


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 10-5-2024 | పేజీలు: 18 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 24

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా. 2.50 తదుపరి చవితి; నక్షత్రం: రోహిణి ఉ. 10.47 తదుపరి మృగశిర; వర్జ్యం: సా. 4.15-5.49; దుర్ముహూర్తం: ఉ. 8.21-9.12, మ. 12.37-1.28; అమృతఘడియలు: ఉ. 7.44-9.15, రా. 1.38-3.12; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.34

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.
వేదిక: అహ్మదాబాద్

గుజరాత్ X చెన్నై



ఒలింపిక్స్ నుంచి బజ్‌రంగ్ అవుట్

స్టార్ రెజ్లర్‌పై ఏడాది చివరిదాకా నిషేధం

వరల్డ్ రెజ్లింగ్ నిర్ణయం

న్యూఢిల్లీ: డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించిన టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, భారత స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియాపై వేటు పడింది. ఈ ఏడాది చివరి వరకు అతడు ఏ టోర్నీలోనూ పాల్గొనకుండా యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిషేధం విధించింది. దీంతో అతడి పారిస్ ఒలింపిక్స్ అవకాశాలు ముగిసినట్టే. ఇటీవలే జరిగిన ట్రయల్స్ సందర్భంగా డోపింగ్ పరీక్ష కోసం శాంపిల్ ఇచ్చేందుకు పూనియా నిరాకరించాడు. దీంతో గతనెల 23న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) అతడిపై తాత్కాలిక సస్పెన్షన్ విధించిన సంగతి తెలిసిందే. ఇక, తాజాగా ప్రపంచ సమాఖ్య అతడిపై ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించింది. దీంతో ఈ జూలైలో మొదలయ్యే విశ్వక్రీడల్లో బజ్‌రంగ్ పాల్గొనేందుకు అవకాశం లేదు. కాగా, బజ్‌రంగ్‌పై నాడా సస్పెన్షన్ గురించిన సమాచారం ఉన్నా.. విదేశాల్లో శిక్షణ తీసుకోవడానికి భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్) అతడికి రూ. 9 లక్షలు మంజూరు చేయడం గమనార్హం. అయితే, తాజా పరిస్థితుల నేపథ్యంలో తాను విదేశాలకు వెళ్లడం లేదని 30 ఏళ్ల పూనియా తెలిపాడు.



నీరజ్‌కు కఠిన సవాల్

నేడు డైమండ్ లీగ్

దోహా: టోక్యో చాంపియన్, స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కఠిన పరీక్ష ఎదురుకానుంది. శుక్రవారం జరిగే ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ తొలి అంచెలో డిఫెండింగ్ చాంప్‌గా నీరజ్ బరిలోకి దిగుతున్నాడు. చోప్రాకు సమవుజ్జీలైన ప్రపంచ మాజీ చాంపియన్ పీటర్స్ (గ్రెనెడా), ఒలింపిక్ పతక విజేత జాకబ్ వాల్డెజ్ (చెక్), యూరోపియన్ చాంప్ జూలియన్ వెబర్ లాంటి మేటి అథ్లెట్లు ఈసారి పోటీలో ఉన్నారు. దీంతో టైటిల్ నిలబెట్టుకోవడం నీరజ్‌కు ఒకింత సవాలే. ఇక, నీరజ్ సహచరుడు, ఆసియా క్రీడల రజత పతక విజేత కిషోర్ జనా కూడా తొలిసారి డైమండ్ లీగ్‌లో పోటీపడుతున్నాడు.

'నెదర్లాండ్స్'లో జ్యోతికి పసిడి



న్యూఢిల్లీ: తెలుగు అథ్లెట్ జ్యోతి ఎర్రాజి అంతర్జాతీయ వేదికపై స్వర్ణ పతకంతో మెరిసింది. నెదర్లాండ్స్‌లోని వాట్‌లో జరిగిన హ్యారీ షల్టింగ్ గేమ్స్‌లో జ్యోతి 100 మీటర్ల రేసులో చాంపియన్‌గా నిలిచింది. గురువారం రాత్రి జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ కేటగిరి ఈ ఈవెంట్ పోటీల్లో రేసును 12.87 సెకన్లలో ముగించి జ్యోతి అగ్రస్థానం దక్కించుకుంది. వైజాగ్‌కు చెందిన 24 ఏళ్ల జ్యోతికిది ఈ సీజన్ అవుట్‌డోర్ పోటీల్లో ఇదే తొలి విజయం కావడం విశేషం.

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (సి) రసో (బి) అర్ష్‌దీప్ 92, డుప్లెసి (సి) శశాంక్ (బి) కావేరప్ప 9, విల్ జాక్స్ (సి) హర్షల్ (బి) కావేరప్ప 12, పటీదార్ (సి) బెయిర్‌స్టో (బి) కర్రాన్ 55, గ్రీన్ (సి) కర్రాన్ (బి) హర్షల్ 46, కార్తీక్ (సి) కర్రాన్ (బి) హర్షల్ 18, లోమ్రార్ (బి) హర్షల్ 0, స్వప్నిల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 241/7; వికెట్ల పతనం:** 1-19, 2-43, 3-119, 4-211, 5-238, 6-240, 7-241; **బౌలింగ్:** కావేరప్ప 4-0-36-2, అర్ష్‌దీప్ 3-0-41-1, కర్రాన్ 3-0-50-1, హర్షల్ 4-0-38-3, రాహుల్ చాహర్ 3-0-47-0, లివింగ్‌స్టోన్ 3-0-28-0.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్ (ఎల్బీ) స్వప్నిల్ 6, బెయిర్‌స్టో (సి) డుప్లెసి (బి) ఫెర్గూసన్ 27, రసో (సి) జాక్స్ (బి) కర్ణ్ శర్మ 61, శశాంక్ (రనౌట్) 37, జితేశ్ (బి) కర్ణ్ శర్మ 5, లివింగ్‌స్టోన్ (సి) కర్ణ్ (బి) స్వప్నిల్ 0, కర్రాన్ (బి) ఫెర్గూసన్ 22, అశుతోష్ (ఎల్బీ) సిరాజ్ 8, హర్షల్ (సి) ఫెర్గూసన్ (బి) సిరాజ్ 0, రాహుల్ చాహర్ (నాటౌట్) 5, అర్ష్‌దీప్ (సి) కర్ణ్ (బి) సిరాజ్ 4, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 17 ఓవర్లలో 181 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-6, 2-71, 3-107, 4-125, 5-126, 6-151, 7-164, 8-170, 9-174, 10-181; **బౌలింగ్:** స్వప్నిల్ 3-0-28-2, సిరాజ్ 4-0-43-3, యశ్ దయాల్ 2-0-22-0, ఫెర్గూసన్ 3-0-29-2, జాక్స్ 1-0-5-0, గ్రీన్ 1-0-16-0, కర్ణ్ శర్మ 3-0-36-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	11	8	3	0	16	0.476
హైదరాబాద్	12	7	5	0	14	0.406
చెన్నై	11	6	5	0	12	0.700
ఢిల్లీ	12	6	6	0	12	-0.316
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
బెంగళూరు	12	5	7	0	10	0.217
ముంబై	12	4	8	0	8	-0.212
పంజాబ్	12	4	8	0	8	-0.423
గుజరాత్	11	4	7	0	8	-1.320

పంజాబ్ కథ ముగిసె..

బెంగళూరు ఘన విజయం

అదరగొట్టిన కోహ్లీ, పటీదార్

ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ ఆశలు సజీవం



రజత్ పటీదార్ (23 బంతుల్లో 55)

విరాట్ కోహ్లీ (47 బంతుల్లో 92)

1 ఐపీఎల్‌లో ఎక్కువసార్లు (4) 600+ పరుగులు సాధించిన బ్యాటర్‌గా రాహుల్‌తో సమంగా నిలిచిన కోహ్లీ.

ధర్మశాల: ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసు నుంచి పంజాబ్ కింగ్స్ నిష్క్రమించింది. అటు విరాట్ కోహ్లీ (47 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 92) మెరుపు ఇన్నింగ్స్‌కు, బౌలర్ల అద్భుత ప్రదర్శన తోడవ్వడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 60 పరుగుల తేడాతో పంజాబ్‌పై ఘనవిజయం సాధించింది. వరుసగా నాలుగో విజయాన్నందుకున్న ఆర్‌సీబీ 10 పాయింట్లతో ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. పంజాబ్ ఆడిన 12 మ్యాచ్‌ల్లో 8 పాయింట్లతోనే ఉంది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 241 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (23 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 55), గ్రీన్ (27 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 46) వేగంగా ఆడారు. హర్షల్‌కు మూడు, కావేరప్పకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 17 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. రిలీ రసో (27 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 61), శశాంక్ (19 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 37) మాత్రమే రాణించారు. సిరాజ్‌కు మూడు.. స్వప్నిల్, ఫెర్గూసన్, కర్ణ్ శర్మలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు.

మధ్యలో వదిలేశారు: 242 పరుగుల భారీ ఛేదనలో రసో ధాటికి పంజాబ్ ఇన్నింగ్స్ మెరుపు వేగంతో ఆరంభమైంది. కానీ అతడు క్రీజులో ఉన్నంత సేపు ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లిన పంజాబ్.. ఆ తర్వాత శశాంక్ దూకుడుకు 14 ఓవర్ల వరకు పోటీలోనే ఉంది. కానీ ఆ తర్వాత మిడిలార్డర్ వైఫల్యంతో పోటీలో లేకుండా పోయింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (6) తొలి ఓవర్‌లోనే అవుటైనా.. బెయిర్‌స్టో (27)తో కలిసి రెండో వికెట్‌కు రసో 65 పరుగులు అందించాడు. నాలుగో ఓవర్‌లో రసో 4,4,4,6తో 18 రన్స్ రాబట్టగా, బెయిర్‌స్టో 6,4తో చెలరేగాడు. తర్వాతి ఓవర్‌లోనూ బెయిర్‌స్టో రెండు ఫోర్లు బాదినా.. ఫెర్గూసన్‌కు చిక్కాడు. అటు రసో మాత్రం తన జోరును ఆపకపోవడంతో 8.2 ఓవర్లలోనే జట్టు స్కోరు వందకి చేరింది. అతను కూడా 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ తొమ్మిదో ఓవర్‌లో 4,6 బాదాక రసో ఇన్నింగ్స్‌కు కర్ణ్ శర్మ బ్రేక్ వేశాడు. జితేశ్ (5), లివింగ్‌స్టోన్ (0) నిరాశపర్చినా.. శశాంక్ రన్‌రేట్ తగ్గకుండా బ్యాట్‌కు పనిజెప్పాడు. అతడి వేగానికి 14 ఓవర్లలోనే స్కోరు 150కి చేరింది. కానీ కోహ్లీ సూపర్‌త్రోతో శశాంక్ రనౌటవడంతో పంజాబ్ వెనుకబడింది. మిగిలిన వికెట్లన్నీ చకచకా పడడంతో 17 ఓవర్లలోనే మ్యాచ్ ముగిసింది.

విరాట్-పటీదార్ మెరుపు ఆటతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు ఆదిలో వికెట్లు కోల్పోయినా.. పరుగుల వేటలో మాత్రం ఎక్కడా తగ్గలేదు. తొలి పది ఓవర్లలో రజత్ పటీదార్ ధాటికి 119/3 స్కోరు చేయగా.. వర్షం తర్వాత విరాట్ కోహ్లీ విధ్వంసంతో జట్టు 122/4 స్కోరు సాధించింది. అయితే కోహ్లీ 0, 10 పరుగుల వద్ద, పటీదార్ కూడా ఖాతా తెరవకుండానే ఇచ్చిన క్యాచ్‌లను పంజాబ్ ఫీల్డర్లు వదిలేయడం బెంగళూరుకు కలిసొచ్చింది. ఈ మూడుసార్లు కూడా అరంగేట్ర పేసర్ విద్వత్ కావేరప్ప బౌలింగ్‌లోనే కావడం గమనార్హం. అయితే కావేరప్ప తన వరుస ఓవర్లలో ఓపెనర్ డుప్లెసి (9), విల్ జాక్స్ (12)ను అవుట్ చేశాడు. ఆరో ఓవర్‌లో పటీదార్ మూడు ఫోర్లతో పవర్‌ప్లేలో జట్టు 56/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా ఆర్‌సీబీ జోరు తగ్గలేదు. ఏడో ఓవర్‌లో విరాట్, పటీదార్ చెరో సిక్సర్ బాదగా.. ఎనిమిదో ఓవర్‌లో పటీదార్ మూడు సిక్సర్లతో చెలరేగాడు. దీంతో స్కోరు 51 బంతుల్లోనే వందకు చేరింది. ఇక పదో ఓవర్‌లో సిక్సర్‌తో 21 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన పటీదార్‌ను కర్రాన్ అవుట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే భారీ వర్షంతో అర్ధగంటపాటు ఆటకు అంతరాయం ఏర్పడింది. అనంతరం 32 బంతుల్లో కోహ్లీ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇక 16వ ఓవర్‌లో కోహ్లీ 2 సిక్సర్లు, గ్రీన్ ఫోర్‌తో కర్రాన్ 21 పరుగులు ఇచ్చుకున్నాడు. అయితే 18వ ఓవర్‌లో 6,4తో సెంచరీ ఖాయమనిపించిన కోహ్లీ తృటిలో ఆ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. అర్ష్‌దీప్ కోహ్లీ వికెట్‌ను అర్ష్‌దీప్ తీయడంతో నాలుగో వికెట్‌కు 92 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ఇక 19వ ఓవర్‌లో ఆర్‌సీబీ 21 పరుగులు సాధించినా.. చివరి ఓవర్‌లో పేసర్ హర్షల్ మూడు పరుగులే ఇచ్చి దినేశ్ కార్తీక్ (18), లోమ్రోర్ (0), గ్రీన్ (46) వికెట్లను తీశాడు. అయినా ఆర్‌సీబీ చివరి నాలుగు ఓవర్లలో 56 రన్స్ సాధించింది.

సిరీస్ క్లీన్‌స్వీప్

భారతిదే ఐదో టీ20



సిల్హట్: బంగ్లాదేశ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను భారత మహిళలు 5-0తో క్లీన్‌స్వీప్ చేశారు. గురువారం జరిగిన ఆఖరిదైన ఐదో మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 21 పరుగుల తేడాతో బంగ్లాను ఓడించింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 156 పరుగులు చేసింది. హేమలత (37), స్మృతి మంధాన (33), హర్మన్‌ప్రీత్ (30), రిచా ఘోష్ (28 నాటౌట్) రాణించారు. రబియా, నహీద చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో బంగ్లా ఓవర్లన్నీ ఆడి 135/6 స్కోరుకే పరిమితమైంది. రీతూ మోనీ (37) టాప్ స్కోరర్. రాధా యాదవ్ 3 వికెట్లు పడగొట్టింది.

కెప్టెన్సీ వదిలేస్తాడా?



రాహుల్‌పై లఖ్‌నవూ ఫ్రాంచైజీ అసంతృప్తి

న్యూఢిల్లీ: ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ ఓపెనర్ల బాదుడు.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్‌సీజీ)కెప్టెన్ కేఎల్ రాహుల్ పదవికి ఎసరు తెచ్చేలా ఉంది. బుధవారం నాటి మ్యాచ్‌లో తమ జట్టు ఆడిన తీరుపై ఎల్‌సీజీ యాజమాన్యం తీవ్ర అసంతృప్తితో ఉంది. ఘోర ఓటమి చెందాక జట్టు యజమాని సంజీవ్ గోయెంకా ఏకంగా మైదానంలోనే కెప్టెన్ రాహుల్‌తో సీరియస్‌గా మాట్లాడిన వీడియోలు దర్శనమిచ్చాయి. దీంతో ఆ జట్టు ఆడాల్సిన మరో రెండు మ్యాచ్‌లకు నాయకత్వ మార్పు ఉండవచ్చని సమాచారం. స్వచ్ఛందంగా కెప్టెన్సీ నుంచి తప్పుకొని బ్యాటింగ్‌పై దృష్టిసారించాలని రాహుల్ భావిస్తున్నాడట. 'తర్వాతి మ్యాచ్‌లో ఢిల్లీతో ఆడేందుకు లఖ్‌నవూకు నాలుగు రోజుల సమయం ఉంది. ఇప్పటికైతే స్పష్టత లేదు కానీ రాహుల్ తన బ్యాటింగ్‌పై దృష్టి సారించేందుకు కెప్టెన్సీ వదిలేసినా ఆశ్చర్యం లేదు. ఇందుకు మేనేజ్‌మెంట్ కూడా వ్యతిరేకించకపోవచ్చు' అని ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. తానాడిన 12 మ్యాచ్‌ల్లో 460 పరుగులు చేసినా.. రాహుల్ స్ట్రయిక్‌రేట్ 136.09 ఉండడం సమస్యగా మారింది. రూ.17 కోట్ల భారీ ధరతో రాహుల్‌ను లఖ్‌నవూ జట్టు రిటైన్ చేసుకున్న విషయం తెలిసిందే.

నిఖత్, ధీరజ్‌కు చేయూత

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌కు సన్నద్ధమవుతున్న తెలుగు అథ్లెట్లు నిఖత్ జరీన్, బొమ్మదేవర ధీరజ్, ఆకుల శ్రీజకు కేంద్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలోని మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంఓసీ) అండగా నిలిచింది. బాక్సర్ నిఖత్‌కు లేజర్ యూనిట్ కిట్ కొనుగోలు చేసేందుకు, ఆర్చర్ ధీరజ్‌కు క్రీడా సామగ్రికి, టీటీ ప్లేయర్ శ్రీజకు ఒలింపిక్స్ ముందు వివిధ పోటీల్లో పాల్గొనేందుకు అయ్యే ఖర్చులు భరించేందుకు ఎంఓసీ ఆమోదం తెలిపింది.

ఆరో రౌండ్లో అర్జున్‌కు డ్రా

వార్సా (పోలెండ్): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సూపర్‌బెట్ టోర్నీ ఆరో రౌండ్‌లో నోడిర్బెక్ అబ్దుస టోరోవ్ (ఉజ్బెకిస్థాన్)తో గేమ్‌ను అర్జున్ ఇరిగేసి డ్రా చేసుకున్నాడు. అంతకుముందు ఐదో రౌండ్లో కిరిల్ షెవ్‌చెంకో (ఉక్రెయిన్)పై అర్జున్ గెలిచాడు. ఆరో రౌండ్లో కార్ల్‌సన్‌తో గేమ్‌ను గుకేశ్ డ్రా చేసుకోగా, విన్సెంట్‌ను ప్రజ్ఞానంద ఓడించాడు. ప్రజ్ఞానంద 4వ, అర్జున్ 5వ, గుకేశ్ 6వ స్థానాల్లో కొనసాగుతున్నారు.

బిజినెస్

మారుతి కొత్త 'స్విఫ్ట్'



న్యూఢిల్లీ: ఆటో దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) సరికొత్త ఫీచర్లతో కొత్త స్విఫ్ట్ హ్యాచ్‌బ్యాక్ కారును మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కారు ధరలు రూ.6.49 లక్షల నుంచి రూ.9.64 లక్షల (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉన్నాయి. ఈ ప్రీమియం హ్యాచ్ బ్యాక్ మోడల్ అభివృద్ధి కోసం రూ.1,450 కోట్లు ఖర్చు చేసినట్టు కంపెనీ ఎండీ, సీఈఓ హిసాచి టకెయుచి చెప్పారు. పర్యావరణానికి హాని చేయని జెడ్ సీరీస్ 1.2 లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో ఈ హ్యాచ్‌బ్యాక్‌ను తీసుకువచ్చినట్టు తెలిపారు. గుజరాత్ ప్లాంట్‌లో ఈ కొత్త మోడల్ స్విఫ్ట్ కారు తయారవుతుందన్నారు. ఇక తమ దృష్టి అంతా హ్యాచ్‌బ్యాక్ కార్లపైనే ఉంటుందన్నారు. 2030 కల్లా భారత్‌లో 40 లక్షల కార్ల ఉత్పత్తి తమ లక్ష్యమన్నారు. లీటర్ పెట్రోల్‌తో 25.75 కిలోమీటర్ల మైలేజీ, ఆరు ఎయిర్‌బ్యాగ్స్ ఈ కారు ప్రత్యేకతలు.

పసిడి రుణాలపై నగదు రూ.20,000 మించొద్దు: ఆర్‌బీఐ


న్యూఢిల్లీ: వ్యక్తిగత పసిడి రుణాలపై ఇచ్చే నగదు మొత్తం రూ.20,000 మించొద్దని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ).. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లకు సూచించింది. ఈ విషయంలో ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 269 ఎస్ఎస్‌ను తూచా తప్పకుండా పాటించాలని కోరింది. ఈ సెక్షన్ ప్రకారం ఏ వ్యక్తీ రూ.20,000కు మించి డిపాజిట్లను, రుణాలను నగదు రూపంలో ఆమోదించకూడదు. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీ పసిడి రుణాలపై ఆంక్షలు విధించిన కొద్ది వారాలకే ఆర్‌బీఐ ఎన్‌బీఎఫ్‌సీలకు ఈ సూచనలు జారీ చేయడం విశేషం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,160 ▼	66,150 ▼	88,700 ▲
ముంబై	71,502 ▼	65,496 ▼	82,342 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	573	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	గోదావరి	148
వరంగల్	140	విజయవాడ	148
కరీంనగర్	140	గుంటూరు	148
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	148
కర్నూలు	140	చిత్తూరు	147
విశాఖపట్నం	140		

ఢమాల్!



- 2 శాతానికి పైగా క్షీణించిన బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు
- రూ.7.34 లక్షల కోట్ల సంపద ఆవిరి
- లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి..

విదేశీ పెట్టుబడుల ఉపసంహరణే కారణం

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం భారీ నష్టాలను చవిచూశాయి. ఒక దశలో 1,132 పాయింట్లు పతనమై 72,334 స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. చివరికి 1,062.22 పాయింట్ల (1.45 శాతం) నష్టంతో 72,404.17 వద్ద స్థిర పడింది. నిఫ్టీ 345 పాయింట్లు (1.55 శాతం) క్షీణించి 21,957.50 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 నష్టపోగా.. ఎల్ అండ్ టీ షేరు 6.0 శాతం జారి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఏషియన్ పెయింట్స్ 4.68 శాతం క్షీణించగా.. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ షేర్లు మూడు శాతానికి పైగా నష్టపోయాయి. టాటా మోటార్స్, ఎం అండ్ ఎం, ఎస్‌బీఐ షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. చిన్న, మధ్యస్థాయి కంపెనీల షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.01 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.41 శాతం పతనమయ్యాయి. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులో రూ.7.34 లక్షల కోట్లకు పైగా తరిగిపోయి రూ.393.35 లక్షల కోట్లకు (4.71 లక్షల కోట్ల డాలర్లు) పరిమితమైంది.

21,750 వద్ద మద్దతు: మార్కెట్ మరింత క్షీణించేందుకే అధిక అవకాశాలు కన్పిస్తున్నాయని టెక్నికల్ నిపుణులంటున్నారు. నిఫ్టీ 22,300 తక్షణ మద్దతు స్థాయి దిగువకు పతనమైన నేపథ్యంలో స్వల్పకాలికంగా సూచీ మరింత దిద్దుబాటుకు లోను కావచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సీనియర్ టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ నాగరాజ్ శెట్టి అన్నారు. అయితే, 21,750 స్థాయి వద్ద సూచీకి మద్దతు లభించవచ్చని, 22,100-22,200 వద్ద నిరోధం ఎదురుకావచ్చన్నారు.

15న గో డిజిటల్ ఐపీఓ: కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ గ్రూప్ పెట్టుబడులు కలిగిన గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 15న ప్రారంభమై 18న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,125 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్, వాటాదారులకు చెందిన 5.47 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

భారీగా తగ్గిన వెండి: విలువైన లోహాల ధరలు మరింత తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం గురువారం రూ.50 తగ్గి రూ.72,250 పలికింది. కిలో వెండి రేటు ఏకంగా రూ.1,500 తగ్గి రూ.83,200కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

మార్కెట్ పతనానికి కారణాలు..

- ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి పెరగడంతో ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా లాభాల స్వీకరణకు దిగుతుండటం మార్కెట్ భారీ క్షీణతకు ప్రధాన కారణం. ఎందుకంటే, ఈసారీ బీజేపీ అధికారంలోకి వస్తుందన్న బలమైన అంచనాల నేపథ్యంలో గడిచిన కొన్ని నెలల్లో మార్కెట్ భారీగా పుంజుకుంది. కానీ, ఇప్పటివరకు జరిగిన మూడు విడతల పోలింగ్‌లో ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గుతూ రావడంతో ఎన్‌డీఏ కూటమి గెలుపు, ఆధిక్యంపై మార్కెట్ వర్గాల్లో సందేహాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేయగలిగే హై నెట్‌వర్త్, సంస్థాగత ఇన్వెస్టర్లు పెద్దఎత్తున లాభాలు స్వీకరిస్తున్నారని, మళ్లీ పెట్టుబడి పెట్టేందుకు సరైన సమయం కోసం వేచిచూస్తున్నారని విశ్లేషకులు పేర్కొన్నారు.
- విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారీగా అమ్మకాలకు పాల్పడటం కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈనెలలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు మన మార్కెట్ నుంచి నికరంగా రూ.15,863 కోట్ల విలువైన పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. బుధవారం ఒక్కరోజే రూ.6,669 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్లను వెనక్కి తీసుకున్నారు.
- ప్రధాన కంపెనీల మార్చి త్రైమాసిక ఫలితాలు పర్వాలేదన్పించినా చాలా వరకు చిన్న, మధ్య స్థాయి కంపెనీల పనితీరు నిరాశాజనకంగా ఉండటం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.
- అమెరికన్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు జాప్యం కావచ్చన్న అంచనాలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతోపాటు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు మళ్లీ పెరుగుతుండటం సైతం ఈక్విటీ మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

ఎస్‌బీఐ లాభం రూ. 21,384 కోట్లు

త్రైమాసిక, వార్షిక లాభాలు రెండూ చారిత్రక గరిష్ఠమే



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కన్సాలిడేటెడ్ లాభం ఈ ఏడాది మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో 18 శాతం పెరిగి రూ.21,384.15 కోట్లుగా నమోదైంది. వడ్డీయేతర ఆదాయం ఇందుకు దోహదపడింది. ఏడాది క్రితం ఇదే కాలంతో పోల్చితే స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన త్రైమాసిక లాభం రూ.16,694.51 కోట్ల నుంచి రూ.20,698.35 కోట్లకు పెరిగింది. ఇదిలా ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కన్సాలిడేటెడ్ లాభం 20.55 శాతం పెరిగి రూ.67,084.67 కోట్లకు చేరినట్టు బ్యాంక్ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా చెప్పారు. 2022-23లో ఇది రూ.55,648.17 కోట్లుంది. త్రైమాసికంగాను, వార్షికంగాను కూడా బ్యాంక్ లాభం చారిత్రక గరిష్ఠ స్థాయి అని ఆయన చెప్పారు. వడ్డీయేతర ఆదాయం 24.41 శాతం పెరిగి రూ.17,369 కోట్లకు చేరడం ద్వారా బ్యాంకు లాభాల్లో వృద్ధికి గట్టి మద్దతు ఇచ్చిందన్నారు. ముఖ్యాంశాలు...

- రుణాల్లో 15 శాతం వృద్ధి ఏర్పడడంతో నికర వడ్డీ ఆదాయం 3.13% పెరిగి రూ.41,655 కోట్లకు చేరింది. అయితే నికర వడ్డీ మార్జిన్ మాత్రం 0.08% తగ్గింది.
- రుణ వృద్ధి కార్పొరేట్, వ్యవసాయం, రిటైల్, చిన్న వ్యాపారాలు సహా అన్ని రంగాలకు విస్తరించింది. కార్పొరేట్ రుణాల్లో 16 శాతం వృద్ధి నమోదైంది. కార్పొరేట్ రుణాల పరిమాణం రూ.4 లక్షల కోట్లుంది. ఇందులో ప్రైవేట్ కార్పొరేట్ల వాటా నాలుగింట మూడు వంతులు కాగా మిగతాది ప్రభుత్వ కార్పొరేట్లది.
- 2025 ఆర్థిక సంవత్సరంలో రుణ వృద్ధి 15 నుంచి 16% ఉంటుందని అంచనా. నికర వడ్డీ ఆదాయం కూడా ఇదే స్థాయిలో కొనసాగించాలని భావిస్తోంది.
- డిపాజిట్లలో వృద్ధి 11.13 శాతం ఉంది. ఈ ఏడాది 13 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.
- స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 2.78 శాతం నుంచి 2.24 శాతానికి తగ్గాయి. డిసెంబరు త్రైమాసికం చివరి నాటికి ఇవి 2.42 శాతం ఉన్నాయి.
- బ్యాంక్ మూలధన నిధుల నిష్పత్తి (సీఏఆర్) 14.28 శాతం ఉంది. 20 శాతం రుణ వృద్ధిని ఇది తట్టుకోగలుగుతుంది.
- బంగారు రుణాల పరిమాణం రూ.1.38 లక్షల కోట్లుంది. సమీప భవిష్యత్తులో ఎలాంటి సవాళ్లు కనిపించడంలేదు.

ఆయిల్ కంపెనీల బోనస్ బొనాంజా

ముంబై: రిఫైనింగ్ మార్జిన్లు తగ్గడంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల (ఓఎంసీ) లాభాలు నాలుగో త్రైమాసికంలో క్షీణించాయి. అయినప్పటికీ గురువారం ఫలితాలు ప్రకటించిన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ రెండూ బోనస్ షేర్లను ప్రకటించాయి. బీపీసీఎల్ తన వాటాదారుల వద్ద ఉన్న ప్రతి ఒక షేరుకు ఒక బోనస్ షేరును ప్రకటించగా హెచ్‌పీసీఎల్ ప్రతి రెండు షేర్లకు ఒక బోనస్ షేరును ప్రకటించింది. కంపెనీల డైరెక్టర్ బోర్డులు బోనస్ షేర్ల జారీకి ఆమోదం తెలిపాయి. ఇతర అనుమతులు పొందాల్సి ఉంది.

బీపీసీఎల్ లాభం 30 శాతం డౌన్: మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి బీపీసీఎల్ రూ.4,789.57 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.6,870.47 కోట్లతో పోల్చితే లాభం 30 శాతం తగ్గింది. ఇదే కాలంలో కంపెనీ టర్నోవర్ రూ.1.34 లక్షల కోట్ల నుంచి రూ.1.32 లక్షల కోట్లకు తగ్గింది. కాగా పూర్తి ఆర్థిక సంవత్సరపు లాభం రూ.26,858.84 కోట్లుంది. ప్రతి బ్యారెల్‌పై రిఫైనింగ్ మార్జిన్ 14.14 డాలర్లుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు రూ.21 తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. బోనస్ షేరును కూడా పరిగణనలోకి తీసుకున్నట్టయితే ఒక్కో షేరుపై రూ.10.5 గిట్టుబాటవుతుంది.

హెచ్‌పీసీఎల్‌దీ అదే బాట: రిఫైనింగ్ మార్జిన్ల క్షీణత కారణంగా జనవరి-మార్చి త్రైమాసికంలో హెచ్‌పీసీఎల్ కన్సాలిడేటెడ్ లాభం 25 శాతం క్షీణించి రూ.2,709.31 కోట్లుగా నమోదైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.3,608.32 కోట్లుగా ఉంది. నాలుగో త్రైమాసికంలో ప్రతి బ్యారెల్‌పై రిఫైనింగ్ మార్జిన్ 6.95 డాలర్లుంది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన మార్జిన్ 14.01 డాలర్లు. త్రైమాసిక టర్నోవర్ రూ.1.15 లక్షల కోట్ల నుంచి రూ.1.22 లక్షల కోట్లకు పెరిగింది. అయితే మార్చి 31వ తేదీతో ముగిసిన 2023-24 సంవత్సరం మొత్తానికి కంపెనీ రికార్డు స్థాయిలో రూ.16,041.61 కోట్ల లాభం ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.6,980.23 కోట్ల నష్టం నమోదు చేసింది. కాగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.16.50 తుది డివిడెండ్‌ను సిఫారసు చేసింది. బోనస్ షేరును పరిగణనలోకి తీసుకుంటే ఒక్కో షేరుపై 11 రూపాయలు గిట్టుబాటయినట్టవుతుంది. గతంలో ఇచ్చిన రూ.15 మధ్యంతర డివిడెండ్‌కు ఇది అదనం.

ఇఫ్కోతో మారుత్ డ్రోన్స్ జట్టు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 5 లక్షల ఎకరాల్లో డ్రోన్ల ద్వారా పిచికారీ కార్యకలాపాలు చేపట్టేందుకు ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో-ఆపరేటివ్ (ఇఫ్కో) లిమిటెడ్‌తో జట్టు కట్టినట్లు మారుత్ డ్రోన్స్ గురువారం ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా ఇఫ్కో అభివృద్ధి చేసిన పలు అగ్రి ఉత్పత్తుల పిచికారీ కోసం తమ సంస్థకు చెందిన ఆధునిక డ్రోన్లను ఉపయోగించనున్నట్లు మారుత్ వెల్లడించింది. వాతావరణంపై ఎరువుల ప్రభావాన్ని తగ్గించడంతోపాటు పంట దిగుబడిని పెంచేడమే ఈ ఒప్పందం లక్ష్యమని సంస్థ పేర్కొంది. డ్రోన్ల వినియోగం ద్వారా వ్యవసాయ రంగంలో కార్మికుల కొరత సమస్యను పరిష్కరించడంతో పాటు చాలా తక్కువ సమయంలో పని పూర్తి చేయవచ్చని మారుత్ డ్రోన్స్ సహ వ్యవస్థాపకులు, సీఈఓ ప్రేమ్ కుమార్ అన్నారు.

పీఎన్‌బీ లాభంలో మూడింతల వృద్ధి

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మార్చి త్రైమాసికంలో రూ.3,010 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది 16 త్రైమాసికాల గరిష్ఠం. మొండి బకాయిలు (ఎన్‌పీఏ) తగ్గడం, కీలక వ్యాపారాలపై ఆదాయాలు పెరగడం ఇందుకు దోహదపడింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ రూ.1,159 కోట్ల లాభం ఆర్జించింది. త్రైమాసికాదాయం కూడా రూ.27,269 కోట్ల నుంచి రూ.32,361 కోట్లకు పెరిగింది. త్రైమాసికంలో వడ్డీ ఆదాయం రూ.28,113 కోట్లు కాగా నికర వడ్డీ ఆదాయం రూ.10,363 కోట్లని బ్యాంక్ వెల్లడించింది. గత ఏడాది మార్చి త్రైమాసికంతో పోల్చితే స్థూల ఎన్‌పీఏలు 8.74 శాతం నుంచి 5.73 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.72 శాతం నుంచి 0.73 శాతానికి తగ్గాయి. ప్రొవిజనింగ్ కూడా రూ.3,625 కోట్ల నుంచి రూ.1,958 కోట్లకు తగ్గింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద బ్యాంక్ రూ.1,20, 285 కోట్ల ఆదాయంపై రూ.8245 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2022-23 సంవత్సరంలో ఆర్జించిన రూ.2,507 కోట్లతో పోల్చితే నికర లాభం మూడు రెట్లు పెరిగింది. ఈ ఏడాది రుణాల్లో 11-12 శాతం, డిపాజిట్లలో 9-10 శాతం వృద్ధిని ఆశిస్తున్నట్టు బ్యాంక్ ఎండీ అతుల్ కుమార్ గోయెల్ తెలిపారు. క్యూఐపీ ద్వారా రూ.7,500 కోట్లు సమీకరించేందుకు బోర్డు అనుమతించిందని గోయెల్ అన్నారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 10-5-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**



చిరంజీవికి పద్మవిభూషణ్ ప్రదానం 2

పైపుల లారీలో రూ.8.36 కోట్లు! 5

ప్రకాశంలో పోటీ చేస్తున్న చిత్తూరు వైసీపీ నేతవేనా?

జనవరి నుంచి ఇప్పటిదాకా ఆపిన 'బటన్ నొక్కుడు' సొమ్ములను పోలింగ్‌కు ముందు జమ చేసేందుకు మార్గం సుగమమైంది. 'ఇన్ని నెలలు కావాలనే ఆపేసి... పోలింగ్‌కు ముందు జమ చేయడం ప్రజాప్రాతినిధ్య చట్టానికి, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధం' అని ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను శుక్రవారం ఒక్కరోజుకు హైకోర్టు ఆపివేసింది. శనివారం, ఆదివారంతోపాటు పోలింగ్ జరిగే సోమవారం నిధులు విడుదల చేయొద్దని ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ మోహన్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం... గురువారం రాత్రి నుంచి శుక్రవారం అర్ధరాత్రి వరకు సొమ్ములు జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వెసులుబాటు వచ్చినట్టే. అంతే... దీని కోసమే ఎదురు చూస్తున్న ప్రభుత్వం చకచకా సొమ్ముల పంపిణీకి రంగం సిద్ధం చేసింది. శుక్రవారం బ్యాంకులు తెరవగానే ఆయా పథకాలకు సంబంధించిన నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమైపోతాయి.



5 నెలలు ఆపేసి.. అర్ధరాత్రి హంగామా

ఎన్నికల వేళ పథకాల సొమ్ము బదిలీలో మలుపులెన్నో

హైకోర్టు 'ఒక్కరోజు' వెసులుబాటు

పాత నొక్కుడుకు ఇప్పుడు డబ్బులు

తెల్లారేసరికి ఖాతాల్లో పడిపోవాలి

ఆర్థిక శాఖ కార్యదర్శి మౌఖిక ఆదేశాలు

అధికారులపై తీవ్ర ఒత్తిడి

మరో రెండు రోజుల్లో పోలింగ్

ప్రభుత్వ ధనంతో 'ఓట్ల కొనుగోలు'

13

ఎప్పుడో నొక్కి ఇప్పుడు డబ్బులా?

కావాలనే ఆపారనుకోవాల్సి వస్తోంది

పోలింగ్‌కు ముందు నగదు బదిలీ కుదరదు

ఇది సమానావకాశాలను దెబ్బతీయడమే

ప్రజాప్రాతినిధ్య చట్టానికి విరుద్ధం

ప్రవర్తనా నియమావళికీ వ్యతిరేకం

పోలింగ్ ముగిసిన తర్వాతే ఇవ్వండి

సీఎస్‌కు ఎన్నికల కమిషన్ ఆదేశాలు

11 నుంచి 13 వరకు పంపిణీ వద్దు

నేటివరకు ఈసీ ఉత్తర్వులు పక్కనపెడుతున్నాం

పంపిణీపై మీడియాలో ప్రచారం చేయొద్దు

ఉత్సవాలు జరపడం వంటివి చేయకూడదు

రాజకీయ నేతల ప్రమేయం నిరోధించండి

మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు

కౌంటర్ దాఖలుకు ప్రతివాదులకు ఆదేశం

తదుపరి విచారణ జూన్ 27కు వాయిదా



తాగేవాళ్లనే తాకట్టు పెట్టాడు.. ప్రజల ఆస్తులను పెట్టడా?

తనఖా పెట్టి జగన్ అప్పులు తేడని గ్యారెంటీ ఏంటి?

పర్యావరణం, సీఆర్‌జడ్ నిబంధనలు తుంగలో తొక్కారు

రేపు ల్యాండ్ టైటిలింగ్ యాక్టుకూ వక్ర భాష్యం చెప్పవచ్చు

భూ వివాదాలు వస్తే కోర్టుల ప్రమేయం లేకుండా చేస్తారా?

ల్యాండ్ టైటిలింగ్ అధికారులుగా సజ్జల, సుబ్బారెడ్డి ఇంట్లో వాళ్లను కూడా పెట్టొచ్చు

ఈ ముఖ్యమంత్రికి ఏదైనా సాధ్యమే!

ప్రశ్నిస్తే దాడులు చేసి ఎదురు కేసులు

మాట తప్పిన వ్యక్తికి ఎందుకు ఓట్లేయాలని జనమే అడుగుతున్నారు

వైఎస్‌కు ఎక్కడ ఆగాలో తెలుసు.. అహం వల్ల జగన్‌కు అది తెలియడం లేదు

13

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జనసేనాని పవన్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ

పార్టీకి పనిచేసిన వారికి ప్రాణమిస్తా

సముచిత స్థానం కల్పిస్తా

బాదుడు లేని పాలన అందిస్తా



కురుపాంలో నిర్వహించిన ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

జగన్‌లా విచ్చలవిడిగా అప్పులు తెచ్చి బటన్ నొక్కను

సంపద సృష్టిస్తా.. సంక్షేమం, అభివృద్ధి చేపడతా.. ల్యాండ్ యాక్ట్‌తో నష్టం

మన భూములపై హక్కుండదు.. వాటిపై జగన్ అప్పు తెచ్చుకునేలా చట్టం

జిరాక్స్‌లివ్వడం వెనుక కుట్ర.. గద్దెనెక్కగానే రెండో సంతకం దీని రద్దుపైనే

మన పాస్‌బుక్స్‌పై జగన్ ఫొటో ఏంటి?.. విశాఖలో 40 వేల కోట్ల భూదోపిడీ

మేం రాగానే మక్కెలు విరగ్గొట్టి అన్నీ వెనక్కి తీసుకుంటాం

వైసీపీ పాలనలో ఒక్క పరిశ్రమైనా వచ్చిందా?.. డ్రగ్స్, గంజాయే వస్తున్నాయి

యువత భవితపై ఆందోళన, బాధ.. ప్రజల భవిష్యత్‌కు కూటమిదే బాధ్యత

దళితులు, గిరిజనుల ద్రోహి జగన్.. జీవో నంబర్ 3ను పునరుద్ధరిస్తాం

హోం గార్డులకు జీతాలు పెంచుతా.. పింఛను రూ.4 వేలు చేస్తా

బకాయిలతో కలిపి జూలై నుంచి ఇస్తా.. టీడీపీ అధినేత స్పష్టీకరణ

కురుపాం, చీపురుపల్లి, విశాఖల్లో భారీ సభలు

16

హిందూ, ముస్లింల సంఖ్యను ఎలా నిర్ధారిస్తారు?: తేజస్వీ



పాట్నా, మే 9: దేశంలో జన గణన జరగకుండానే హిందూ, ముస్లింల జనాభాపై కేంద్రం ఒక నిర్ణయానికి ఎలా వస్తుందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. భారత్‌లో ముస్లింల జనాభా పెరిగిందని అదే సమయంలో హిందువుల జన సంఖ్యలో తగ్గుదల ఉందంటూ ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి వెల్లడించిన నివేదికపై ఆయన మాట్లాడారు. ఇటువంటి చర్యల ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందూ, ముస్లింల మధ్య గొడవలు సృష్టించేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు.

దేశంలో నీగ్రో, మంగోలాయిడ్ ప్రజలు!

» కాంగ్రెస్‌నేత అధీర్ రంజన్ చౌధురి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 9: 'దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లలా ఉంటారు' అంటూ కీలకమైన ఎన్నికల సమయంలో శామ్‌పిట్రోడా చేసిన వ్యాఖ్యలతో పార్టీకి కలిగిన నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ ఉంటే.. ఆ పార్టీకే చెందిన మరో సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధురి.. పిట్రోడా వ్యాఖ్యలను సమర్థించేలా మాట్లాడి మరోసారి బీజేపీ నేతల విమర్శలకు ఆస్కారమిచ్చారు. శామ్‌పిట్రోడా వ్యాఖ్యలపై ఆయన స్పందన కోరగా.. "ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలపైనా నేనేమీ మాట్లాడదల్చుకోలేదు. మనదేశంలో ప్రోటో ఆస్ట్రలాయిడ్, నెగ్రిటా(నీగ్రో), మంగోలాయిడ్ జాతులకు చెందినవారున్నారు. మనదేశ నైసర్గిక స్వరూపం (టోపోగ్రఫీ) కారణంగా దేశంలో ఒక్కోచోట ఒక్కో రూపురేఖలున్నవారు ఉంటారు. ఇదే మనం నేర్చుకున్నది. అందరూ ఒకలా ఉండరు. కొంతమంది నల్లగా.. కొంతమంది తెల్లగా ఉంటారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఒక్క శామ్‌పిట్రోడాయే కాదు.. మొత్తం కాంగ్రెస్ నేతలందరూ జాతివివక్ష వ్యాఖ్యలు చేస్తారంటూ బీజేపీ నేతలు మండిపడుతున్నారు.

బాణాసంచా కర్మాగారంలో భారీ విస్ఫోటం

» శివకాశిలో 8 మంది దుర్మరణం.. 14 మందికి తీవ్ర గాయాలు

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని విరుదునగర్ జిల్లా శివకాశి సమీపంలోని ఓ బాణసంచా కర్మాగారంలో భారీ విస్ఫోటం సంభవించింది. హఠాత్తుగా సంభవించిన పేలుడు కారణంగా ఐదుగురు మహిళలు సహా ఎనిమిది మంది దుర్మరణం చెందారు. మరో 14 మంది తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల్లోనూ మహిళలే అధికంగా వున్నారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. తిరుత్తంగల్ స్టాండర్డ్ కాలనీకి చెందిన శరవణన్ (55) సెంగమలపట్టిలో 'సుదర్శన్ ఫైర్ వర్క్స్' పేరుతో బాణాసంచా తయారీ కర్మాగారం నిర్వహిస్తున్నాడు. ఈ కర్మాగారంలోని ఓ గదిలో గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో హఠాత్తుగా పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి మిగిలిన గదుల్లోని బాణసంచా కూడా పేలిపోయింది. ఈ ప్రమాదంలో మొత్తం ఏడు గదులు కుప్పకూలగా, ఆయా గదుల్లో పని చేస్తున్న కార్మికుల శరీరాలు ఛిద్రమయ్యాయి. శివకాశి బాణాసంచా పేలుడు ఘటనపై రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

'ఆంధ్రజ్యోతి' బిజినెస్ ఎడిటర్ బాలాజీ కన్నుమూత

» 27 ఏళ్లపాటు జర్నలిస్టుగా సేవలు.. నేడు చీరాలలో అంత్యక్రియలు



హైదరాబాద్ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయుడు.. 'ఆంధ్రజ్యోతి' బిజినెస్ ఎడిటర్.. గార్లపాటి బాలాజీ (54) తీవ్ర అనారోగ్యంతో గురువారం ఉదయం కన్నుమూశారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన బాలాజీ ఆర్థిక శాస్త్రంలో ఎంఏ పూర్తిచేసి 1997లో పాత్రికేయ వృత్తిలోకి ప్రవేశించారు. తొలుత ఈనాడు బిజినెస్ డెస్క్‌లో సబ్ ఎడిటర్‌గా చేరారు. అనంతరం ఆ సంస్థలోనే కొన్నేళ్లు రిపోర్టర్‌గా పనిచేశారు. 2018లో 'ఆంధ్రజ్యోతి'లో చేరి.. బిజినెస్ ఎడిటర్‌గా సేవలందించారు. 27 ఏళ్లుగా బిజినెస్ జర్నలిజంలోనే ఉన్న ఆయన కెరీర్ మొత్తం హైదరాబాద్ కేంద్రంగానే కొనసాగింది. అయితే, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయన తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. అప్పట్నుంచీ.. హైదరాబాద్‌లోని తన ఇంటిలోనే చికిత్స పొందుతున్నారు. వారం రోజుల క్రితం ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి చేయిదాటి పోయిందని వైద్యులు చెప్పడంతో.. హైదరాబాద్ నుంచి గుంటూరుకు తీసుకెళ్లి, అక్కడ ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. బుధవారం రాత్రి నుంచి ఆయన పరిస్థితి విషమించిందని.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని.. గురువారం ఉదయం కన్నుమూశారని కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు స్వగ్రామం చీరాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కాగా, బాలాజీకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలిద్దరూ వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు.

మార్పు దిశగా ఒడిశా!

పట్నాయక్‌కు రాజకీయ పరీక్ష.. నవీన్ ఇమేజ్ బీజేడీని కాపాడేనా?.. పాతికేళ్ల వ్యతిరేకత అధిగమించేనా?

» విజయం కోసం బీజేపీ తహతహ
» పార్లమెంటు స్థానాలపై పట్టు బిగింపు
» 2019లో 8 నుంచి ఇప్పుడు 16కు ప్లాన్
» అధికారం కోసమూ పక్కా వ్యూహం
» కేడర్ లేక వెనుకబడిన కాంగ్రెస్ పార్టీ
» 13 నుంచి మూడు దశల్లో పోలింగ్



న్యూఢిల్లీ, మే 9: ఒడిశా ప్రజలు మార్పు కోరుకుంటున్నారా? పాతికేళ్ల నవీన్ పట్నాయక్ పాలనను మార్చాలని చూస్తున్నారా? ఇదే అదునుగా బీజేపీ పుంజుకుని, విజయం దక్కించుకునేందుకు తహతహలాడుతోందా? అంటే ఔననే అంటున్నారు పరిశీలకులు. అయితే, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఇమేజ్ కొంత వరకు అధికార పార్టీ బిజు జనతా దళ్(బీజేడీ)కి దన్నుగా నిలుస్తుందని.. అధికార పీఠాన్ని మరోసారి అందించే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. నవీన్ మంచితనం, పారదర్శక పాలన వంటివి ఆయనను కాపాడే అవకాశం ఉందని అంటున్నారు. అయినప్పటికీ ప్రస్తుతం జరుగుతున్న ఒడిశా అసెంబ్లీ ఎన్నికలు నవీన్ పట్నాయక్‌కు రాజకీయ పరీక్ష పెడుతున్నాయని చెబుతున్నారు. ఒడిశాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు మే 13న ప్రారంభమై జూన్ 1 వరకు మొత్తం మూడు దశల్లో జరగనున్నాయి. దీంతో ప్రధాన ప్రతిపక్షాలకు మరింత అవకాశం చిక్కినట్టయిందని పరిశీలకులు చెబుతున్నారు. ఇక, విపక్షాలు చేస్తున్న ఎన్నికల ప్రచారాలకు భారీ ఎత్తున ప్రజలు పోటెత్తుతున్నారు. ఈ నెల 6న ప్రధాని మోదీ బెర్హంపూర్, నబరంగ్‌పూర్‌లో నిర్వహించిన సభకు వేల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఒకవైపు వడగాడ్పులు, తీవ్రమైన ఎండ కొనసాగుతున్నా లెక్కచేయకుండా మోదీ సభకు హాజరు కావడం గమనార్హం. అదేవిధంగా ఏప్రిల్ 28న కేంద్రపారాలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహించిన సభకు కూడా ప్రజలు వేలాదిగా హాజరయ్యారు. 42 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా లెక్కచేయకుండా ఈ సభకు రావడం విశేషం. ఈ పరిణామాలను గమనిస్తే సుదీర్ఘ బీజేడీ పాలనను మార్చాలన్న స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్టు కనిపిస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే, సీఎం నవీన్ పట్నాయక్ ఇమేజ్ బీజేడీకి కలిసి వస్తుందని, ప్రభుత్వ వ్యతిరేకతను అడ్డుకునే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అధికార పార్టీ బీజేడీపై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తున్నా.. సీఎం నవీన్‌పై మాత్రం కాదని అంటున్నారు.

జూన్ 4తో సరి: మోదీ

ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తున్నారు. "జూన్ 4.. బీజేడీ ప్రభుత్వానికి ఎక్స్‌పెయిరీ డేట్. ఆ రోజుతో ఆ పార్టీ ప్రభుత్వం సరి" అని వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాదు.. తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని జోస్యం చెబుతున్నారు. మరోవైపు రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అంచనా ప్రకారం ఒడిశాలోని లోక్‌సభ స్థానాల్లో బీజేపీ భారీ ఎత్తున పుంజుకుంటుందని చెబుతున్నారు.

విసిగిపోయాం: జనం

క్షేత్రస్థాయిలో జరుగుతున్న పలు సర్వేల్లో ప్రజలు బీజేడీ సర్కారుతో విసిగిపోయామని చెబుతున్నారు. ఈ దఫా తాము బీజేపీకి వేటేయాలని నిర్ణయించుకున్నామని చెబుతుండడం గమనార్హం. ఇక్కడ బీజేపీ కంటే కూడా.. ప్రధాని మోదీ ఇమేజ్ ఎక్కువగా పని చేస్తుండడం గమనార్హం. టీకొట్లు, బడ్డీ కొట్లు ఇలా జనసమర్థం ఉన్న ప్రాంతాల్లో ప్రజల అభిప్రాయం తీసుకున్నప్పుడు మెజారిటీ అభిప్రాయం బీజేడీకి వ్యతిరేకంగానే ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇక్కడి వారు.. బీజేడీకి వ్యతిరేకంగా ఓటేస్తామని చెబుతున్నారు. ముఖ్యంగా పేదలు, గిరిజనులు మార్పు కోరుకుంటున్నారు. దీంతో వీరి సంప్రదాయ ఓట్లు ఈసారి బీజేడీ నుంచి బీజేపీకి మారే అవకాశం కనిపిస్తోంది. అయితే.. కొన్ని చోట్ల మాత్రం కాంగ్రెస్ కూడా పోటీ ఇస్తుండడంతో త్రిముఖ పోరులో ఓటు ఎటు పడుతుందనేది ఆసక్తిగా మారింది. పట్టణ, నగర ప్రాంతాల్లో ఓటర్లను సోషల్ మీడియా ప్రభావితం చేస్తోంది. ఇక, రాజధాని భువనేశ్వర్ వంటి కీలక నగరాల్లో ప్రజలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. బీజేపీ అద్భుతాలు ఏమీ చేయలేదని అంటున్నా.. ఈసారి మార్పు కోరుకుంటున్నట్టు చెబుతున్నారు. ఈ పరిణామం బీజేపీకి మేలు చేసే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

పోల్ మేనేజ్‌మెంట్‌లో బీజేడీ దూకుడు

గత పాతికేళ్లుగా అధికారంలో ఉండడంతో బీజేడీకి క్షేత్రస్థాయిలో బలమైన కార్యకర్తలు, పార్టీని ముందుకు నడిపించే నేతలు, పోల్ మేనేజ్‌మెంట్ చేసేవారు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఇదే సమయంలో కాంగ్రెస్‌కు బలమైన కేడర్ లేకపోవడంతో ప్రభుత్వ వ్యతిరేకతను అందిపుచ్చుకోవడంలో వెనుకబడింది. బీజేపీ విషయాన్ని గమనిస్తే గత పదేళ్లుగా ఒడిసాపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కార్యకర్తలను పెంచుకోవడం, నాయకులను ప్రోత్సహించడంలో ముందుంది. ఫలితంగా 2019 పార్లమెంటు ఎన్నికల్లో ఒడిసాలోని 21 స్థానాలకుగాను ఏకంగా 8 చోట్ల బీజేపీ విజయం నమోదుచేసింది. కాంగ్రెస్ ఒకస్థానానికే పరిమితం కాగా అధికార బీజేడీ 12 స్థానాలు దక్కించుకుంది. ఈ పరిణామం ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీకి మరింత కలిసివస్తోందని అంటున్నారు పరిశీలకులు. గత ఎన్నికల్లో 8 చోట్ల గెలిచిన కమలనాథులు తాజా ఎన్నికల్లో ఈ సంఖ్యను రెట్టింపు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

అసెంబ్లీ సీట్లపై కూడా..

ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లోనూ పుంజుకునేందుకు బీజేపీ తీవ్రంగా శ్రమిస్తోంది. గత 2019 ఎన్నికల్లో నవీన్ నేతృత్వంలోని అధికార పార్టీ బీజేడీ 147 స్థానాలకు గాను 112 చోట్ల విజయం దక్కించుకుంది. ఇక, బీజేపీ 2014లో గెలుచుకున్న 13 స్థానాలను కాపాడుకుంటూ మరో 10 స్థానాల్లో పుంజుకుంది. మొత్తంగా 23 చోట్ల విజయం దక్కించుకున్న ప్రధాన ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీ కేవలం 9 స్థానాలకే పరిమితమైంది. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండడం గమనార్హం.

చౌతాలా పార్టీలో చీలిక!

» హరియాణా సంక్షోభంలో మరో మలుపు



న్యూఢిల్లీ, మే 9 (ఆంధ్రజ్యోతి): హరియాణాలో రాజకీయ సంక్షోభం కొత్త మలుపులు తీసుకుంటోంది. కాంగ్రెస్‌తో కలిసి బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని భావిస్తున్న జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) చీలిక ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఆ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేల్లో నలుగురు గురువారం బీజేపీ నేత, రాష్ట్ర మాజీ సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ విలేకర్లతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని, మార్చిలో జరిగిన విశ్వాస పరీక్షలో విజయం సాధించామని, అవసరమైతే మరోసారి విశ్వాసపరీక్షకు సిద్ధమని స్పష్టం చేశారు. మరోవైపు, దుష్యంత్ చౌతాలా గురువారం రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయకు లేఖ రాశారు. బీజేపీ ప్రభుత్వం మైనారిటీలో పడినందున శాసనసభలో మెజారిటీ నిరూపించుకోవల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కూడా గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరింది. రాష్ట్రంలో పరిస్థితులను వివరించటానికి శుక్రవారం తమకు సమయం ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకోవడంతో హరియాణలో సీఎం నాయబ్‌సింగ్ సైనీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీలో పడిన విషయం తెలిసిందే. 90 సీట్లు ఉండే హరియాణా అసెంబ్లీలో రెండు సీట్లు ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం 88 మంది సభ్యులు ఉన్నారు. మెజారిటీకి 45 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా బీజేపీకి శాసనసభలో 40 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. 10 మంది సభ్యులు ఉన్న జేజేపీ తొలుత బీజేపీకి మద్దతు ఇచ్చినప్పటికీ మార్చిలో ఉపసంహరించుకుంది. కాంగ్రెస్‌కు 30 మంది ఎమ్మెల్యేలున్నారు. ఐఎన్ఎల్‌డీ, హరియాణా లోక్‌హిత్ పార్టీలకు చెరో ఎమ్మెల్యే ఉన్నారు. ఆరుగురు ఇండిపెండెంట్లు. కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే మరో 15 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. అక్టోబరులో హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది.

అధికారం.. మోదీ చేజారుతోంది: రాహుల్

న్యూఢిల్లీ, మే 9: దేశంలో ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు మోదీ చేజారిపోతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దాంతో ప్రజల దృష్టిని మరల్చేందుకు ఆయన కొత్త నాటకానికి తెరలేపే అవకాశాలు ఉన్నాయని, దేశ యువత ఆ మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గురువారం 'ఎక్స్'లో రాహుల్ గాంధీ వీడియో సందేశం విడుదల చేశారు. జూన్ 4న తాము అధికారం చేపట్టబోతున్నామని, ఆగస్టు 15 నుంచి 30 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టబోతున్నామని ప్రకటించారు. యువతే దేశానికి బలం అని అన్నారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న చిరంజీవి

చిరంజీవికి పద్మవిభూషణ్ ప్రదానం

న్యూఢిల్లీ, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు చిరంజీవి, ప్రముఖ నర్తకి వైజయంతీ మాల బాలికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలో రెండో అత్యున్నతమైన పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందజేశారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్, చిరంజీవి కుమారుడు, ప్రముఖ సినీ నటుడు రాంచరణ్, ఆయన సతీమణి ఉపాసన తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పురస్కారాల ప్రదానంలో భాగంగా ఇద్దరికి పద్మవిభూషణ్, 9 మందికి పద్మభూషణ్, 55 మందికి పద్మశ్రీలను రాష్ట్రపతి బహూకరించారు. సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీవీ, బీజేపీ నేతలు సత్యవ్రత ముఖర్జీ, ఓ రాజగోపాల్, దివంగత సినీనటుడు విజయకాంత్, లద్దాఖ్ ఆధ్యాత్మిక గురువు తోగ్దాన్ రింపోచే, గుజరాతీ పత్రిక జన్మభూమి ఎడిటర్ కుందన్ వ్యాస్, బాంబే సమాచార్ యజమాని హోర్ముస్ జీ కామా తదితరులకు పద్మభూషణ్ ప్రదానం చేశారు. విజయకాంత్, ఫాతిమా బీవీ, సత్యవ్రత ముఖర్జీ బంధువులు వారి తరఫున పురస్కారాన్ని స్వీకరించారు. కాగా పద్మశ్రీ పురస్కారాలు స్వీకరించిన తెలుగు వారిలో యాదాద్రి శిల్పకారుడు వేలు ఆనందాచారి, హరికథా కళాకారిణి ఉమామహేశ్వరి, ప్రముఖ సాహితీ వేత్త, ఇంటినే గ్రంథాలయంగా మార్చిన కూరెళ్ల విఠలాచార్య ఉన్నారు. గుజరాత్‌కు చెందిన సాహితీవేత్త, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత రఘువీర్ చౌదరి, తొలి మహిళా మావటి పర్బతి బారువా, ఆదివాసీ పర్యావరణవేత్త చామి ముర్ము తదితరులు కూడా పద్మశ్రీ పురస్కారాలను స్వీకరించారు. కాగా, 2024 పద్మ అవార్డుల ప్రదానోత్సవ తొలివిడత కార్యక్రమాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 22న చేపట్టగా.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పద్మవిభూషణ్, మరికొంత మందికి పద్మ పురస్కారాలను రాష్ట్రపతి అందించగా.. గురువారం మిగతా వారికి అందజేశారు.

మోదీ, రాహుల్.. డిబేట్‌కి రండి

» ఇద్దరు మాజీ న్యాయమూర్తులు, హిందూ ఎడిటర్ ఆహ్వానం

న్యూఢిల్లీ, మే 9: రిజర్వేషన్లు, ఆర్టికల్ 370, సంపద పంపిణీ, ఎన్నికల బాండ్లు.. ఇలా పలు అంశాలపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పర విమర్శలు, ఆరోపణలతో వాగ్యుద్ధాలకు దిగడం చాలాకాలంగా చూస్తున్నదే! అయితే.. ఇలా ఆరోపణలు, దూషణలతో సరిపెట్టకుండా ఆయా అంశాలపై ఇరుపార్టీల నేతల నడుమ సహేతుక చర్చ జరిగితే తాము ఎవరికి ఓటేయాలో ప్రజలు నిర్ణయించుకోగలుగుతారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకూర్, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఏపీ షా, హిందూ పత్రిక సంపాదకుడు ఎన్.రామ్ భావించారు. ఈమేరకు వారు.. పబ్లిక్ డిబేట్‌కు రావాల్సిందిగా కోరుతూ ప్రధాని మోదీకి, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌కి లేఖ రాశారు. ఇరుపార్టీల నేతల మధ్య బహిరంగ చర్చ జరిగితే.. ప్రశ్నలు, ఆరోపణలు మాత్రమే కాక సమాధానాలు కూడా ప్రజలు వినగలుగుతారని, ఎవరికి ఓటేయాలో తేల్చుకుంటారని లేఖలో పేర్కొన్నారు.

మోదీ 'బాబ్రీ తాళం' వ్యాఖ్యలు అబద్ధం: ప్రియాంక

రాయ్‌బరేలి (ఉత్తరప్రదేశ్), మార్చి 9: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అయోధ్యలోని రామాలయానికి 'బాబ్రీ తాళం' వేస్తారంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధమని ఆ పార్టీ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా గురువారం అన్నారు. తాము కోర్టు తీర్పులను గౌరవిస్తామని స్పష్టం చేశారు. కోర్టు తీర్పును గౌరవించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు పేర్కొందని, గతంలోనూ ఇది పాటించామని, భవిష్యత్తులోనూ ఇదే చేస్తామని పాత్రికేయులతో ఆమె అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి మాట్లాడే ముందు ప్రధాని ఒకసారి దానిని చదవాలని ఆమె సూచించారు. కాగా, "జూన్ 4న కాంగ్రెస్ సారథ్యంలోని ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది" కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ తెలిపారు.

బడుగులే బలి!

» ల్యాండ్ టైటిల్ చట్టంతో ఎక్కువ నష్టపోయేది వారే
» భూమిపై వివాదం వస్తే వారి గోడు వినేదెవరు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ చట్టంతో లాభం ఎవరికి? ఈ ప్రశ్నకు తడుముకోకుండా సమాధానం చెప్పేది ఎవరు? రైతుల్లో అలజడి ఉంది. ఆ చట్టం మా మేలు కోసమే అని చెప్పేందుకు వారు సాహసించడం లేదు. ఇక ఈ చట్టాన్ని అడ్డం పెట్టుకొని లబ్ధిపొందేది ఎవరు? భూముల దురాక్రమణ దారులు, కబ్జాకోరులు, లిటిగేషన్‌లు పుట్టించి భూ యజమానులను వేధించుకుతినే వారు, ఇంకా లంచాలకు రుచిమరిగి అడ్డగోలు పనులు చేసే వారికే ఈ చట్టం ప్రత్యక్షంగా లాభంచేకూర్చనుంది. మరి ఈ చట్టం కింద బాధితులు ఎవరు? ప్రతి రైతూ బాధితుడే. వివాదంలో భూమి ఇరుక్కుంటే ప్రతి భూ యజమానీ బాధితుడే. సివిల్ కోర్టులకు వెళ్లి న్యాయం పొందే హక్కును ఈ చట్టం కాలరాసింది. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిందే. ఏ స్థాయిలో న్యాయం దొరక్కపోయినా పేదలు, బడుగువర్గాల రైతులు బలికావాల్సిందే. అప్పటికీ ఎవరికైనా ఆశలు ఉంటే చివరి ప్రయత్నంగా హైకోర్టుకు వెళ్లాల్సిందే. ఇదీ జగన్ సర్కారు తీసుకొచ్చిన టైటిల్ చట్టం ప్రసాదించే ఊహించని కష్టం.

చట్టం ఇలా..

రాష్ట్రంలో రైతులకు శాశ్వత భూ హక్కు కల్పించే పేరిట జగన్ సర్కారు ల్యాండ్ టైటిల్ (భూ యజమాన్యపు) చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం గత ఏడాది అక్టోబరు 31నే అమల్లోకి వచ్చింది. చట్టం అమలులో భాగంగా డిసెంబరులో ల్యాండ్ అథారిటీని కూడా ఏర్పాటు చేశారు. అయితే, అప్పటికే రైతులు, ప్రజాసంఘాలు, న్యాయవాదులు ఆందోళన చేయడంతో ప్రభుత్వం తోకముడిచింది. ఇప్పుడు మళ్లీ అమలు చేయడానికి యత్నిస్తోంది.

వివాద రిజిస్టర్ ఇలా..

తొలుత గ్రామం వారీగా ఇప్పుడున్న రికార్డుల ప్రకారం భూముల రికార్డును నోటిఫై చేస్తారు. ఇక అందులో ఏదైనా భూమిపై ఎవరైనా వివాదం రాజేయవచ్చు. అంటే, ఆ భూమి తమదనో, లేక తమ వారసులదనో దొంగ డాక్యుమెంట్లు సృష్టించి టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి ముందు ఫిర్యాదు చేస్తే చాలు. అవి వాస్తవమైనవా? కాదా? అని విచారించరు. నేరుగా సంబంధిత భూమిని వివాద రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఇక ఆ భూమి తనదే అని ఆ రైతు నిరూపించుకోవాల్సిందే. ఆ రైతు గోడు టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి వినరు. ఆ వివాదాన్ని ల్యాండ్ టైటిల్ అప్పిలేట్ అధికారి పరిష్కరించాలి. ఆ పోస్టులో రిటైర్డ్ ఐఏఎస్‌ను ప్రభుత్వం నియమిస్తుంది. తమకు అస్మదీయులైన వారినే ప్రభుత్వం ఏరికోరి ఆ పోస్టుకు పంపిస్తుంది. కాబట్టి వారు ప్రభుత్వ ఒత్తిళ్లకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకుంటారు. ఇక రైతుల మాట వారెక్కడ వింటారు? అదే పరిస్థితి వస్తే రైతులు అధికారుల ముందు మోకరిల్లి న్యాయం చేయండి అని బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి వస్తుందని రెవెన్యూ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్వోఆర్‌తో కోర్టే శ్రీరామరక్ష!

ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తక చట్టం-1971(ఆర్వోఆర్) రైతులకు భూమిపై హక్కులు కల్పిస్తోంది. భూమిపై వివాదాలొస్తే.. అంటే, రెవెన్యూ అధికారులు ఏదైనా లిటిగేషన్ సృష్టించినా, ఉన్న భూమి విస్తీర్ణంలో కోత పెట్టినా, ఇతరత్రా ఇబ్బందులు పెట్టినా రైతు నేరుగా సివిల్ కోర్టుకు వెళ్లి న్యాయం పొందవచ్చు. వారసత్వ, గట్టు తగాదాలు వచ్చినా సత్వర న్యాయం పొందవచ్చు. రైతుల భూముల విషయంలో ఏవైనా తేడాలు చేసినా, రాత్రికి రాత్రి భూముల రికార్డులను, విస్తీర్ణాలను మార్చేసినా రైతులు వెంటనే కోర్టు కెళ్లే అవకాశం ఉంది. ఈ భయం రెవెన్యూ అధికారుల్లో ఉంది. కోర్టులకు వెళ్తే న్యాయం దక్కుతుందనే భరోసా రైతులకు ఉంది.

కచ్చితంగా పేద, బడుగు రైతులే బలి!

వివాద రిజిస్టర్ అనేది రైతుకు నష్టం కలిగించేదే అని రెవెన్యూ నిపుణుడు ఎన్.గోపాలరావు స్పష్టం చేశారు. తన భూమిపై ఎవరైనా అన్యాయంగా వివాదం రాజేస్తే రైతు సివిల్‌కోర్టులకు వెళ్లకుండా నిరోధించారని, ఇది ప్రాథమిక హక్కులకు, సహజ న్యాయసూత్రాలను అడ్డుకోవడమేనని చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. "రెవెన్యూ శాఖ నివేదిక ప్రకారం, రాష్ట్రంలో 1.35 కోట్ల సర్వే నంబర్లలో 3.40 కోట్ల ఎకరాల భూమి ఉంది. ఇందులో 30 సెంట్ల నుంచి ఎకరం భూమి ఉన్న రైతులు 42 లక్షల మంది ఉన్నారు. రెండెకరాల భూమి ఉన్న రైతులు 26 లక్షల మంది ఉన్నారు. సగటున మూడు ఎకరాలున్న వారు 21 లక్షల మంది ఉన్నారు. వీరంతా పేద, బడుగువర్గాల వారే. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ కక్షలు, విబేధాలు బలంగా నాటుకుపోయాయి. ఏ చిన్న వివాదం దొరికినా పెత్తందారులు పేదలపై ప్రతాపం చూపిస్తున్నారు. రాజకీయంగా దారికి రాని వారిని, తమ చెప్పుచేతల్లో అణిగిమణిగి ఉండనివారి భూములను వివిధ కారణాలతో 22(ఏ) నిషేధ భూముల జాబితాలో చేర్పించారు. ఇంకా కొందరి భూములను రెవెన్యూ రికార్డుల్లో పంటకాలువ, పోరంబోకు, చెరువు శిఖంలుగా భూమి స్వభావాన్ని మారిపించారు. ఆ వివాదాల నుంచి బయటపడటానికే రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి పనులుకాక అలసిసోయారు. ఇక ఈ టైటిల్ చట్టంలోని వివాద రిజిస్టర్ గ్రామ పెత్తందారులు, భూస్వాములకు.. మరీ ముఖ్యంగా అధికారపార్టీ నేతలకు పెద్ద అస్త్రంగా మారే ప్రమాదం ఉంది. 'ఈ విధానంలో ఉద్దేశపూర్వక వివాదాలు పుట్టించే ప్రమాదం పొంచి ఉంది. ఇద్దరు వ్యక్తులు, రెండు సంఘాలు, సంస్థలు, సమూహాల మధ్య వివాదాలు ఉన్నా వారికి సంబంధించిన భూములపై వివాదం రాజేసి వారిపై పంతం తీర్చుకునే అవకాశానికి పాల్పడతారు. అదే జరిగితే, ఎక్కువగా నష్టపోయేది పేద, బడుగువర్గాల వారే. వివాదం మొదలవ్వగానే కోర్టుకు వెళ్లడానికి లేకుండా చేశారు. ఏదైనా అప్పిలేట్ అధికారికే చెప్పుకోవాలి. పేద, బడుగు రైతు మాట ఆ అధికారి వింటారా? లేక రాజకీయ పలుకుబడి ఉన్న పెత్తందారులు, అధికార పార్టీ నేతల మాటలే వింటారు. అలాంటప్పుడు పేదలకు తక్షణ న్యాయం దొరకదు. అప్పుడు ల్యాండ్ అథారిటీలో మరోసారి రైతు అప్పీల్ చేసుకోవాలి. అక్కడా న్యాయం దొరకుతుందన్న గ్యారంటీ లేదు. చిన్న, పేద రైతులు భూమి వివాదాల నుంచి బయటపడటానికి అయ్యే ఖర్చును భరించడం కష్టతరంగా ఉంటుంది. ఆ వివాదం నుంచి బయటపడటానికి ఇతర ఆస్తులు అమ్ముకునే పరిస్థితి వస్తుంది. అది మరింత దారుణమైన పరిస్థితి" అని ఎన్. గోపాలరావు చెప్పారు.

టైటిల్ చట్టంలో అధికారుల దయే!

జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ చట్టంలో రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసే అంశాలు రెండు ఉన్నాయి. అందులో ఒకటి వివాద రిజిస్టర్. రెండోది సివిల్ కోర్టులకు వెళ్లే అవకాశం లేకుండా చేయడం. ఆర్వోఆర్ చట్టంలో వివాద రిజిస్టర్ లేదు. ఇప్పుడున్న చట్టాల ప్రకారం భౌతికమైన ఆర్ఎస్ఆర్, వెబ్‌ల్యాండ్‌లోని డిజిటల్ ఆర్ఎస్ఆర్‌నే చట్టబద్ధమైన ప్రామాణిక రిజిస్టర్‌గా పరిగణిస్తున్నారు. ప్రత్యేకంగా వివాదాల రిజిస్టర్ అంటూ లేదు. కానీ టైటిల్ చట్టంలో ప్రత్యేకంగా వివాద రిజిస్టర్ ఉంది. రైతుల భూములపై ఎవరైనా దొంగ డాక్యుమెంట్లు సృష్టిస్తే ఇక అంతే! కోర్టులతో పనిలేదు కనుక ప్రభుత్వ కనుసన్నల్లో ఉండే అధికారులు, రాజకీయ నేతల ఒత్తిడితో అక్రమార్కులకు కొమ్ముకాస్తే రైతుల భూములు గల్లంతే!

ఇంతకంటే దుర్మార్గం ఉంటుందా?!

"రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులను కల్పిస్తోంది. న్యాయం పొందే హక్కును కూడా ఇచ్చింది. కానీ ప్రభుత్వం తీసుకొచ్చిన టైటిల్ చట్టం ఈ హక్కును కాలరాస్తోంది. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమైనది. భూ తగాదాలు వచ్చినప్పుడు కోర్టులకు వెళ్లి న్యాయం పొందాలని ఆర్వోఆర్ చట్టం చెబుతోంది. కానీ టైటిల్ చట్టం సివిల్ కోర్టులకు వెళ్లడానికి వీల్లేదని చెబుతోంది. ఈ చట్టానికి సివిల్ ప్రొసీజర్‌కోడ్ కూడా వర్తించదని రాసుకొచ్చారు. ఇంతకు మించిన దుర్మార్గం మరొకటి లేదు"

-ఎన్. గోపాలరావు, రెవెన్యూ నిపుణుడు

కసితీరా ఓటేశారు!

» పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 4.32 లక్షలు
» 2019లో కంటే రెట్టింపుగా నమోదు
» ఈ పట్టుదల దేనికి సంకేతమని చర్చలు


అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు కసితీరా ఓటేశారు. పోస్టల్‌లో బ్యాలెట్ల ద్వారా దాదాపు 5లక్షల మంది వరకు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 2,38,468 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి. ప్రస్తుతం ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు 4,32,222 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. గురువారం (9న) జరిగిన పోలింగ్‌ను కూడా కలుపుకుంటే 5లక్షల మంది వరకూ ఓట్లు వేసి ఉంటారని ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి వివరాలను ఈసీ ఇంకా వెల్లడించాల్సి ఉంది. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు గత ఐదు రోజుల నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో, జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో మండుటెండను సైతం లెక్కచేయకుండా, గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. కొన్నిజిల్లాల్లో అధికారులు మీ ఓట్లు ఇక్కడ లేవని అక్కడకు, అక్కడ లేవని ఇక్కడకు తిప్పినా పట్టువదలని విక్రమార్కుల్లా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. గతంలో కన్నా ఎక్కువగా పోలింగ్ నమోదు చేశారు. ఈ పట్టుదల దేనికి సంకేతమన్న చర్చ సర్వత్రా మొదలైంది. తుది సమాచారం ప్రకారం 8వ తేదీ నాటికి 4,32,222 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురువారం వీరితో పాటు ఎన్నికల విధుల్లో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, కాంట్రాక్టు ఉద్యోగులు ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద బారులుదీరారు. కాగా, అనంతపురం అర్బన్‌లో అత్యధికంగా 5,478 ఓట్లు, మంత్రాలయం అసెంబ్లీ పరిధిలో అత్యల్పంగా 702 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గంలో అత్యధికంగా 23,574 ఓట్లు, నర్సాపురం పార్లమెంటు స్థానంలో అత్యల్పంగా 13,177 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి.

లోకం తీరు









ఎవరు గెలిచినా మీదే గెలుపు
రాష్ట్ర స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ....
దోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీకి / కూటమికి ఎన్ని సీట్లు వస్తాయి...
మీ అంచనాలను ఈ క్రింది గడిలో తెలియజేయగలరు.

మొత్తం సీట్లు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి
ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.






Sathya.retail
మన సత్యా ఇప్పుడు
విజయవాడ లో
2వ షోరూమ్
ఏలూరు రోడ్, (రామమందిరం దగ్గర)
సత్యా
అంటే సంతోషం
ప్రారంభోత్సవ ఆఫర్‌గా,
రూ. 20000 పైగా
వస్తువులు కొనుగోలు చేసే అందరికీ
బంగారు నాణెం ఉచితం
మే 10 నేటి నుండి
SATHYA SPREADING HAPPINESS
చల్లగా చల్లగా AC OFFER
అన్ని బ్రాండ్ల AC లు
అతి తక్కువ ధరలకే లభిస్తాయి
VOLTAS LG BLUE STAR DAIKIN Haier Carrier GENERAL SAMSUNG Godrej Panasonic HITACHI LLOYD IFB ONIDA
3 Star AC ₹28990 onwards
5 Star AC ₹34990 onwards
EMI ₹1999 onwards 0 Down Payment
upto ₹5000 Exchange Offer
upto ₹5000 Cash Back
20% OFF
Authorised Reseller
iPhone 15 128 GB
Effective Price ₹40,900 ₹79,900
Buy Smartphone
₹1499 worth Bluetooth Neckband FREE*
0 Down Payment*
Cash Back ₹3000* HDFC BANK
Buy Fridge (Refrigerator) & get upto 46% OFF
Buy Side By Side Refrigerator & get 10990 worth Mini Refrigerator FREE*
Buy Double / Single Door Refrigerator & Get Electric Rice Cooker (or) Pressure Cooker FREE*
upto ₹5000 HDB Cash Back
LG SAMSUNG Haier Whirlpool Godrej IFB BOSCH VOLTAS beko
Buy Washing Machine & get upto 54% OFF
8 kg Washing Machine EMI ₹1791*
Buy Whirlpool Front Loading Washing Machine & get ₹8500 worth VIP STROLLEY FREE
Buy Top Load Washing Machine & get Iron Box FREE*
LG SAMSUNG Haier Whirlpool IFB Panasonic BOSCH Godrej
Buy LED TV
EMI ₹999* onwards
0 Down Payment*
Buy any OLED FREE*
Buy any 55" & 65" LED & get ₹15499 worth Sound Bar FREE*
Buy any 75" LED Sound Bar FREE*
upto ₹15000* Cash Back Offer
Buy Kitchen Appliance
& get upto 63% COMBO OFF
& get upto 10% OFF
& get ₹1000 worth Non Stick Tawa FREE*
Buy Water Purifier & get Butterfly Electric Kettle FREE*
Buy Pedestal Fan & get 3 Pcs Set FREE*
Buy Laptop ₹23,700 onwards
DELL hp acer SAMSUNG
Buy Water Heater Bath Towel FREE*
Air Coolers ₹5,490 onwards
Available PS5
*T&C Apply
Scan to find our Showroom Locations
Scan to know Prices, Offer details & to Shop Online www.sathya.store
Whatsapp: 99166 98985 or Call: 88805 98985
For corporate bookings or bulk orders, mail us: corporatesales@sathya.email
Extended Warranty Available onsitego
SATHYA SPREADING HAPPINESS
ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర, అరుండల్‌పేట, గవర్నర్ పేట, విజయవాడ. PH: 96426 97986, 63017 94441, 87544 74985
శ్రీ హరి సూపర్ మార్కెట్ పక్కన, పాత చెక్ పోస్ట్, ఆటోనగర్, విజయవాడ. PH: 81060 84659, 90309 94899
Our Branches now: Naidupeta Opp. to Railway Station 8754469985 | Sulurpeta SHAR Byepass Road 91501 75985 | Chittoor Near Old Bus Stand 9003179985 | Tirupathi (Thirumala Road 7845229985 & Air Byepass Road 78453 63985) | Venkatagiri RTC Bus Stand Road 7338740985 | Pileru Cross Road Junction 78453 45985 | Tadipatri Canara Bank Road 95001 21985 | Chilkulurpeta Near India Bank GT Road 73583 80985 | Palamnar Near Old Canara Bank 73387 96985 | Bapatla 6304983454 | Koduru 9789778985 | Tenali 9866865813 | Nellore 7026278985 | Vijayawada 81060 84659 | Guntur 99661 14412
త్వరలో Punganur | Sri Kalahasti | Nandyal | Narasaraopet | Rajampet | Machilipatnam | Vijayawada | Kurnool | Ongole | Proddutur | Badvel | Puttur | Rayachoti | Anantapur | Adoni | Vinukonda | Kadapa | Tadepalligudem | Thadapali | Guntur | Madanapalli | Chirala | Bhimavaram | Eluru | Buchireddy Palem | Kadiri | Kavali | Kaikalur | Gudivada | Atmakur | Tanuku | Mydukur | Vuyyur
Now 200+ Showrooms

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జనాభా విశేషాలు

బిడ్డలు ఎక్కువ కన్నతల్లినే భాగ్యవతన్నారానాడూ, సౌభాగ్యవత న్నారానాడూ/ బిడ్డలు లేని గొడ్రాలికే గౌరవమన్నారీనాడు – యాభై ఏండ్ల కిందట ఎన్ టి రామారావు తన సొంత సినిమాలో ఈ పాటను అందించారు. ఇక్కడ పలుకు కొసరాజుది అయినా, భావం ఎన్టీయా ర్‌దే. ఆయనకు కుటుంబ నియంత్రణ మీద భిన్నమయిన అభిప్రాయం ఉండేదని ఆయన పిల్లల సంఖ్యను బట్టే అర్థం చేసుకోవచ్చు. పరిమిత సంతానం అన్న భావన ఆనాటికి ఇంకా సార్వజనీనం కాలేదు. దాన్ని పిదప కాలపు పోకడగా భావించినవారూ ఉండేవారు. కుబేరులకు ఎందరు సంతానమున్నా భాగ్యమే అనుకోవచ్చును కానీ, కుచేలురకు అధిక సంతానం దౌర్భాగ్యమే అవుతుందని మన సమాజం క్రమంగా అర్థం చేసుకుంటూ వస్తోంది. ధనమున్నా లేకపోయినా మిత సంతానమే ఆధునిక కాలంలో, పిల్లల పోషణకు, వికాసానికి ఉత్తమమని అనుభవపూర్వకంగా తెలిసి వస్తోంది. ఈ అవగాహన సర్వవ్యాప్తం కావడం ఇంకా పూర్తి కాలేదు.

ఫలానా మతం వారు ఎక్కువ మంది పిల్లలను కంటున్నారని, ఇక దేశమంతా వారి చేతిలోకి వెళ్లిపోతుందని అనవసరపు భయాలు కల్పిస్తున్న శక్తులు కొన్ని ఉన్నాయి. అంకెలను పైపైన మాత్రమే చూసి, వాస్తవాన్ని విస్మరించే దుర్గుణం ఆ శక్తులకు ఉన్నది. అధికసంతానం ఏ మతవర్గానికి ఉన్నా, కులంలో ఉన్నా, అది ఆ సామాజిక శ్రేణిలో ఉన్న వెనుకబాటుతనాన్ని మాత్రమే సూచిస్తుంది. అంతేకాదు, ఆ సామాజిక వర్గంలో ఆడవారి స్థితిగతులను, ప్రతిపత్తిని కూడా అధిక జనాభారేటు సూచిస్తుంది. అంతమాత్రమే కాదు, ఈ వెనుకబాటు తనం, విద్యారాహిత్యం, అవగాహనా రాహిత్యం, దారిద్ర్యం కులమతాలకు పరిమితమైనవే కావు, ప్రాంతాలను బట్టి కూడా ఆ పరిస్థితులు నెలకొని ఉంటాయి. అదే మతంవారిలో, అదే కులంవారిలో ఇతర ప్రాంతాల్లో భిన్నమయిన ఎంపికలు కనిపిస్తాయి.

నిజమే, 1951 నుంచి 2011 దాకా అరవై ఏండ్ల కాలంలో, ముస్లిముల జనాభా 4 శాతం పెరిగింది. ఆ మేరకు హిందువుల జనాభా శాతం తగ్గింది. ఇంత మాత్రమే చెబితే, అవి గణాంక వివరాలే కావు. ఈ నాలుగు శాతం పెరుగుదల అరవయ్యేండ్ల కిందట కనిపించిన వేగం ప్రకారం జరిగిందా? ఆ వేగంలో హెచ్చుతగ్గులు ఉన్నాయా? మరో 30, 40 ఏండ్లకు, లేదా మరో అరవయ్యేళ్లకు ఆ పెరుగుదల ఎనిమిది శాతమో, అంతకంటె ఎక్కువో కానున్నదా? ఈ ప్రశ్నలు వేసుకోకపోతే, కేవలం 4 శాతం పెరుగుదల అన్న సమాచారం అర్థం కాదు. ముస్లిమ్ స్త్రీ జీవిత కాలంలో జన్మనిస్తున్న సంతానం 1992లో 4.4 (అంటే 100 మంది ముస్లిమ్ స్త్రీలు తమ గర్భధారణ యోగ్య వయస్సులో 440 మంది సంతానాన్ని కంటారు), అదే , 2015 వచ్చే సరికి ఆ రేటు 2.6కు (అంటే 100 మంది ముస్లిమ్ మహిళలు 260 మంది పిల్లలకు జన్మనిస్తున్నారు) తగ్గిపోయింది. హిందూ స్త్రీల సంతాన శీలత 1992లో 3.3 కాగా, అది 2015లో 2.1కు తగ్గిపోయింది. ఇప్పటికీ ముస్లిమ్ స్త్రీల సంతానశీలత ఎక్కువే, కానీ, అది పతనోన్ముఖంగా ఉన్నది. హిందువులలో కంటె వేగంగా తగ్గిపోతూ వస్తున్నది. అంటే త్వరలో, హిందూ ముస్లిమ్ మతస్థుల మధ్య ఉన్న సంతానశీలత అంతరం సరిసమానం కావడం జరుగుతుంది. ఇది ఎట్లా జరిగింది? పరిమిత కుటుంబం ఆవశ్యకతను గుర్తించడం వల్ల. ఆ గుర్తింపు ఎట్లా వస్తుంది? విద్య వల్ల, అవగాహన వల్ల. ఎంతమంది పిల్లలను కనాలన్న నిర్ణయంలో వారి వారి మతం కానీ, కులం కానీ వేసే ప్రభావం అతి తక్కువ. సాంస్కృతికంగా, ఆర్థికంగా ఆ శ్రేణుల స్థితిగతులే ఆ నిర్ణయం వెనుక కారణాలుగా ఉంటాయి. సంతానం పరిమితం చేయాలన్న ఆలోచన వెనుక ఆయా సామాజిక శ్రేణుల స్త్రీలు, ముఖ్యంగా నిరుపేద స్త్రీలు తీసుకున్న చొరవ అధికం.

దేవుడు ఇస్తుంటే, మనం కాదనడం ఎందుకు– అనే ధోరణి అన్ని మతాలలోను ఉంటుంది. కుటుంబ నియంత్రణ కూడా దైవేచ్ఛే అని నమ్మకం కుదిరిన తరువాత, ఆడ, మగ వ్యత్యాసాలు నియంత్రణ తీరును ప్రభావితం చేశాయి. ఆడపిల్లయినా, మగపిల్లవాడయినా ఒకటే, మగపిల్లల కోసం పిల్లల్ని కంటూ పోనక్కరలేదు అన్న అవగాహన పెంపొందడానికి సమానత్వ భావాలు వ్యాపించవలసి వచ్చింది. ఇప్పటికీ దేశంలో అనేక ప్రాంతాలు తక్కిన ప్రాంతాల కంటె వెనుకబడి, అధిక జనాభాతో ఉన్నాయి. జనన మరణాలు సరిసమానం అయ్యే రీతిలో జనాభా నియంత్రణ (2.1)ను కేరళ 1998లో, తమిళనాడు 2000లోనే సాధించాయి. 2005లోపు దక్షిణాది రాష్ట్రాలు అన్నీ ఆ మజిలీ చేరుకున్నాయి. ఈ స్థాయి చేరుకోవాలంటే బిహార్ 2039 దాకా నిరీక్షించాలి. బిహార్ తో పాటు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ ఇంకా జననమరణాల సరిసమాన రేటును అందుకోవలసి ఉన్నాయి. గత యాభై ఏండ్ల కాలంలో దక్షిణాది రాష్ట్రాల తలసరి ఆదాయం బాగా పెరిగింది. జనాభా బాగా తగ్గింది. ఉత్తరాది రాష్ట్రాల పరిస్థితి ఇందుకు పూర్తి తలకిందులు. నిధుల కేటాయింపులో జనాభాకు పెద్దపీట వేస్తారు. అందుకే నిధుల విషయంలో 15వ ఆర్థికసంఘం ఎదుట దక్షిణాది రాష్ట్రాలు నిరసన వ్యక్తం చేశాయి. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు తక్కువ నిధులివ్వడం ఏమి న్యాయం అని ప్రశ్నించాయి.

జనగణన అన్నది తలకాయల లెక్కింపు కాదు. దేశంలోని మానవవనరుల సర్వస్వం అది. దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక వాస్తవికతలకు ముడిసరుకు. అదే సమయంలో, వనరులకు, వసతులకు, జనసంఖ్యకు మధ్య ఆరోగ్యకరమైన నిష్పత్తిని నిర్వహించేందుకు పనికివచ్చే ప్రాతిపదిక. ప్రపంచపు లెక్కలతో పోల్చుకుంటే కొద్దిగా వెనుకబడిన మాట నిజమే కానీ, జనాభాను తగినంత స్థాయిలో తగ్గించే ప్రయాణంలో భారత్ చురుకుగానే కదులుతున్నది. జనాభా పెరుగుదలకు ప్రజలలోని కొందరిని పనిగట్టుకుని దోషులను చేసే ధోరణి పోవాలి. అణగారిన, వెనుకబడిన శ్రేణులలో, మారుమూల గ్రామసీమలలోనే ఇంకా కుటుంబ సంక్షేమ సందేశం చేరలేదు. అందుకు కారణాలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలి.

చేతగాని పాలనలో మోయలేని రుణభారం

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ కనీవినీ ఎరగని రీతిలో అప్పుల ఊబిలో కూరుకుపోయింది. నిర్దిష్ట ప్రణాళిక అనేది లేకుండా ఆర్థిక అరాచకత్వంలోకి రాష్ట్రాన్ని నెట్టేసిన ఈ ప్రభుత్వానికి దాన్నించి ఎలా గట్టెక్కగలమా అనే భయం, బెదురూ ఏకోశానా లేవు. వైసీపీ ప్రభుత్వం అధికారికంగానే కాకుండా అనధికారికంగా కూడ కుప్పలుతెప్పలుగా అప్పులు చేసింది. సాధారణంగా రాష్ట్రప్రభుత్వం చేసే అప్పులు పారదర్శకంగానే ఉంటాయి. ప్రభుత్వ బడ్జెట్ పుస్తకాలలో, ప్రభుత్వ వెబ్‌సైట్లలో అన్ని గణాంకాలు అందుబాటులోనే ఉంటాయి. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రజలందరికీ అవగాహన కల్పించడానికి కొన్ని సందర్భాలలో ప్రభుత్వాలు శ్వేతపత్రాలు ప్రచురించడం కద్దు. ఇవన్నీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు పాటించే విధానాలు, సంప్రదాయాలు. కానీ, వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆశ్చర్యకరంగా వాటి ఆనవాళ్లే తుడిచిపెట్టుకుపోయాయి. అప్పులు తేవడం కోసం ఆయన ప్రభుత్వం అనుసరించిన సృజనాత్మక పద్ధతుల్ని గమనిస్తే ఎవరికైనా కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ఉదాహరణకు మద్యం రాబడిని గ్యారంటీగా చూపించి దానిపై అప్పు తెచ్చారు. బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి లిక్కర్‌లోన్ పేరిట రూ. 1,400 కోట్లు అప్పు చేసిన జగన్ సర్కార్, 'లిక్కర్ బాండ్లు' పేరిట మరో 8,305 కోట్లు తీసుకుంది.

'అప్పు చేయడం తప్పుకాదు.. అమెరికా వంటి అగ్రరాజ్యం చేసిన అప్పులు ట్రిలియన్ల డాలర్లు దాటిపోయాయి. అంతెందుకు.. ఎన్డీఏ ప్రభుత్వం ఈ పదేళ్లలో చేసిన అప్పు కోటి కోట్లు దాటిపోయింది'.. అంటూ జగన్‌తో సహా కొందరు అధికార పార్టీ నేతలు గడుసుగా అప్పుల్ని సమర్థించుకోవడాన్ని చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది. 2002లో నాటి వాజ్‌పేయి ప్రభుత్వం తెచ్చిన ఎఫ్ఆర్‌బిఎం (ఫిస్కల్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ రెస్పాన్సిబిలిటీ) చట్టం ప్రకారం, రెవెన్యూ రాబడిని మించి ఖర్చు ఎక్కువైనప్పుడు ఏర్పడే రెవెన్యూ లోటును భర్తీ చేయడానికి రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3శాతం మించకుండా అప్పు తీసుకుని, అందులో అత్యధికభాగాన్ని మూలధన వ్యయం కోసం వినియోగించాలి. అంటే, తెచ్చిన సదరు అప్పు ద్వారా ఆస్తులను సృష్టించి ఆర్థికవ్యవస్థను పరిపుష్టం చేయాలి. ఆస్తుల కల్పనకు ఉపయోగపడే రంగాలలో సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, పోర్టులు, విమానాశ్రయాలు, ఇతర మౌలికసదుపాయాలు ప్రధానంగా ఉండాలి. కానీ, జగన్ సర్కార్ ఈ ఐదేళ్లలో తెచ్చిన అప్పుల్లో దాదాపు 28 శాతాన్ని మాత్రమే ఆస్తులను సృష్టించడానికి కేటాయించి మిగతా 72 శాతాన్ని రెవెన్యూవ్యయంగా మళ్లించేసింది. ఇక, అనధికార అప్పులన్నిటినీ నూటికినూరుశాతం రెవెన్యూ వ్యయంగా వాడేశారు. దీనివల్ల అప్పు చెల్లించాలన్నా, వడ్డీ కట్టాలన్నా మళ్లీ అప్పు తెచ్చుకోవాల్సిందే. ఈ అప్పులన్నీ భవిష్యత్‌తరాల వారి మెడలకు గుదిబండలుగా మారడం ఖాయం.



> అభివృద్ధి కుంటుపడితే రాష్ట్రానికి జరిగే అనర్థం ఏమిటో ప్రజలు గ్రహించాలి. ఇతోధికంగా ప్రగతిపథంలో సాగితేనే రాష్ట్రప్రభుత్వ ఆదాయం, ప్రజల వ్యక్తిగత ఆదాయం పెరుగుతాయి. ఆర్థిక కార్యకలాపాలు ఇబ్బడిముబ్బడిగా సాగితేనే రాష్ట్రం కళకళలాడుతుంది. అన్నివర్గాల ప్రజలకు ఉపాధి లభిస్తుంది. సమృద్ధిగా రాబడి ఉంటుంది. ప్రజలు ఈ వాస్తవాల్ని గ్రహించాలి. ఆర్థిక ఉగ్రవాదాన్ని వదిలించుకోవాలి.

జగన్ ప్రభుత్వం చేస్తున్న అనధికార అప్పులకు అసలు లెక్కలే లేవు. అవన్నీ రహస్యంగానే ఉంటున్నాయి. చివరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు సమర్పించే లెక్కల్లో సైతం పారదర్శకత లేదు. అప్పు అధికారికమైనా, అనధికారికమైనా ప్రభుత్వం గ్యారంటీలు ఇవ్వాల్సిందే. కార్పొరేషన్ల ద్వారా చేస్తున్న ఈ అప్పులకు ప్రభుత్వం ఏ ఆస్తులను గ్యారంటీలుగా చూపిస్తోందో వివరాలు అందించమని 'కాగ్' పదేపదే అడిగినా రాష్ట్రప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. అనధికారిక అప్పులను బహిర్గత పరచకపోవడానికి గల కారణాలలో మొదటిది – ఇంత భారీ మొత్తంలో అప్పుచేస్తున్నారా అని ప్రజల్లో చర్చ జరగకుండా చూడడం. రెండోది – మొత్తం అప్పులో మూలధన వ్యయం (ఆస్తుల కల్పన)కు కేటాయిస్తున్నది కేవలం 10–12 శాతం మించడం లేదన్న వాస్తవం బహిర్గతం కాకుండా జాగ్రత్తపడడం.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆర్థిక అంశాలలో రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతూ, చట్టవిరుద్ధ నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల భవిష్యత్తును పరాధీనంలోకి నెట్టడాన్ని ఆర్థికఉగ్రవాదంగానే భావించాలి. మితిమీరి అప్పు చేయడం ఎంత ప్రమాదకరమో ఆయనకు అవగాహన లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రజలకు తేటతెల్లం చేయాలని, అందుకు అసెంబ్లీ సహా పలు వేదికల్ని ఉపయోగించుకోవాలన్న ఇంగితం కూడ ఆయనలో లోపించింది. రాష్ట్రానికి అప్పులు పెరిగేకొద్దీ ప్రజలపై పన్నులభారం పెరుగుతుంది. ఆ క్రమంలోనే జగన్ ప్రభుత్వం చివరకు చెత్తమీద కూడా పన్ను విధించడంతో ప్రజలు ఈసడించుకుంటున్నారు. మరొక దారుణమేమిటంటే, అధిక మొత్తంలో అప్పు తెచ్చుకోవడం కోసం ఈ ప్రభుత్వం బడ్జెట్ అంచనాలను ఇష్టానుసారంగా పెంచుతూ పోవడం. ఆర్థికసంవత్సరం ఆరంభంలో ప్రభుత్వాలు బడ్జెట్ అంచనాలను చూపుతాయి. ఓ ఆర్నెల్ల తర్వాత సదరు అంచనాలను రాబడి ఆధారంగా సవరిస్తాయి. ఏడాది చివరలో వాస్తవిక బడ్జెట్ స్వరూపాన్ని.. అంటే, ఆదాయవ్యయాల వివరాలను పూర్తిగా అందిస్తాయి. ఇదంతా ఓ క్రమపద్ధతి ప్రకారం జరిగిపోయే ప్రక్రియ. కానీ, జగన్ అధికారంలోకి వచ్చాక ఈ సత్సంప్రదాయాన్ని తుంగలో తొక్కారు. నిజానికి, బడ్జెట్ వివరాలన్నీ 'బడ్జెట్ ఇన్ బ్రీఫ్' పుస్తకం ద్వారా, లేదా ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా అందించాలి. కానీ, గోప్యతకు మారుపేరైన జగన్ ప్రభుత్వంలో ఆర్థికరంగ నిపుణులు ఎంతో కష్టపడి వాస్తవాల్ని వెలికితీస్తే తప్ప రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం గోచరం కాదు.

దీనంతటికి బాధ్యత వహించవలసిన ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఏనాడూ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై వివరణ ఇవ్వరు. ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మీడియా సమావేశం నిర్వహించి రాష్ట్రప్రభుత్వం ఎంత గొప్పగా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తోందో సుద్దులు చెబుతుంటారు. ప్రజలకు జవాబుదారీతనం వహించాల్సిన అమాత్యులు ముఖం చాటేయడం ఏమిటి? ఉద్యోగులతో మీడియా సమావేశాలు ఏర్పాటుచేయించి ప్రతిపక్షాలను తిట్టించడం ఏమిటి? విపక్షంలో ఉండగా బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పబ్లిక్ ఎకౌంట్స్ ఛైర్మన్ (పీఏసీ)గా నాటి ప్రభుత్వ ఆర్థికనిర్వహణ గురించి అసెంబ్లీలో ఎన్నో విమర్శలు, సూచనలు, సలహాలు చేశారు. ఉన్నత సంప్రదాయాల గురించి సెలవిచ్చారు. ఇప్పుడు అధికారంలో ఉండి ఆర్థికశాఖ పగ్గాలు చేపట్టినా తనకేటు వంటి సంబంధం లేనట్టు ముఖం చాటేస్తున్నారు.

ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేసిన అప్పు ఎంత? నిజానికి, ఈ లెక్కలు తేల్చడం తలకుమించిన భారమే. ఉమ్మడి రాష్ట్రం విడిపోయాక విభజిత ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం చేసిన అప్పు రూ. 1,66,401 కోట్లు. 2024 నాటికి రాష్ట్రప్రభుత్వం చేసిన అప్పులు, చెల్లించాల్సిన బకాయిలు కలిసి రూ. 10.21లక్షల కోట్ల మేరకు చేరాయి. ఇవికాక, గత మార్చి చివరినాటికి మరో రూ. 18వేల కోట్లు కావాలని జనవరిలోనే రిజర్వ్ బ్యాంకుకు అర్జీ పెట్టారు. జూన్ నాటికి ఇంకో రూ. 25వేల కోట్ల అప్పు జమ అయ్యే అవకాశం ఉందని ఆర్థికశాఖ సమాచారం. అంటే, అధికారికంగా తెచ్చిన ఈ అప్పులతో.. రాష్ట్రప్రభుత్వం అప్పు మొత్తం రూ. 10.65లక్షలకోట్లకు చేరుతోంది. వీటితో పాటు వివిధ కార్పొరేషన్ల ద్వారా పొందిన రుణాలు, బాండ్ల ద్వారా సేకరించిన అప్పులు కలిపి రాష్ట్ర స్థూల రుణం రూ. 14 లక్షల కోట్లని అంచనా వేస్తున్నారు.

'అప్పులు తెచ్చినా పేదల సంక్షేమానికేగా ఖర్చు చేస్తున్నది' అంటూ అధికార పార్టీ నేతలు సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. కానీ, ప్రతిపక్షనేత చంద్రబాబు ఆరోపిస్తున్నట్లు ప్రజలకు రూ. 10లు ఇచ్చి రూ. 100 లాగుతున్నారనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. మితిమీరిన అప్పులు చేయడం వల్ల ఈ ఐదేళ్లలో నానారకాల శిస్తులు, సుంకాలు, పన్నులు, చార్జీల బాదుడుతో ప్రజలపై రూ. 2లక్షల కోట్ల భారాన్ని మోపారు. ఇందులో కరెంట్‌చార్జీల పెంపు, పెట్రోల్ డీజిల్‌పై అదనపు భారం, ఆస్తిపన్ను పెంపుదల, హరితపన్ను, చెత్తపన్ను, ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుదల, ఓటీఎస్ రూపంలో ఇండ్ల లబ్ధిదారుల నుంచి పిండిన మొత్తం, రేషన్ సరుకుల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు తదితరమైనవి ఎన్నో ఉన్నాయి.

అభివృద్ధి కుంటుపడితే రాష్ట్రానికి జరిగే అనర్థం ఏమిటో ప్రజలు గ్రహించాలి. ఇతోధికంగా ప్రగతిపథంలో సాగితేనే రాష్ట్రప్రభుత్వ ఆదాయం, ప్రజల వ్యక్తిగత ఆదాయం పెరుగుతాయి. ఆర్థిక కార్యకలాపాలు ఇబ్బడిముబ్బడిగా సాగితేనే రాష్ట్రం కళకళలాడుతుంది. అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి లభిస్తుంది. సమృద్ధిగా రాబడి ఉంటుంది. అప్పుచేసి తినే పప్పుకూడు మనిషిని జీవచ్ఛవాన్ని చేసినట్టే రాష్ట్రాన్ని కూడా అలాగే తయారు చేస్తుంది. ప్రజలు ఈ వాస్తవాల్ని గ్రహించాలి. ఆర్థిక ఉగ్రవాదాన్ని వదిలించుకోవాలి. రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసే సామర్థ్యం ఉన్నవారెవరో గ్రహించాలి. వారికే పట్టం కట్టాలి.

• సి. రామచంద్రయ్య
మాజీ శాసనమండలి సభ్యులు

అభివృద్ధి ముసుగు.. అడ్డంగా దోపిడీ!

అబద్ధపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చి, ఆంధ్రప్రదేశ్ సంపద సృష్టికి కేంద్రాలైన అమరావతిని, పోలవరాన్ని, విశాఖపట్నం అభివృద్ధిని కూల్చివేసి, ఉత్తరాంధ్రలోని ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టి తన నైజాన్ని చాటుకున్న పాలకుడు జగన్‌రెడ్డి. వైసీపీ పాలనలో సకాలంలో ప్రభుత్వోద్యోగులకు జీతాలే ఇవ్వలేని దుస్థితి నెలకొంది. రాష్ట్రంలో యువతకు సరైన ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో సగటు పౌరుల, కార్మికుల జీవనస్థితి దుర్భరమయింది.

విశాఖలో రుషికొండకు గుండు కొట్టారు, మిలీనియం టవర్స్ ఖాళీ చేయించారు. లులూ, హెచ్ఎస్‌బీసీ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, ఫిన్‌కార్ప్ లాంటి కంపెనీలను తరిమేశారు. మన్యంలో లేటరైట్, బాక్సైట్ మైనింగ్ దోపిడీకి జెండా ఊపారు. ఉత్తరాంధ్రలోని విలువైన భూవనరులను దోచుకోవటానికి విశాఖను రాజధానిగా చేస్తానంటూ మూడుముక్కలాట ఆడుతున్నారు. విలువైన దసపల్లా, 65 ఎకరాల ఎన్‌సీసీ, బే పార్కు, జ్ఞానానంద రామానంద ఆశ్రమం, కార్తీకవనం ప్రాజెక్టును, 500 ఎకరాలు భోగాపురం ఎయిర్‌పోర్ట్ భూములను, రుషికొండలోని రూ.1500 కోట్ల విలువ చేసే 93 ఎకరాల హడ్కో స్థలాన్ని సొంత పార్టీ వారికి దోచిపెట్టి, జగన్ ప్రజలను మోసగించారు.

భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను గత ప్రభుత్వం అన్ని అనుమతులతో శంకుస్థాపన చేసినా, నిర్మాణం చేయకుండా ఆలస్యం చేసి ఉత్తరాంధ్రకు జగన్‌రెడ్డి ఎంతో నష్టం చేశారు. ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ ఇవ్వకుండా, పారిశ్రామికవేత్తలలో ఎలాంటి భరోసా నింపకుండా పెట్టుబడిదారులను జె– ట్యాక్స్ పేరుతో బెదిరించడంతో ఉత్తరాంధ్రకు పెట్టుబడులు ఆగిపోయాయి. లక్షలాదిమంది యువత నిరుద్యోగులుగా ఉండిపోయారు. 2019లో విశాఖలో దాదాపు యాభైవేల మంది ఐటీ నిపుణులు ఉంటే, ఆ కంపెనీలను తరిమేశారు. దాంతో వారంతా విశాఖపట్నం నుంచి తరలిపోయారు.



కరోనా సమయంలో మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్ ప్రాణాలు తీశారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన పదివేల ఎకరాల అసైన్‌మెంట్ భూమిని బలవంతంగా తీసుకొని ఉత్తరాంధ్రలో బడుగులకు ఏమి న్యాయం చేశారో జగన్ చెప్పాలి. మద్యం రేట్లు పెంచి, రకరకాల బ్రాండ్లతో వేలాది కార్మికుల ఆరోగ్యాలను, కుటుంబ వ్యవస్థలను కూల్చివేశారు. అన్న క్యాంటీన్ రద్దు, చంద్రన్న బీమా రద్దు, పండుగ కానుకల రద్దు, రైతు రుణమాఫీ రద్దు, నిరుద్యోగ భృతి రద్దు, స్థానిక ఎన్నికలలో బడుగులకు 10 శాతం రిజర్వేషన్లు రద్దు, విశాఖ రైల్వే జోన్ రద్దు వంటి వాటితో అపకీర్తి మూటగట్టుకున్న జగన్మోహన్ రెడ్డికి మళ్లీ ఓటు వేయాలా?

> గత ఐదేళ్లలో ఉత్తరాంధ్రలోని నదుల నుంచి ఇసుక లూటీ చేసి లక్షలాది నిర్మాణ కార్మికుల బ్రతుకులు దుర్భరం చేశారు. డ్రగ్స్, గంజాయి, ల్యాండ్ మాఫియాతో సామాన్య, మధ్యతరగతి, విద్యార్థుల భవిష్యత్తును బుగ్గిపాలు చేశారు. ప్రజాస్వామ్యానికి హాని కలిగించే జగన్‌రెడ్డి కావాలో, విశాఖ అభివృద్ధి ప్రదాతగా గుర్తింపు పొందిన చంద్రబాబు కావాలో ఓటర్లు నిర్ణయించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

పోలవరాన్ని ఎత్తు తగ్గించి రివర్స్ టెండర్లతో నిర్మాణాన్ని ప్రశ్నార్థకం చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని, నాగావళి–వంశధార నదులను అనుసంధానం చేయకుండా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను నష్టపరిచారు. సంపద సృష్టించే ప్రజా రాజధాని అమరావతిని ధ్వంసం చేసి, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి, సామాన్య ప్రజానీకం మీద మరింత భారం మోపిన ఈ ప్రభుత్వం గురించి ఓటర్లు స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది.

ఉత్తరాంధ్రలోని నదుల నుంచి ఇసుక లూటీ చేసి లక్షలాది నిర్మాణ కార్మికుల బ్రతుకులు దుర్భరం చేశారు. డ్రగ్స్, గంజాయి, ల్యాండ్ మాఫియాతో సామాన్య, మధ్యతరగతి, విద్యార్థుల భవిష్యత్తును బుగ్గిపాలు చేశారు జగన్‌రెడ్డి. జీవో 217తో ఉత్తరాంధ్రలోని లక్షలాది మంది మత్స్యకారుల వృత్తిని దెబ్బతీశారు. జీవో 5తో వేలాది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఉత్తరాంధ్రలోని ఇండస్ట్రియల్ కారిడార్ల, ఆటోనగర్ భూములు దోచుకోవడానికి స్కెచ్ వేశారు. గంగవరం, మూలపేట పోర్టులను అదానికి; కాకినాడ పోర్టు, సెజ్‌లను విజయసాయి రెడ్డికి దోచిపెట్టారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఆర్థిక పరిస్థితి దిగజార్చి, అమ్మటానికి ప్రయత్నించి అందులోనూ వాటా కొట్టేయాలని చూస్తున్నారు. మెట్రో ప్రాజెక్టుకు మంగళం పాడి, ఆంధ్ర యూనివర్సిటీని రాజకీయాలతో కలుషితం చేశారు. ప్రశాంతతకు మారుపేరైన ఉత్తరాంధ్రను గుండాలు, రౌడీల రాజ్యంగా మార్చి భూకబ్జాలు, బెదిరింపులతో హత్యలకు నిలయంగా మార్చారు.

ప్రజాస్వామ్యానికి హాని కలిగించే జగన్‌రెడ్డి కావాలో, విశాఖపట్నాన్ని ప్రపంచ పటంలో పెట్టి అభివృద్ధి బాటలు వేసి, హుద్‌హుద్ తుఫాన్ సమయంలో దెబ్బతిన్న నగరానికి యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించి, సకాలంలో పునరుద్ధరించి విశాఖ అభివృద్ధి ప్రదాతగా గుర్తింపు పొందిన చంద్రబాబు కావాలో ప్రజలు ఆలోచించాలి. ఉత్తరాంధ్ర యువత అభివృద్ధి కోసం నిరంతరం తపించే పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని బలోపేతం చేయాలి. ఉత్తరాంధ్ర అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ విశేష కృషి చేసింది. మన గురించి, మన పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి సంపద సృష్టించే ఆధునికాంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాత చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గెలుపు కోసం పౌర సమాజంలోని ప్రజాతంత్ర శక్తులు, అన్ని వర్గాల వారు కృషి చేయాలి. అరాచక జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు సమాయత్తం కావాలి.

■ కోగంటి లెనిన్‌బాబు
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టిఎన్‌టియుసి

మాయ

ఐదేళ్లకోసారి..
పెద్దసిరమ్మ పండగలా ఊరికి జాతరొస్తుంది
అప్పటివరకూ మెలకువతోనే ఉంటాము
ఆ రాత్రి ఊరిమీదొక మాయ
దట్టమైన మబ్బులా కమ్ముకుంటుంది
బలి కోరినట్టు బతుకుల్ని కోరుతూ
ఒక రాకాసినీడ మునివాకిట తలుపు తడుతుంది
చెమటచిందే చేతులకు/ తాయిలాల తైలం పూస్తుంది
గంజి తాగే గొంతులో గరళం పోస్తుంది
అంతే.. మత్తు ఆవహించి మనమంతా
మైకంలో మునిగిపోతాం వివక్షణ కోల్పోతాం!

అప్పుడే అది..
చూపుడువేళ్ల మీద చీకటిచుక్క పెట్టి
మన భవితను
బేలట్ పెట్టెల్లో కొల్లగొట్టుకుపోతుంది
తేరుకున్నాక తీరా జూస్తే..
యింకేముంది ఊరంతా ఒకటే చీకటి
చెరవబడ్డ ఆడకూతురులాగుంది ఊరు
చూరుమీద గబ్బిలం భయపెడుతుంది
పొలాల కాలవల్లో కన్నీరు పారుతుంది
ధరలు ధరమీద ఉండవు
ఊరుమీద ఒకటే దుఃఖపుముసురు
వరద బాధితుల్లా.. మనమంతా
కట్టుగుడ్డలతో నడివీధిలో నిలబడతాము
కడుపుపుట్టలో
ఆకలిపాములు సుడిమడతలు పడతాయి
ఎవడో విసిరే ముష్టి మెతుకుల కోసం
గుర్తింపు కార్డ్ పట్టుకొనీ క్యూలైన్లో నిలబడతాం!

అప్పటికే.. మన చూపుడువేళ్లు తెగిపోయి
చేతులు మొండివైపోతాయి
పిడుగులు కురిసే గొంతులు పిల్లికూతలై పోతాయి
ఎవడో జుర్రేసిపోయిన తాటిబురికిలమై
వీధిన పడ్డపుడుగానీ మనకు తెలిసిరాదు
మత్తులో వేసిన ఓటే మనల్ని కాటేసిందనీ..
తుపాకీనీడలో.. ఉనికిని కోల్పోయిన ఊరు
వల్లకాడైపోయిందనీ..!

దశాబ్దాలుగా మనల్ని గొర్రెల్ని జేసి
కనిపించని కంచెల్లోకి నెట్టేస్తున్న మాయని
యికనైనా మానవాయుధాలమై తిప్పికొట్టాల్సిందే..
అమృతోత్సవాల వేళ నాగలిని భుజాలకెత్తుకొని
ఊరిమీద జెండాలా ఎగరేయాల్సిందే..!!

– సిరికి స్వామినాయుడు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

బడుగుయువత భవితను మింగేసిన వైసీపీ సర్కార్

ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల వైసీపీ పాలన సుస్థిర ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడంలో పూర్తిగా విఫలమైంది. యువతకు ఉపాధి భరోసా కల్పించగలిగిన లక్ష్యసాధన దిశగా అడుగులు కూడ వేయలేకపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైటెక్ సిటీ ఏర్పాటులాగో, నవ్యాంధ్రప్రదేశ్‌లో అమరావతి రాజధానిలాగో భారీ ప్రాజెక్టుల నిర్మాణమూ జరగలేదు. యువత సాధికారత కోసం ప్రభుత్వం దూరదృష్టితో వ్యవహరించిన ఆనవాళ్లూ లేవు. వారి భవిష్యత్తును మొత్తంగా అంధకారంలోకి నెట్టేసింది. జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయన్నంతటి హడావిడి చేసి జగనన్న పేరిట అరకొర చిల్లర కానుకలతో సరిపెట్టేసింది. జాలరుల పగ్గాలు తెగిపోయాయి. సాలీల మగ్గాలు తుప్పుపట్టేశాయి. కమ్మరి కొలుముల్లో బొగ్గులు కరువయ్యాయి. కుమ్మరి చక్రం మీద ప్లాస్టిక్ పడగ విప్పింది. ముఖ్యమంత్రి జగన్ నిర్దిష్ట మానవాభివృద్ధి లక్ష్యాలతో పాలన చేయలేక పోయారనడానికి ఇవన్నీ నిదర్శనాలు. విభాగానికో అరడజను మంది చొప్పున వందల మందిని సలహాదారులుగా నియమించుకున్నప్పటికీ చివరికి ఖజానాకు కన్నం పడిందే తప్ప యువత కలలు సాకారం కానేలేదు. సమగ్ర సమృద్ధి విధానాల రూపకల్పనలో వాళ్లెవరూ భాగం కాలేకపోయారు. కేవలం వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను చూపించి నిరుద్యోగసమస్యకు అదే పెద్ద పరిష్కారం అన్నట్లుగా ప్రభుత్వం చాటుకుంది. అడపాదడపా ఏవో కొన్ని ఉద్యోగ నియామకాలు తప్ప మెగా డిఎస్సీ, మెగా పోలీసు రిక్రూట్‌మెంట్, సర్వీస్ కమిషన్ ద్వారా పెద్దసంఖ్యలో నియామకాలు చేపట్టలేకపోయింది. నిజానికి ఆ వ్యవస్థ ఒక ప్రహసనంగా మిగిలిపోయింది. ఈ పరిస్థితులు ప్రత్యేకించి బడుగు యువతను మరింత అగమ్యగోచరంలోకి నెట్టేశాయి. గ్రామీణ యువతీయువకుల పరిస్థితి మరింత అధ్వాన్నమైపోయింది. రాష్ట్రానికి ఒక్కకొత్త పరిశ్రమా రాకపోగా ఉన్నవి కూడా తరలిపోయాయి. ఉపాధి కోసం యువత ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు వలసబాట పట్టింది. అభివృద్ధి మీద అవగాహన, భవిష్యత్తు మీద ఆశలు కలిగిన జనం ప్రశ్నలకు జవాబు చెప్పలేని ప్రభుత్వం పథకాల గేలం వేసింది. రాష్ట్రంలో పప్పూబెల్లాల సంక్షేమాన్ని వ్యతిరేకించి, అభివృద్ధి కావాలని ప్రశ్నించే ప్రజలే లేకుండా పోయారు. ఎవరైనా ఉన్నా వారి మీద దాడులు జరిగాయి.

ఆంధ్రప్రదేశ్ యువత ప్రపంచమంతా విద్యా ఉద్యోగ రంగాల్లో అవకాశాల్ని వెతుక్కుంటూ విస్తరించింది. దీని వెనుక గత ప్రభుత్వాల కృషి ఎంతో ఉంది. ప్రపంచ ప్రసిద్ధ పారిశ్రామికవేత్తలు, కంప్యూటర్ రంగ నిపుణులు అనేకమంది రాష్ట్రంలో పర్యటించి స్ఫూర్తి నింపారు. అవకాశాల మీద అవగాహన కల్పించారు. చైతన్యవంతుల్ని చేశారు. అయితే ఉన్నత చదువుల కోసం, లక్ష్యసాధన కోసం వలస వెళ్లిన వారిలో ధనికవర్గాలే అధికంగా ఉన్నాయి. పేద, మధ్యతరగతి, బడుగువర్గాల యువతలో ఒక్కరో, ఇద్దరో మినహా మిగిలినవారంతా ఆర్థికస్తోమత లేక ఇక్కడే ఉండిపోయారు. వీరికి రాష్ట్ర పరిధిలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం తప్పనిసరి. పైగా కుటుంబసభ్యులు కూడా వీరి మీదే ఆధారపడి జీవించే పరిస్థితులు ఉంటాయి. ఇలాంటివారి భవితకు దారులు వేయడంలో, ఆర్థికంగా చేయూత అందించడంలో ప్రభుత్వం విఫలమయింది. గత మూడు దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్తంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్, ఇతర అడ్వాన్స్‌డ్ సైన్సెస్‌లో ఆంధ్రప్రదేశ్ యువత సాధించిన విజయపరంపరను వైసీపీ ప్రభుత్వం కొనసాగించలేకపోయింది. రాష్ట్రంలో సాంకేతిక విద్య నీరుగారిపోయింది. అధ్యాపక, ఇతర సిబ్బంది కొరతతో పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు, పాలిటెక్నిక్ కళాశాలలు అనేకం మూతపడ్డాయి. నైపుణ్యాభివృద్ధి సంస్థలను ప్రభుత్వం పనిగట్టుకుని నట్టేట ముంచేసింది. చివరికి ఇంజనీరింగ్ కళాశాలలూ నిరాదరణకు గురయ్యాయి.

> ఏ ప్రభుత్వానికీ లేనంత విఫలచరిత్ర సృష్టించుకున్న వైసీపీ సర్కార్ విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మంటగలిపి బడుగుల బతుకును, భవితను మింగేసింది. గడచిన ఐదేళ్లుగా తిరోగమనబాట పట్టించిన ప్రభుత్వం స్థానంలో సమర్థప్రభుత్వం కావాలిప్పుడు. తమ జీవితాల్ని మెరుగుపరచి, యువత భవిష్యత్తుకు పూచీకత్తుగా నిలిచి, అభివృద్ధికి పట్టం కట్టే నాయకత్వం వైపే ప్రజానీకం నిలబడాలి.



ఇటీవల మానవవనరుల అభివృద్ధి సంస్థ కార్మిక, ఉపాధి సమస్యల నివేదిక 2024ను విడుదల చేసింది. అంతర్జాతీయ కార్మికసంస్థ భాగస్వామ్యంతో కలిసి రూపొందించిన ఈ నివేదిక మనదేశంలోని ఆర్థిక, కార్మిక, మార్కెట్, విద్య నైపుణ్యం తదితర అంశాల గురించి చర్చించింది. దేశంలో నిరుద్యోగం సమస్య ఎక్కువగా ఉందని ఉన్నత విద్యనభ్యసించిన వారిలో ఇది మరింత ఎక్కువని పేర్కొంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ ప్రగతిని పరిశీలిస్తే గతంలో కంటే వెనుకబడి ఉందని తేటతెల్లమవుతుంది. ఇసుక రాజకీయంలో కూరుకుపోయి నిర్మాణరంగం తీవ్రంగా దెబ్బతినడంతో చేతివృత్తి కార్మికులు, భవననిర్మాణ కార్మికులు, వడ్రంగి, తాపీ తదితర వృత్తులవారికి పనులే దొరకడం లేదు. ఇప్పటికీ ఈ పరిస్థితిలో మార్పులేదు. ముందు జాగ్రత్తల గురించి యోచించడం అటుంచి దీనిని చక్కదిద్దడానికి ప్రభుత్వం కనీస ప్రయత్నం కూడ చేయలేదు. ఫలితంగా బడుగు వర్గాలకు తగిన ఉపాధి అవకాశాలు కరువయ్యాయి. పేదరికం మరింత పెరిగింది. కులాల ప్రాతిపదికగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వందల కార్పొరేషన్లు ఈ దయనీయ పరిస్థితుల్లోనూ నిస్సహాయంగా మిగిలిపోయాయి. వీటి ద్వారా కనీసం చిన్నమొత్తాల్లోనైనా రుణాలు మంజూరు చేసి బడుగు యువతకు ప్రభుత్వం చేయూత అందించలేకపోయింది. ఉపాధికల్పన గురించి ఆలోచించకుండా ఖాతాల్లో పదేసివేలు జమచేసే పథకాల్ని రూపొందించి చేతులు దులుపుకుంది. వాటినే ఇప్పటి ఎన్నికల్లో ప్రచారాస్త్రాలుగా వాడుకుంటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని పటిష్టంగా మార్చాలన్నా, పదికాలాల పాటు జనం సుభిక్షంగా జీవించాలన్నా వైసీపీ ప్రభుత్వ విధానాలు సరిపడవని మేధోవర్గం తలబాదుకుంటోంది.

రాష్ట్రంలో మానవవనరుల అభివృద్ధిలో అత్యంత కీలక పాత్ర వహించే విశ్వవిద్యాలయాలు రాజకీయకేంద్రాలుగా మారి సామర్థ్యాలు కోల్పోయి ప్రశ్నార్థకంగా నిలిచాయి. సరైన బోధనాసిబ్బంది నియామకాలు జరగలేదు. ప్రభుత్వనేతల సిఫార్సులతో ఉపకులపతులు నియమావళిని పక్కనబెట్టి చడీచప్పుడు లేకుండా సొంతంగా నియామకాలు చేసుకున్నారు. వారిలో సగం మందికి కనీస అర్హతలు లేవు. దాంతో ధనికవిద్యార్థులు ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. సగానికి పైగా విశ్వవిద్యాలయాల్లో పాలన ప్రైవేటుపరమైపోయింది. వర్సిటీల అధికారులు కూడా ఎన్నికలసంఘానికి చిక్కని రూపాల్లో అధికారపార్టీ తరఫున ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకటనకు ముందే రాష్ట్రంలో అన్ని విశ్వవిశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల నిరసనలను అణగదొక్కి మరీ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను నిర్మించారు. ఇంత విఫలచరిత్ర సృష్టించుకున్న వైసీపీ ప్రభుత్వం విద్య ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మంటగలిపి బడుగుల బతుకును, భవితను మింగేసింది. గడచిన ఐదేళ్లుగా తిరోగమనబాట పట్టించిన ప్రభుత్వం స్థానంలో సమర్థ ప్రభుత్వం కావాలిప్పుడు. తమ జీవితాల్ని మెరుగుపరచి, యువత భవిష్యత్తుకు పూచీకత్తుగా నిలిచి, అభివృద్ధికి పట్టం కట్టే నాయకత్వం వైపే ప్రజానీకం నిలబడాలి.

◆ డాక్టర్ జీకేడీ ప్రసాద్

విజన్ ఉన్న నాయకుడు రావాలి!

ఒక మనిషి విభిన్నంగా ఆలోచిస్తే, నియమ నిబద్ధత కలిగి జీవిస్తే సామాన్య కుటుంబ నేపథ్యం నుండి కూడా అసామాన్యంగా ఎదగొచ్చు అనడానికి చంద్రబాబు జీవితం ఓ నిదర్శనం. విద్యార్థి రాజకీయాల్లో బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులతో కలిసి సేవా కార్యక్రమాలు చేశారు. 28 సంవత్సరాల వయస్సులోనే మంత్రిగా పని చేశారు. అటు తరువాత ప్రతిపక్ష నాయకుడిగా, రెండుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, మళ్లీ ప్రతిపక్ష నాయకుడిగా, ఎన్డీయే కన్వీనర్‌గా, విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన సాధించిన విజయాలు, తీసుకున్న నిర్ణయాలు.. భవిష్యత్ తరాలకు ఒక పాఠ్యాంశం.

డా. బాబు జగ్జీవన్ రాం, డా. బి.ఆర్. అంబేడ్కర్, జ్యోతిరావు పూలే వంటి మహనీయులు జన్మించిన ఏప్రిల్ నెలలోనే చంద్రబాబు నాయుడు కూడా జన్మించడానికి గల కారణం, వెనుకబడిన దళిత, గిరిజన, బలహీనవర్గాలకు, సేవ చెయ్యాలి అని ఆయన భవిష్యత్‌ని కాలం నిర్దేశించడం అయ్యి ఉంటుంది. ఆయనెప్పుడు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని రేపటి తరాల భవిష్యత్తు కోసమే ఉపయోగించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా తెలుగు వారు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా అభివృద్ధిలో ఉండాలని తాపత్రయపడ్డారు. మన దేశం ప్రపంచంలో అగ్రగామిగా ఉండాలని కోరుకున్నారు. 90వ దశకంలోనే సాంకేతిక పరిజ్ఞానాన్ని కొత్త పుంతలు తొక్కించి, కొండలు గుట్టలుగా ఉన్న ప్రాంతాన్ని సైబరాబాద్‌గా మార్చారు. ఎన్నో పెట్టుబడులు తీసుకువచ్చి, పరిశ్రమలు స్థాపించి బిల్‌గేట్స్, బిల్ క్లింటన్, టోనీ బ్లెయిర్ వంటి వారిని మన దగ్గరికి తీసుకువచ్చి అభివృద్ధికి కొత్త నమూనాగా మారి విజన్ 2020 గురించి మాట్లాడారు. ఇప్పుడు నాలెడ్జి ఎకానమీతో కూడుకున్న విజన్ 2047 గురించి మాట్లాడుతున్నారు.

దార్శనికతతో హైదరాబాద్‌ని అభివృద్ధి చేశారు. అదే తోవలో 33వేల ఎకరాలు రైతుల దగ్గరి నుంచి సేకరించి అమరావతికి రూపకల్పన చేశారు. ఇలాంటి నాయకుడు ఏ ఒడిసాలోనో, పశ్చిమ బెంగాల్‌లోనో, గుజరాత్‌లోనో ఉండివుంటే మొదటిసారి ముఖ్యమంత్రి అయిన దగ్గర నుంచి ఈ రోజు వరకు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండేవారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయి, పోలవరాన్ని పూర్తి చేసి, అమరావతిని నిర్మించి, విద్య–వైద్యం–ఉపాధి కల్పించి, ఆర్థిక–సామాజిక–రాజకీయ అసమానతలు లేని ఆనంద ఆంధ్రప్రదేశ్‌ను నెలకొల్పాలి.

– ప్రొ. వై. సురేష్‌బాబు
హైదరాబాద్

పైపుల లారీలో రూ.8.36 కోట్లు!

- గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టివేత
- డ్రైవర్ క్యాబిన్, లారీ బాడీ మధ్య ప్రత్యేక అర
- మొత్తం ఐదు అట్టపెట్టెల్లో నగదు
- ప్రకాశం బరిలోని చిత్తూరు వైసీపీ నేతవేనా?
- టీడీపీ నేతలవంటూ సీ-విజిల్ యాప్‌లో టీడీపీ ఫిర్యాదు


పట్టుబడిన నగదుతో అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అధికారులు

విజయవాడ(ఆంధ్రజ్యోతి)/వేటపాలెం(చీరాల), మే 9: ఎన్టీఆర్ జిల్లా గరికపాడు చెక్‌పోస్టు వద్ద లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ.8.36 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోని మెదక్ నుంచి పైపులలోడుతో వస్తున్న లారీని గురువారం తెల్లవారుజామున ఒంటి గంట తర్వాత స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో పైపులు తప్ప ఎలాంటి నగదు లభించలేదు. దీంతో డ్రైవర్, క్లీనర్‌ను ప్రశ్నించారు. దీంతో డ్రైవర్ క్యాబిన్‌కు, లారీ బాడీకి మధ్య ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన అరలో నగదు ఉన్నట్లు వారు వెల్లడించారు. పోలీసులు అరను తెరిచి ఐదు అట్టపెట్టెల్లో రూ.8,36, 78,000 ఉన్నట్లు గుర్తించారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఇంత భారీ మొత్తంలో నగదు పట్టుబడటం సంచలనం కలిగిస్తోంది. విజయవాడ నుంచి వచ్చిన స్పెషల్ టాస్క్‌ఫోర్సు ఏసీపీ శ్రీహరి బాబు, నందిగామ ఏసీపీ రవికిరణ్, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. నగదును కలెక్టర్ ఆఫీసుకు తరలించారు.

టీడీపీ నేతల ఫిర్యాదుతో...

గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదు ఎవరిదనే అంశంపై పోలీసులు నోరు విప్పడం లేదు. అయితే ఈ నగదు ప్రకాశం జిల్లాలో వైసీపీ తరఫున పోటీ చేస్తున్న చిత్తూరు జిల్లా నేతవని విశ్వసనీయ సమాచారం. మెదక్ నుంచి వస్తున్న లారీ నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ మీదుగా ఒంగోలు వెళ్లే అవకాశం ఉన్నా హైవేపై రావడం గమనార్హం. ఈ లారీకి సంబంధించిన పక్కా సమాచారం టీడీపీ నేతలకు రావడంతో వారు అప్రమత్తమయ్యారు. వైసీపీ నేతలకు సంబంధించిన నగదని చెబితే పోలీసులు ఎలా స్పందిస్తారోననే అనుమానంతో టీడీపీ నేతలకు చెందిన నగదు ఫలాన లారీలో వస్తోందని సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, పట్టుబడిన లారీతో పాటు మరో 3 లారీల్లోనూ నగదు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ లారీ వెనుకే అవి రావాల్సి ఉన్నా వెనక్కి వెళ్లిపోయాయి.

ఆమంచి అనుచరుడి వద్ద నోట్ల కట్టలు

బాపట్ల జిల్లా కఠారివారిపాలెంలో రూ.22.95 లక్షల నగదు పట్టుబడింది. డీఎస్పీ బీప్రసాద్ గురువారం కార్డన్ సెర్చ్‌లో భాగంగా నరసింహారావు అనే వ్యక్తి బైక్‌ని పరిశీలించగా రూ.22.95 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. ధ్రువపత్రాలు లేకపోవడంతో సొమ్మును సీజ్ చేశారు. కాగా, నరసింహారావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అనుచరుడు.

వైసీపీ అభ్యర్థి నుంచి నగదు స్వాధీనం?

విశాఖపట్నం, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైసీపీ అభ్యర్థి నుంచి గురువారం భారీ మొత్తంలో నగదును ఎన్నికల ప్రవర్తన నియమావళి బృందం స్వాధీనంచేసుకున్నట్టు తెలిసింది. ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఒకచోట నగదు సిద్ధం చేసినట్టు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నారు. అయితే పట్టుకున్న సొమ్ము కోట్లలో ఉంటుందని వైసీపీ వారే చెబుతున్నారు.

24న ఆగస్టు నెల రూ.300 దర్శన కోటా విడుదల

తిరుమల, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెలకు సంబంధించిన శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈ నెల 24వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికార వెబ్‌సైట్‌లో ఈ కోటాను విడుదల చేస్తుంది. ఇక, ఈ నెల 18న ఉదయం 10 గంటలకు శ్రీవారి ఆర్జితసేవా టికెట్లను విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలతో పాటు ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు ఆలయంలో నిర్వహించనున్న పవిత్రోత్సవాల సేవా టికెట్లను 21వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. భక్తులు 'టీటీడీవస్థానమ్స్ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్ నుంచి ఈ సేవలను భక్తులు పొందవచ్చు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.2.81 కోట్లు

శ్రీశైలం, మే 9: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. లెక్కింపులో ఆలయ హుండీల ద్వారా రూ.2,81,51,743 ఆదాయం లభించింది. ఈ కానుకలను భక్తులు గత 27 రోజుల్లో సమర్పించారు.

కూటమిదే అధికారం

- 120-140 మధ్యలో అసెంబ్లీ స్థానాలు, 19 నుంచి 21 లోక్‌సభ సీట్లు: గోనె ప్రకాశరావు

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కూటమిదే ప్రభుత్వమని ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశరావు తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌కు భారతి స్ట్రోక్ తగలబోతోందని ఆయన అన్నారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కూటమికి 19 నుంచి 21 లోక్‌సభ సీట్లు, 120 నుంచి 140 అసెంబ్లీ స్థానాలు దక్కుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ సర్కారుపై వ్యతిరేకత ఒకేలా ఉంది. రాష్ట్రం బాగుపడాలంటే అనుభవజ్ఞుడైన చంద్రబాబు అధికారంలోకి రావాలి. స్థానికులతో మాట్లాడుతుంటే కేశినాని శివనాథ్ (చిన్ని)పై ప్రజల్లో ఉన్న ఆదరణ ఏమిటో అర్థమవుతుంది. ఆయన రెండు లక్షల మెజారిటీతో గెలుస్తారు. చెల్లికి, తల్లికి న్యాయం చేయలేని జగన్ రాష్ట్రానికి ఏం చెబుతారు? ప్రజలు కూడా జగన్ డ్రామాలు తెలుసుకున్నారు. ప్రజలు జగన్‌కు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. ఉత్తరాంధ్రలోని 34 అసెంబ్లీ స్థానాల్లో కూటమికి 28 సీట్లు వస్తాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 34 అసెంబ్లీ స్థానాలకు గాను 31 సీట్లు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 33 స్థానాలకు గాను 25 నుంచి 29 స్థానాలు కూటమి దక్కించుకుంటుంది. అమిత్ షా అమరావతే రాజధాని అని స్పష్టం చేయడంతో ఈ రెండు జిల్లాల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసినా ఆశ్చర్యం లేదు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 22 అసెంబ్లీ స్థానాల్లో కూటమికి 22 స్థానాలూ వస్తాయి. రాయలసీమలోని 52 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 24చోట్ల కూటమి విజయం సాధిస్తుంది' అని ప్రకాశరావు వివరించారు.

పాతాళంలోకి వైసీపీ మాఫియా

- పోస్టల్ బ్యాలెట్‌తోనే ఖాయమైన జగన్ ఓటమి: బీజేపీ

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ మాఫియాను పాతాళంలోకి తొక్కేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ సరళి చూస్తుంటే సాధారణ పోలింగ్‌కు మూడు రోజుల ముందే వైసీపీ ఓటమి ఖాయమైందని ఆ పార్టీ నేతలు పాతూరి నాగభూషణం, సుధీష్ రాంబొట్ల, సూర్యనారాయణరాజు అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. 'విజయవాడలో నరేంద్ర మోదీ ర్యాలీకి వచ్చిన జనాన్ని చూస్తే జగన్ పాలనపై ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టంగా అర్థం అవుతోంది. అధికార పార్టీకి వ్యతిరేకంగా ఓటేశామని ఉద్యోగులు బహిరంగంగా చెప్పడం చరిత్రలో ఎన్నడూ చూడలేదు. డబులింజన్ సర్కార్ వస్తుందని స్పష్టం కావడంతో కొందరు అధికారులు ఫైళ్లు దాచేస్తున్నట్లు తెలుస్తోంది. అటువంటి పనులు చేసి అనవసరంగా ఇబ్బందుల్లో పడొద్దు' అని బీజేపీ నేతలు హెచ్చరించారు.

నేడే అప్పన్న చందనోత్సవం

- నిజరూప దర్శనం ఇవ్వనున్న సింహాచలేశుడు

సింహాచలం, మే 9: సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి శుక్రవారం భక్తులకు నిజరూపంలో దర్శనం ఇవ్వనున్నారు. దీనినే చందనోత్సవంగా పేర్కొంటారు. ఏటా వైశాఖమాస శుక్లపక్ష తదియ నాడు భక్తులకు నిజరూప దర్శనం కల్పించడం షట్‌చక్రవర్తులలో ఒకరైన పురూరవుని కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే అప్పన్న నిజరూప దర్శనానికి ఏర్పాట్లు పూర్తిచేశారు.

నేడు గన్నవరానికి చంద్రబాబు
మధ్యాహ్నం 2 గంటలకు సభ

విజయవాడ - ఆంధ్రజ్యోతి: ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం గన్నవరం నియోజకవర్గానికి టీడీపీ అధినేత చంద్రబాబు రానున్నారు. మధ్యాహ్నం 2గంటలకు జంక్షన్‌లో జరిగే బహిరం గ సభలో పాల్గొంటారు. నియోజకవర్గ టీడీపీ అ భ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. శనివారం రాత్రి 10గంటలకు ప్రచారం ముగియనుండటంతో గన్నవరం సభను విజయవంతం చేసేందుకు టీడీపీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి.

ఆర్యవైశ్య పశ్చిమ నేతలకు పదవులు

వన్‌టౌన్: పశ్చిమలో పలువురు ఆర్యవైశ్య నేతలకు టీడీపీ అధిష్టానం పదవులు కేటాయించింది. గురువారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురా మ్, పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) వారికి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా కా ర్యదర్శిగా వీవీకే నరసింహారావు, కార్యనిర్వాహక కా ర్యదర్శిగా నూకల నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధికార ప్రతినిధిగా కేఎల్‌వీ సతీష్‌కుమార్, వాణి జ్య విభాగం కార్యదర్శిగా బెల్లం కొండ రాఘవేంద్రలకు నియామకపత్రాలు అందజేశారు.

చంద్రబాబుకు ముస్లింల మద్దతు

వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రజాసంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ముస్లిం సభ్యులు, నేతలు ఎమ్మెల్సీ ఎండీ షరీఫ్ ఆధ్వర్యం లో చంద్రబాబుకు మద్దతు పలికారు. గత ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు చేసిన సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై మద్దతు పలికామన్నారు. ఈ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీ నిధుల నుంచి కానీ ప్రభుత్వం నుంచి కానీ మైనార్టీల సంక్షేమానికి రూ పాయి కూడా వినియోగం కాలేదని దీన్ని ఆలోచించుకుని ప్రతి ఒక్కరూ కూటమి అభ్యర్థులను బలపరచి ఓటు వేయాలని కోరారు.

చంద్రబాబే సీఎం కావాలి: సుచిత్ర

విద్యాధరపురం: పేద, మధ్య తరగతి కుటుంబాల బాగుకు సీఎంగా చంద్రబాబునాయుడు రా వాల్సిన అవశ్యకత ఎంతగానో ఉందని తెలుగు మ హిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర అ న్నారు. గురువారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 13న పోలింగ్ రోజున మహిళలంతా పోలింగ్‌బూత్‌లకు చేరుకుని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకు తప్పనిసరిగా ఓటు వేసి చంద్రబాబును సీఎంగా చేయాలని కోరారు. బుక్యా సౌజన్య, యడ్లపల్లి నళిని పాల్గొన్నారు.

రైల్వే డివిజన్‌లో రూ.7.20 కోట్ల స్క్రాప్ విక్రయం

రైల్వేస్టేషన్: రైల్వే డివిజన్‌లో రూ.7.20కోట్ల వి లువైన 1547 మెట్రిక్ టన్నుల స్క్రాప్ రికార్డు స్థా యిలో విక్రయమైందని రైల్వే డివిజన్ ఒక ప్రకటనలో తెలిపింది. డివిజన్ చరిత్రలో ఒకే ఈ వేలం ద్వారా ఇంత అత్యధిక మొత్తం సాధించడం ఇదే ప్రథమమన్నారు. బుధవారం నిర్వహించిన ఈ వే లంలో స్క్రాప్‌లు విక్రయించారు. గత ఆర్థిక సంవత్సరంలో 21.460 మెట్రిక్ టన్నుల స్క్రాప్‌ను రూ.89.94 కోట్ల ఆదాయాన్ని పొందిందన్నారు. డివిజన్ సీనియర్ డీఎంఎం కేబీ తిరుపతయ్యను ఆ యన బృందాన్ని డీఆర్ఎం పాటిల్ అభినందించారు.

పవన్ రోడ్‌షోకు హోరెత్తిన జనం

కేశినేని శివనాథ్, గద్దె, బొండా స్వాగతం

మొగల్రాజపురం, మే 9: పవన్ కల్యాణ్ రోడ్ షోకు జనం హోరెత్తారు. సాయంత్రం 4గంటలకు స్టేడియం నుంచి రోడ్ షో ప్రారంభం కావాల్సి ఉండగా రెండున్నర గంటల ఆలస్యంగా ప్రారంభమైంది. పశువుల ఆసుపత్రి వద్దకు పవన్ రాగానే ఆయనకు ఎన్‌డీఏ కూటమి పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాద్, తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్ ఘన స్వాగతం పలికారు. పవన్‌కు స్వాగతం పలకడానికి బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు భారీగా పశువుల ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. శిఖామణి సెంటర్‌లో బొండా ఉమా, తనయులు బొండా సిద్ధార్థ, రవితేజ పవన్‌కు స్వాగతం పలికారు. ఈ రెండు చోట్ల డిజేలతో హోరెత్తించారు. కార్యకర్తలు పవన్ సినిమా పాటలకు హుషారుగా నృత్యాలు చేశారు. మెట్రో సెంటర్‌లో 7వ డివిజన్ కార్యకర్తలు, నేతలు స్వాగతం పలికారు. పవన్, చంద్రబాబు, వంగవీటి రంగా ఫొటోలను ప్రదర్శిస్తూ బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల జెండాలతో రోడ్డును నింపేశారు.

బందరు రోడ్‌లో..

లబ్బీపేట: జనసేనాని పవన్ కళ్యాణ్ పర్యటనకు అభిమానులు, ఏన్డీఏ నేతలు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం సాయంత్రం వన్‌టౌన్ పంజా సెంటర్‌లో జరిగిన సభకు బందర్ రోడ్డులోని పశువుల ఆసుపత్రి నుంచి రోడ్ షోగా బయలుదేరారు. సాయంత్రం 5గంటల నుంచి అభిమానులు వేలాదిగా వచ్చేశారు. రాత్రి 7గంటలకు పవన్ చేరుకుని భారీగా వచ్చిన అభిమానులు, ఏన్డీఏ కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ వాటర్ ట్యాంక్ రోడ్డు నుంచి విశాలాంధ్ర వైపు వెళ్లారు. భారీగా ప్రజలు ముఖ్యంగా యువత, మహిళలు చేరుకోవడంతో 2 గంటలపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తింది.



రాధా ఎంతుకో అలిగాడు.!

విజయవాడ: పవన్ తన ప్రసంగంలో వంగవీటి రాధాకృష్ణ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. పవన్ మాట్లాడానికి ముందు సుజనా చౌదరి, కేశినేని చిన్ని మాట్లాడారు. తర్వాత పవన్ ప్రసంగిస్తారని సుజనా చౌదరి అన్నారు. వెంటనే పవన్ రాధాతో మాట్లాడించాలని చెప్పారు. మాట్లాడానికి రాధా రాలేదు. పవన్ రాధా చేయిపట్టుకుని ముందుకు తీసుకొచ్చి మాట్లాడించారు. తర్వాత రాధా గురించి మాట్లాడుతూ "రాధా ఎందుకో రాజకీయాలపై అలిగాడని, ఇలా రాజకీయాలపై అలిగిన వ్యక్తిని మొదటిసారిగా చూస్తున్నానన్నారు. ఎన్నోసార్లు రాజకీయాల్లో రావాలని అడిగినా రాలేదు. జనసేనలో అయినా ఉండమన్నా రాలేదు. నగర ప్రజలకు ముఖం చూపించమని బయటకు తెచ్చా. బలమైన నేతల సమూహం అవసరం" అని అన్నారు. కూటమి ఏర్పడగానే మొదటిగా జలీల్‌ఖాన్ వచ్చి జనసేన నుంచి పోటీ చేస్తానని విజ్ఞప్తి చేశారన్నారు. తనకు చిన్నతనం నుంచి జలీల్ ఖాన్ గురించి తెలుసునన్నారు. పవన్ ప్రసంగిస్తుండగా ఒక అభిమాని చేసిన చేష్ట ఆగ్రహం కలిగించింది. జనసేన తువాలును పైకి విసిరడంతో కేశినేని చిన్ని అడ్డుకున్నాడు. దీంతో పవన్ ప్రసంగం మధ్యలోనే ఆ అభిమానికి క్లాస్ తీసుకున్నారు. పశ్చిమకు బలమైన కొత్త నేతను తయారు చేస్తానని కార్యకర్తల నుంచే కొత్త నేత వస్తాడన్నారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన పోతిన మహేష్ పేరు ప్రస్తావించకుండానే ఘాటుగా సమాధానమిచ్చారు. ముఖం తెలియని వ్యక్తిని నేతగా తయారు చేస్తే వైసీపీ మాయలోపడి తనపైనే విమర్శలు చేస్తున్నాడన్నారు. పశ్చిమలో జనసేన బలంగా ఉందన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

మాచవరం, మే 9: స్థానిక కొత్త ప్రభుత్వాసుపత్రిలో అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి ఒక రోగి ప్రాణాలను కాపాడారు. నగరానికి చెందిన సాంబశివరావు (65) పంటి సమస్యతో బాధపడుతూ ఒక డెంటల్ ఆసుపత్రిలో చికిత్స చేయికునే సమయంలో తొలగించిన పన్నును మింగిశాడు. వెంటనే దగ్గు, ఆయాసంతో తీవ్ర అస్వస్థతకు గురవడంతో అతడ్ని కొత్త ప్రభుత్వాసుపత్రిలోని చెవి, ముక్కు, గొంతు విభానికి తీసుకెళ్లారు. డాక్టర్ కొణిదె రవి సాంబశివరావుకు సిటీ స్కాన్, చెస్ట్ స్కాన్ పరీక్షలు చేసి తొలగించిన పన్ను కుడి ఊపిరితిత్తులోకి జారిందని నిర్ధారించారు. అనంతరం అత్యంత ఖరీదైన ఉన్నత ప్రమాణాలు కలిగిన బ్రాంకోస్కాప్ ద్వారా ఊపిరితిత్తుల్లో ఇరుక్కున్న పంటిని చాకచక్యం బయటికి తీశారు. ప్రస్తుతం రోగి ప్రాణాపాయం నుంచి బయటపడి కోలుకుంటున్నట్టు డాక్టర్ రవి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కొణిదె రవితో పాటు డాక్టర్ జి.బి.శ్రీనివాస్, పీజీ వైద్యులు డాక్టర్ విజయ్, భవ్య, డాక్టర్ కిరణ్, డాక్టర్. నవీన్, డాక్టర్ అనగ, సపోర్టింగ్ స్టాఫ్ సంధ్య, వరలక్ష్మిని సూపరింటెండెంట్ డి.వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కొణిదె రవి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రి ఈఎన్‌టీ విభాగంలో అత్యాధునిక వైద్యసదుపాయాలున్నాయని, ఎలాంటి క్లిష్ట సమస్యలనైనా పరిష్కరించడంతో పాటు పేదల అనారోగ్య సమస్యలకు వైద్యం అందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు.



అధికారంలోకి రాగానే పాన్‌షాపుల సమస్యల పరిష్కారం

విద్యాధరపురం, మే 9: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాను ఎంపీగా గెలిస్తే పాన్‌షాపల సమస్యలను పరిష్కరిస్తానని పాన్‌షాపు అసోసియేషన్‌కు అండగా ఉంటానని పార్లమెంట్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో పాన్‌షాప్ అసోసియేషన్ సభ్యులు ఆయన్ను కలిసి సమస్యలపై వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా రాష్ట్రంలో ఏ వ్యాపారం సరిగ్గా జరగలేదన్నారు. పాన్‌షాపు దుకాణదారులు తీవ్రంగా నష్టపోయారని వీరిని ఆదుకునేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఫెడరేషన్ రిటైలర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నగర పాన్‌షాపు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అధ్యక్షుడు డి. సూరిబాబు, వైస్ ప్రెసిడెంట్ వి.నారాయణరెడ్డి, కోశాధికారి శంకర్ వినతిపత్రం ఇచ్చినవారిలో ఉన్నారు.


కేశినేని చిన్ని ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన ముదిరాజులు

టీడీపీ కండువా కప్పుకున్న ముదిరాజులు

వైసీపీని వీడి 200 మంది ముదిరాజులు గురువారం ఎన్టీఆర్ భవన్‌లో కేశినేని శివనాథ్ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. జిల్లా ముదిరాజ్ సాధికారిక సమితి అధ్యక్షుడు బుచ్చిరామయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ ముదిరాజ్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆయన వెంట రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు సుమారు 200 మంది పార్టీ కండువాలు కప్పుకున్నారు. నేతలు ఉట్ల వెంకటరామయ్య, గురిజాల సుబ్బారావు, పిట్టు రమేష్, మచ్చు జోగారావు, చప్పిడి సుధీర్, శ్రీకాంత్ చిట్టేటి, పద్మశాలీ నేత చుట్ల విజయకుమార్‌కు శివనాథ్ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ ఒక సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి జగన్మోహనరెడ్డి కనీసం మాట్లాడేందుకు అవకాశమివ్వకపోవడం దారుణమన్నారు. చప్పిడి కృష్ణమోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ వైసీపీని వీడి టీడీపీలోకి చేరడంతో ఎంతో స్వేచ్ఛ వచ్చిందన్నారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

ఓటేసి.. దివికేగి!

● ఎన్టీఆర్ క్లాస్‌మేట్ పూర్ణరమేష్ కన్నుమూత

● మంచి పాలన వచ్చి రాష్ట్రం బాగుపడాలని ఆఖరి శ్వాస

కృష్ణలంక, మే 9: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ఎన్టీఆర్ క్లాస్‌మేట్ అరిగపూడి పూర్ణ రమే ష్ (99) గురువారం విజయవాడ మున్సిప ల్ కాలనీలోని ఆమె స్వగృహంలో కన్నుమూశారు. ఆమె గుం టూరు ఏసీ కాలేజీలో ఎన్టీఆర్‌తో కలిసి చదువుకున్నారు. 2 రోజుల క్రితం ఎన్నికల సిబ్బంది ఆమె ఇంటికి వెళ్లగా మంచి పరిపాలన రావాలని, రా ష్ట్రం బాగుపడి ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ఓటు హ క్కు వినియోగించుకొని ఆ గుర్తును అందరికీ చూపించారు. గురువారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆమెకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.


పూర్ణ రమేష్ భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న గద్దె రామ్మోహన్

ఓటు వేస్తే శంకర్ నేత్రాలయలో ఉచిత కన్సల్టేషన్

మొగల్రాజపురం: ఎన్నికల సంఘం పిలుపు మేరకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు కీలకమని నమ్మి బాధ్యతగా ప్రజలు ఓటు వేయడానికి ముందుకు వచ్చేలా చేయడానికి తమ ఆసుపత్రి ఓటేసి సిరా గుర్తు చూపించిన వారికి ఉచిత కన్సల్టేషన్ అవకాశం కల్పించినట్టు శంకర్ నే త్ర చికిత్సాలయ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాదేళ్ల స్వాతి తెలిపారు. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు నిర్మలా కాన్వెంట్ జంక్షన్‌లోని ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ అవకాశం మే 13నుంచి జూన్ 30వరకు ఉంటుందన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. డాక్టర్ రోహిత్, డాక్టర్ జరీనా, డాక్టర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేత కృష్ణ సుందరరావుకు నివాళి

గవర్నర్‌పేట, మే 9: యూటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఏ కృష్ణ సుందరరావు ప్రథమ వర్ధంతి గురువారం ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఏ సుందరయ్య, పలువురు ఉపాధ్యాయ సంఘాల, సీపీఎం, సీఐటీయూ నేతలు హాజరై కృష్ణ సుందరరావు చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. యూ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పీ మనోహర్‌కుమార్, నేతలు ఏ ఉమామహేశ్వరరావు, ఎం. హనుమంతరావు, సంజీవరెడ్డి, రమణయ్య, గోపాలకృష్ణ, అనంత్‌కుమార్, హరిప్రసాద్, లలిత, ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

కేడీసీఏ మహిళా క్రికెట్ జట్ల ఎంపిక పూర్తి

విజయవాడ స్పోర్ట్స్, మే 9: కేడీసీఏ మహిళా క్రికెట్ జట్ల ఎంపికలను పూర్తిచేసినట్టు కేడీసీఏ అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు, కన్వీనర్ ఎం. రవిశంకర్, క్రికెట్ హెడ్ వి. విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. సెలెక్టర్లుగా హెచ్.రామ్‌ప్రసాద్, పి.నాగమణి, కోచ్ గాంధీ పాల్గొన్నారు.

అండర్-15: బి.స్రవంతి (కెప్టెన్), ఎం.సృజన, ఆర్.మానస యశోద, పి.లక్ష్మి అపర్ణ, డి.జస్య నిత్య, పి.సుమశ్రీ, టి.కావ్య, బి.తమళిక, సీహెచ్.ధన శ్రీ, ఆర్.చేతన ప్రియ, కె.హారిక, వి.అన్విశ్రీ, బి.నిహారిక, పి.ఆనంద దీప్తి, టి.గుణ చంద్రిక, సౌఖ్యశ్రీ, జేవీవీఎస్ఎస్. యశ్విని, స్టాండ్‌బైలుగా వి. అక్ష య, టి. సౌమ్యశ్రీ, కె.జస్మిద సాయిరెడ్డి, ఆర్. తేజస్విని. అండర్-19: పి.రంగలక్ష్మి(కెప్టెన్), ఎం.గీతాంజలి, బి. పుష్ప, ఎ. లేఖన, అంజుమ్, కీర్తి, ఎం.పూజిత, ఎండీ.జస్రా మెహక్, లక్ష్మణ శృతి, సీహెచ్.గౌతమీ, ఆర్.ఇషాకామ్యే, ఎ.ఎస్తేరురాణి, టి.నాగచంద్రిక, జి.నోషిణి, వి.గా యత్రిదేవీ, టి.గుణచంద్రిక, స్టాండ్‌బైలుగా నిఖిత, చందన, సయ్యద్ మహనూర్. .. అండర్-23: కేతు.దయానా(కెప్టెన్), పి.రంగ లక్ష్మి, కేవైఎంవీ. వర్ధిని, బి. పుష్ప, ఎండీ.అఫ్రా ముష్కానా, ఎం.భావన, కె.ధాత్రి, టి. నివేదిత, ఎం.లే ఖన, ఎం.పూజిత, అంజుమ్, ఎండీ.రిజెర్స్ మెహక్, సీహెచ్.గౌతమీ, ఆర్.ఇష్కాకామ్యే, పి.లక్ష్మిశృతి. జి.గీతాంజలి, కీర్తి, గాయత్రి దేవి, జి.నోషిణి.



ప్రధానమంత్రి నరేంద్రమోదీ రోడ్ షోతో జోష్ మీదున్న కూటమి కార్యకర్తలకు రెట్టింపు ఉత్సాహం కలిగింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ నగరంలో గురువారం నిర్వహించిన రోడ్ షో డబుల్ ఇంజన్ జోష్‌ను నింపింది. టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, నేతలు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొనగా, పంజా సెంటర్ బహిరంగ సభలో పవన్ చేసిన ప్రసంగం ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపింది.



పంజా సెంటర్ బహిరంగ సభకు హాజరైన జనం (ఇన్‌సెట్‌లో) అభిమానులు బహూకరించిన ఖడ్గంతో పవన్ కల్యాణ్

జనసేనానికి జన స్వాగతం

నగరంలో పవన్ రోడ్ షో గ్రాండ్ సక్సెస్

- భారీగా తరలివచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు
- పంజా సెంటర్ బహిరంగ సభకు పోటెత్తిన జనం
- మూడు నియోజకవర్గాల్లో సాగిన రోడ్ షో
- సెంట్రల్‌లో బొండా ఉమా ఘన స్వాగతం
- వెలంపల్లి, కర్నాటి రాంబాబుపై ఘాటైన విమర్శలు
- పోతిన మహేశ్‌కు చురకలంటించిన పవన్
- అమరావతి కోసమే 'పశ్చిమ'ను వదులుకున్నామని వివరణ
- ముస్లింలకు కొండంత అండగా ఉంటానని భరోసా



సభలో పవన్‌తో పాటు పాల్గొన్న గద్దె రామ్మోహన్, సుజనా చౌదరి, వంగవీటి రాధాకృష్ణ, కేశినేని చిన్ని, ఎంఎస్ బేగ్ తదితరులు

విజయవాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : బందరురోడ్డులోని పశువుల ఆసుపత్రి జంక్షన్ నుంచి నైస్‌బార్ సెంటర్, విశాలాంధ్ర రోడ్డు, ఏలూరు రోడ్డు, లోబ్రిడ్జి మీదుగా పంజా సెంటర్ వరకు జనసేనాని పవన్ కల్యాణ్ ర్యాలీ జరిగింది. శిఖామణి సెంటర్ వద్ద సెంట్రల్ టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. తూర్పు టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ రోడ్ షో చివరి వరకు ఉన్నారు. ఇక పంజా సెంటరులో నిర్వహించిన సభలో పవన్ నియోజకవర్గంలోని సమస్యలను ప్రస్తావించారు. పరిష్కారానికి తాను ఉన్నానని భరోసా ఇచ్చారు. ముస్లిం రిజర్వేషన్లపై జరుగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేస్తానన్నారు. ముస్లింల ప్రాథమిక హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు.

అమరావతి కోసమే పశ్చిమను వదులుకున్నాం : పవన్

పొత్తులో భాగంగా పశ్చిమ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించాల్సి ఉందని పవన్ పేర్కొన్నారు. అయితే, ఈ సీటును బీజేపీ నేతలు కోరారని, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అమరావతిని రాజధాని చేయాలని కోరగా, కేంద్ర నాయకత్వం సరేనని అంగీకరించిందన్నారు. అందువల్ల ఈ సీటును త్యాగం చేయాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన ఉందని తాను చెప్తే ఎవరూ నమ్మలేదని, నరేంద్రమోదీ ఇదే విషయాన్ని చెప్పారన్నారు. పశ్చిమలో జనసేన బలంగా ఉందన్నారు. విజయవాడలో శాంతిభద్రతలు బలంగా ఉండాలని పవన్ అభిప్రాయపడ్డారు. అందుకే తాము పెంచిన నేతలు తిడుతున్నా పడుతున్నామన్నారు. త్వరలో సుజనా ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. ఏ సమస్య ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పోతిన మహేశ్ అంటే పశ్చిమ ప్రజలకు తెలియదని, నాయకుడిగా తయారు చేసింది తానేనని చెప్పారు. ఇప్పుడాయన వైసీపీ మాయలో పడి తనను దూషిస్తున్నాడని మండిపడ్డారు. మంత్రి వెలంపల్లి హయాంలో దుర్గమ్మ రథంపై వెండి సింహాలు మాయమయ్యాయని గుర్తుచేశారు. కాల్‌మనీ కేసుల్లో నిందితుడ్ని దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ చేశారని విమర్శించారు. ఒక కంటికి దెబ్బ తగిలితే మరో కంటికి కట్టు వేసుకుని ఆస్కార్ నటన చేస్తున్నాడని వెలంపల్లిని ఎద్దేవా చేశారు. ఎవరో విసిరిన రాయి 360 డిగ్రీల్లో తిరిగి ఆయనకు తగిలిందన్నారు. వెలంపల్లి చేసిన నటన తాను సినిమాల్లోనూ చేయలేదన్నారు.



రోడ్ షోలో పవన్‌కు పూలవర్షం కురిపిస్తున్న జనసేన అభిమానులు

అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తా..

ఉత్తరాంధ్రలోని ఉద్దానంలో కిడ్నీ సమస్య వంటిది పశ్చిమలోనూ ఉందన్నారు. ఇక్కడున్న కొండ ప్రాంతవాసులు ఎక్కువగా పక్షవాతం బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ఇది ఎందుకు వస్తుందో పరిశోధన చేయించి సమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. డ్రెయినేజీలో ఎక్కడికక్కడ దుర్గంధం పేరుకుపోయిందన్నారు. ఆ సమస్యను సరిచేసే బాధ్యత కూటమి తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కూటమి ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి, నాయకులు వంగవీటి రాధాకృష్ణ, జలీల్‌ఖాన్, ఎంకే బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల దందాగిరీ..!

పవిత్రమైన దుర్గమ్మ సన్నిధిలో దుష్ట పన్నాగాలు పన్నారు.. కాసులు కురిపించే కార్పొరేషన్‌ను ఇష్టమొచ్చినట్టు కొల్లగొట్టారు.. ఆఖరుకు కరోనా కాలంలోనూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు.. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా, మంత్రిగా, మాజీ మంత్రిగా ఈ ఐదేళ్లలో వెలంపల్లి శ్రీనివాసరావు, ఆయన అనుచరులు చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. నియోజకవర్గానికి కానీ, జిల్లాకు కానీ ఏమీ చేయలేకపోగా, వెలంపల్లి, ఆయన ముఖ్య అనుచరుడు బుజ్జిబాబు మాత్రం ఆస్తులు భారీగా పెంచుకున్నారు. స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఈ ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గంలో దుకాణం తెరిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి అవినీతి, అక్రమాలు



- ఇంద్రకీలాద్రి నుంచి కార్పొరేషన్ వరకూ అన్నీ దందాలే
- దేవదాయ మంత్రిగా దుర్గగుడిలో అరాచకాలు
- తాను తెచ్చిన ఈవో సురేశ్‌బాబుతో కలిసి ఇష్టానుసారంగా..
- వెండి సింహాలు మాయం ఘటనలో వివాదాలు
- కరోనా సమయంలోనూ ఆగని కాసుల వేట
- కార్పొరేషన్‌లో వెలంపల్లి, అనుచరుల మాటే శాసనం
- అవినీతి పెచ్చుమీరడంతో ఈసారి 'సెంట్రల్'వైపు..

అమ్మ సన్నిధిలో అరాచకాలు

వైసీపీ అధికారంలోకి వచ్చాక పవిత్రమైన దుర్గగుడి రాజకీయాలకు వేదికగా మారింది. గతంలో ఈవోగా పనిచేసిన కోటేశ్వరమ్మ తన మాట వినడం లేదని దేవదాయ మంత్రిగా ఉన్న వెలంపల్లి ఏరికోరి మరీ సురేశ్‌బాబును ఈవోగా తీసుకొచ్చారు. ఆ సమయంలో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందనే ఆరోపణలు వచ్చాయి. ఈవోగా సురేశ్‌బాబు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి దుర్గగుడిలో పాలన అదుపు తప్పింది. కాంట్రాక్టులను తమ బినామీ సంస్థలకు కట్టబెట్టడం మొదలు అసలు నిర్మాణాలే చేయకుండా కోట్లాది రూపాయలు డ్రా చేయడం వరకు అడ్డగోలు దందాలకు ఇంద్రకీలాద్రి వేదికైంది. మంత్రిగా ఉన్న వెలంపల్లి అండ చూసుకుని ఈవో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వివాదాస్పదమైంది. వెలంపల్లి మంత్రిగా ఉన్న సమయంలోనే దుర్గమ్మ సన్నిధిలో అమ్మవారి వెండి ఉత్సవ రథంపై ఉన్న మూడు సింహాలు మాయమైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది.

- దుర్గగుడిలో ఓ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఉద్యోగి తన ఉద్యోగ విరమణ చేయడానికి ముందు ఏఈవోగా పదోన్నతి కల్పించడం ద్వారా సుమారు అరకోటి రూపాయలు వెలంపల్లి అనుచరులకు ముట్టాయి. సదరు ఉద్యోగి గతంలో సింహాచలం ఆలయంలో పనిచేసినప్పుడు ఆ దేవస్థాన భూముల కుంభకోణంలో ప్రధాన సూత్రధారి అనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అవినీతి ఆరోపణలపై విచారణ కొనసాగుతుండటంతో నిబంధనలకు విరుద్ధంగా ఆయనకు ఏఈవోగా పదోన్నతి కల్పించేయడం గమనార్హం.
- శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా చక్కా నాగవెంకట వరలక్ష్మిని నియమించారు. ఆమెకు చెందిన కారులో రూ.40 వేల విలువ చేసే 283 మద్యం బాటిళ్లను అక్రమంగా రవాణా చేస్తుండగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆమెను పదవి నుంచి రాజీనామా చేయించారు. అయితే కొద్దిరోజులకే మళ్లీ ఆమెను ట్రస్టుబోర్డు మెంబరుగా నియమించారు.

దేవుడి ఆస్తులను దోచేయాలనుకున్నారు

దేవదాయ శాఖ మంత్రిగా వెలంపల్లి సుమారు రెండున్నరేళ్లు పనిచేశారు. ఆ సమయంలో దేవుడి ఆస్తులను కాజేయడంపైనే ఆయన అనుచరులు దృష్టిసారించారు. సుమారు రూ.100 కోట్ల విలువైన ఆస్తులున్న నాలుగు సంస్థలపై కన్నేశారు. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం చెంతనే నిడుముక్కల రంగవల్లి తాయారమ్మ చారిటీస్, నిడుముక్కల సుబ్బారాయుడు ధర్మరామానుజ కూటం, పారేపల్లి శ్రీరాములు ధర్మరామానుజ కూటం ఉన్నాయి. ఈ నాలుగు దేవాదాయ శాఖ ఆధీనంలోనివే. వీటిలో పారేపల్లి శ్రీరాములు ధర్మరామానుజ కూటాన్ని ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ (ఎఫ్ఎఫ్ఎం) పర్యవేక్షిస్తుండగా, మిగిలిన మూడు సంస్థలను దేవదాయ శాఖ ఈవోలు పర్యవేక్షిస్తున్నారు. వీటికి జిల్లావ్యాప్తంగా సుమారు రూ.100 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. వీటిపైన మంత్రి అనుచరుల కన్ను పడింది. శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం మేనేజింగ్ కమిటీ పేరుతో దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న పై నాలుగు సంస్థలను తమకు అప్పగించాలని లేఖ రాయడం, ఆ ఫైలును సర్క్యులేట్ చేయాల్సిందిగా మంత్రిగా ఉన్న వెలంపల్లి ఆదేశించడం ఆగమేఘాలపై జరిగిపోయాయి. అయితే వైశ్యుల నుంచి నిరసనలు వ్యక్తం కావడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది.

కార్పొరేషన్‌ను కొల్లగొట్టేశారు

విజయవాడ కార్పొరేషన్‌ను వెలంపల్లి అనుచరులు తమ గుప్పెట పెట్టుకున్నారు. వెలంపల్లి మంత్రిగా ఉన్న సమయంలో వీఎంసీలో అధికారుల సంతకాలనే ఫోర్జరీ చేసి రూ.10 లక్షల దోపిడీకి ఓ కాంట్రాక్టర్ ప్రయత్నించారు. బోగస్ మస్తర్లతో రూ.9.50 లక్షలకు బిల్లు తయారు చేసి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు. వాటాల వద్ద తేడా రావడంతో ఫోర్జరీ సంతకం గుట్టురట్టయింది. విచారణ జరిపిన సీఎంహెచ్‌వో ఫైలును నిలిపేశారు. కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు పెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. కానీ, మంత్రి ఒత్తిడితో వెనక్కి తగ్గారు. విద్యాధరపురంలో ఓ ప్రముఖ వ్యాపార సంస్థ 114 గజాల్లో కింద షాపులు, పైన మూడంతస్థులు నిర్మించింది. వీఎంసీ అధికారులు ఆ వ్యాపార సంస్థ యజమానికి నోటీసులిచ్చారు. అది అనధికార కట్టడమని, వెంటనే తొలగించాలని ఆ నోటీసులో కోరారు. వెంటనే మంత్రి అనుచరుల నుంచి వీఎంసీ అధికారులకు ఫోన్ వెళ్లింది. ఆ నిర్మాణం జోలికి వెళ్లొద్దంటూ హుకుం జారీ అయింది.

కరోనా పేరుతో దోచేశారు

కరోనా కాలంలోనూ మంత్రి అనుచరుల దోపిడీ ఆగలేదు. ప్రజల విటమిన్ సి, డి, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లతో పాటు డోలో వంటి మందుబిళ్లలకూ డిమాండ్ పెరిగింది. దీంతో ఇదే రంగంలో ఉన్న మంత్రి అనుచరుడు బుజ్జిబాబు.. నాణ్యత తక్కువగా ఉండే పీసీడీ మందులను నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, మందుల దుకాణాలకు సరఫరా చేసి భారీగా సొమ్ము చేసుకున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో బెడ్లనూ అమ్ముకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పల్స్ తెలిసి పక్కకు..

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో ఆయనకు నియోజకవర్గ ప్రజల పల్స్ ఏమిటో అర్థమైపోయింది. ఎక్కడికి వెళ్లినా నిలదీతలు.. నిరసనలే ఎదురయ్యాయి. 2022, జూన్‌లో కొత్తపేట బెజ్జాలమేడ ప్రాంతంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటుండగా, అదే ప్రాంతానికి చెందిన బీఎల్వీ నాగబాబు ఇంటికి వెళ్లారు. సమస్యలు గురించి ఆరా తీశారు. చెత్తపన్ను అధికంగా వసూలు చేస్తున్నారని, ఇదేం విధానమని నాగబాబు నిలదీశారు. దీంతో వెలంపల్లి ఆగ్రహంతో ఊగిపోయారు. ఆ యువకుడిపై మండిపడ్డారు. తక్షణమే అరెస్టు చేసి కేసు పెట్టాలని పోలీసులను ఆదేశించారు. ఇలాంటి ఉదంతాలెన్నో ఎదురవ్వడం వల్లే ఆయన పశ్చిమ నుంచి సెంట్రల్‌కు సీటు ఫిరాయించేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

- వెలంపల్లి పీఏగా ఉన్న ఒకరు నేరుగా అధికార పార్టీ కార్పొరేటర్ల నుంచి భారీగా వసూలు చేశారు. వీఎంసీ ఎన్నికల్లో వారిని గెలిపించడంలో తన పాత్ర ఉందంటూ ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష డిమాండ్ చేశాడు. మరో పీఏ ఏకంగా తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని దేవుడి మాన్యాలకు అడ్డగోలుగా ఎన్‌వోసీలు జారీ చేసేందుకు ప్రయత్నించాడు. ఎన్‌వోసీలు జారీ చేయకుండానే రూ.50 లక్షలకుపైగా ఖర్చు పెట్టానంటూ నగరానికి చెందిన ఒకరి నుంచి సుమారు రూ.15 కోట్ల విలువైన స్థలాన్ని కారుచౌకగా తన మామగారి పేరుపై రాయించేసుకున్నాడు.

గుడివాడ ఆర్వో కార్యాలయంలో

డబ్బు పంపిణీ



ఆర్వో కార్యాలయంలో దర్జాగా కూర్చున్న వైసీపీ పోలింగ్ ఏజెంట్

అధికారుల ముందే అధికార పార్టీ అరాచకం

- కుర్చీ వేసుకుని మరీ కారు డ్రైవర్లకు నగదు
- వైసీపీ ఏజెంట్ కృష్ణ హడావిడి
- ఆర్వో ఆఫీసులోనే ఉన్నా చర్యలు శూన్యం
- ప్రశ్నించిన మీడియాను అడ్డుకున్న వైనం

గుడివాడ రిటర్నింగ్ అధికారి (ఆర్డీవో) పి.పద్మావతి మరోసారి అధికార పార్టీకి దాసోహమయ్యారు. పోలింగ్ ఏజెంట్ ముసుగులో వైసీపీ నాయకుడు గురువారం ఉదయం నుంచి ఆర్వో కార్యాలయంలో ఉండి, దర్జాగా నగదు పంపిణీ చేస్తున్నా కనీసం పట్టించుకోలేదు. విషయం తెలిసి మీడియా ప్రతినిధులు కార్యాలయం వద్దకు చేరుకున్నా పోలీసులను పెట్టి అడ్డుకున్నారు కానీ, సదరు ఏజెంట్లపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది.

గుడివాడ, మే 9 : స్థానిక ఆర్డీవో (ఆర్వో) కార్యాలయంలో గురువారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల కార్ల డ్రైవర్లు ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లలోపు ఎటువంటి పార్టీ కార్యకలాపాలు నిర్వహించకూడదు. కానీ, గుడివాడలోని అధికార పార్టీ పోలింగ్ ఏజెంట్ కృష్ణ గురువారం ఉదయం నుంచి ఆర్వో కార్యాలయం ఆవరణలో దర్జాగా కూర్చున్నాడు. ఉన్నతాధికారులు వస్తున్నా పట్టించుకోకుండా తన పని తాను చేసుకున్నాడు. తొలుత ఆర్వో కార్యాలయ రిసెప్షన్ కౌంటర్ పక్కన ఉన్న బల్లపై కూర్చుని, డ్రైవర్ల కాగితాలను పూర్తిచేసి, నగదును బహిరంగంగా పంపిణీ చేశాడు. అక్కడే ఉన్న ఆర్డీవో కార్యాలయ సిబ్బంది చూస్తూ కూడా ఎలాంటి ఆక్షేపణ తెలపలేదు. ఆ తరువాత కార్యాలయం ఎదురుగా చెట్టు కింద కుర్చీ వేసుకుని మరీ దర్జాగా నగదు పంపిణీ చేశాడు. ఈ తతంగమంతా పోలింగ్ బూత్‌కు 100 మీటర్లలోపు జరుగుతున్నా పోలీసులు గానీ, ఎన్నికల అధికారులు గానీ పట్టించుకోలేదు.

మీడియా రాకతో హడావిడి

వైసీపీకి చెందిన వ్యక్తి బహిరంగంగా నగదు పంపిణీ చేస్తున్నట్లు మీడియా దృష్టికి వచ్చింది. అప్పుడు అధికారుల్లో చలనం కలిగింది. మీడియా రాకను ఆర్వో పి.పద్మావతి గమనించారు. వారందరినీ వెంటనే బయటకు పంపాలని వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాసరావుకు ఫోన్‌లో ఆదేశాలిచ్చారు. సీఐ అక్కడికి చేరుకుని మీడియా వారంతా బయటకు వెళ్లాలని కోరారు. పోలింగ్ ఏజెంట్‌ను మాత్రం బయటకు పంపలేదు. రిలీవింగ్ ఏజెంట్ కార్యాలయ ఆవరణలో ఉన్నా పోలీసులకు, ఆర్వోకు కనిపించలేదు. రెండు గంటలుగా ప్రచార అనుమతుల పేరుతో ఇద్దరు వైసీపీ నాయకులు కూడా అక్కడే ఉన్నారు. వీరందరూ కార్యాలయంలో ఉన్నా చూసిచూడనట్టు వ్యవహరించిన ఆర్వో మీడియాపై మాత్రం ఆంక్షలు విధించారు. అధికార వైసీపీ నాయకులు అక్కడ ఎందుకు ఉన్నారని మీడియా ప్రశ్నించడంతో పోలీసులు హడావిడిగా పోలింగ్, రిలీవింగ్ ఏజెంట్లను బయటకు పంపారు.



నగరాన్ని తడిపిన వాన

నగరంలో గురువారం కూడా వర్షం కురిసింది. ఓ మోస్తరుగా వర్షం పడటంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. కాగా, ఈ నెల 13 వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



పెద ఓగిరాలలో నేలవాలిన అరటి పంట

బెజవాడలో పవర్ స్టార్

» జనసేనానికి భారీ స్పందన » కిక్కిరిసిపోయిన నగర వీధులు » భద్రతా ఏర్పాట్లలో పోలీసుల నిర్లక్ష్యం



వన్‌టౌన్‌లో పవన్‌కల్యాణ్ సభకు హాజరైన జనం



వన్‌టౌన్, మే 9 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సభకు భారీ స్పందన వచ్చింది. పవన్‌కల్యాణ్ వస్తున్నారన్న సమాచారంతో మధ్యాహ్నం నుంచే అభిమానులు వీధుల్లోకి వచ్చారు. గురువారం పవన్‌కల్యాణ్ వారాహి యాత్ర. బహిరంగ సభ వన్‌టౌన్ పంజాసెంటర్‌లో ఏర్పాటు చేశారు. పవన్ పర్యటన అనుకున్న సమయం కంటే నాలుగు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. అయినా మహిళలు సహా ప్రజలు వీధుల్లోనే వేచి ఉన్నారు. బైక్‌లపై యువత కేరింతలు కొట్టారు. జనం పెద్ద ఎత్తున రావడంతో పంజా సెంటర్, గణపతిరావు రోడ్డు కిక్కిరిసాయి. ఆర్టీసీ, ఇతర వాహనాలను దారి మళ్లించారు. వారాహి వాహనంపై పవన్‌కల్యాణ్. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి శివనాథ్ (చిన్ని), పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనాచౌదరి, పార్టీల నాయకులు వంగవీటి రాధాకృష్ణ, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, జలీల్ ఖాన్, ఎంఎస్ బేగ్, బొమ్మసాని సుబ్బారావు, అడ్డూరి శ్రీరామ్, అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు. పవన్ సభకు సుమారు 15 వేలమందికి పైగా జనం హాజరయ్యారు. ఆయనను చూసేందుకు అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చింది.

రాష్ట్రం కోసం పవన్ ఎన్నో రాజీలు పడ్డారు

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి

రాష్ట్రంలో అరాచక పాలన పోవాలి.. మంచి పాలన రావాలి.. అందుకోసమే పవన్ కల్యాణ్ కూటమిని ఏర్పాటు చేశారు.. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధికి కోసం ఆయన ఎన్నో రాజీలు పడ్డారు. కూటమిని ఏర్పాటు చేయడం కోసం అనేక త్యాగాలు చేశారు. అనకాపల్లిలో సొంత అన్నయ్య సీటును త్యాగం చేశారు. నేను, పవన్ ఉద్యోగం కోసం రాజకీయాల్లోకి రాలేదు. ప్రజాసేవ చేయడానికి వచ్చాం. ప్రజాస్వామ్యంలో ఒకసారి ప్రజలు తప్పు చేస్తే ఏం జరుగుతుందో ప్రత్యక్షంగా చూస్తున్నాం. 2019 ఎన్నికల్లో జగన్ గెలవలేదు. ప్రతిపక్షాలు మాత్రమే ఓటమి చెందాయి. పంజా సెంటర్‌ను గంజాయి సెంటర్‌గా జగన్ మార్చేశాడు. పదో తరగతి పూర్తి చేసిన వ్యక్తికి నైపుణ్యం నేర్పకుండా.. జగన్ గంజాయి అలవాటు చేశాడు. బెజవాడ రాజకీయ, సినిమా రంగానికి రాజధాని. వాణిజ్య రంగానికి జంక్షన్. అటువంటి నగరంలో ఉన్న పశ్చిమ నియోజకవర్గం దారుణంగా ఉంది. వీధుల్లో తిరుగుతున్నప్పుడు చలించిపోతున్నా. దేశంలో బీజేపీ పెద్ద పార్టీ. రాష్ట్రంలో టీడీపీ పెద్ద పార్టీ. చాలా చిన్న పార్టీ జనసేన. అటువంటి జనసేన మినరల్ వాటర్ ఇచ్చినంత ఉత్తేజాన్ని ఇస్తోంది.

ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో పవన్‌కు బాగా తెలుసు

- కేశినేని చిన్ని

ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ కల్యాణ్. జగన్ నాయకత్వంలో పాడైపోయిన రాష్ట్రం తిరిగి చంద్రబాబు, పవన్ నాయకత్వంలో బాగుపడాలని ప్రజలు కోరుకుంటున్నారు. మోదీ రోడ్డుషో, పవన్ సభ కూటమికి డబుల్ ఇంజన్ జోష్‌ను ఇచ్చాయి. అనేక విషయాల్లో తగ్గిన పవన్ ప్రజల గుండెల్లో మాత్ర బాగా పెరిగారు. పవన్ వల్లే కూటమి కల సాధ్యమైంది. గాడి తప్పిన రాష్ట్రం చంద్రబాబు, పవన్ వల్లే దారిలో పడుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. ప్రజాజీవితంలో ఇబ్బందులు పెట్టిన నేతలను ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలి.

సింహం పిచ్చిపట్టి తిరుగుతోంది

- వంగవీటి రాధాకృష్ణ

ప్రజల కోసం 130 సార్లు బటన్ నొక్కానని ఒక సింహం పిచ్చిపట్టి తిరుగుతోంది. సింహాలు, పులులు అడవుల్లో ఉండాలి. బటన్ నొక్కడం గురించి మాట్లాడుతున్న జగన్ తానెంత నొక్కేశాడో ప్రజలకు చెప్పాలి. పవన్ కల్యాణ్‌ను ఆయన తగ్గించినా.. ప్రజల గుండెల్లో టన్నుల కొద్దీ పెరిగారు. జగన్‌కు ఇక విశ్రాంతిని ఇద్దాం. రాబోయే ఎన్నికల్లో పులివెందులా, పిఠాపురమా, కుప్పమా తేల్చుకుందాం. ఇది పార్టీల కూటమి కాదు. ప్రజాకూటమి. భావితరాల భవిష్యత్తు కోసం కలిసికట్టుగా ప్రయాణం చేయాలి. రంగా ఇచ్చిన పిలుపు ప్రకారం చేయి చేయి కలుపు.. చేజారదు గెలుపు అన్న సూక్తిని నిజం చేద్దాం.



పవన్‌ను చూసేందుకు వస్త్రలత వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్ తీగలను తాకుతూ దూకుతున్న యువకులు, ఫోన్ చూస్తున్న పోలీసులు

పవన్ సభకు పోలీసు భద్రత కరువు..!

» ట్రాన్స్‌ఫార్మర్లు.. విద్యుత్ గేట్లను ఎక్కిన యువత
» చోద్యం చూసిన పోలీసులు

జనసేన అధినేత రోడ్ షోలో ట్రాఫిక్ నియంత్రించడంలో ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యం పూర్తిగా బయటపడింది. దీంతో రోడ్ షోలో ముందుడే రోప్ పార్టీ జనాన్ని నియత్రించే క్రమంలో పలు చోట్ల జనం కింద పడ్డారు. దీంతో రోడ్‌షో ప్రారంభమైనపుడు కార్లు కూడా రోడ్‌షోకు ఎదురు రావడంతో వాటర్ ట్యాంకు రోడ్డు, శిఖామణి సెంటర్‌లో పోలీసులు జనాన్ని తోసేశారు. దీంతో వారు వాహనాలపై పడ్డారు. శిఖామణి సెంటర్‌లో ట్రాఫిక్ స్థంభించింది. వన్‌టౌన్‌లో పవన్‌కల్యాణ్‌ను చూడాలన్న ఆసక్తితో యువకులు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలను పట్టించుకోకుండా ఐరన్ గేట్లు ఎక్కేశారు. పోలీసులు అక్కడే ఉన్నా చోద్యం చూశారు. బందోబస్తు వదిలి సెల్‌ఫోన్ చిట్ చాట్‌లో మునిగిపోయారు. జరగరానిది జరిగితే బాధ్యులెవరని స్థానిక ప్రజలు విమర్శలు గుప్పించారు. కిక్కిరిసిన జనం మధ్యలో గ్యాస్‌తో వెల్డింగ్ రాడ్‌ను వెలిగించి పవన్‌కల్యాణ్ అభిమానులు హారతి ఇచ్చారు. దీనిని పోలీసులు కాని, ఎవరూ కాని నివారించలేదు. అయితే ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



గంగూరులో టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడుతున్న వైసీపీ మూకలు

గంగూరులో టీడీపీ నేతలపై వైసీపీ గూండాల దాష్టీకం

గంగూరు (కంకిపాడు), మే 9 : గంగూరులో టీడీపీ నాయకుల ఇళ్లపై వైసీపీ గూండాలు దాడులకు తెగబడ్డారు. ఇంటి వద్ద ఉన్న మహిళలు, చిన్నారులపై విరుచుకుపడ్డారు. టీడీపీ నాయకులు కూడా ప్రతిఘటించగా ఇరువర్గాలను పోలీసులు చెదర కొట్టారు. గంగూరు రైస్ మిల్ సమీపంలో గురువారం సాయంత్రం పెనమలూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సమయంలో టీడీపీకి చెందిన ఓ నాయకుడి ఇంటికి, కరెంటు స్తంభాలకు టీడీపీ జెండాలు కట్టి ఉన్నాయి. దీంతో ఆగ్రహించిన వైసీపీ గూండాలు జెండాలు ఎందుకు కట్టావ్ అంటూ జెండాలను లాగేసి కింద పడేసి కాళ్లతో తొక్కారు. అదేంటని ప్రతిఘటించిన టీడీపీ నాయకుడు, కుటుంబసభ్యులపై వైసీపీ గూండాలు దాడులకు పాల్పడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను చెదరకొట్టారు. అదే విధంగా వణుకూరులో నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో కూడా వైసీపీ గూండాలు టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడ్డారు. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించటం సరికాదని ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఖాళీ బిందెలతో ఎన్నికల ప్రచారంలో రవీంద్ర, రాయుడు

కూటమి ప్రభుత్వంతో బందరు సుందర నగరమే..

» ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 9 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బందరు సుందర నగరంగా రూపుదిద్దుతామని మాజీమంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక కళ్యాణ మండపంలో కొల్లు పునీత్, ప్రముఖ క్రికెట్ ఆటగాడు అంబటి రాయుడు ఆధ్వర్యంలో యువతతో జరిగిన చర్చా గోష్టిలో కొల్లు రవీంద్ర మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బందరు పోర్టు నిర్మాణం పూర్తి చేస్తామని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగేలా పరిశ్రమలు తీసుకుని వస్తామన్నారు. గతంలో టీడీపీ హయాంలో స్టేడియం నిర్మించేందుకు శంకుస్థాపన చేశామని, నిధులు కూడా విడుదలయ్యాయని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్టేడియంకు కేటాయించిన స్థలాన్ని పేదలకు ఇచ్చి వేసిందన్నారు. తాము అధికారంలోకి రాగానే మచిలీపట్నంలో స్టేడియం నిర్మిస్తామన్నారు.

చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి

» క్రికెటర్ అంబటి రాయుడు

అంబటి రాయుడు మాట్లాడుతూ, పవన్‌కళ్యాణ్, చంద్రబాబు ఆశయాలకు స్పందించి క్రికెట్‌ను వదిలిపెట్టి ప్రజాసేవలోకి వచ్చానన్నారు. యువత పవన్‌కళ్యాణ్, చంద్రబాబు అధికారంలోకి రావాలంటే కొల్లు రవీంద్ర, వల్లభనేని బాలశౌరిని గెలిపించాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, యువతలో రాజకీయ చైతన్యం పెరిగిందన్నారు. పవన్‌కళ్యాణ్ అభిమానులు ఈ ఎన్నికల్లో సైనికుల్లా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సినీనటుడు అంబటి శ్రీనివాస్, నియోజకవర్గ తెలుగు యువత నాయకుడు సలీం తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

» వెనిగండ్ల రాము

గుడివాడ, మే 9 : కేంద్ర, రాష్ట్ర నిధులతో గుడివాడను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మచిలీపట్నం ఎంపీ, జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, గుడివాడ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాములు అన్నారు. గురువారం పట్టణంలోని వార్డుల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం సమతుల్యతకు చంద్రబాబు రోల్‌మోడల్‌గా నిలిచారన్నారు. గుడివాడలో రాక్షస పాలనకు ప్రజలు ఓటు ఆయుధంతో ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుడివాడలో రాజకీయ రౌడీల తాటతీస్తామని హెచ్చరించారు. గడ్డం గ్యాంగ్ భూకబ్జాలపై పూర్తిస్థాయి విచారణ చేయించి బాధితులకు న్యాయం చేస్తానని హామీ యిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నేతలు యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, వార్డు కమిటీల సభ్యులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



గుడివాడ రోడ్‌షోలో వెనిగండ్ల, నర్సిరెడ్డి, యలవర్తి



వెనిగండ్లను గెలిపించండి

» దాసరి కుమారి ఆంటీ

గుడివాడ : గుడివాడ కూటమి అభ్యర్థి వెనిగండ్ల రామును అఖండ మెజార్టీతో గెలిపించాలని సెలబ్రిటీ దాసరి కుమారి ఆంటీ కోరారు. గురువారం స్థానిక 25వ వార్డు, పెదఎరుకపాడులో వెనిగండ్ల రాము తరఫున ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ఫుడ్‌స్టాల్ నిర్వహించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లి సామాజిక మాధ్యమాల్లో, టీవీ చానళ్లలో కుమారి ఆంటీ పాపులర్ అయిన విషయం విదితమే.



ఎన్నికల అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

» ఎన్నికల అధికారుల శిక్షణా కార్యక్రమంలో కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియ సక్రమంగా సజావుగా సాగేందుకు ఎన్నికల అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని కృషా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జడ్పీ కన్వెన్షన్‌హాలులో పీవోలు, సెక్టార్‌అధికారులకు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 13వ తేదీన పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రిసైడింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల పని తీరుకు సంబంధించి ఎర్రర్, రీప్లేస్‌మెంట్, ప్రోటోకాల్ తదితర అంశాలపై అధికారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోల్‌డే మేనేజ్‌మెంట్ సిస్టం గురించి ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించామని, దీనిద్వారా ప్రతిఅంశాన్ని అప్‌డేట్ చేయాల్సి ఉందన్నారు. ఎండల కారణంగా పోలింగ్ రోజు ఉదయం 10గంటలలోపు, సాయంత్రం 4గంటల తరువాత ఓటర్లు బూత్‌లకు వస్తారని, త్వరితగతిన ఓటర్లతో ఓట్లు వేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తగినంత వెలుతురు, విద్యుత్ సౌకర్యం ఉండేలా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, పోలింగ్ నిర్వహణ ఎంత ముఖ్యమో, రిపోర్టింగ్ కూడా అంతేముఖ్యమన్నారు. కార్యక్రమంలో శిక్షణవిభాగం నోడల్ అధికారి మురళీకిషోర్, జెడ్పీ సీఈవో ఆనందకుమార్ పాల్గొన్నారు.





పోలింగ్ బూత్‌ల్లో పకడ్బందీ ఏర్పాట్లు

» రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా

మచిలీపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు, ఓటర్లు నిర్భయంగా పోలింగ్‌బూత్‌లకు వచ్చి ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రత్యేకపోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో కలెక్టర్, ఎస్పీ, ఆయా విభాగాల, నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిబంధనల మేరకు జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. నగదు, మద్యం, వస్తువుల పంపిణీ తదితర అంశాలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద నిఘా మరింత పెంచాలని సూచించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలవద్ద బందోబస్తు ఏర్పాట్లను వివరించారు. సీజర్ మేనేజ్‌మెంట్ పనిచేస్తున్న తీరు, తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. సమావేశంలో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం, మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల పరిశీలకుడు జాన్‌కింగ్స్‌లే, గన్నవరం, గుడివాడ, పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల పరిశీలకుడు సరహరిసింగ్ బంగర్, ఎన్నికల వ్యయపరిశీలకులు చవాన్ ప్రవీణ్ మోహన్‌దాస్, వికాస్‌చంద్ర కరోల్, ఆర్వోలు పాల్గొన్నారు.

అరాచక పాలన

అంతం కావాలి

» వెలగలేరులో వసంత కృష్ణ ప్రసాద్ ఎన్నికల ప్రచారం

జి.కొండూరు, మే 9 : వైసీపీ అరాచక పాలన అంతమొందించేందుకు ఏపీ అభివృద్ధి, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన కవులూరు, వెలగలేరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాలు పసుపు మయంగా మారాయి. పెద్ద ఎత్తున ప్రజలు బ్రహ్మరథం పట్టగా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా



వసంతకు హారతి పడుతున్న మహిళలు

వసంత మాట్లాడుతూ, 2019కి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ నెరవేర్చకుండా మాట తప్పి మడమ తిప్పి రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశాడన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధిని అందించేది ఎన్డీఏ కూటమే అన్నారు. రాజధానిలోనే ఇల్లు, ఆఫీసు కట్టుకుంటున్నానని నమ్మించి అసెంబ్లీలో ప్రస్థావించి మూడు రాజధానులంటూ ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని సర్వనాశనం చేశారని, దీనివల్ల ఎంతో మంది కార్మికులకు ఉపాధి కరవైందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని నాశనం చేశాడన్నారు. ఎన్నికల్లో విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)కి పార్లమెంట్ అభ్యర్థుల ఈవీఎంలో 1వ గుర్తుకు, మైలవరం అసెంబ్లీ అభ్యర్థుల ఈవీఎంలో 4వ గుర్తులో ఉన్న తనకు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.



పోలాటితిప్ప గ్రామంలో ఎన్నికల ప్రచారంలో కొల్లు రవీంద్ర

వచ్చే ఎన్నికల్లో వైసీపీ తుడిచిపెట్టుకు పోవడం ఖాయం

» గ్రామాల్లో పర్యటించిన కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 9 : కృష్ణాజిల్లాలో ఉమ్మడి అభ్యర్థులకు ప్రజాదరణ పెరుగుతోందని, వైసీపీ ప్రభుత్వం ఈ ఎన్నికల్లో తుడుచిపెట్టుకు పోవడం ఖాయమని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి బందరు మండలం కోన, పోలాటితిప్ప గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, మచిలీపట్నం నియోజకవర్గ ప్రజలు ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మత్స్య కారులు, బీసీల ఆర్థికాభివృద్ధిని ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే మత్స్యకారుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్య కారుల కుటుంబాలకు రూ.20 వేలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పోలాటితిప్పగ్రామ సర్పంచ్ మోకా రాజు టీడీపీ నేతలు నాగరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు. కోన గ్రామంలో తాగునీటి కొరత ఉందని గ్రామ ప్రజలు చెప్పడంతో కొల్లు రవీంద్ర, క్రికెట్ క్రీడాకారుడు అంబటి రాయడు తదితరులు ఖాళీ బిందెలు పట్టుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, పిప్పళ్ల కాంతారావు, మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్

» మొత్తం 21,532 మంది ఉద్యోగుల్లో బుధవారం నాటికి 17,420 మంది ఓటు హక్కు వినియోగం
» గురువారం రాత్రి వరకు కొనసాగిన పోస్టల్ బ్యాలెట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పోస్టల్ బ్యాలెట్ సమరం ముగిసింది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా గురువారం చివరి అవకాశాన్ని ఉద్యోగులు ఉపయోగించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 21,532 మంది ఉద్యోగులు ఉండగా బుధవారం నాటికి 17,420 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బుధవారం పోస్టల్ బ్యాలెట్ ముగిసే నాటికి ఇంకా 4,112 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఉద్యోగులు తాము ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నామని ఏపీజేఏసీ, ఏపీజేఏసీ అమరావతి జేఏసీ నాయకత్వాల దృష్టికి తీసుకు వచ్చాయి. ఏపీజేఏసీ నుంచి ఏ విద్యాసాగర్, ఏపీజేఏసీ అమరావతి నుంచి బొప్పరాజు వెంకటేశ్వర్లు రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకురావటం జరిగింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం మరోరోజు అవకాశం ఇవ్వాలని జిల్లా ఎన్నికల యంత్రాంగానికి సూచించింది. దీంతో గురువారం రాత్రి 9 గంటలకు కూడా పోస్టల్ బ్యాలెట్ కొనసాగుతోంది. దీంతో చివరి రోజు ఎంతమంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకున్నారన్నది శుక్రవారం తెలిసే అవకాశం ఉంది.

ముగిసిన హోమ్ ఓటింగ్

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 1052 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా పోలింగ్ ముగిసే నాటికి 1018 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎనభై ఐదు సంవత్సరాల పైబడిన వృద్ధులు 650 మంది దరఖాస్తు చేసుకోగా 628 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నలభై శాతం పైగా అంగవైకల్యం కలిగిన దివ్యాంగులు 402 మంది దరఖాస్తు చేసుకోగా 390 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరో 34 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఎనభై ఐదు సంవత్సరాల పైబడిన వయోవృద్ధులే హోమ్ ఓటింగ్‌లో పాల్గొనటంతో మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. సెంట్రల్ నియోజకవర్గంలోని సత్యనారాయణపురం నకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు అడుసుమిల్లి వేణుగోపాలరావు, 99ఏళ్ల వయస్సులోనూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయన సతీమణి అడుసుమిల్లి హనుమారత్నం(90) తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 90 ఏళ్ళు దాటిన వృద్ధులు కూడా ఓటు హక్కు వినియోగించుకుంటున్న నేపథ్యంలో, మే 13 వ తేదీన జరిగే ఎన్నికలలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాలు పంచుకుని పోలింగ్ శాతం పెరిగేందుకు కృషి చేయాలని కోరారు. అత్యవసర శాఖలకు సంబంధించిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ కూడా గురువారంతో ముగిసింది. బ్యాలెట్ ముగిసే నాటికి మొత్తం 1011 మంది ఉద్యోగులకు గాను, 822 మంది ఉద్యోగులు మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంకా 189 మంది వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఏ కారణంతో వీరు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదో తెలియాల్సి ఉంది.



ఓటు హక్కు వినియోగించుకున్న జేసీ గీతాంజలి శర్మ, పక్కన ఆర్డీవో వాణి

ఓటు ప్రతి ఒక్కరి హక్కు.. : జేసీ

మచిలీపట్నం టౌన్ : ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని, అది తమ హక్కుగా భావించాలని జేసీ గీతాంజలి శర్మ అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫెసిలిటేటర్ సెంటర్‌లో గీతాంజలి శర్మ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. గన్నవరం అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ ఆఫీసరుగా ఉంటూ పనిఒత్తిడిలో ఉండి కూడా జేసీ ఓటు వేసారు. ప్రతి ఒక్కరూ 13వ తేదీన ఓటు వేయాలని పిలుపునిచ్చారు.



తిప్పనగుంటలో భారీగా మద్యం డంప్

» వైసీపీ నేతకు చెందిన రైస్ మిల్లుపై అధికారుల ఆకస్మిక దాడి
» 125 కేసుల గోవా మద్యం స్వాధీనం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 9 : బాపులపాడు మండలం తిప్పనగుంట గ్రామం ఆరుగొలను రోడ్డులో రైస్ మిల్లులో మద్యం అక్రమంగా నిల్వచేశారన్న సమాచారంతో జిల్లా స్పెషల్ పోర్సు అధికారులు గురువారం రాత్రి ఆకస్మిక దాడి చేశారు. 125 కేసుల గోవా మద్యంను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. స్థానిక వైసీపీ నేత గారపాటి ప్రసాద్ పుల్లారావుకు చెందిన రైస్ మిల్లులో అక్రమంగా మద్యం నిల్వ చేశారన్న సమాచారం మేరకు ఎస్ఈబీ, జిల్లా స్పెషల్ పోర్సు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, వీరవల్లి పోలీస్ సిబ్బంది రాత్రి 7గంటల సమయంలో మిల్లును చుట్టిముట్టారు. రాత్రి 9గంటలు వరకు మిల్లు యజమాని తాళాలు తీయకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అధికారులు లోపలకి వెళ్లనీయకుండా స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు మోహరించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో తాళాలు పగలగొట్టి రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 125 కేసుల గోవాకు చెందిన సుమారు రూ.6 లక్షల విలువైన మద్యంను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	153, 162, 173
చికెన్ విత్ స్కిన్	294
చికెన్ స్కిన్‌లెస్	304
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25	

బుల్లా విజయకుమార్ బీజేపీలో చేరిక

విద్యాధరపురం, మే 9: ఎన్నికల వేళ వైసీపీకి విజయవాడ పశ్చిమలో భారీ వేటు పడింది. ఆ పార్టీ 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయకుమార్ గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరికి మద్దతుగా పెద్ద సంఖ్యలో అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. సుజనా చౌదరి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బుల్లా విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీలో సీనియర్లకు గుర్తింపు లేదని వ్యాఖ్యానించారు. ఎవరైన అవాకులు, చవాకులు పేలితే తాటతీస్తానని హెచ్చరించారు. ఎంఎస్ బేగ్, పైలా సోవినాయుడు, బొమ్మసాని సుబ్బారావు, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, మోబీన్ తదితరులు పాల్గొన్నారు.




పవన్ రోడ్ షోకు ఊర్మిళానగర్, మధురానగర్ నుంచి భారీగా తరలిన జనసేన, బీజేపీ, టీడీపీ నేతలు, కార్యకర్తలు

పవన్ రోడ్‌షోకు భారీగా తరలిన కూటమి శ్రేణులు

భవానీపురం, మే 9 : పశ్చిమ ఎమ్మెల్యేగా సుజనా చౌదరీ, ఎంపీగా కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ గురువారం పంజా సెంటర్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ రోడ్‌షో, సభకు 43వ డివిజన్‌లో సీనియర్ టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, మోరబోయిన రాంబాబుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కూటమి నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు.

100 మందికిపైగా యువత బైక్‌ల్లో వెళ్లగా, పదుల సంఖ్యలో ఆటోల్లో మహిళలు, కార్యకర్తలు తరలి వెళ్లారు. అచ్చిరెడ్డి, మెట్టెల నరసింహారావు, మోదీ వెంకట్రాజు, కాకర్ల కోటి, నారుబోయిన పెద్దిరాజు, రావులపల్లి ఏడుకొండలు, పొదిలి ప్రసాద్, రాయల శివ, బత్తుల వెంకట్రావులు పాల్గొన్నారు.

మధురానగర్ నుంచి..

మధురానగర్: జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం నగరంలో చేపట్టిన రోడ్ షోకు సెంట్రల్ నియోజకవర్గం 29వ డివిజన్ మధురానగర్ నుంచి జనసేన శ్రేణులు తరలి వెళ్లాయి. డివిజన్ అధ్యక్షుడు కెంబూరి కృష్ణ ఆధ్వర్యంలో కమిటీ నాయకులు మహిళలు, కార్యకర్తలు ర్యాలీగా తరలి వెళ్లారు.

అవినీతి సొమ్ముతో పారిపోవడానికి జగన్ ప్రయత్నం

తూర్పు టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, మే 9: ఎన్నికల ఫలితాల తరువాత అవినీతి సొమ్ముతో విదేశాలకు పారిపోవడానికి జగన్ సిద్ధం అవుతున్నాడని బీజేపీ, జనసేన బలపరచిన తూర్పు టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం ఆయన 8వ డివిజన్ పిటింగేల్ పేట, గాయత్రీనగర్, ఇశ్రాయేల్ పేట, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, ఆచార్య రంగా నగర్‌లో ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని శివనాథ్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు సైకిల్ గుర్తు మీద ఓటేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ స్వంత చెల్లి షర్మిల తన అన్న అవినీతి సొమ్ముతో పారిపోతున్నాడని స్వయంగా చెబుతోందన్నారు. ఎన్నికల తరువాత జగన్ ఎక్కడ దాక్కున్నా బయటకులాగి దోచుకున్నది కక్కిస్తామని చెప్పారు. దివ్యాంగులు, ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌లో సైకిల్‌కు 75 శాతం వచ్చాయని చెప్పారు. విజయవాడలో మోదీ రోడ్‌షోలో జనం నుంచి వచ్చిన స్పందన చూసి వైసీపీకి భయం



8వ డివిజన్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

పట్టుకుందని అన్నారు. బీజేపీ నాయకుడు పోతంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రావడం ఖాయమని చెప్పారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, జాస్తి లక్ష్మిపతి, మల్లెల రామకృష్ణ, తంగిరాల పౌలు, మెరకనపల్లి నాగేశ్వరరావు, దేవపొంగు కృపారావు, దూళిపాళ్ల రమేష్, మల్లవరపు జ్యోతి, పి. అమ్ములు, జంతిక నాగేంద్రమ్మ, వీరారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి చెబుదాం

జగన్ రాష్ట్రంలో విధ్వంసకర పరిపాలన చేసి అన్నివర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడని 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి వైసీపీ పాలనకు చరమగీతం పాడదాం అని గద్దె రాజేష్, గద్దె హిమాన్ష్ అన్నారు. బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం 7వ డివిజన్‌లో ఉన్న బొండా ఉమా వీధి, దాసరి లింగయ్య వీధిలో ప్రచారం నిర్వహించారు.

ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సంక్షేమ పథకాలు సూపర్ సిక్స్ గురించి వారికి వివరించారు. గుమ్మడి గురుప్రసాద్, పటమట సతీష్ చంద్ర, దోమకొండ అశోక్, దయాల శిరీషా గాంధీ, దోమకొండ జ్యోతి రత్నాకర్, నాగుమోతు రాజా, పెనుగొండ శ్రీనివాస్, మాదల మల్లికార్జునరావు, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

వైపీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పండి

టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు

సత్యనారాయణపురం, మే 9: గత టీడీపీ హయాంలో తాను అధికారంలో ఉండగా సెంట్రల్‌లో జరిగిన అభివృద్ధే తప్ప వైసీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 27వ డివిజన్ బావాజీ పేట శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నుంచి గులాబీ తోట చర్చి వరకూ గురువారం రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు ఓటు అనే ఆయుధంతో రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే



27వ డివిజన్‌లో బొండా ఉమామహేశ్వరరావు ప్రచారం

ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు సైకిల్ గుర్తుపైన ఓటు వేసి సెంట్రల్‌లో బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీగా కేశినేని శివనాథ్ (చిన్ని)ని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు, కె.రూప్‌కుమార్, డి. నాగరాజు, ఆర్ ముఖం, బి. వెంకట్రావ్, డి. జయరాజు. బి. హనుమంతరావు, ఎస్‌కే.మస్తాన్, ఎం. రుక్మిణి, బి. కొండా, ఎం. శివ, సురేష్, రవణమ్మ స్థానిక టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

డివిజన్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్ల సమావేశంలో సుజనా చౌదరి

విద్యాధరపురం, మే 9: పశ్చిమ ప్రజల కలలను సాకారం చేస్తానని పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి హామీ ఇచ్చారు. గురువారం సితార సెంటర్‌లోని ఎస్ కన్వెన్షన్ హాలులో జరిగిన డివిజన్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి డివిజన్‌లోను ఏరియా కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పోలింగ్ నాడు ఓటింగ్ శాతం పెంచే విధంగా చూడాలన్నారు. బీజేపీ, టీడీపీ, జన సేన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జగన్ ఐదేళ్ల అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. తాను గెలిస్తే అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో చూపించే బాధ్యత తనదన్నారు. కార్యకర్తల సంక్షేమం



ప్రసంగిస్తున్న సుజనా చౌదరి

లక్ష్యంగా ఆరోగ్య సురక్ష బీమా పథకాన్ని ప్రవేశ పెడతానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. నాయకులు షేక్ అబ్దుల్ సత్తార్, టీడీపీ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, ముదిరాజ్ శివాజీ, ప్రసన్నలక్ష్మీ, తిరుపతి అనూష, సురేష్ పాల్గొన్నారు.

కూటమికి మెజారిటీ అందించండి

ప్రచారంలో మహిళలకు పూల సలోమి పిలుపు

భవానీపురం, మే 9 : డ్వాక్రా మహిళలకు మేలు చేసిందే చంద్రబాబు నాయుడని, అలాంటి వ్యక్తి సీఎం అయితే మహిళా లోకాన్ని లక్షాధికారులను చేస్తారని, మహిళలంతా కూటమికి అఖండ మెజారిటీ అందించాలని భవానీపురంలోని సీనియర్ మహిళా నేత పూల సలోమి పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు పూల కాంతారావు ఆధ్వర్యంలో మహిళలతో కలిసి గురువారం ఊర్మిళానగర్, సీతారెడ్డి కాలనీ, ఐరన్‌యార్డు ప్రాంతాల్లో ఎంపీగా కేశినేని



శివనాథ్‌ను, ఎమ్మెల్యేగా యలమంచిలి సుజానా చౌదరిని గెలిపించాలని కోరుతూ ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సలోమి మాట్లాడుతూ మహిళంతా పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొని చిన్నికి సైకిల్ గుర్తుపైన, సుజనాకు కమలం గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. కాంతారావు ఆధ్వర్యంలో సితార కొండ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలపైన, టీడీపీతోనే భవిష్యత్‌కు గ్యారంటీలపై కరపత్రాలను పంచారు.

సుజనా చౌదరి గెలుపును కోరుతూ

దుర్గమ్మకు టెంకాయల సమర్పణ

వన్‌టౌన్, మే 9: పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి గెలుపు కోరుతూ దుర్గగుడి ఘాట్‌రోడ్డులో ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద గురువారం బీజేపీ నాయకులు



పోతిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయలను సమర్పించారు.

అమ్మవారికి పూజలు చేశారు. పోతిన బేసికంఠేశ్వరుడు, పోతిన అచ్యుతరావు, పోతిన అవినాష్, పి.రాము, పి.హరికృష, జనసేన నాయకులు అడపా ప్రతాప్, రేకపల్లి శ్రీను, పి.శ్రీకాంత్, వి.గిరీష్, ఆర్‌కే పాల్గొన్నారు.

చంద్రబాబుకే సంపద ఎలా సృష్టించాలో తెలుసు

కేశినేని జానకీ లక్ష్మి



28వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కేశినేని జానకీ లక్ష్మి బొండా సుజాత

సత్యనారాయణపురం, మే 9: జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకీ లక్ష్మి పిలుపునిచ్చారు. 28వ డివిజన్‌లో గురువారం బొండా ఉమా మహేశ్వరరావు సతీమణి బొండా సుజాతతో కలిసి ఆమె ఎన్నికల రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జానకీ లక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడికే సంపద ఎలా సృష్టించాలో తెలుసు అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలను వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన జగన్మోహనరెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు.సైకిల్ గుర్తుపైన ఓటు వేసి సెంట్రల్‌లో ఎమ్మెల్యేగా బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీగా కేశినేని శివనాథ్ (చిన్ని)ని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. 28వ డివిజన్ కార్పొరేటర్ వీరమాచినేని లలిత, డివిజన్ అధ్యక్షుడు శ్రీను, పవన్, జోగినాయుడు, ధనలక్ష్మి, భారతి, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేశినేని శివనాథ్‌కు నవతరం నేతల మద్దతు



కేశినేని శివనాథ్‌తో నవతరం పార్టీ నేతలు

వన్‌టౌన్, మే 9: విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) కు నవతరం పార్టీ నేతలు మద్దతు పలికారు. గురువారం ఆయనను గురునానక్ నగర్‌లోని ఎన్‌టీఆర్ భవన్‌లో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం, పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేస్తున్న యనమండ్ర కృష్ణ కిషోర్‌లు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదన్న ఉద్దేశ్యంతో కృష్ణకిషోర్‌ను పోటీ నుంచి విరమింప చేసినట్లు తెలిపారు.నవతరం తరఫున నాలుగు పార్లమెంట్ స్థానాలు, ఆరు అసెంబ్లీ స్థానాల నుంచి అభ్యర్థులను పోటీ నుంచి విరమింపచేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతం చేసేందుకు బేషరతుగా టీడీపీ అభ్యర్థికి మద్దతు చెబుతున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి చంద్రబాబునాయుడు, కేంద్ర సహకారం కావాలన్నారు. పవన్‌కల్యాణ్ వంటి ప్రజాసేవకుడు అవసరమని తెలిపారు. శివనాథ్ ఎన్‌డీఏకు మద్దతు పలికిన నవతరం పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నవతరం పార్టీ మద్దతును స్వాగతించారన్నారు.

ఇంటింటి ప్రచారం

విద్యాధరపురం, మే 9: భవానీపురం 40వ డివిజన్‌లో కూటమి అభ్యర్థులు సుజనా చౌదరి, కేశినేని శివనాథ్(చిన్ని) ల గెలుపును కాంక్షిస్తూ గురువారం ముమ్మర ప్రచారం చేశారు. 21, 22, 25, 26, 27, 19, 20, 28, 29, 31 బూత్‌లపరిధిలో ప్రచారం చేశారు. 40 వడివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి చిన వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలు, మేనిఫెస్టోలోని అంశాలతో ఉన్న కరపత్రాలను పంచారు.

సుజనా చౌదరి గెలుపునకు కట్టుబడి ఉన్నాం

టీడీపీ ఏపీ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా

విద్యాధరపురం, మే 9: పశ్చిమలో సుజనా చౌదరి గెలుపునకు ముస్లిం వర్గాలు కట్టుబడి ఉన్నాయని టీడీపీ ఏపీ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా అన్నారు. గురువారం భవానీపురంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముస్లిం, మైనార్టీ వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌పై తీవ్రంగా ధ్వజమెత్తారు. కొందరు ముస్లింలు ప్రలోభాలకు ఆశపడి ఆసిఫ్‌ను భుజాన వేసుకుని తిరుగుతున్నారన్నారు. కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు కానీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు కానీ ముస్లిం సామాజిక వర్గానికి ఆసిఫ్ ఏనాడైనా సహాయపడ్డారా అని ప్రశ్నించారు. సుజనా చౌదరి గురించి కానీ కేశినేని చిన్ని గురించి కానీ నోరు జారి మాట్లాడితే ఆసిఫ్ నాలుక కోస్తామంటూ హెచ్చరించారు. ఎన్నికల్లో సుజనా చౌదరిని 50వేల మెజారిటీతో, కేశినేని శివనాథ్‌ను మూడు లక్షల మెజారిటీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. షేక్ బడేసాయిబ్, ఎండీ మోదీన్, ఎండీ నజీద్, షేక్ ఇస్మాయేల్, షేక్ ఫక్రుద్దీన్, షేక్ జాన్‌బాషా, సయ్యద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

8 మంది విద్యార్థులకు స్మార్త కోర్సు పూర్తి

వన్‌టౌన్, మే 9: దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో పోరంకిలో నడుస్తున్న వేదపాఠశాలలో 8మంది విద్యార్థులు స్మార్త కోర్సును పూర్తి చేసుకున్నారు. తాజాగా జరిగిన పరీక్షల్లో వీరంతా ఉత్తీర్ణులయ్యారు. గురువారం వేద పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఈవో రామారావు వారందరికీ పట్టాలు అందజేశారు మరోవైపు విద్యార్థుల భవిష్యత్ అవసరాల నిమిత్తం ఒక్కో విద్యార్థికి మూడు లక్షల రూపాయల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ ఓచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎంతో ఉన్నతికి ఎదగాలని కాంక్షించారు. స్థానాచార్యుడు విష్ణుభట్ల శివప్రసాదశర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షణ్ముఖ శాస్త్రి, పరీక్షల అధికారులు టీటీడీకి చెందిన రెంటచింతల సోమయాజులు, ఆగిరిపల్లి వేదపాఠశాలకు చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు లక్ష్మీనరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఈవో రామారావు

ధర్మపథం వేదికపై హరికథ

ధర్మపథం వేదికపై గురువారం తాడేపల్లిగూడెంకు చెందిన భాగవతారిణి శారద హరికథాగానం చేసి ఆహూతులను అలరించారు. పార్వతీ కల్యాణం హరికథను ఆమె హృద్యంగా సాగించారు. వయొలిన్‌పై దక్షిణామూర్తి, మృదంగంపై కాపవరపు సుబ్బారావులు సహకరించారు.

మూకల అప్పారావు మృతి ఉపాధ్యాయులకు తీరని లోటు

● సంస్మరణ సభలో పలువురు వక్తలు

ధర్నాచౌక్, మే 9: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మూకల అప్పారావు మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని పలువురు వక్తలు తెలిపారు. అప్పారావు సంస్మరణ సభ గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో గురువారం జరిగింది.

ఎమ్మెల్సీలు పి.అశోక్‌బాబు, చిరంజీవిరావు, పి.రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్.రామకృష్ణ, సుభాష్‌చంద్రబోస్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. 30 ఏళ్లగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఆయన మృతి సంఘానికి తీరని లోటని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

సంఘం ప్రధానకార్యదర్శి వెంకట్రావ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు బి.హైమారావు, సీహెచ్ పద్మావతి, పీఆర్టీయూ నాయకులు డి.శ్రీను, ఎస్టీయూ నాయకులు చంద్రశేఖర్, నీలకంఠయ్య, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధితోనే సంక్షేమం!

- సంక్షేమం అంటే డబ్బులు పంచడం కాదు
- ప్రతి కుటుంబానికి ఆర్థిక వికాసం కల్పించాలి

ఆంధ్రజ్యోతి-విజయవాడ : సంక్షేమం అంటే డబ్బులు పంచడం కాదు. ప్రతి కుటుంబానికి ఆర్థిక వికాసం కల్పించడం. చంద్రబాబు ఎప్పుడూ ఈ విధానాన్నే నమ్ముకున్నారు. సంక్షేమం, అభివృద్ధి అనేవి వేరు కాదని, అభివృద్ధి ద్వారానే సంక్షేమం చేయగలమని నమ్మిన దార్శనికుడు ఆయన. చంద్రబాబు దుబాయ్ వచ్చినప్పుడు కూడా ఆయన దృష్టి అంతా ఇక్కడ పాలనా వ్యవస్థలు, ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి మీదే ఉండేది. ఇక్కడి ప్రజలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సేవలు అందుతున్నాయి? అవి ఎంత త్వరగా వారికి చేరుతున్నాయి? అనే అంశాలను తెలుసుకోవటానికి ఆయన ఆసక్తి చూపేవారు. తదనంతరం ఆయన తెలుసుకున్న విధానాలను మన రాష్ట్రంలో అమలు పరిచిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. అభివృద్ధి అనేది గమ్యం కాదు కేవలం ప్రయాణం మాత్రమే. ఈ ప్రయాణాన్ని ఒక్క చాన్స్ అంటూ అడిగిన ఆనాటి ప్రతిపక్షనేత జగన్, చంద్రబాబు కంటే మరింత వేగంగా ముందుకు తీసుకుని వెళ్తారని ఆంధ్ర ప్రజలు నమ్మారు. కానీ గడిచిన ఐదేళ్లలో జరిగింది వేరు. ప్రజావేదిక కూల్చివేత, అమరావతి విధ్వంసంతోపాటు ఉద్యోగాలు, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి లేక ఒక తరం నిర్వీర్యమైపోయింది. ఉద్యోగం కోసం ఇతర రాష్ట్రాల బాట పట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఇసుక విధానం బడుగుల ఉపాధిపై మరింత దెబ్బ వేసింది. దీనిని అధిగమించి మళ్లీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టి నడిపించాలంటే చంద్రబాబు కావాలి.

• ఎన్నారై మాట



వేమూరి రాజేశ్

ప్రతి అడుగులో చంద్రుని జాడలు

1995 నుంచి 2004 వరకు చంద్రబాబు తీసుకొచ్చిన విద్య ఉపాధి సంస్కరణలతో అప్పటికి తరతరాలుగా అభివృద్ధినెరగని బడుగు, మధ్యతరగతి కుటుంబాలు 20 ఏళ్లలో వొళ్లు విరుచుకున్నాయి. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న యువత బయటకి వచ్చే లోపే వారికి ఉద్యోగాలు కల్పించే దిశగా ఐటీ కంపెనీలు, పరిశ్రమల స్థాపనకు మన రాజధాని అనుకున్న హైదరాబాద్‌లో కృషి చేసి వారి ఆర్థిక వికాసానికి బాటలు వేసింది చంద్రబాబే. ఆ ఫలితాలు ఇరవై ఏళ్ల తర్వాత ప్రజలకి అందాయి. ఈ ఆర్థిక ప్రయోజనాల్ని మన రాష్ట్రం అందిపుచ్చుకునే సమయంలో జరిగిన రాష్ట్ర విభజన మనకి పెద్ద ఆశనిపాతమైంది. చంద్రబాబు పరిస్థితు లను నిందిస్తూ కూర్చోలేదు. అమరావతి కోసం నడుం కట్టారు. ముఖ్యంగా పల్లెల్లో వేసిన 25 వేల కిలోమీటర్ల పైచిలుకు సిమెంటు రోడ్లు దేశంలో మరే రాష్ట్రమూ వేయలేదు. మండల కేంద్రాలకు దూరంగా విసిరేసిన ట్టుండే చిన్న పల్లెటూళ్లకు సైతం రోడ్డు కనెక్టివిటీ ఏర్పడింది. కేవలం హైదరాబాద్‌లోనే పెట్టుబడులు పెట్టే ఎన్‌ఆర్‌ఐలు అంతా తమ పెట్టుబడుల్ని అమరావతికి, తాము జన్మించిన గ్రామాలకు, టూటైర్ పట్టణాలకు మార్చారు. కానీ గడిచిన ఐదేళ్లలో పరిస్థితులు పూర్తిగా తారుమారు అయ్యాయి. చంద్రుడి జాడలు చెరిపివేసే పనిలో నిమగ్నమైన పాలకులు రాష్ట్రాన్ని తిరోగమన మార్గంలో పయనింపజేశారు.

ఆరోపణలు.. వాస్తవాలు

వ్యవసాయం దండగ అన్నారని చంద్రబాబుపై ఒకప్పుడు లేనిపోని ఆరోపణలు చేసిన ప్రతిపక్షాలు ఇప్పుడు ఆయన దూరదృష్టితో నిర్మించిన పట్టిసీమ ప్రాజెక్టునే వినియోగించడం గమనార్హం. టీడీపీ ప్రభుత్వం చేపట్టడం వల్లే పోలవరం కనీసం ఈ స్థాయికి వచ్చింది. వైసీపీ పాలనలో ఏ మేరకు పనులు జరిగాయే కళ్ల ముందే కనిపిస్తోంది. చంద్రబాబు సంక్షేమ పథకాలకు వ్యతిరేకి అని ప్రచారం చేశారు. కాని అందులో ఏమాత్రం నిజం లేదనటానికి ఆయన అమలు పరిచిన సంక్షేమ పథకాలు. మనకీ జీతాలు, ఆదాయంలో పెరుగుదల ఉన్నట్లే ప్రభుత్వం అందించే పథకాల విలువలో కూడా పెరుగుదల ఉంటుంది. అది ఏ ప్రభుత్వం అయినా పెంచాల్సిందే కానీ ఒక్కసారిగా పదింతలు పెంచిన వారిని విమర్శించి పది శాతం పెంచిన వారిదే సంక్షేమం అంటే ఆశ్చర్యంగా ఉంది. ఆంధ్రులు విజ్ఞతతో ఆలోచించాలి. విధ్వంస పాలకుడా? ప్రగతి వైపు నడిపించే నాయకుడా? అనేదానిపై ఆంధ్రప్రజల భవిష్యత్తు ఆధారపడి ఉంది.



ప్రచారం ముగింపు దశకొచ్చింది. పంపకాల దశకు రంగం సిద్ధమైంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రధాన పార్టీలు ఏర్పాట్లు చేశాయి. ఎన్నికలకు ఇంకా మూడు రోజుల సమయమే ఉండటంతో నగదు పంపిణీకి ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు సంసిద్ధులవుతున్నారు. రెండు, మూడు రోజులుగా అన్ని నియోజకవర్గాల్లో మద్యం పంపిణీ వేగవంతం చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో నగదు పంపిణీని ఇప్పటికే ప్రారంభించారు. అభ్యర్థిని బట్టి, డిమాండ్‌ను బట్టి ఓటుకు రూ.1500 నుంచి రూ.3000 పంపిణీకి సిద్ధమవుతున్నారు.

- ఓటర్లకు నగదు పంపిణీకి అంతా సిద్ధం చేసిన ప్రధాన పార్టీలు
- నియోజకవర్గానికి రూ.30 కోట్లు పంపిణీకి వైసీపీ ఏర్పాట్లు
- ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.3వేలు ఇచ్చేందుకు సన్నద్ధత
- హవాలా రూపంలోనూ నియోజకవర్గాలకు నగదు చేరవేత
- ఈపాటికే పోస్టల్ బ్యాలెట్ ఓటుకు రూ.3వేలు పంపిణీ
- కొన్నిచోట్ల తిరస్కరించిన ఉద్యోగులు

నోట్ల పందేరం!

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : అధికారపార్టీ ముందంజ అధికార పార్టీ నుంచి వైసీపీ అభ్యర్థులకు నియోజకవర్గానికి రూ.30 కోట్ల వరకు ఈనెల ఒకటీ, రెండు తేదీల్లోనే నగదును చేరవేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఓటర్లు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో, ఇతరత్రా ఎన్నికల ఖర్చు నిమిత్తం మరికొంత నగదు కావాల్సి రావడంతో హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి హవాలా రూపంలో అభ్యర్థులు నగదును కూడబెడుతున్నారు. హవాలా రూపంలో కోటి రూపాయలకు తగ్గకుండా నగదు మార్పిడి జరుగుతుండటం గమనార్హం. రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు స్థానిక నాయకత్వంతో పాటు విదేశాల నుంచి, ఇతర జిల్లాలు, ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థుల అనునయుల పర్యవేక్షణలో నగదు జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈసారి ఒక్కో ఓటరుకు రూ.2వేల చొప్పున నగదు పంపిణీ చేస్తారనే ప్రచారం జరుగుతున్నా, రూ.వెయ్యికి తగ్గకుండా రెండు పార్టీల అభ్యర్థులు నగదు పంపిణీకి సిద్ధపడ్డారు. ఈ నాలుగు రోజులు వ్యవధిలో నియోజకవర్గాల్లో నెలకొన్న పరిస్థితులు, రాజకీయ పరిణామాలు, ఓట్లు రాబట్టుకునేందుకు చేసే యత్నాల్లో భాగంగా ఈ నగదుమొత్తాన్ని మరింతగా పెంచాలనే ఆలోచన చేస్తున్నారు. నలుగురు కూడి మాట్లాడుకుంటున్నా వైసీపీ, టీడీపీల తరుపున ఈసారి జరిగే ఎన్నికల్లో ఎంతనగదు ఇస్తారనే అంశంపైనే చర్చ జరుగుతోంది. అధికారపార్టీకి కొంతమంది అధికారులు అనుకూలంగా ఉండి చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తామనే భరోసా ఇవ్వడంతో ఇప్పటికే నగదును ఆయా ప్రాంతాలకు చేరవేసి పంపిణీకి సిద్ధంగా ఉంచారు.

● అవనిగడ్డ నియోజకవర్గంలో అధికారపార్టీ తరఫున రూ.2వేల నుంచి రూ.3వేలు పంపిణీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నియోజకవర్గంలో మద్యం బాటిళ్లను రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనాల్లో గ్రామాలకు తరలించడం, ఈ అంశం వెలుగులోకి రావడంతో వివాదాస్పదమైంది. ఘంటసాల మండలం పూషడంలో ఎక్సైజ్ అధికారులు బుధవారం 288 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ నగదు పంపిణీ

ఓటర్లకు నగదు పంపిణీ అంశంలో రెండుపార్టీల కార్యకర్తలు గోప్యంగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 4వ తేదీ నుంచి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభం కాగా, ఉద్యోగ సంఘాల యూనియన్ నాయకుల ద్వారా నగదు పంపిణీ చేశారు. రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేల వరకు ఒక్కో పోస్టల్ బ్యాలెట్‌కు నగదును ఇచ్చారు. కొంతమంది ఉద్యోగులు ఈ నగదును తీసుకుంటే వచ్చేరోజుల్లో ఏ ప్రభుత్వం వచ్చినా తమకు విలువ ఉండదనే కారణంతో నగదును తీసుకోవడానికి నిరాకరించారు. పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు ఉంటే రెండు పార్టీల నాయకులు ఉద్యోగుల గృహాలకు వెళ్లి మరీ రాయబేరాలు నడిపారు. కొంతమంది ఉద్యోగులు సున్నితంగానే తమకు నగదు వద్దని చెప్పి పంపేశారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లోని సచివాలయాల్లో పనిచేస్తున్న శానిటరీ, ఇతర విభాగాల్లో పనిచేసే కొందరు ఉద్యోగులు ఓటుకోసం నగదు తీసుకునేందుకు సుముఖత చూపలేదు. గుడివాడ నియోజకవర్గంలో ఒక్కో పోస్టల్ బ్యాలెట్‌కు మూడువేల చొప్పున నగదు పంపిణీచేశారు. సాధారణ ఓటర్లకు ఇదే పద్ధతిలో నగదు ఇస్తారా, ఇవ్వరా అనే అంశంపై చర్చ జరుగుతోంది. పామర్రులో పోస్టల్‌బ్యాలెట్‌కు రూ.1500 చొప్పున పంపిణీ చేశారు. గన్నవరం నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌కు రూ.2500 నుంచి రూ.3వేలు వరకు ఇచ్చారు. సాధారణ ఓటర్లకు ఒక్కో ఓటరుకు రూ.3వేలు చొప్పున నగదు పంపిణీ చేస్తారనే ప్రచారం గత రెండు రోజులుగా జరుగుతోంది.

ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరణ

ప్రభుత్వపరంగా సచివాలయ సిబ్బంది ద్వారా ఇప్పటికే ఓటర్లకు ఏ పోలింగ్‌బూత్‌లో వారి ఓటు ఉందో తెలియజేసేందుకు ఓటరు స్లిప్పులను ఇప్పటికే పంపిణీ చేశారు. రెండు ప్రధాన పార్టీలకు చెందిన స్థానిక కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆ గృహంలో ఎంతమంది ఓటర్లున్నారు? ఎంతమేర నగదు పంపిణీ చేయాలి?అనే అంశంపై లెక్కలు వేస్తున్నారు. దీంతోపాటు సంబంధిత కుటుంబసభ్యులు గతంలో ఏ పార్టీకి అనుకూలంగా ఉన్నారు? ప్రస్తుతం ఏ పార్టీ వైపునకు మొగ్గుచూపుతున్నారు? అనే అంశంపైనా ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉద్యోగం, ఇతర పనులు చేస్తూ అక్కడ నివాసం ఉంటున్నవారిని రప్పించేందుకు ప్రయాణ ఖర్చులు ఇస్తామని వారిని రప్పించాలని చెబుతున్నారు. ఈ అంశంలో రెండు ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో పెద్దఎత్తున కసరత్తు చేస్తున్నాయి.



ఓటు కనపడటం లేదు

గుడివాడలోని పెద ఎరుకపాడుకు చెందిన వాసుపల్లి విజయకుమార్ కొన్ని రోజులుగా ఓటర్ లిస్ట్, ఇంటర్నెట్‌లో వెతికినా వెతికినా కనిపించడం లేదని గురువారం గ్రామంలో ఫెక్సీ కట్టి వినూత్న నిరసన తెలిపాడు. తన ఓటు కనపడకుండా పోవడానికి కారణాలను అడిగితే సచివాలయ సిబ్బంది చెప్పడం లేదు. ఇప్పటికీ మూడుసార్లు ఓటు హక్కును వినియోగించుకున్నానని, ఏ కారణంలో ఓటు హక్కును తొలగించారో చెప్పాలని అధికారులను కోరుతున్నాడు.

– గుడివాడ

సగం పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకం

- జగ్గయ్యపేటలో అధికారులకు సవాల్‌గా ఎన్నికల నిర్వహణ

జగ్గయ్యపేట రూరల్, మే 9 : జగ్గయ్యపేటలో జరగనున్న ఎన్నికలు పోలీస్ యంత్రాంగానికి కత్తిమీద సాములా కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో 52 శాతం సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. తొమ్మిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్యే గట్టి పోటీ ఉంటుంది. గతంలో జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలో అరాచకపాలన, అధికార పార్టీతో అంటకాగుతున్న నేపథ్యంలో ఎన్నికలు ఏ మేరకు సాఫీగా సాగుతాయనే అనుమానం వ్యక్తమవుతోంది. నియోజకవర్గంలోని 76 గ్రామాల్లో 2,05,364 మంది ఓటర్లుండగా 222 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సమస్యాత్మకంగా 116 కేంద్రాలను గుర్తించగా 27 గ్రామాల్లో అత్యంత సమస్యాత్మకంగా గుర్తించారు. సజావుగా సాగాలంటే ముందస్తు నిఘా, సమస్యలు సృష్టించే వారి కదలికలపై దృష్టి పెట్టటం, పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత కల్పించాల్సి ఉంది. అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా తక్కెళ్లపాడు, మల్కాపురం, తిరుమలగిరి, జయంతిపురం, వేదాద్రి, బండిపాలెం, గౌరవరం, చిన్నమోదుగపల్లి, ఇందుగపల్లి, చిట్యాల, ఆళ్లూరుపాడు, పోలంపల్లి, దబ్బాకుపల్లి, కంభంపాడు, కాకరవాయి, మాచినేనిపాలెం, తాళ్లూరు, శివాపురం, అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు, నవాబుపేట, తోటచర్ల, వెంగనాయకునిపాలెం, సుబ్బాయిగూడెం, కొండూరు, జొన్నలగడ్డ, సోమవరం ఉండగా జగ్గయ్యపేటలో నాలుగు, గండ్రాయిలో ఐదుకు నాలుగు, షేర్‌మహ్మద్‌పేటలో ఆరుకు మూడు, అనుమంచిపల్లిలో మూడుకు రెండు, బూదవాడలో నాలుగుకు మూడు, త్రొరకుంట పాలెంలో రెండుకు ఒకటి, చిల్లకల్లులో ఏడుకు మూడు, కె.అగ్రహారంలో రెండుకు ఒకటి, ముక్త్యాల మూడుకు ఒకటి, భీమవరంలో ఐదుకు రెండు, మంగొల్లులో నాలుగుకు ఒకటి, వత్సవాయిలో ఎనిమిదికి ఐదు, ముండ్లపాడులో మూడుకు రెండు కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. పటిష్ట భద్రతతో పాటు స్థానిక పోలీసులు కేంద్ర బలగాలను కూడా పెద్దస్థాయిలో మోహరించాలని ఓటర్లు అభిప్రాయపడుతున్నారు.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వేదాద్రి ఎత్తిపోతల నిర్మాణానికే ప్రాధాన్యత

- 38,627 ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తాం
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యను నివారిస్తాం
- కొత్త పరిశ్రమలు తీసుకొస్తాం
- యువతకు ఉపాధి కల్పిస్తాం
- వైసీపీ పాలనను ఛీకొడుతున్న జనం
- బీజేపీ, జనసేన బలపరిచిన జగ్గయ్యపేట టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

'వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వేదాద్రి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడమే నా తొలి ప్రాధాన్యం. నియోజకవర్గంలోని 38,627 ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తాం' అని బీజేపీ, జనసేన బలపరిచిన జగ్గయ్యపేట టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్పష్టం చేశారు. జగ్గయ్యపేటకు కృష్ణా జలాలను తెచ్చిన తానే పట్టణంలో పురాతన పైపులైన్‌లను సమూలంగా ప్రక్షాళన చేయిస్తానన్నారు. వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. ఆ పార్టీ పాలనపై జనం దుమ్మెత్తిపోస్తున్నారని చెబుతున్న శ్రీరాం మాల్యాద్రితో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ విశేషాలు..

–జగ్గయ్యపేట,ఆంధ్రజ్యోతి

ప్రచారం ఎలా సాగుతుంది?

ప్రచారంలో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. రాష్ట్రంలో చంద్రబాబును మళ్లీ సీఎంగా చూడాలనే ఆకాంక్ష బలంగా కనిపిస్తోంది. సూపర్ సిక్స్ పథకాలతోపాటు నియోజకవర్గంలో ఐదేళ్లగా ఆగిపోయిన అభివృద్ధిని ఉరుకులు పెట్టించాలన్న కోరిక ప్రజల్లో ఉంది.

ప్రజలకు మీరిచ్చే హామీలేంటి?

నియోజకవర్గంలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. 38,627 ఎకరాల ఆయకట్టు కోసం టీడీపీ ప్రభుత్వం మొదలుపెట్టిన ముక్త్యాల ఎత్తిపోతలను వైసీపీ ప్రభుత్వం వేదాద్రి ఎత్తిపోతలగా పేరు మార్చి శంకుస్థాపన చేసి వదిలేసింది. తిరిగి ముక్త్యాల వద్ద ఎత్తిపోతలను నిర్మించి సాగునీరు అందించడమే తొలి లక్ష్యం. టీడీపీ హయాంలో 80 శాతం పూర్తి చేసిన 3424 టిడ్కో ఇళ్లను సకల సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు అందిస్తాం. పట్టణంలో 40-50 ఏళ్ల నాటి పైపులైన్ వ్యవస్థను ప్రక్షాళన చేసి పూర్తిస్థాయిలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం. తక్కెళ్లపాడు లిఫ్ట్ పూర్తిచేసి 4118 ఎకరాలకు సాగునీరు అందిస్తాం. నియోజకవర్గంలో కొత్త పరిశ్రమలు, ఉపాధి కల్పనకు కృషి చేస్తాం.

వైసీపీ పాలనలో అభివృద్ధి చేశామని మీ ప్రత్యర్థి చెబుతున్నారు కదా! మీరేమంటారు?

80 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను ఐదేళ్లలో విఎగిలిన పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వలేకపోవటం అభివృద్ధా? ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని పేరుమార్చి నిర్వీర్యం చేయటం అభివృద్ధా? వైసీపీ ప్రభుత్వం కొత్తగా ఒక్క అభివృద్ధి పనీ చేపట్టలేదు. అంతా అవినీతే. ఊరచెరువు సుందరీకరణ పేరుతో చెరువును విధ్వంసం చేశారు. రోడ్లకు మరమ్మతులు లేవు. రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ప్రాంతం కావటంతో అక్కడ రోడ్లు, ఇక్కడ రోడ్లు చూసి ప్రజలు విస్తుపోతున్నారు. గతంలో తాము పేదలకు వైద్య సహాయం కావాలంటే రూ.20 లక్షల వరకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఇప్పించాం. ఇప్పుడు అసలు ఆ ఊసే లేదు. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో వైఫల్యాలు ఉన్నాయి. ప్రజలు నాటి పాలనకు, నేటి పాలనకు బేరీజు వేసుకుంటున్నారు.

కూటమి పక్షాలతో సమన్వయం ఎలా ఉంది?

జనసేన, బీజేపీ, టీడీపీ సమన్వయంతో ప్రచారం నిర్వహిస్తున్నాం. పార్టీ నేతలు అంతా కలిసిపోయి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. ఓట్ల బదలాయింపు జరగకుండా ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు చేసినా ఫలితం లేదు. నాకు భారీ విజయం దక్కటం ఖాయం.

- 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దారిమళ్లింపు
- నిధులకోసం హస్తినలో ఉద్యమించిన గ్రామ సర్పంచ్‌లు
- అధికారుల విచారణలో నిధులు దారి మళ్లించినట్టు నిర్ధారణ



వైసీపీ పాలనలో పడకేసిన పంచాయతీలు

మచిలీపట్నం టౌన్ : గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు. గ్రామ స్వరాజ్యంతోనే దేశాభివృద్ధి. వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమయింది. నిధులు, విధులు లేకుండా పోయాయి. సర్పంచుల పరిస్థితి అగమ్యగోచరమే. ఒక్క అభివృద్ధి పనీ చేయడానికి వీల్లేకుండా పోయింది. పంచాయతీలకు సమాంతరంగా సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను తీసుకుని రావడంతో గ్రామాల్లో సర్పంచ్‌ల అధికారాలకు మంగళం పాడినట్టయింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో సర్పంచ్‌లు గ్రామాల్లో అత్యవసర అభివృద్ధి పనులు నిర్వహించలేక పోయారు. గ్రామాల్లో సర్పంచ్‌లను ఎన్నుకొన్న ప్రజలు ఆశించిన విధంగా అభివృద్ధి పనులు చేయలేకపోవడంతో సర్పంచ్‌లు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14, 15 ఆర్థిక సంఘ నిధులను వైసీపీ ప్రభుత్వం తన ఖాతాకు మళ్లించడంతో సర్పంచ్‌లు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. నిధులు విడుదల కాక పంచాయతీ వ్యవస్థలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాల్లా తయారయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలో పెద్దఎత్తున ఉద్యమించారు. ఉద్యమాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వ అధికారులు బందరు మండలం పెదయాదరకు విచారణకు వచ్చారు. విచారణలో 14, 15 ఆర్థిక సంఘాల నిధులు రాష్ట్ర ప్రభుత్వ అకౌంట్‌కు డైవర్ట్ అయినట్టు తేలింది.

వైసీపీ పాలకుల కక్ష సాధింపు చర్యలు



వైసీపీ పాలకులు ప్రతిపక్ష సర్పంచ్‌లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఎస్సీ కాలనీల్లో రోడ్లు, తాగునీరు అందించడం వంటి తక్షణ అవసరాలకు కావలసిన నిధులు విడుదల చేయడంలో పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారు. వ్యయం చేసిన నిధుల బిల్లులు విడుదల కావడం లేదు. కేంద్రం పంచాయతీలకు నేరుగా విడుదల చేసే నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పెత్తనం ఏమిటో అర్థం కావడం లేదు. పంచాయతీల నిధులను వైసీపీ ప్రభుత్వం తమ సొంత పథకాలను వినియోగించుకుంటోంది. దీనివల్ల పంచాయతీల అభివృద్ధి కుంటుబడుతోంది.

– గల్లా తిమోతి, సర్పంచ్ పెదయాదర, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు

బకాయిలు పేరుకుపోతున్నాయి



జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పంచాయతీలకు రావలసిఉన్న బకాయిలను ప్రభుత్వం చెల్లించడం లేదు. దీంతో సర్పంచ్‌లు అప్పులు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తూనే ఉన్నాం. ఉద్యమాల ఫలితంగా కొంతమేర నిధులను విడుదల చేశారు. అయితే ప్రభుత్వం ఇంకా నిధులు విడుదలలో తాత్సారం చేస్తూనే ఉంది.

– కాగిత గోపాలరావు, సర్పంచ్, చిన్నాపురం

నవ్య నివేదన

శుక్రవారం • 10 మే 2024



నేడు అక్షయ తృతీయ

అక్షయ ఫలదాయకం

జ్యోతిష శాస్త్రాన్ని అనుసరించి ఒక్కొక్క గ్రహానికి ఒక్కొక్క కాలంలో ఉచ్ఛ స్థితి, నీచ స్థితి ఉంటాయి. గ్రహాలు ఉచ్ఛ స్థానాల్లో ఉన్నప్పుడు శుభకార్యాలు చేయడం ఉత్తమం. దానివల్ల ఆ గ్రహం తాలూకు అనుగ్రహం లభిస్తుంది. ఏటా ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకూ... సౌర మానం ప్రకారం మేష మాసంలో... సూర్యుడు ఉచ్ఛ స్థితిలో ఉంటాడు. ఆ సమయంలో రవి అనుగ్రహాన్ని పొందితే ఆరోగ్యం, అభివృద్ధి, ఉత్సాహం లభిస్తాయి. రోహిణి నక్షత్రం రోజున చంద్రుడు ఉచ్ఛ స్థితిలో ఉంటాడు. చంద్రుడి అనుగ్రహం లభిస్తే సర్వకార్యానుకూలత, సంతోషం, మనోల్లాసం కలుగుతాయి. సూర్యుడు, చంద్రుడు ఉచ్ఛ స్థితిలో ఉన్న రోజైన రోహిణీ నక్షత్రయుతమైన వైశాఖ శుక్ల పక్ష తృతీయ (అక్షయ తృతీయ) విశేషమైనది. సూర్య చంద్రులిద్దరూ ఉచ్ఛ స్థితిలో ఉండడం వల్ల... ఈ రోజున చేసే ప్రతి పనీ అక్షయం అవుతుందనేది భారతీయుల విశ్వాసం. ఈ విషయాన్ని 'నిర్ణయ సింధు', 'మత్స్యపురాణం', 'మరీచి సంహిత' తదితర గ్రంథాలు ధ్రువపరుస్తున్నాయి. ఇది సర్వశుభాలనూ కలిగించే పర్వదినమనీ పేర్కొంటున్నాయి. అలాగే ఇది లక్ష్మీ దేవికీ, గౌరీ దేవికీ ప్రీతిపాత్రమైన రోజు.


ఉదకుంభ ప్రదానేన శివలోకే మహీయతే
ఏష ధర్మ మతోదత్తో బ్రహ్మా విష్ణు శివాత్మికః
అన్య ప్రదానాత్ తృష్యంతు పితరోపి పితామహాః



. ఈ రోజున అక్షయ స్వరూపుడైన విష్ణువును అర్చించాలనీ, ఉద కుంభదానం విశేష ఫలప్రదమనీ, రాగి లేదా వెండి చెంబులో శుద్ధ జలాన్ని ఉంచి, అర్చించి దానం ఇస్తే... పితృదేవతలు దాన్ని గ్రహించి, తృప్తి చెంది అనుగ్రహిస్తారనీ పూర్వులు చెప్పారు.

ఈ రోజు ఏ కార్యం చేసినా అది అక్షయం అవుతుందనీ, విష్ణువును అక్షతలతో అర్చించి, వాటిని శిరస్సున ధరిస్తే అక్షయఫలం చేకూరుతుందనీ శాస్త్రవచనం. సూర్యుడు పాండవులకు అక్షయ పాత్రను ప్రసాదించినదీ, భగీరథుని తపస్సుకు మెచ్చి దివి నుంచి భువికి గంగ వచ్చినదీ, శ్రీకృష్ణుణ్ణి కుచేలుడు దర్శించి, ఆయన కృపను పొందినదీ, ఆది శంకరులు కనకధారా స్తోత్రాన్ని ఉపదేశించినదీ ఈ రోజునేనని పురాణాలు చెబుతున్నాయి. పరశురామ జయంతి కూడా ఈనాడే కావడం విశేషం. ఈ రోజు బంగారాన్ని కొనుగోలు చేస్తే... ఆ ఇల్లు బంగారంతో తులతూగుతుందనే విశ్వాసం కొన్ని ప్రాంతాల్లో ఉంది.

• ప్రొఫెసర్ వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు, తిరుపతి



నృసింహ సంకీర్తనాచార్య కృష్ణమయ్య

భగవంతుడి గుణాలను ప్రస్తుతించడానికీ, దైవ లీలలను సామాన్యులకు తెలియజేసి... వారిలో భక్తి కలిగించి, తద్వారా ముక్తి మార్గాన్ని చూపడానికి... ఒక్కొక్క కాలంలో ఒక్కొక్కరు జన్మిస్తారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని కీర్తించడానికి తాళ్ళపాక అన్నమయ్య జన్మిస్తే... అంతకుముందు కాలంలో... సింహాచల శ్రీవరాహ లక్ష్మీ నరసింహుణ్ణి కీర్తించడానికి పుట్టినవాడు... సింహాచలం కృష్ణమయ్యగా ప్రసిద్ధి చెందిన శ్రీకాంత కృష్ణమాచార్యులు. నేడు సింహాచలంలో చందనోత్సవం జరుగుతున్నవేళ... సింహాద్రి అప్పన్నను తన రచనలతో అర్చించిన కృష్ణమయ్యను స్మరించుకోవడం సముచితం.

కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడి కాలానికి చెందిన కృష్ణమయ్య గురించిన ప్రస్తావన 'ప్రతాపరుద్ర చరిత్ర', 'సిద్దేశ్వర చరిత్ర' గ్రంథాల్లో కనిపిస్తుంది. కృష్ణమయ్య సుమారు ఏడువందల ఏళ్ళ క్రితం... ఆరు భాద్రపద బహుళ చతుర్దశి రోజున గోవిందాచార్యులు, లక్ష్మీదేవి దంపతులకు జన్మించాడు. తను పుట్టుకతోనే అంధుడిననీ, ఆ కారణంగా తన అమ్మమ్మ తనను బావిలో పడేస్తే... ఒక సాధువు చేరదీసి కాపాడాడనీ, సింహాచల శ్రీ నృసింహస్వామి కరుణతో... పదకొండేళ్ళ వయసులో తనకు చూపు వచ్చిందనీ ఆయన స్వయంగా చెప్పుకున్నాడు. అప్పటినుంచీ... అంటే పదకొండేళ్ళకే నృసింహ సంకీర్తనా సేవకు శ్రీకారం చుట్టాడు. అందుకు వచనాన్ని మార్గంగా ఎంచుకున్నాడు. వచన భక్తి వాఙ్మయంలో ఆయనే ప్రథమాచార్యుడు. కృష్ణమయ్య పాడుతూ ఉంటే... ఆ నృసింహుడే బాలునిగా వచ్చి నృత్యం చేసేవాడంటారు. 'దేవా' అని ప్రారంభమై... 'సింహగిరి నరహరి దయానిధే' అంటూ ముగిసే ఆయన రచనలు ఆ కాలంలో ప్రజల నాలుకల మీద నాట్యమాడాయి.

కృష్ణమయ్య సాహిత్యం గురించి, భక్తి గురించి తెలుసుకున్న ప్రతాపరుద్రుడు... ఆయనను ఓరుగల్లుకు ఆహ్వానించి సత్కరించాడు. ఒకసారి గ్రహణ సమయంలో... కృష్ణమయ్యతో సహా కొందరు పరివారంతో ప్రతాపరుద్రుడు గౌతమీ నదిలో స్నానం చేస్తూండగా... స్వర్ణ, వజ్రాభరణాలు దొరికాయి. వాటితో పాటు మరికొన్ని ఆభరణాలను కృష్ణమయ్యకు ఇచ్చి... వాటిని సింహాచలేశునికి అలంకరించమన్నాడు. ఆ ఆభరణాలను తన ఇంటికి తీసుకువెళ్ళి, వాటిని తన నిత్యాగ్నిహోత్ర హోమగుండంలో వేసి... "ఇవి సింహాద్రి అప్పన్నకు" అన్నాడు కృష్ణమయ్య. ఈ విషయం తెలుసుకున్న ప్రతాపరుద్రుడు... నగలు ఏవని కృష్ణమయ్యను అడిగాడు. రాజును వెంటబెట్టుకొని సింహగిరిపైకి వెళ్ళాడు కృష్ణమయ్య. తాను ఇచ్చిన ఆభరణాలు స్వామికి అలంకరించి ఉండడం చూసిన ప్రతాపరుద్రుడు ఆశ్చర్యపోయాడు. కృష్ణమయ్య భక్తికి దాసుడయ్యాడు. ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉన్న కాలంలో... నారసింహుణ్ణి కీర్తిస్తూ కృష్ణమయ్య గానం చేస్తే... కనకవర్షం కురిసిందట. ఈ వివరాలన్నీ 'సిద్దేశ్వర చరిత్ర'లో ఉన్నాయి.

తాను పాడితే నారసింహుడు ఆడతాడనీ, తనంత భక్తుడు ఎవరూ లేరనీ గర్వపడిన కృష్ణమయ్య జీవితంలో ఒక అపూర్వమైన ఘట్టం జరిగింది. భగవద్రామానుజాచార్యులు శిష్య సమేతంగా దేశసంచారం చేస్తూ సింహాచలం వచ్చారు. స్వామిని సేవించుకున్నారు. అక్కడ కృష్ణమయ్య గురించి విన్న రామానుజులు ఆయనను కలిసి... "మీరు ప్రతిరోజూ అప్పన్నను దర్శిస్తున్న మహానుభావులు. నాకు మోక్షం ఉందో, లేదో స్వామిని అడుగుతారా?" అని కోరారు.

"సరే"నంటూ స్వామిని కృష్ణమయ్య అడిగాడు. స్వామి చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. ఈ సంగతి రామానుజులకు కృష్ణమయ్య చెప్పాడు. అప్పుడు "రామానుజులు మీకు మోక్షం ఉందో లేదో కనుక్కోండి" అన్నారు. దానితో ఉగ్రుడైన కృష్ణమయ్య "రోజూ కనిపించే స్వామి నాకే మోక్షం ఇవ్వడా?" అంటూ నరసింహ స్వామి దగ్గరకు వెళ్ళి అడిగాడు. "నీకు మోక్షార్హత లేదు. నీ పాటకు, నేను చేసిన నృత్యంతో సరిపోయింది. నీతో ఈ ప్రశ్న అడిగించిన రామానుజులకే కలియుగంలో మోక్షం ఇచ్చే అర్హత ఉంది" అని బదులిచ్చాడు. ఆగ్రహించిన కృష్ణమయ్య తాను నిత్యం కొలిచే స్వామినే దుర్భాషలాడాడు. అప్పన్న కోపిస్తూ "ఏ సాహిత్యాన్ని చూసి నువ్వు గర్వపడుతున్నావో... అది నశించిపోతుంది" అని శపించాడు. కృష్ణమయ్య తప్పు తెలుసుకొని, రామానుజులను శరణు కోరి, ఆయనకు శిష్యుడయ్యాడు.

> పురాణేతిహాసాలు సంస్కృతంలో ఉండడం వల్ల అవి సామాన్య జనానికి దూరమయ్యాయని భావించిన కృష్ణమయ్య... వాటిని అందరికీ అందుబాటులో ఉండాలనుకున్నాడు. వేదాలను, ఉపనిషత్ సారాన్నీ తేలికైన తెలుగు వచనంలో రాశాడు. సంగీత, నాట్యాల సమ్మేళనంతో వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్ళాడు. ఆయన రాసిన 'సింహగిరి వచనాల'ను ఈనాటికీ సింహాచలం ఆలయంలో పఠిస్తారు.

కృష్ణమయ్య రచన, భక్తి, సంగీతం, నాట్యాలు కలబోసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన రచనలు కొన్ని ప్యారిస్‌లోని లిండ్స్ లైబ్రరీకి తరలించినట్టు ఆధారాలున్నాయి. అలాగే తంజావూరు సరస్వతీ మహల్ పుస్తక భాండాగారంలో కృష్ణమయ్య రచనలు రెండువందల వరకూ లభ్యమయ్యాయి. వైష్ణవ సంప్రదాయాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించి, భగవద్రామానుజులు ప్రతిపాదించిన విష్ణుభక్తి, భాగవత కైంకర్యం, ఆచార్య సేవానిరతి తదితర వైష్ణవ మత సూత్రాలను ఆయన తన రచనల్లో పొందుపరిచారు. ఆయన సాహిత్యం తదనంతర కాలంలోని వారికి మార్గదర్శకంగా ఉపయోగపడింది. "సింహగిరి నరహరీ! మీ దివ్యనామము ఇదియే నాకు జపము, దయానిధీ!" అంటూ సింహాచలాధీశుణ్ణి మనసారా కీర్తించి, తొలి తెలుగు వాగ్గేయకారునిగా కీర్తిపొందిన మహనీయుడు శ్రీకాంత కృష్ణమాచార్యులు.

(నేడు సింహాచలేశుని చందనోత్సవం)

• అద్దంకి శ్రీరామ కుమార్, 9440567625



విశేషం

జ్ఞానానందమయం... శ్రీశంకర వాఙ్మయం

ఆది కవి వాల్మీకి శ్రీమద్రామాయణం ద్వారా ఆదర్శ మానవుడు ఎలా ఉండాలో లోకానికి మార్గదర్శనం చేశాడు. వ్యాసమునీంద్రుడు మహాభారతం, ప్రస్థానత్రయం, పురాణాల ద్వారా భారతీయ సంస్కృతిని భావితరాలకు అందించాడు. అలాగే... శాఖోపశాఖలుగా చీలిపోయి, అస్తవ్యస్తంగా ఉన్న హిందూ మతాన్ని, వైదిక ధర్మాన్ని పునరుద్ధరించి, ఒకే తాటి మీదకు తెచ్చి పునరుజ్జీవింప జేసినవారు ఆది శంకరులు.

ఎనిమిదేళ్ళ వయసులో ఆపత్సన్యాసాన్ని స్వీకరించి, తల్లి అనుజ్ఞతో ఆదిశంకరులు దేశ సంచారాన్ని ప్రారంభించారు. నర్మదా నదీతీరంలో... గోవింద భగవత్పాదాచార్యుల దగ్గర క్రమ సన్యాసాన్ని పొంది, శ్రీశంకర భగవత్పాదాచార్యులుగా యోగ పట్టాన్ని స్వీకరించారు. శ్రీశంకరుల ఎనిమిదేళ్ళ ఆయుష్షును గురువు పదహారేళ్ళకు పెంచారు.

గురువు ఆదేశం మేరకు శ్రీశంకరులు కాశీ క్షేత్రం చేరుకున్నారు. ఈశ్వర సాక్షాత్కారంతో బ్రహ్మ జ్ఞానం పొందారు. అనంతరం వ్యాసుల దర్శనం అయింది. శంకరుల జ్ఞాన సంపదకు మెచ్చిన వ్యాస మహర్షి... తాను రచించిన ప్రస్థాన త్రయానికి భాష్యాన్ని రాయాలనీ, దేశం నలుమూలలా పర్యటించి, వైదిక ధర్మానికి ప్రాచుర్యం కల్పించాలనీ ఆదేశించారు. అందుకు వీలుగా... శ్రీశంకరుల ఆయుర్దాయాన్ని పదహారేళ్ళ నుంచి రెట్టింపు చేస్తూ ఆశీర్వదించారు.

వ్యాసుడి ఆదేశాన్ని పాటిస్తూ... శ్రీ శంకరులు ప్రస్థానత్రయ భాష్యంతో పాటు, అద్వైత సిద్ధాంత ప్రాచుర్యానికి వీలుగా అనేక ప్రకరణ గ్రంథాలను రచించారు. దేశ పర్యటనలో తాను దర్శించిన అనేక దేవాలయాల్లో యంత్రాలను స్థాపించారు. ఆయా దేవీ దేవతల మీద స్తోత్రాలను రాశారు. అవి కొన్ని వందల సంఖ్యలో ఉంటాయి. 'అద్వైతానుభూతి', 'ఆత్మబోధ', 'ప్రబోధ సుధాకరం', 'అపరోక్షానుభూతి', 'సర్వవేదాంత సార సంగ్రహం', 'వివేక చూడామణి', 'వేదాంత డిండిమ' తదితరాలు ప్రకరణ గ్రంథాలు. అనేక స్తోత్ర రత్నాలు, 'విష్ణు సహస్రనామ భాష్యం', 'లలితా త్రిశతీ భాష్యం' ఆదిగా ఎన్నో భాష్య రచనలూ చేసి అపార వైదిక వాఙ్మయాన్ని ఆయన అందించారు.

ఆది శంకరుల 'లహరులు' అత్యంత ప్రత్యేకమైనవి. 'సౌందర్య లహరి'లో శ్రీవిద్యా మహిమను, ఉపాసనా విధులను, మంత్రోద్ధార రహస్యాలను, షట్చక్రాల సంబంధాన్ని, దార్శనిక విచారాలనూ పొందుపరిచారు. శక్తి చెంతలేనిదే శివుడు అశక్తుడంటూ 'శివ శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుః' అని 'సౌందర్యలహరి'ని ప్రారంభించారు. జగదంబను అందులో వర్ణించిన తీరు ఆయనకే సాధ్యమంటారు పండితులు. 'జ్ఞానానంద సుధా మరందలహరీ సంవిత్ఫలాభ్యున్నతిః... శివా! నీ ధ్యానంతో నా మనస్సు వసంతకాలంలా జ్ఞానమనే ఫలాలను, జ్ఞానానందం అనే తేనెను అందిస్తున్నాయి' అంటారు 'శివానందలహరి'లో శ్రీ శంకరులు. ఆ మాటలు ఆయన రచనలకూ వర్తిస్తాయి. ఆయన వాఙ్మయం ఆద్యంతం జ్ఞానానందమయం.

(12న శ్రీశంకర జయంతి)

• అయపిళ్ళ రాజపాప

మాతృ వందనం

12న మదర్స్ డే

సహజయోగ



సృష్టికి మూలం ఆదిశక్తి. ఆమె తన మాతృప్రేమ శక్తితో ఈ చరాచర ప్రకృతిని సృష్టించింది. అలాగే తనకు ప్రతిబింబంగా స్త్రీలను సృష్టించి... వారిలో ప్రేమైక మాతృత్వ గుణాలను స్థిరపరచింది. ఆ మాతృత్వ గుణాలకు ప్రతిరూపమైన శ్రీమాతాజీ నిర్మలాదేవి జాతి, మత, వర్ణ విభేదాలు లేని వసుధైక కుటుంబ స్థాపన కోసం కృషి చేశారు. మనిషి తనకు ప్రయోజనంలేని, అనవసరమైన విషయాలకు బానిస కావడం ఆమె మాతృహృదయాన్ని కలచివేసింది. వాటి నుంచి మనిషిని విముక్తి చేయడం ఎలా?' అని ఆలోచించారు. సహజయోగాన్ని కనుగొన్నారు.

కష్టంలో ఉన్నవారు కనిపిస్తే ఆమె చలించిపోయేవారు. ఒకసారి ఆమె రైలులో ప్రయాణిస్తున్నప్పుడు... భర్తలు వదిలేసిన బీద మహిళలు, అనాథలైన ఆడపిల్లలను స్టేషన్లలో చూసి బాధపడ్డారు. వారి కోసం ఢిల్లీలో 'నిర్మల ప్రేమాశ్రమం' అనే సంస్థను ఏర్పాటు చేశారు. వారికి చదువు, వృత్తి పని నేర్పించి... కొత్త జీవితాన్ని అందించారు. ఆమె భర్త సర్ సి.పి. శ్రీవాత్సవ ఐక్యరాజ్య సమితిలో పనిచేసేవారు. ఉద్యోగరీత్యా వారు ఇంగ్లండ్‌లో నివసిస్తున్నప్పుడు.. రోడ్డుపై బక్కచిక్కిన, సరైన దుస్తులు లేని పిల్లవాడిని ఆమె చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఆ పిల్లవాడిని కారులో తన ఇంటికి తీసుకువచ్చి, స్నానం చేయించి, తన భర్త దుస్తులను వేశారు. సాయంత్రం ఇంటికి వచ్చిన శ్రీవాత్సవ తన దుస్తుల్లో ఉన్న ఆ కుర్రాణ్ణి చూసి ఆశ్చర్యపోయారు. జరిగినదంతా నిర్మలాదేవి ఆయనకు చెప్పారు. ముక్కూ మొహం తెలియని పిల్లవాడిని ఎవరి అనుమతీ లేకుండా ఇంటికి తీసుకురావడం ప్రమాదకరమని చెప్పినా... ఆమె మాతృహృదయం ముందు అలాంటి ఆలోచన, భయాలు పని చేయలేదు.

భారత కేంద్ర ప్రభుత్వంలో శ్రీవాత్సవ ఉన్నత పదవిలో ఉన్న రోజుల్లో.... ఒకసారి మతకల్లోలాలు పెచ్చుమీరాయి. ఆశ్రయం కోసం ఒక జంట, ఒక ముస్లిం యువకుడు వచ్చి... తమ ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయనీ, ఒక్క రోజు తలదాచుకోవడానికి అనుమతించాలనీ ప్రాధేయపడ్డారు. నిర్మలాదేవి సరేనన్నారు. కాసేపటికి వచ్చిన శ్రీవాత్సవ బయటి పరిస్థితుల గురించి ఆమెకు చెబుతూ... వారికి ఆశ్రయం ఇవ్వడం సరికాదనీ, సురక్షితమైన మరో చోటుకు పంపిద్దామనీ అన్నారు. నిర్మలాదేవి ఆయనకు నచ్చజెప్పారు. మరునటిరోజు స్థానిక యువకులు పెద్ద పెద్ద కర్రలతో, మారణాయుధాలతో వారి ఇంట్లోకి దూసుకువచ్చి... "మీరు దేశ ద్రోహులకు... అందులోనూ ముస్లింలకు ఆశ్రయం ఇచ్చారు. వారిని మాకు మర్యాదగా అప్పగించండి" అని గొడవ చేశారు. అప్పుడు ఆమె "నేను స్వచ్ఛమైన హిందువును, భారతీయురాలిని. శత్రువులకు ఆశ్రయం ఎలా ఇస్తాననుకున్నారు?" అని చెప్పి, వారిని పంపేశారు. తన ఇంటికి వచ్చినవారు ప్రసిద్ధ సినీనటి అచల సత్యదేవ్ దంపతులనీ, ఆ ముస్లిం యువకుడు ఇప్పటి ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ అనీ తరువాత తెలిసింది. ఆమె జీవితంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో.

"మనలో మాతృమూర్తి తత్త్వమైన భూమాతే... మనలో నివశిస్తున్న కుండలినీ శక్తి. అది జన్మజన్మల నుంచి మనకు తల్లిగా ఉంటూ, మనకు అంతర్గతమైన, ఆధ్యాత్మికమైన పోషణను ఇస్తోంది. మన బాగోగులను చూసుకుంటోంది. మనం భూమాతను తల్లిగా కొలుచుకుంటాం. దేశాన్ని 'భారతమాత' అని తల్లిగానే గౌరవించుకుంటాం. తల్లికి ఉన్న స్థానం అది. పిల్లలను చక్కని నడవడిక కలిగిన వారిగా తీర్చి దిద్దడంలో తల్లుల పెంపకమే కీలకం. పెద్దలను, గురువులను, సమాజాన్ని గౌరవించడం వారికి నేర్పాలి. 'మానవాళి అంతా ఒక కుటుంబం' అని బోధించాలి. ఈ శక్తి తల్లికే ఉంది. పిల్లలు లంచగొండులు, అవనీతిపరులు, హింసాకారకులు అయితే... దానికి బాధ్యత తల్లులదే. పిల్లలను సన్మార్గంలో పెట్టడం అనే బాధ్యత తల్లులు సక్రమంగా నెరవేర్చకపోతే... ఆ ప్రభావం మొత్తం సమాజం మీద పడుతుంది" అని వివిధ సందర్భాల్లో ఆమె చెప్పారు.

కుమార్తెగా, విద్యార్థి నాయకురాలుగా, స్వాతంత్ర్య ఉద్యమకారిణిగా, ఆదర్శ పత్నిగా, గృహిణిగా, తల్లిగా, అమ్మమ్మగా... తన బాధ్యతలన్నిటినీ సమగ్రంగా నిర్వహించిన నిర్మలాదేవి... ఆధ్యాత్మిక గురువుగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 1970 మే 5న... సహజయోగాన్ని ఆవిష్కరించారు. ప్రపంచమంతటా దాన్ని వ్యాప్తి చేశారు. ధ్యాన సాధన ద్వారా లక్షలాదిమంది సమస్యలకు సునాయాసమైన పరిష్కారాన్ని చూపించారు. శిష్యులనుంచి శ్రీమాతాజీగా వందనాలు అందుకుంటున్నారు.

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ivEAEh2లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

సల్మాన్‌ఖాన్‌కు జోడీగా






'యానిమల్' చిత్రంతో కథానాయికగా బాలీవుడ్‌లో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు రష్మిక మందన్న. ఇప్పుడు ఆమె మరో హిందీ చిత్రంలో అవకాశం అందుకున్నారు. ఏకంగా అగ్రనటుడు సల్మాన్‌ఖాన్‌కు జోడీగా అలరించబోతున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న 'సికందర్' చిత్రంలో రష్మికను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. గురువారం చిత్రబృందం ఈ విషయాన్ని ప్రకటించింది. సల్మాన్‌ఖాన్‌తో నటించే అవకాశం దక్కడాన్ని గౌరవంగా, గర్వంగా భావిస్తున్నాను అని రష్మిక పేర్కొన్నారు.

కన్నప్ప సెట్‌లోకి



శివ భక్తుడు కన్నప్పగా మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్‌కుమార్ లాంటి దిగ్గజ నటులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ పరమశివునిగా కనిపించనున్నారు. ఆయన ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ప్రభాస్ సెట్‌లోకి అడుగుపెట్టినట్లు చిత్రబృందం గురువారం తెలిపింది. ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

పాత కాంబోలో కొత్త చిత్రం



హీరో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రం ఖరారైంది. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. గతంలో విజయ్‌తో 'డియర్ కామ్రేడ్', 'ఖుషి' చిత్రాలను నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తోంది. అలాగే విజయ్‌తో 'టాక్సీవాలా' చిత్రాన్ని తెరకెక్కించిన రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్‌లో బీడు భూముల్లో రాతిపై చెక్కిన వీరుడి విగ్రహం సినిమా నేపథ్యాన్ని తెలుపుతోంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మాతలు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు యూనిట్ తెలిపింది.

అచ్చమైన తెలుగు సినిమాలా...



తమిళంలో చిన్న సినిమాగా విడుదలై పెద్ద విజయాన్ని అందుకున్న 'రంగోళి' చిత్రాన్ని తెలుగులో 'సత్య'గా డబ్ చేశారు శివ మల్లాల. "అచ్చమైన తెలుగు సినిమాలా 'సత్య' ఉంటుంది. ఈ సినిమాకు తండ్రీకొడుకు మధ్య ఉన్న అనుబంధం స్పెషల్ హైలెట్ అవుతుంది. అలాగే చదువు, స్నేహం కూడా ఈ కథలో భాగం" అని ఆయన చెప్పారు.

ప్రతి జర్నలిస్ట్‌కి ప్రతిరూపంగా...



పదేళ్ల క్రితం విడుదలై సంచలన విజయం సాధించిన 'ప్రతినిధి' సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కిన చిత్రం 'ప్రతినిధి 2'. నారా రోహిత్ హీరోగా నటించిన ఈ చిత్రానికి మూర్తి దేవగుప్తపు దర్శకత్వం వహించారు. సిరిలెల్లా హీరోయిన్‌గా నటించారు. కుమార్‌రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీతోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మించారు. 'ప్రతినిధి 2' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మీడియాతో ముచ్చటించింది. దర్శకుడు మూర్తి దేవగుప్తపు మాట్లాడుతూ "ఇందులో నారా రోహిత్ న్యూస్ రిపోర్టర్‌గా కనిపిస్తారు. ప్రతి జర్నలిస్ట్‌కి ప్రతిరూపంగా ఇందులో ఆయన పాత్ర ఉంటుంది. ఈ పొలిటికల్ థ్రిల్లర్ అందరినీ ఆకట్టుకుంటుంది" అని నిర్మాతలు చెప్పారు.

మంచి ఫీల్‌తో బయటకు వస్తారు



నటుడు సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వి.వి గోపాల కృష్ణ దర్శకత్వం వహించారు. దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మల పాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. 'కృష్ణమ్మ' సినిమా ఈ రోజు విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ "దర్శకుడు ఈ సినిమాకు బెస్ట్ స్క్రిప్ట్‌ను ఇచ్చారు. సినిమా చూసి బయటకు వచ్చేటప్పుడు గొప్ప చిత్రాన్ని చూశామనే మంచి ఫీల్‌తో బయటకి వస్తారు" అని చెప్పారు. దర్శకుడు వి.వి గోపాలకృష్ణ మాట్లాడుతూ "ఈ సినిమాలోని ప్రధాన పాత్రల జీవితాల్లో తిరిగే మలుపులు కృష్ణా నది మలుపులను తలపిస్తాయి" అని చెప్పారు.

మంచి కథ కుదిరితే...



మోహన్ భగత్, సుప్రీత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ నటించిన చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి దర్శకత్వం వహించగా అభిషేక్ వీటీ నిర్మించారు. ఈ ఎమోషనల్ థ్రిల్లర్ ఈ రోజు విడుదలతోన్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీవిష్ణు మాట్లాడుతూ "ఈ మూవీ టీమ్ పనితీరు అద్భుతంగా ఉంది. మంచి కథ కుదిరితే వీరితో కలసి ఓ సినిమా చేస్తా" అని అన్నారు. దర్శకుడు అజయ్ నాగ్ వి మాట్లాడుతూ "ఈ సినిమాని అందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని చెప్పారు. నిర్మాత అభిషేక్ వీటీ మాట్లాడుతూ "ఇలాంటి న్యూ కాన్సెప్ట్ సినిమాకు అందరి ఆదరణ దక్కాలి" అని ఆకాంక్షించారు.

ఇక.. పరీక్షా సమయం!

- ఎస్పీలు, జిల్లా ఎన్నికల అధికారులతో సీఈవో మీనా
- ఏమాత్రం తేడా వచ్చినా ఊహించని ఫలితాలు: డీజీపీ గుప్తా

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): గత కొన్ని నెలలుగా చేస్తున్న కృషికి పరీక్షా సమయం ఆసన్నమైందని, ఈ నెల 13న జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా, న్యాయంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు వ్యూహాత్మకంగా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల డీఈవోలను, ఎస్పీలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి ఎన్నికల నిర్వహణకు 72 గంటల ముందు చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు విస్తరణ ప్రణాళిక అమలు అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. 'రానున్న మూడు రోజులు ఎంతో కీలకమైనవి. యంత్రాంగాలు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. అవాంఛనీయ ఘటనలు, ఓటర్లను ప్రలోభపర్చే కార్యక్రమాలకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి' అని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలన్నీ వెబ్‌కాస్టింగ్ ద్వారా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ల నుంచి పర్యవేక్షించాలన్నారు. 48 గంటల ముందు అంటే 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి మద్యం అమ్మకాలను రద్దు చేస్తూ డ్రై డే ప్రారంభమవుతుందని, డ్రై డేను పటిష్ఠంగా అమలుపర్చాలని ఆదేశించారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ శాంతిభద్రతల ప్రణాళికలను పటిష్ఠంగా అమలుపరచాలని, ఏమాత్రం తేడా వచ్చినా ఊహించిన ఫలితాలు రావన్నారు. తెలంగాణ సరిహద్దులు గల జిల్లాలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ రోజు వాహనాలు, వ్యక్తుల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

డబ్బులున్నా... పింఛను ఇవ్వలేదు

- 38 మరణాలకు జవహర్‌రెడ్డిదే బాధ్యత: టీడీపీ

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): ఖజానాలో రూ.14 వేల కోట్లు ఉంచుకొని అవ్వా తాతల పింఛన్లకు సకాలంలో డబ్బులు ఎందుకు విడుదల చేయలేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని తెలుగుదేశం పార్టీ ప్రశ్నించింది. ఏప్రిల్ మండు వేసవిలో పింఛన్ల కోసం తిరిగి 38 మంది ప్రాణాలు కోల్పోవడానికి ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిదే బాధ్యతని, ఆయనపై విచారణ జరపాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ గురువారం ఇక్కడ తమ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ఖజానాలో డబ్బులు దాచి పెడితే గుడ్లు పెడతాయా? అధికారులు సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. డబ్బులు దాచిపెట్టి వివిధ పథకాల లబ్ధిదారులకు సరిగ్గా పోలింగ్‌కు ముందు విడుదల చేసి ప్రజలను ప్రలోభపెట్టాలని వైసీపీ వ్యూహ రచన చేసిందని నీలాయపాలెం ఆరోపించారు. 'రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలలోనే రూ.14 వేల కోట్లు ఆయా శాఖల ఖాతాల్లో జమ చేసింది. కాని ప్రజలకు మాత్రం విడుదల చేయలేదు. ఈ నాలుగు నెలలూ ఆ డబ్బులు ఎక్కడ దాచిపెట్టారో సమాధానం చెప్పాలి. ఇన్ని వేల కోట్లు ప్రభుత్వ శాఖల ఖాతాల్లో ఎందుకు మగ్గుతున్నాయో ప్రధాన కార్యదర్శికి తెలియదా? ఆయా శాఖల కార్యదర్శులు లబ్ధిదారులకు వాటిని బదిలీ చేయకుండా ఎందుకు ఆపారు? వీటికి సమాధానం చెప్పాలి' అని నీలాయపాలెం కోరారు.

వైసీపీని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధం: కనకమేడల

న్యూఢిల్లీ, మే 9(ఆంధ్రజ్యోతి): 'జగన్ అహంకారం, ఆలోచనలతో తమ భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ప్రజలు తెలుసుకున్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపాలని ప్రజలు ఫిక్స్ అయ్యారు' అని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. గురువారం, ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఏపీలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. జగన్ నుంచి భూములు కాపాడుకోవాలంటే ఎన్డీయే కూటమిని, చంద్రబాబును సీఎంగా గెలిపించాలి' అన్నారు.

ఓడిపోయే వైసీపీకి ఓటేయొద్దు: షరీఫ్

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): ఓడిపోయే వైసీపీకి ఓటేసి ముస్లింలు తమ అమూల్యమైన ఓటును వృథా చేసుకోవద్దని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ కోరారు. జగన్‌రెడ్డి అబద్ధపు, అసత్యపు ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "వైసీపీ ఐదేళ్ల పాలనలో ముస్లింపై అనేక దాడులు జరిగాయి. జగన్ సర్కార్ మైనార్టీల సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసింది. పవిత్రమైన మసీదుల్లో వైసీపీకి ఓటేయాలని చెప్పడం సరికాదు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం" అని షరీఫ్ అన్నారు.

బరితెగిస్తున్న వైసీపీ మూకలు: అచ్చెన్న

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోతున్నామనే అక్కసుతో వైసీపీ మూకలు బరితెగిస్తున్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో జగన్ సభ నేపథ్యంలో ఈనాడు కంట్రిబ్యూటర్ రమేశ్‌పై దాడిని గురువారం ఓ ప్రకటనలో ఆయన తీవ్రంగా ఖండించారు. 'జగన్ అండతో రెచ్చిపోతున్న వైసీపీ గూండాలు ఎన్నికల తర్వాత తమ పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలి. జర్నలిస్టులపై దాడులు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు. కూటమి అధికారంలోకి వచ్చాక జర్నలిస్టుల భద్రతకు చర్యలు తీసుకుంటాం' అన్నారు.

పాతాళంలోకి వైసీపీ మాఫియా: బీజేపీ

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ మాఫియాను పాతాళంలోకి తొక్కేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ సరళి చూస్తుంటే సాధారణ పోలింగ్‌కు మూడు రోజుల ముందే వైసీపీ ఓటమి ఖాయమైందని ఆ పార్టీ నేతలు పాతూరి నాగభూషణం, సుధీష్ రాంబొట్ల, సూర్యనారాయణ రాజు అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. 'జగన్ పాలనలో మాఫియా దోపిడీ గురించి దేశ ప్రధాని పదే పదే ప్రస్తావించారంటే రాష్ట్రాన్ని వైసీపీ ఏ స్థాయిలో లూటీ చేసిందో అర్థం చేసుకోవాలి. డబులింజన్ సర్కార్ వస్తుందని స్పష్టం కావడంతో కొందరు అధికారులు ఫైళ్లు దాచేస్తున్నట్లు తెలుస్తోంది. అటువంటి పనులు చేసి అనవసరంగా ఇబ్బందుల్లో పడొద్దు' అని హెచ్చరించారు.

మళ్లీ మాదే అధికారం... మీ అంతు చూస్తాం!

- ఫ్లయింగ్ స్క్వాడ్‌పై వైసీపీ నాయకుడి దౌర్జన్యం
- పోలీసులపై బూతుపురాణం, బెదిరింపులు
- తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు
- 'ఆంధ్రజ్యోతి' కంట్రిబ్యూటర్‌పై దాడి

తుళ్లూరు మే 9: ఫ్లయింగ్ స్క్వాడ్ టీంపై వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్ దౌర్జన్యం చేశాడు. పోలీసులను బండబూతులు తిడుతూ, వచ్చేది మళ్లీ మా ప్రభుత్వమేనంటూ తప్ప తాగి రాజధానిలో వీరంగం చేశాడు. ఈ ఘటనను వీడియో తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్ సెల్‌ఫోన్ లాక్కొని ఆయనపై దాడి చేశారు. తుళ్లూరు పాత పెట్రోలు బంకు వద్ద బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేస్తోంది. అనిల్, అతని సహచరుల కార్లను తనిఖీ చేయడానికి అధికారులు సిద్ధపడ్డారు. దీంతో కారులో నుంచి దిగిన అనిల్.. 'నేను ఎస్సీని.. నా కార్లనే తనిఖీ చేస్తావా.. ఎంత ధైర్యం మీకు...' అంటూ చొక్కా ఊడదీసి వీరంగం చేశాడు. 'నేనూ ఎస్సీనే' అని ఏఎస్‌ఐ వి.ప్రసాద్ దీటుగా బదులిచ్చారు. పోలీసులపై అనిల్ తిట్లదండకం ఎత్తుకున్నాడు. 'నేను వైసీపీ వ్యక్తిని.. మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం.. మీ అంతు చూస్తాం..' అంటూ రెచ్చిపోయాడు. ఈ ఘటనను వీడియో తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' కంట్రిబ్యూటర్ సెల్‌ఫోన్ లాక్కొని అనిల్ సహచరులు దాడి చేశారు. గాయపడిన కంట్రిబ్యూటర్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తుళ్లూరు సీఐ సుభాని తెలిపారు. అనిల్ అతని అనుచరులు మొత్తం మూడు కార్లలో వచ్చారు. మొదటి కారు నుంచి అనిల్ దిగి పోలీసులతో ఘర్షణ పడుతున్న సమయంలో చివర్లో ఉన్న మూడో కారును వెనక్కి తిప్పి అక్కడ నుంచి జారుకున్నారు. ఆ కారులో మద్యం, నగదు, మారణాయుధాలు ఉండి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

దాబాలో పనిచేసే వారిని కత్తులతో బెదిరించి...

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ అనంతరం తుళ్లూరు పాత పెట్రోలు బంకులో ఉన్న దాబాలో పనిచేస్తున్న ముగ్గురిని బోరుగడ్డ అనిల్ అండ్ బ్యాచ్ బెదిరించింది. గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ కార్లలో డబ్బు వచ్చిందని, రూ.50లక్షలు పంచారని, గంజాయి అమ్ముతున్నారని చెప్పాలని బెదిరించారు. దీంతో ఆ యువకులంతా భయభ్రాంతులకు గురయ్యారు. కత్తులు చూపటంతో భయపడి వారు చెప్పమన్నట్టుగా చెప్పామని దాబాలో పనిచేసే యువకులు పోలీసులకు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

హలో.. వస్తున్నాం!

ఎన్నికల కోసం ఏపీకి భారీగా ప్రవాసులు.. రేపు గన్నవరం ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానం

- షార్జా నుంచి ఎక్కువగా కదులుతున్న ఆంధ్రులు
- దక్షిణ తూర్పు ఆసియా దేశాలు, అమెరికా, కెనడా, ఫ్రాన్స్, యూరప్, ఆస్ట్రేలియాల నుంచి కూడా...
- హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లోని ఐటీ ఉద్యోగులు భారీగా విజయవాడకు రాక

(హైదరాబాద్, విజయవాడ- ఆంధ్రజ్యోతి): పోలింగ్‌కు మూడు రోజుల ముందు నుంచే ఓటు సందడి మొదలైంది. మన రాష్ట్రానికి చెందిన ప్రవాసులు, ఇతర రాష్ట్రాలలోని ఐటీ ఉద్యోగులు ఎన్నికల్లో పాల్గొనేందుకు భారీగా తరలివస్తున్నారు. దేశీయంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర దూరప్రాంత నగరాలలో ఉద్యోగాలు చేసుకుంటున్నవారు, ఉపాధి పొందుతున్నవారు కూడా ప్రయాణ సన్నాహాల్లో ఉన్నారు. గురువారం నుంచే రాష్ట్రానికి వచ్చే ప్రవాసులతో విమానాలు, రైళ్లు, బస్సులు కిటకిటలాడిపోతున్నాయి. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులు, రైళ్లలో రాక ప్రారంభమైంది. ఒక్క హైదరాబాద్ నుంచే లక్షన్నర మంది ఏపీకి తరలి వస్తున్నారన్నది ఆర్టీసీ అధికారుల అంచనాగా ఉంది. వారం రోజుల ముందుగానే హైదరాబాద్ నుంచి విజయవాడకు మే 11, 12, 13 తేదీలలో షెడ్యూల్ బస్సులలో సీట్లన్నీ బుక్ అయిపోయాయి. మే 13 వ తేదీన ఓటు హక్కు వినియోగించుకుని తిరుగు ప్రయాణమయ్యేవారు ఎక్కువమంది ఉంటారు. అలాంటివారు బుకింగులకు పోటెత్తడంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు కూడా నూరు శాతం రిజర్వేషన్‌ను పూర్తి చేసుకున్నాయి. దీంతో భారీగా రాకపోకలు ఉంటాయన్న అంచనాతో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వారి కోసం అదనంగా 70 స్పెషల్ బస్సులు నడపాలని నిర్ణయించామని ఆర్టీసీ పీఎన్‌బీఎస్ డీసీటీఎం బషీర్ అహ్మద్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రానున్న రెండు రోజులలో ఈ సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత స్లాక్ (మందకొడి)సీజన్‌లో ఆర్టీసీ దూరప్రాంత షెడ్యూల్ బస్సులలో 30 శాతం ఆక్యుపెన్సీ కూడా దాటడం లేదు. అలాంటిది గురువారం సాయంత్రం నాటికి 80 శాతం ఆక్యుపెన్సీ నమోదు అయింది. దీనిని బట్టి హైదరాబాద్, ఇతర తెలంగాణ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఏపీకి వస్తున్నారన్నది అర్థమౌతోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలలో ఐటీ ఉద్యోగాలు చేసుకుంటున్న వారంతా.. సెలవులు పెట్టి ఏపీకి వచ్చేస్తున్నారు. ప్రవాస భారతీయులు ఇప్పటికే స్వల్ప సంఖ్యలో వచ్చారు. బుధవారం విజయవాడలో జరిగిన మోదీ రోడ్డు షో కార్యక్రమంలో ప్రవాస భారతీయులు ప్లకార్డులు చేతబూని మరీ పాల్గొన్నారు. దక్షిణ తూర్పు ఆసియా దేశాలలో ఉంటున్నవారితో పాటు అమెరికా, కెనడా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, యూరప్ ప్రాంతాలలో ఉంటున్న ప్రవాసులు తమ దేశాల నుంచి ఢిల్లీ, హైదరాబాద్‌లకు విమానాల్లో రావటానికి బుక్ చేసుకున్నారు. గల్ఫ్ దేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రవాసులు విజయవాడ విమానాశ్రయానికి నేరుగా బుక్ చేసుకున్నారు. గల్ఫ్ దేశాల నుంచి చూస్తే ప్రధానంగా షార్జా నుంచి విజయవాడకు ప్రవాసుల రాకపోకలు పెరిగాయి. 11న భారీ సంఖ్యలో ప్రవాసీయులు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటున్నట్టు ఎన్ఆర్ఐ వేమూరి రాజేశ్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

50 రైళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు....20 రైళ్లకు అదనపు కోచ్‌లు

మే 10నుంచి 14వరకు హైదరాబాద్ నుంచి ఏపీలోని ఆయా ప్రాంతాలకు వెళ్లే 50 రైళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మే10, 12 తేదీల్లో సికింద్రాబాద్-విశాఖపట్నం (12740), మే11, 13 తేదీల్లో విశాఖపట్నం-సికింద్రాబాద్ (12739), మే11న సికింద్రాబాద్-విశాఖపట్నం (22204), మే12న విశాఖపట్నం-సికింద్రాబాద్ (22203), మే9నుంచి 11వరకు మచిలీపట్నం-బీదర్ (12749) మే10 నుంచి 12వరకు బీదర్-మచిలీపట్నం (12750), మే10, 11 తేదీల్లో కాచిగూడ-గుంటూరు (17252). మే11,12 తేదీల్లో గుంటూరు-కాచిగూడ (17251), మే10, 11 తేదీల్లో కాచిగూడ-రేపల్లె (17625), మే12, 13 తేదీల్లో రేపల్లె- వికారాబాద్ (17626), మే10 నుంచి 12 వరకు గుంటూరు-తిరుపతి (17261), మే11నుంచి 13వరకు తిరుపతి-గుంటూరు (17262), మే10 నుంచి 12 తేదీల్లో గుంటూరు-వికారాబాద్ (12747), మే10 నుంచి 12 వరకు వికారాబాద్-గుంటూరు, (17248) మే11 నుంచి 13వరకు గుంటూరు-విశాఖపట్నం (17239), మే12నుంచి 14 వరకు విశాఖపట్నం-గుంటూరు (17240), మే11నుంచి 14వరకు సికింద్రాబాద్ -విజయవాడ, (17214), మే11 నుంచి 14 వరకు విజయవాడ,-సికింద్రాబాద్ (17213), మే9 నుంచి 11 వరకు నర్సాపూర్-ధర్మవరం (17247), తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు

ఏబీవీ సస్పెన్షన్ వెనుక దురుద్దేశం

- కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ వ్యాఖ్యలు

హైదరాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి, అదనపు డీజీ ఏబీ వెంకటేశ్వరరావును రెండోసారి సస్పెండ్ చేయడం వెనుక ఏపీ ప్రభుత్వ దురుద్దేశం ఉందని కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) పేర్కొంది. సస్పెన్షన్ సరికాదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత మళ్లీ 2021లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను ఊటంకిస్తూ సాక్షులను ప్రభావితం చేసేలా వ్యవహరించారనడం సాకు మాత్రమేనని తెలిపింది. ఈ కారణంగా రెండోసారి సస్పెండ్ చేయడం దురుద్దేశపూర్తి చర్యేనని పేర్కొంది. క్యాట్ తీర్పులోని కీలక అంశాలు ఇవీ.. "సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించేలా ఏపీ ప్రభుత్వం వ్యవహరించింది. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఒకసారి విధుల్లో చేరిన పిటిషనర్‌ను రెండోసారి సాక్షులను ప్రభావితం చేశారనే నెపంతో ఎలాంటి ఆధారాలు లేకుండా సస్పెండ్ చేశారు. బుర్ర ఉపయోగించకుండా దురుద్దేశంతో అధికారాన్ని తప్పుడు మార్గంలో ఉపయోగించారు. ఒకేరకమైన కారణాలు చూపుతూ రెండోసారి సస్పెండ్ చేయడం సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించడం కిందికే వస్తుంది. అఖిల భారత సర్వీసు నిబంధన-3(3)ని అడ్డుపెట్టుకుని సస్పెండ్ చేయడం చట్టసమ్మతంకాదు. అక్రమంగా.. అన్యాయంగా వైసీపీ ప్రభుత్వం 2022, జూన్ 28న జీవో 55 ద్వారా జారీచేసిన రెండో సస్పెన్షన్ ఉత్తర్వులను క్వాష్ చేస్తున్నాం. పిటిషనర్‌ను విధుల్లోకి తిరిగి చేర్చుకోవడంతోపాటు సర్వీసు బెనిఫిట్స్ సహా పెండింగ్‌లో ఉన్న అన్ని జీతభత్యాలు చెల్లించాలి" అని తీర్పులో పేర్కొన్నారు. సాక్షులను ప్రభావితం చేశారనే ఏకైక ఆరోపణ తప్ప రూల్ 3(3) కింద రెండోసారి సస్పెండ్ ఎందుకు చేశారో వివరిస్తూ ఒక్క ఆధారం సమర్పించలేదు. సస్పెన్షన్ ఆదేశాల్లో సైతం ఎలాంటి కారణాలూ పేర్కొనలేదు. పిటిషనర్ ప్రెస్ స్టేట్‌మెంట్ విడుదల చేయడంపై ప్రభుత్వం ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీచేసింది. నోటీసు తర్వాత ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన విచారణ చేపట్టవచ్చు. అంతేగానీ ప్రస్తుత కేసుకు దానిని ముడిపెట్టడం ద్వారా ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు స్పష్టమవుతోంది. చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత కూడా పిటిషనర్‌పై ఉన్న సస్పెన్షన్ ఎత్తేసే ప్రయత్నంగానీ.. సమీక్షించడం గానీ చేయలేదు. రూల్ 3(3)కి తప్పుడు భాష్యం చెప్పి చర్యలు తీసుకున్నారు. ప్రెస్ రిలీజ్‌ను సస్పెన్షన్‌కు ముడిపెట్టడం సరికాదు.

ఎన్నికల తర్వాత దేశంలో పెనుమార్పులు!

- బీజేపీ ఓటమి ఖాయమని మూడు విడతల్లో స్పష్టం
- అందుకే మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న మోదీ : ఏచూరి



అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ, కూనవరం, మే 9: ఎన్నికల తర్వాత దేశంలో పెనుమార్పులు వచ్చే అవకాశం ఉందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు. గురువారం విజయవాడలో విలేకరుల సమావేశంలో, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ అల్లూరి జిల్లా కూనవరంలో నిర్వహించిన బహిరంగ సభలోనూ ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాన్ని చట్టబద్ధం చేసిన తొలి ప్రధాని మోదీ అని విమర్శించారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేస్తుందని, ప్రజాస్వామ్యానికి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు జరిగిన మూడు విడతల ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని స్పష్టమైందని చెప్పారు. దీంతో ముస్లింలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేసి, దేశంలో మతోన్మాద ఘర్షణలు రెచ్చగొట్టడం ద్వారా ఎన్నికల్లో గెలవడానికి మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకికవాద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు వామపక్షాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులను కాపాడటానికి ఇది అవసరం, అనివార్యమని పేర్కొన్నారు. ఉత్తర భారతంలోని అన్ని రాష్ట్రాల్లోనూ బీజేపీకి గతంలో కంటే తక్కువ సీట్లే వస్తాయని చెప్పారు. దక్షిణాదిన కూడా కర్ణాటక, మహారాష్ట్రల్లో ఆ పార్టీకి నామమాత్రంగానే సీట్లు వస్తాయన్నారు. ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకున్న రాష్ట్రాల్లోనే ఎన్డీయే కూటమికి కొంచెం ఉనికి చాటుకునే అవకాశం ఉందని తెలిపారు. బ్లాక్‌మనీ టెంపోల్లో తరలిపోతుంటే ఈడీ, సీబీఐ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అవి రాజకీయ ఏజెన్సీలుగా మారిపోయాయని, ఆ సంస్థలు పాలక పార్టీల కోసమే పని చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా సీఈసీ కనీసం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న అస్తవ్యస్త ఆర్థిక విధానాల వల్ల పేదలు మరింత పేదరికంలో కూరుకుపోతుండగా.. ధనవంతులు అపర కుబేరులుగా అవతరిస్తున్నారని విమర్శించారు. దేశంలో 42 శాతం పట్టభద్రులు నిరుద్యోగులుగా మిగిలిపోయారన్నారు. నల్లధనం లేకుండా చేస్తానని చెప్పిన ప్రధాని.. ఇప్పుడు అదానీ, అంబానీలు కాంగ్రెస్‌కు నల్లధనం ఇస్తున్నారని చెబుతున్నారని, దేశంలో ఇంకా నల్లధనం ఉందని మోదీనే ఒప్పుకొన్నారని విమర్శించారు.

చిరంజీవికి చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా దేశ రెండో అత్యున్నత పురస్కారం 'పద్మ విభూషణ్' అందుకున్న మెగాస్టార్ చిరంజీవికి టీడీపీ అధినేత చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్యాల పట్ల గట్టి సంకల్పంతో, క్రమశిక్షణతో కృషి చేస్తే ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చని నిరూపించిన చిరంజీవిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. అలాగే.. 'ఇది తెలుగు వారు గర్వించే సందర్భం.. నాతో సహా కోట్లాది అభిమానులు ఆనందించే సమయం' అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు.

అమరావతి సర్వనాశనం

- ఈ పాపంలో జగన్, ఆళ్లకు భాగస్వామ్యం
- మీ ఓటుతో టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించండి
- మంగళగిరి ప్రజలకు నారా లోకేశ్ విజ్ఞప్తి



కురగల్లు రచ్చబండలో ప్రసంగిస్తున్న నారా లోకేశ్

మంగళగిరి, మే 9: "ఈ ఎన్నికల సందర్భంగా మా కుటుంబంలోనూ ఓ యుద్ధం జరుగుతోంది. యుద్ధమంటే అదో తరహా పోటీ! మామగారు, అత్తగారు హిందూపూర్‌లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అమ్మా, నాన్న కుప్పం ప్రచారంపై దృష్టి పెట్టారు. నా భార్య బ్రాహ్మణి మంగళగిరిలో ప్రచారం చేస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో ఎవరు ఎక్కువ మెజారిటీతో గెలుస్తారన్న చర్చ మా కుటుంబంలో నడుస్తోంది. మా ముగ్గురి (చంద్రబాబు, బాలకృష్ణ, లోకేశ్)లో ఎవరు ఎక్కువ మెజారిటీతో గెలుస్తారో.. మీరే చెప్పండి" అని టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలను ప్రశ్నించారు. దీనికి వారు మంగళగిరిలోనే అత్యధిక మెజారిటీ వస్తుందని బదులిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా లోకేశ్ గురువారం రాత్రి తన తల్లి భువనేశ్వరి, నందమూరి సుహాసినితో కలిసి కురగల్లులో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. అమరావతిని సర్వనాశనం చేశారని.. ఈ పాపంలో సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే ఆళ్లకు భాగస్వామ్యం ఉందన్నారు. విశాఖలో తానొక్కడే బతికేందుకు సీఎం జగన్ రూ.500 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చుచేసి ప్యాలెస్ కట్టుకున్నారని లోకేశ్ విమర్శించారు. అవే నిధులను మన మంగళగిరిలో ఖర్చు చేసివుంటే ప్రతి నిరుపేద కుటుంబానికీ ఇల్లు, ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు వచ్చిఉండేదని, ఇక్కడ రోడ్లన్నీ అద్భుతంగా తయారైవుండేవని అన్నారు. నేడు ఓట్ల కొనుగోలు కోసం ఒక్క మంగళగిరిలోనే జగన్ రూ.300 కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. ఓటుకు రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు పంపిణీ చేస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. ఆ డబ్బంతా ప్రజల డబ్బేనని, నిరభ్యంతరంగా తీసుకోవచ్చని చెప్పారు. నిజంగా సీఎం జగన్‌కు పెద్ద మనస్సు వుంటే రైతులకు కౌలు డబ్బులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. తాను గతంలో ఓటమి చెందినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని గుర్తుచేశారు. ఈసారి ఎన్నికల్లో ప్రజలు మోసాలు, కుతంత్రాలకు లోనుకాకుండా సైకిల్ గుర్తుపై ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని లోకేశ్ పిలుపునిచ్చారు.

ఏపీ ప్రజలు చంద్రబాబు పాలనను, జగన్ పాలనను రెండింటిని చూశారు. ఎవరి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందిందో ప్రజలు బేరీజు వేసుకుని ఈ ఎన్నికల్లో ఓటేసి అభివృద్ధిని గెలిపించాలని నందమూరి సుహాసిని అన్నారు. అమరావతిని అద్భుత రాజధానిగా మలిచే మహాయజ్ఞం జరుగుతున్న తరుణంలో జగన్ వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. గత ఎన్నికల్లో చేసిన తప్పును మరోమారు చేయకుండా టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో లోకేశ్ తల్లి నారా భువనేశ్వరి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నన్ను ఓడించేందుకు వైసీపీ కుట్ర

- 300 కోట్లతో ఓట్లు కొనుగోలు చేస్తున్నారు: నారా లోకేశ్

మంగళగిరి నియోజకవర్గంలో తనను ఓడించేందుకు వైసీపీ కుట్ర పన్నుతోందని టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం సాయంత్రం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి కొత్తగా పలువురు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. తనను ఓడించేందుకు మంగళగిరిలో వైసీపీ రూ.300 కోట్లను ఖర్చు చేస్తుందన్నారు. ఇసుక, గ్రావెల్‌లో దోచుకున్న సొమ్ములో పదిశాతం సొమ్మును బయటకు తీసి ఓట్లు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. తాను మాత్రం నీతి నిజాయితీతో ఎన్నికల్లో గెలుపొందాలని నిశ్చయించుకున్నానని చెప్పారు. '40 ఏళ్లపాటు రాజకీయాలల్లో ఉంటా... నీతి నిజాయితీతోనే పనిచేస్తా...' అని లోకేశ్ చెప్పారు. కాగా, నియోజకవర్గ అభివృద్ధికి కలిసి రావాలన్న నారా లోకేశ్ పిలుపుతో వైసీపి నుంచి 260 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ అభ్యర్థుల్లో 87 మందిపై క్రిమినల్ కేసులు

- టీడీపీలో 42 మందిపై కూడా: ఏడీఆర్

న్యూఢిల్లీ, మే 9(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న 175మంది వైసీపీ అభ్యర్థుల్లో 87మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ జాబితాలో టీడీపీ అభ్యర్థులు 42 మంది ఉండగా, బీజేపీ నుంచి 8 మంది, జనసేన అభ్యర్థులు 10మంది ఉన్నారు. ఇక, 604 మంది కోటీశ్వరులు అసెంబ్లీకి పోటీచేస్తున్నారు. వీరిలో వైసీపీ నుంచి 165, టీడీపీ 134, జనసేన 18, బీజేపీ 8, కాంగ్రెస్ 79, సీపీఎం, సీపీఐ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. తాజా ఎన్నికల్లో 229(10%) మంది మహిళలు పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో 193మంది పోటీ చేయగా ఈసారి ఆ సంఖ్య పెరిగింది. అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్), ఏపీ ఎలక్షన్ వాచ్ ఈ వివరాలను తమ నివేదికలో వెల్లడించాయి. మొత్తం అభ్యర్థుల్లో 543 మందిపై క్రిమినల్ కేసులు, 374 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. వైసీపీ 87, టీడీపీ 42, కాంగ్రెస్ 42, జనసేన 10, బీజేపీ 8, సీపీఎం, సీపీఐలో ఐదుగురి చొప్పున అభ్యర్థులపై క్రిమినల్ కేసులన్నాయి. తీవ్రమైన నేరాలకు సంబంధించి వైసీపీ 49, టీడీపీ 85, కాంగ్రెస్ 20, జనసేన 7, బీజేపీ 5, సీపీఎం 3, సీపీఐ ఇద్దరు అభ్యర్థులపై కేసులున్నాయి. అసెంబ్లీ బరిలో మొత్తం 2,387 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకి అత్యధికంగా రూ.931కోట్ల ఆస్తులున్నాయి. రూ.824 కోట్లతో నెల్లూరు సిటీ బరిలో ఉన్న టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ రెండోస్థానంలో ఉన్నారు. వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ రూ.757 కోట్ల ఆస్తితో మూడో స్థానంలో ఉన్నారు. అత్యధిక అప్పులు ఉన్న వారిలో టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతికి రూ.197 కోట్లు, నారాయణ పొంగూరుకు రూ.190 కోట్లు ఉన్నాయి. అత్యధికంగా సీఎం జగన్ కుటుంబానికి ఏడాదికి రూ.73 కోట్లు ఆదాయం ఉంది. జగన్ ఒక్కరికే ఏడాదికి రూ.57 కోట్ల ఆదాయం ఉంది. రెండో స్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థి జనార్ధన్‌రెడ్డి కుటుంబానికి రూ.37 కోట్లు, వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి కుటుంబానికి 34కోట్ల ఆదాయం ఉంది. విద్యార్హతల విషయంలో.. 1,055 మంది అభ్యర్థులు 5 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు. 1,079 మంది డిగ్రీ లేదా ఆపై విద్యార్హతలు కలిగి ఉన్నారు. 120 మందికి డిప్లొమాలు ఉన్నాయి.86 మంది నిరక్షరాస్యులున్నారు.

వైసీపీ కోసం.. లూప్‌లైన్ 'వ్యూహం'

- జగన్ వీరభక్త పోలీసు అధికారుల ఎత్తుగడ
- ఉభయ గోదావరి, ఉత్తరాంధ్రకు లూప్‌లైన్ సిబ్బంది
- సీమకు పొరుగు పోలీస్.. రాజధాని జిల్లాల్లో మనోళ్లే
- ఈ కుట్రను కొత్త డీజీపీ పసిగట్టి సరిదిద్దుతారా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"రాయల సీమలో వైసీపీ బలంగా ఉంది. దౌర్జన్యాలు చేసినా మన ఎస్‌హెచ్‌వోలే ఉంటారు కాబట్టి ఇబ్బంది లేదు. పొరుగు రాష్ట్రాలకు చెందిన బలగాలను ఇక్కడ పెడితే వారు స్థానిక ఎస్‌హెచ్‌వోలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. కానీ, లూప్‌లైన్ విభాగాల్లో ఉన్న వారిని మాత్రం ఇటు రానీయొద్దు. అక్కడున్నది అధికార పార్టీపై అసంతృప్తులు. వారితో ఇబ్బంది"- ఇదీ వైసీపీ వీరభక్త ఉన్నతస్థాయి పోలీసు అధికారుల మధ్య గత నెలలో జరిగిన చర్చ. ఎన్నికల్లో ఎలాగైనా అధికార వైసీపీని గెలిపించే బాధ్యత భుజాన వేసుకున్న కీలక అధికారులు సమావేశమై పలు వ్యూహాలు పన్నే క్రమంలో ఈ ఆసక్తికర అంశాన్ని ఇతర పోలీసులు పసిగట్టారు. ఎన్నికల సమయంలో పోలీసు వ్యవస్థ కీలకం కావడంతో బలగాల మోహరింపులో కుట్ర చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల్లో ఎక్కడికక్కడ ఎత్తులు, పైఎత్తులు వేస్తూ ఎలాగైనా గెలవాలని చూస్తున్న వైసీపీకి కలిసి వచ్చేలా అధికార పార్టీ బలంగా ఉన్న చోట ఒక విధంగా.. ప్రతిపక్షాలు బలంగా ఉన్న ప్రాంతాల్లో మరోలా బందోబస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. రాయలసీమ జిల్లాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా మినహా కర్నూలు, కడప, చిత్తూరులలో తాము బలంగా ఉన్నట్లు వైసీపీ విశ్వసిస్తోంది. అక్కడ ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు బలంగా పోటీ ఇచ్చే చోట అల్లర్లు చేసైనా గెలిచేందుకు కుట్ర చేసినట్లు రాజకీయ వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాంటి కుట్రలకు బలం చేకూర్చేలా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుంచి వచ్చే పోలీసు బలగాలను రాయల సీమ జిల్లాల్లో మోహరించారు. దీంతో అక్కడ ఎలాంటి ఉల్లంఘనలు చేసినా పొరుగు రాష్ట్రాల పోలీసులకు అర్థం కాదు. ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో వైసీపీ అనుకూల పోలీసులే సరిపడా ఉన్నారు. అయినప్పటికీ కేంద్ర బలగాలు కూడా కొన్ని వచ్చాయి. ఈ జిల్లాల్లో పూర్తి ఏకపక్షంగా ఉన్న నియోజకవర్గాలను వదిలేసి 'నువ్వా నేనా' అన్నట్టుగా ఉన్న నియోజకవర్గాల్లో మాత్రం వీలైనంత మేర అక్రమాలు చేసేందుకు అధికార పార్టీ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. పల్నాడు ప్రాంతంలో గతంలో హింసాత్మక ఘటనలు దృష్టిలో పెట్టుకుని కేంద్ర బలగాలు గట్టిగా పనిచేసేందుకు ప్రయత్నించినా.. ఇప్పటి వరకు అక్కడున్న లోకల్ పోలీసు అధికారులతో కుట్ర అమలుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలకు పూర్తిగా లూప్‌లైన్ విభాగాల సిబ్బందిని ఎన్నికల విధుల్లో దించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ, ఎస్‌పీఎఫ్, ఏపీఎస్పీ, సీఐడీ, జీఆర్పీ, పీటీసీ, ఆర్టీసీ, అగ్నిమాపక, ఎర్రచందనం యాంటీ ఫోర్స్ తదితర విభాగాల నుంచి 2,598 మంది సిబ్బందిని ఎన్నికల విధుల కోసం తీసుకున్నారు. వారిని రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కాకుండా ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మాత్రమే మోహరించారు. దీనికి కారణం అక్కడ ప్రతిపక్షాలు బలంగా ఉండటమేనని పోలీసు వర్గాలే చెబుతున్నాయి. శాంతి భద్రతల విభాగంలో ఉన్న పోలీసులు అధికార పార్టీకి అడ్డగోలుగా పనిచేస్తుంటే లూప్‌లైన్ విభాగాల్లో ఉన్న వారు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అయితే, ఎన్నికల విధుల నుంచి దూరమైన పోలీసు ఉన్నతాధికారులే ఈ స్కెచ్ వేసినట్టు చర్చసాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత డీజీపీ దీనిని పసిగట్టి సరిదిద్దుతారా? లేక సమయం లేదని ఊరుకుంటారా.. అనేది చూడాలని సీనియర్ అధికారులు భావిస్తున్నారు.

వైసీపీకి వ్యతిరేకంగా ప్రజలు: సీపీఐ రామకృష్ణ

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా ప్రధాని మోదీకి ఊడిగం చేసిన జగన్ ఇప్పుడు అదే మోదీని విమర్శిస్తుండటం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని తెలిసే మోదీ.. చంద్రబాబుతో కలిశారని చెప్పారు. గురువారం విజయవాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోదీని అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో జగన్ అప్రజాస్వామిక, అరాచక పాలన చేశారని విమర్శించారు.

నేడు ఐదు చోట్ల 'ప్రజాగళం'.. పాల్గొననున్న చంద్రబాబు

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం ఒక్కరోజే ఐదు చోట్ల ప్రజాగళం సభల్లో పాల్గొననున్నారు. ఉండి, ఏలూరు, గన్నవరం, మాచర్ల, ఒంగోలు నియోజకవర్గాల్లో ప్రజాగళం సభలకు చంద్రబాబు హాజరుకానున్నారు. అలాగే శనివారం మూడు చోట్ల నిర్వహించనున్నారు. ప్రచార గడువు ముగిసే నాటికి 90 నియోజకవర్గాల్లో చంద్రబాబు సభలు పూర్తికానున్నాయి.

ప్రజల్లో మార్పునకు కారణాలేమిటి?

ప్రధాన కారణం మాట తప్పడం. ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తానని.. మద్య నిషేధం చేస్తానని చెప్పి మాట తప్పడం.. మెగా డీఎస్సీ, జాబ్ కేలెండర్‌పై మాట తప్పడం.. మద్యం వ్యాపారం గుప్పిట్లోకి తీసుకోవడం.. ఇవన్నీ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. కానీ ఏం చేయాలో వారికి అర్థం కావడం లేదు. అందుకే పార్టీలుగా మేం వారికి దిశానిర్దేశం చేస్తున్నాం. కొంత మంది దిగువ మధ్యతరగతి మహిళలు నా వద్దకు వచ్చినప్పుడు.. ప్రభుత్వంపై అసంతృప్తి ఎందుకు.. పథకాలు అందడం లేదా అని అడిగాను. అన్నీ అబద్ధాలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని... మద్య నిషేధం చేస్తామన్నారని.. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పారని.. తర్వాత చేయలేదని చెప్పారు. ఈ ప్రభుత్వం ఏం చేసినా దాని వెనుక ఒక స్కాం ఉంటోంది. ఎయిడెడ్ స్కూళ్లకు వీలైతే సాయం అందించాలి.. లేకపోతే ఊరుకోవాలి. కానీ వాటి స్థలాలపై కన్నేసి స్వాధీనం చేసుకోవాలని.. లేదా ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నించారు. రూ.3-4 వేలు ఉండే ఫీజులను రూ.25 వేలు చేశారు. వీటిపై ప్రశ్నించాలనుకుంటే ఎవరూ నోరు తెరవలేనంత అరాచకాన్ని పెంచి పోషించారు. పట్టణ ప్రాంతాల్లో రౌడీయిజానికి హద్దు లేకుండా పోయింది. గంజాయి బ్యాచ్‌లు, పిచ్చి మందు తాగినవారి పూనకాలు అదనం. సమాజంలో ప్రతి వర్గం ఈ ప్రభుత్వ హయాంలో బాధలు పడింది. అణచివేతకు గురైంది. చివరకు రిటైర్డ్ ఉద్యోగులు కూడా రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. డబ్బు పోతే పోయింది. కానీ ఐదేళ్లలో ఇరవై ఏళ్లపాటు రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లారు. పోలవరం నిలిచిపోయింది. అమరావతి నిలిచిపోయింది. ఇదేమిటని ప్రశ్నిస్తే కులం పేరు పెట్టి తిడతారు.

ఈ సమస్యలకు ప్రత్యామ్నాయ ప్రణాళిక మీ వద్ద ఉందా?

ముందు నిలబడితే తర్వాత ప్రత్యామ్నాయ ప్రణాళిక వస్తుంది. నలుగురు కూర్చుని చర్చిస్తే ప్రణాళిక రూపొందడం పెద్ద కష్టం కాదు. కొత్తగా అద్భుతాలు చేయాలని ప్రజలు కోరుకోవడం లేదు. ఉన్నవి సక్రమంగా చేస్తే చాలనుకుంటున్నారు. ఉదాహరణకు.. చిన్న నీటి వనరులు, మధ్య తరహా ప్రాజెక్టులకు కనీస నిర్వహణ ఈ ప్రభుత్వంలో కరువైంది. ముందు వీటిని సవ్యంగా నిర్వహించి ఆ తర్వాత కొత్త పనులు చేపట్టాలని ప్రజలు కోరుకొంటున్నారు. అన్ని రంగాల్లో ఇవే ఆలోచనలు ఉన్నాయి.

రాష్ట్రంలో మార్పు రావాలన్న కోరిక ప్రజల్లో ముందు నుంచీ బలంగా ఉంది. అది ఇంకా పెరుగుతూ వస్తోంది. 2019 ఎన్నికల్లో కూడా టీడీపీ, జనసేనలకు వచ్చిన ఓట్లు కలిపి చూస్తే ఆ రోజూ ప్రజలు మావైపే ఉన్నారు. ఇప్పుడు తటస్థుల్లోనూ మార్పు వచ్చింది.

తమను ఎవరైనా ప్రశ్నిస్తే వారిని పచ్చి బూతులు తిడుతున్నారు. పొద్దున్నే టీవీ పెట్టాలంటే అసహ్యం కలిగేన్ని బూతులు. రోడ్ల మీద గుంతల గురించి అడిగినా బూతులతో తిట్లే. ప్రజలు దేనినైనా భరిస్తారు గానీ అరాచకాన్ని భరించలేరు. - పవన్ కల్యాణ్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

తాగేవాళ్లనే తాకట్టు పెట్టాడు..

ప్రజల ఆస్తులను పెట్టడా?

అమరావతి, మే 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే 15 ఏళ్లపాటు ఈ రాష్ట్రంలో మద్యపానంపై ఎంత ఆదాయం వస్తుందో లెక్కగట్టి దానిని తాకట్టు పెట్టి సీఎం జగన్ అప్పులు తెచ్చారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. తేలికైన భాషలో చెప్పాలంటే మద్యం తాగేవాళ్లనే తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని.. ఇది చేసిన వాళ్లు రేపు రాష్ట్రంలో ప్రజల ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు తేరని గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. పర్యావరణ నిబంధనలు, కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జడ్) నిబంధనలను తుంగలో తొక్కి విశాఖలో రుషికొండ మీద అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడ్డారని, చట్టాలను తుంగలో తొక్కి వ్యవహరించడానికి అలవాటు పడిన ఈ ముఖ్యమంత్రి రేపు లాండ్ టైటిలింగ్ చట్టానికి వక్ర భాష్యం చెప్పి ప్రజల ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి అప్పులు తెచ్చినా తేగలడని.. తనకు ఏదైనా సాధ్యమేనని అనేక సార్లు నిరూపించుకున్నారని ఆయన వ్యాఖ్యానించారు. గురువారమిక్కడ మంగళగిరిలోని తమ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. లాండ్ టైటిలింగ్ చట్టం సహా అనేక అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. రైతుల పట్టా పుస్తకాల మీద జగన్ ఫొటో ముద్రించడంపై మండిపడ్డారు. రైతుల పొలాల్లో సరిహద్దుల వద్ద ముఖ్యమంత్రి ఫొటోతో సరిహద్దు రాళ్లు పాతడం ఏం పద్ధతని నిలదీశారు. 'అంటే నా ఆస్తి మీరు తీసుకుంటున్నారని చెప్పడమా? నేను ఇచ్చేవాడిని.. మీరు నా చెప్పుచేతల్లో ఉండేవారని పరోక్షంగా చాటడమా? ప్రాణాలు త్యాగం చేసి తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం సాధించిన పొట్టి శ్రీరాములు తన ఫొటో ఎక్కడైనా ఉండాలని కోరుకున్నారా? జగన్ చేష్టలు ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నాయి. ఆయనలా ప్రధాని మోదీ ప్రజల పాస్‌పోర్టుల మీద తన ఫొటో వేసుకుంటున్నారా? ప్రధానమంత్రి యోజన అని పథకం పేరు పెట్టారు గానీ నరేంద్ర మోదీ యోజన అని పెట్టుకున్నారా? లాండ్ టైటిలింగ్ చట్టంలో భూ వివాదాల్లో కోర్టుల ప్రమేయం లేకుండా చేయడం మరీ దుర్మార్గం. ఏదైనా తగాదా వస్తే పోలీసు స్టేషన్‌కో లేదా సివిల్ కోర్టుకో ప్రజలు వెళ్తారు. అది తీసివేసి హైకోర్టుకు మాత్రమే వెళ్లాలంటే ఎంత మందికి సాధ్యం? కోర్టులు తటస్థంగా, నిష్పాక్షికంగా ఉంటాయి కాబట్టి ఎవరైనా వివాదం వస్తే కోర్టులో తేల్చుకోవాలనుకుంటారు. దాని పాత్ర తొలగించడం ద్వారా ఏం సాధించాలని అనుకుంటున్నారు? ఇదేమిటని అడిగితే కేంద్ర చట్టమంటూ సాకులు చెబుతున్నారు. కేంద్రం అనేక చట్టాలకు సంబంధించి ముసాయిదాలు పంపించి తప్పొప్పులు, సాధ్యాసాధ్యాలు చూసుకోమని చెబుతుంది. అది వీళ్లు చూసుకోవాలి. కేంద్రం స్మార్ట్ సిటీలు చేయాలని చెప్పింది.. జల్‌జీవన్ మిషన్ కింద గ్రామాలకు నీళ్లు ఇవ్వాలని చెప్పింది. ఇవన్నీ చేశారా? పైగా లాండ్ టైటిలింగ్ చట్టాన్ని తమకు కావలసినట్లు రాసుకున్నారు. లాండ్ టైటిలింగ్ అధికారిగా ప్రభుత్వ ఉద్యోగిని పెట్టాలి. కానీ ప్రభుత్వ ఉద్యోగి అని తీసివేసి ఎవరినైనా పెట్టుకోవచ్చని చట్టంలో రాశారు. అంటే సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఇళ్లలో ఉండేవారిని ఆ పోస్టులో పెడతారా? అందుకే ప్రజల్లో దీనిపై తీవ్రమైన భయసందేహాలు నెలకొన్నాయి. దానినే మేమూ ప్రశ్నిస్తున్నాం' అని ఆయన వివరించారు. ఇంటర్వ్యూలో ఇతర ముఖ్యాంశాలు..



● ఈ ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి?

పవన్: ప్రజల మూడ్ చూస్తుంటే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని ఖాయంగా అర్థమవుతోంది. ఇన్ని సీట్లు వస్తాయని చెప్పను గానీ.. వైసీపీకి తిరిగి అధికారంలోకి వచ్చే దారులు మూసుకుపోయాయి. ప్రజా సమూహాల మనోభావాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఇప్పుడు అధికారంలో ఉన్న వ్యక్తి రైటు కాదని బలంగా భావిస్తున్నారు. మీరైనా నలుగురితో మాట్లాడితే ఈ విషయం అర్థమైపోతుంది.

? వైసీపీ వ్యతిరేక ఓట్ల చీలికను నివారించాలన్న ఆలోచన ఎలా మొదలైంది?

రాష్ట్రానికి రాజకీయ స్థిరత్వం ముఖ్యం. తెలంగాణ ఆర్థికంగా బలమైన రాష్ట్రం. అక్కడ బలమైన నాయకత్వం కూడా ఉంది. మన వద్ద రాజకీయ స్థిరత్వం ఉంటేనే రాష్ట్రం ముందుకు వెళ్లగలుగుతుంది. రకరకాల శక్తుల చేతిలో ప్రజలు చీలిపోయి ఉన్నారు. వారిని ఒకతాటిపైకి తేవడానికి ఐక్యత అవసరం. 2014లో ఇదే ఆలోచన చేశాను. 2024లో ఈ అవసరం మరింత బలంగా కనిపించింది.

? చంద్రబాబు అరెస్టు సమయంలోనే పొత్తు ప్రకటన చేయడానికి ప్రేరణ ఏమిటి?

అరెస్టుకు, పొత్తుకు సంబంధం లేదు. అనేకానేక సంఘటనల్లో ఆయన అరెస్టు ఒకటి మాత్రమే. ఎప్పటి నుంచో నా మనసులో ఉంది. ఆ సమయంలో దానిని బయట పెట్టాను. ఇక దీనిని సాగదీయకుండా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆ రోజు ప్రకటించాను. వ్యక్తుల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటాయి. టీడీపీలో కూడా కొందరు నేతలకు, నాకు మధ్య గతంలో మాటల వివాదం ఉంది. కానీ వాటిని పక్కన పెట్టాను. ప్రజాస్వామ్యంలో కత్తులు, కఠార్లతో పోరాటం ఉండదు. మాట కలిస్తే భావాలు కూడా కలుస్తాయి.

సీఎం జగన్‌పై పవన్ ఫైర్

మీ పెళ్లిళ్లు సహా అనేక విషయాల్లో మిమ్మల్ని కించపరిచారు. ఇవన్నీ ఎందుకు పడాలని ఎప్పుడైనా అనిపించిందా?

సినిమాల్లోకి రాక ముందు నేను తీవ్రమైన ప్రజా ఉద్యమాలకు సిద్ధంగా ఉండేవాడిని. ఏదైనా సంఘటన జరిగితే ప్రాణాలు అర్పించడానికి కూడా సిద్ధపడి వెళ్లిపోవాలని అనుకున్నాను. కానీ అలాంటి సంఘటనేదీ జరగలేదు. ప్రాణాలు అర్పించడానికి సిద్ధపడిన వాడికి ఇవన్నీ చిన్న చిన్న విషయాలు. కోపం వస్తుంటుంది. కానీ నియంత్రించుకుంటున్నాను.



? ఎన్నికలు సవ్యంగా జరగవేమోనని జగన్ అంటున్నారు..?

ఆయన పంచాయతీ ఎన్నికలను సవ్యంగా జరగనిచ్చారా? మేమంటే కొత్త పార్టీ. టీడీపీని కూడా ఆ ఎన్నికల్లో ఎంత హింస పెట్టాడు? నామినేషన్లు వేయడానికి వెళ్తే దాడులు చేసి తరిమికొట్టారు.

? సినీ హీరోగా మీ సభలకు ప్రజలు వేలు... లక్షల సంఖ్యలో వస్తారు. అవన్నీ ఓట్లుగా మారతాయా?

అలా మారకపోతే నా పార్టీ ఎక్కడ ఉండేది? వచ్చేవారు నిలబడ్డారు కాబట్టే మా పార్టీ నిలబడింది. లక్ష మంది వస్తే అందరూ పార్టీలో నిలబడకపోవచ్చు. ప్రజారాజ్యం పార్టీలో అభిమానం ఏమిటో.. రాజకీయం ఏమిటో చూశాను. ఎన్టీఆర్ తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చినా అతి స్వల్ప కాలంలోనే తిరుగుబాటు ఎదుర్కోవలసి వచ్చింది. నాకు సమూహ బలం ఉంది. పోరాడే శక్తీ ఉంది. అది ఉండబట్టే విశాఖలో, ఆంధ్రా బోర్డర్‌లో పోరాడాను. నా వెనుక కేడర్ వచ్చారు. వారింకా ఈ తరహా పోరాటాలకు అలవాటు పడాలి. ఎన్నికలు ఏమిటి.. ఎత్తుగడలు ఏమిటి.. ఎన్నికల పోరాటం ఏమిటి.. ఇలా చాలా నేర్చుకోవాలి.

? షణ్ముఖ వ్యూహంలో స్కిల్ సెన్సస్ పథకం పెట్టారు.. ఆ ఆలోచన ఎలా వచ్చింది..

ప్రజలతో, యువతతో మాట్లాడితే వారి సమస్యలు తెలుస్తాయి. నేను రోడ్డు మీద వెళ్తుంటే ఒక యువకుడు.. అన్నా.. మాకు 25 కేజీల బియ్యం కాదన్నా.. 25 ఏళ్ల భవిష్యత్ చూపించాలని అడిగాడు. అంటే నా భవిష్యత్ అగమ్యగోచరంగా ఉంది.. ఏదైనా చేయండి, పని కల్పించండి, గైడెన్స్ ఇవ్వమని అడిగాడు. సమాజంలో యువతకు గైడెన్స్ ఇచ్చే వాళ్లు ఎంత మంది ఉంటారు? నేను ఫలానా కులంలో పుట్టాను.. నా తల్లిదండ్రులు ఆ వృత్తి చేసుకుంటున్నారు. నాకు ఇంకేదో అవ్వాలని ఉంటుంది. కానీ నేను ఈ పనే చేసుకుంటూ ఉండిపోయానని ప్రతి యువకుడూ భావిస్తున్నాడు. వారి మనసులో ఏదో ఒకదానిపై నైపుణ్యం పెంచుకోవాలని ఉంది. టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ)పై ఆసక్తి ఉంది. కానీ చాలా మంది చదువుకోలేకపోయారు. 18-19 ఏళ్లు వచ్చే వరకూ యువతలో చాలా మందికి ఏం కావాలో తెలియదు. అలాంటి వారిని అడగాలి కదా..! ఇక్కడి నుంచి 10, 15 ఏళ్ల వాళ్లే దేశ భవిష్యత్.. బ్రిటిష్ వాళ్లు ఉపాధి కల్పించలేక, భారం తగ్గించుకునేందుకు యువతకు మత్తు అలవాటు చేశారు. ఒక తరాన్ని ఐదేళ్లు నిర్వీర్యం చేస్తే చాలు కదా యువత భవిత నాశనం అవ్వడానికి, ప్రభుత్వానికి భారం తగ్గడానికి! ఇది కరెక్టు కాదు. యువతలో నైపుణ్యం బయటకు తీయాలనే స్కిల్ సెన్సస్ పెట్టాం.

? మీరు వైఎస్‌ను.. జగన్‌ను చూశారు... తేడా ఏమిటి?

వైఎస్ రాజశేఖరరెడ్డికి వయసు, అనుభవం ఉన్నాయి. అనుభవం వల్ల ఏది.. ఎక్కడ ఆపాలో ఆయనకు తెలుసు. జగన్‌కు అహంకారం వల్ల అది తెలియడం లేదు. ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. ప్రజలు ఒక స్థాయి వరకూ భరిస్తారు. ఆ తర్వాత ప్రశ్నించడం మొదలు పెడతారు. ఇప్పుడు అదే జరుగుతోంది.

? కూటమి అధికారంలోకి వస్తే మీ పాత్ర ఏమిటి..?

చాలా నిర్మాణాత్మకంగా ఉంటుంది. ఎందుకంటే నేను పని చేస్తాను.. చేయిస్తాను. ఇందులో రాజీపడే ప్రసక్తే లేదు.

? కూటమి పదేళ్లు కొనసాగాలని అభిలషిస్తున్నారు.. సాధ్యమేనా..?

ముందు సందేహాలతో ఎందుకు మొదలుపెట్టాలి? వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వను అన్నప్పుడు సాధ్యాసాధ్యాల గురించి ఆలోచించలేదు. ముందు ప్రయత్నం చేయాలి. భగీరథ ప్రయత్నం చేయాలి. ఆకాశం నుంచి గంగనే తీసుకొచ్చారు.. ఇవీ అంతకంటే పెద్దవి కావు కదా! పోలవరం లాంటి ప్రాజెక్టు భగీరథ ప్రయత్నమే కదా.. అది సాధ్యమైంది. కొంత మంది వ్యక్తుల వల్ల నిర్మాణం ఆగింది. ఏదైనా మానవ మేధస్సు, పట్టుదలపై ఆధారపడి ఉంటుంది.



? పదేళ్లు పార్టీ కోసం చాలా మంది కష్టపడ్డారు, ఇప్పుడు అసంతృప్తిలో ఉన్నారు.. వారికి ఎలాంటి భరోసా ఇస్తారు?

వ్యక్తులు, నాయకులు బతకాలంటే పార్టీ బతకాలి. పార్టీని బతికించడం వేరు. నిర్మాణాత్మకంగా, ప్రజలను ప్రభావితం చేయగలిగే స్థాయిలో పార్టీ ఉండడం వేరు. అది అందరూ అర్థం చేసుకోవాలి. ఒకరిద్దరు నాయకులు తప్ప మెజారిటీ నాయకులు అర్థం చేసుకున్నారు. అలాంటి వారికి సముచిత స్థానం కల్పిస్తాం. మంచి స్థానం ఇవ్వాలంటే ముందు ప్రభుత్వాన్ని స్థాపించాలి.

? కూటమి ఇంత భారీగా ఫైట్ చేస్తోంది.. పొరపాటున మళ్లీ జగనే అధికారంలోకి వస్తే..?

ప్రస్తుత పరిస్థితుల్లో ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఎందుకంటే జగన్ ఓడిపోతున్నారు.

ఎప్పుడో బటన్ నొక్కి

ఇప్పుడు డబ్బులా?

- పోలింగ్‌కు ముందు నగదు బదిలీ కుదరదు.. ముగిశాకే ఇవ్వండి
- సీఎస్‌కు ఎన్నికల కమిషన్ ఆదేశాలు

అమరావతి, మే 9 (ఆంధ్రజ్యోతి): జగన్ అప్పుడెప్పుడో నొక్కిన బటన్‌లకు పోలింగ్ ముందు డబ్బులు ఇవ్వడం కుదరదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. రెండు రోజులు ఆగి, సోమవారం పోలింగ్ ముగిసిన తర్వాతే డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సీఎం జగన్ ఈ ఏడాది జనవరి నుంచి ఊరూరికీ వెళ్లి ఉత్తుత్తి బటన్‌లు నొక్కారు. డబ్బులు మాత్రం లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయలేదు. సరిగ్గా పోలింగ్ ముందు ఖాతాల్లో వేసి... రాజకీయంగా లబ్ధి పొందేలా ప్రణాళిక రచించారు. దీనిపై ఈసీ తీవ్రంగా స్పందించింది. ఇప్పుడు నగదు బదిలీకి వీల్లేదని, పోలింగ్ ముగిశాకే చేయాలని ఆదేశించింది. ఏయే పథకానికి ఎప్పుడు బటన్ నొక్కారు, ఎంత జమ చేయాల్సి ఉందో తన ఉత్తర్వుల్లో ప్రస్తావించింది.

ఎప్పుడెప్పుడో నొక్కి....

"ఈ ఏడాది జనవరి 23న ఆసరా, మార్చి 1న విద్యా దీవెన, మార్చి 6 రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, మార్చి 7 చేయూత, మార్చి 14న ఈబీసీ నేస్తం పథకాలకు జగన్ బటన్ నొక్కారు. వీటికి సంబంధించి రూ.14,165 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాలి. కానీ, డబ్బులు మాత్రం వేయలేదు. డీబీటీ పథకాలకు సాధారణంగా 24 గంటల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు పడిపోవాలి. ఏదైనా సమస్య ఉంటే 48 గంటల్లోగా జమ కావాలి. అలాంటిది జనవరిలో బటన్ నొక్కిన పథకాలకూ నిధులు ఆపేశారంటే... ఇదంతా ఉద్దేశపూర్వకమే అని అనుకోవాల్సి వస్తోంది" అని ఈసీ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఎన్నికల బరిలో సమాన అవకాశాలు దెబ్బతీసేందుకు 12, 13 తేదీల్లో లబ్ధిదారుల ఖతాల్లోకి డబ్బులు బదిలీ చేయాలని భావిస్తున్నట్టు తమ వద్ద సమాచారం ఉందని తన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలంటే డీబీటీని 13వ తేదీ తర్వాతే చేపట్టాలని హెచ్చరించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన మొత్తం వివరాలను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల్లోపు తమ నివేదిక ఇవ్వాలని ఈసీ ఆదేశించింది.

48 గంటలు సైలెంట్ పీరియడ్!

1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 126 ప్రకారం ఎన్నికలకు 48 గంటల ముందు ప్రభుత్వం, పార్టీలన్నీ సైలెంట్‌గా ఉండాలని... 11, 12 తేదీలు సైలెంట్ పీరియడ్‌లోకి వస్తాయని ఈసీ తెలిపింది. ఈ సమయంలో ప్రభుత్వ నిధుల విడుదల చట్ట విరుద్ధమని వెల్లడించింది. "ప్రవర్తనా నియమావళిలోని 7వ పేరాగ్రాఫ్ ప్రకారం అధికారంలో ఉన్న పార్టీ, తన 'పవర్'ను ఎన్నికల ప్రచారానికి వాడుకోకూడదు. ఇప్పుడు ఆయా పథకాలకు నగదు బదిలీ చేయడమంటే దీనిని ఉల్లంఘించడమే. ఒక్కసారి కోడ్ అమల్లోకి వచ్చాక మంత్రులు గానీ, అధికారులు గానీ నగదు బదిలీలు చేయకూడదు" అని సీఎస్ జవహర్‌రెడ్డికి స్పష్టం చేసింది.



నేటి వరకు ఈసీ ఉత్తర్వులు పక్కన పెడుతున్నాం

11 నుంచి 13 వరకు నిధుల పంపిణీ వద్దు

- పంపిణీపై మీడియాలో ప్రచారం చేయొద్దు
- రాజకీయ నేతల ప్రమేయం నిరోధించండి
- మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు
- తదుపరి విచారణ జూన్ 27కు వాయిదా

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికలకు ముందు, ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు చేయూత, విద్యాదీవెన, ఆసరా,ఈబీసీ నేస్తం పథకాల నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పోలింగ్ తేదీ ముగిసిన తరువాతే పథకాల నిధులను పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం గురువారం ఇచ్చిన ఉత్తర్వుల అమలును, ఈ నెల 10వరకు తాత్కాలికంగా పక్కన పెడుతున్నామని పేర్కొంది. నిధుల విడుదలకు సంబంధించి ప్రింట్, ఎలక్ట్రానిక్, రేడియో, ఇంటర్నెట్, ఇతర ప్రసార మాధ్యమాల్లో ఎలాంటి ప్రచారం చేయవద్దని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉత్సవాలు జరపవద్దని, రాజకీయనేతల ప్రమేయాన్ని నిరోధించాలని తేల్చిచెప్పింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన వ్యాజ్యాలపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించారు. విచారణను జూన్ 27కి వాయిదా వేశారు. రాష్ట్రంలో పోలింగ్ ముగిసిన (మే13) తరువాత రోజు నుంచి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు చేయూత, విద్యాదీవెన, ఆసరా,ఈబీసీ నేస్తం పథకాల నిధులను లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయవచ్చునంటూ ఈసీ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం, అత్యవసరంగా ఎందుకు పంపిణీ చేయాలనుకుంటున్నారో కారణాలు పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి తాజాగా వినతి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి దానిపై నిర్ణయాన్ని తీసుకోవాలని, ఆ వివరాలను కోర్టు ముందు ఉంచాలని ఈసీని ఆదేశించింది. ఈ అంశం గురువారం విచారణకు రాగా ఉదయం 10.30 నుంచి సాయంత్రం 3.30 వరకు సుదీర్ఘ వాదనలు జరిగాయి.

సంతృప్తికరంగా లేని సర్కారు వినతి : ఈసీ

కేంద్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. "వివిధ పథకాల లబ్ధిదారులకు దాదాపు రూ.14,165 కోట్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరింది. పోలింగ్ తేదీ మే 13 తరువాత ఎప్పుడైనా ఆ నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో వేసేందుకు అనుమతించాం. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు సొమ్ము పంపిణీ చేయవద్దని గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించాం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సమాన అవకాశాలను(లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్) దెబ్బతీయకుండా, లబ్ధిదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం. కోడ్ అమల్లో ఉన్నప్పటికీ సొమ్ము పంపిణీ చేసేందుకు ప్రభుత్వానికి అనుమతి ఇచ్చాం. పథకాల సొమ్ము విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కేవలం కొద్దిమంది లబ్ధిదారులు మాత్రమే కోర్టును ఆశ్రయించారు. ఫలానా తేదీ లోపలే సొమ్ము తమ ఖాతాల్లో జమ చేయాలని కోరే చట్టబద్ధమైన హక్కు పిటిషనర్లకు లేదు. పథకాల లబ్ధిదారులమని నిరూపించుకొనేందుకు ఎలాంటి ఆధారాలను కోర్టు ముందు ఉంచలేదు. పథకాల నిధుల విడుదల ప్రకటన చేసిన 3 నుంచి 5 నెలల తరువాత పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. కోడ్ కొత్త పథకాలతోపాటు అమల్లో ఉన్న పథకాలకు సైతం వర్తిస్తుంది. కోర్టు పరిశీలనలో ఉన్న ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం పథకాల లబ్ధిదారులకు ఏడాదికి ఒకసారి సొమ్మును జమ చేస్తారు. నాలుగు రోజులు వారికి సొమ్ము జమ చేయకపోవడం వల్ల ఎలాంటి నష్టం జరగదు. కరువుబారిన పడి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆరునెలల క్రితం గుర్తించింది. ఇప్పటివరకు వారికి సొమ్ము జమ చేయకుండా జాప్యం చేసి పోలింగ్ జరిగే ఒకటి రెండు రోజుల ముందు జమ చేస్తామనడం సరికాదు. కోడ్ అమల్లోకి రాకముందే పథకాల నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమచేసేందుకు ఇంత జాప్యం ఎందుకు జరిగిందో రాష్ట్రప్రభుత్వం సమర్పించిన వినతిలో పేర్కొన్న కారణాలు ఆమోదయోగ్యంగా లేవు. దీనిపై వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రాశాం. పోలింగ్ తేదీ తరవాత పథకాల నిధులు పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం సహేతుకమైన షరతులే విధించింది. ఈ నేపథ్యంలో వ్యాజ్యాలను కొట్టివేయాలి" అని కోరారు.

నిధుల విడుదలకు ఆదేశించండి: ప్రభుత్వం

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి, న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపించారు. 'ఇప్పటికే అమల్లో ఉన్న పథకాల అమలును అడ్డుకోవడానికి వీల్లేదు. ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం పథకాల నిధుల విడుదలను సైతం పోలింగ్ ముగిసేవరకు ఆపాలని ఈసీ ఆదేశించింది. ఈ పథకాలు కొత్తవి కాదు. మూడేళ్లుగా అమల్లో ఉన్నవే' అని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. "నిధుల పంపిణీకి అనుమతి ఇవ్వాలని స్క్రీనింగ్ కమిటీ ముందుగానే ప్రతిపాదనలు పంపించింది. నిర్ణయం వెల్లడించకుండా ఈసీయే జాప్యం చేసింది. నిధుల పంపిణీకి అనుమతించాలి" అని కోరారు.

ఐదు నెలలు ఆపేసి అర్ధరాత్రి హంగామా!

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): నాలుగైదు నెలల కిందట నొక్కిన బటన్ డబ్బులు ఎన్నికల ముందు జమ చేసేందుకు సర్కారు హడావుడి మొదలుపెట్టింది. అర్థరాత్రి, ఆగమేఘాల మీద కసరత్తు మొదలుపెట్టి.. బ్యాంకులు తెరవగానే లబ్ధిదారుల ఖాతాల్లో పడిపోయేలా పావులు కదుపుతోంది. మరో 2 రోజులు గడిస్తే పోలింగ్ ఉందనగా, ఎంచక్కా ప్రభుత్వధనంతో, అధికారికంగా ఓట్లు 'కొనే' వ్యూహం రచించింది. అప్పుడెప్పుడో బటన్ నొక్కి ఇప్పుడు నిధులు జమ చేయడం నిబంధనలకు విరుద్ధమని గురువారం ఉదయం ఈసీ ఉత్తర్వులు ఇవ్వగా... దానిని ఒక్కరోజు 'నిలిపివేస్తూ' రాత్రికి హైకోర్టు ఆదేశాలిచ్చింది. 11, 12, 13 తేదీల్లో మాత్రం నిధులు జమ చేయరాదని స్పష్టం చేసింది. శుక్రవారం పథకాల లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బు జమ చేసుకునేందుకు అవకాశం ఇచ్చినట్లే. ప్రభుత్వానికి కావాల్సింది కూడా ఇదే. శుక్రవారం తెల్లారేసరికి ఖాతాల్లో డబ్బులు పడిపోవాలంటూ గురువారం అర్ధరాత్రి నుంచే అన్ని శాఖల అధికారులపై ఆర్థిక శాఖ సెక్రటరీ కేవీవీ సత్యనారాయణ ఒత్తిడి తెచ్చారు. బడ్జెట్ రిలీజ్ ఆర్డర్(బీఆర్‌వో) లేకుండా నిధులు విడుదల చేయబోమని వారు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. 'నా మాటే బీఆర్వోతో సమానం. ముందు డబ్బులు ఇచ్చేయండి' అని ఆదేశించినట్లు తెలిసింది. ఖాతాల్లో జమ చేసేందుకు సర్కారు వేర్వేరు చోట్ల డబ్బులు సిద్ధంగా ఉంచింది. ఆర్బీఐ నుంచి వేజ్ అండ్ మీన్స్, ఓడీ అప్పుల ద్వారా రూ.5,000 కోట్లు, శుక్రవారం కేంద్రం నుంచి వచ్చే రూ.3000 కోట్ల పన్నుల్లో వాటాను కలిపి పథకాలకు వాడాలని భావిస్తున్నారు. వేర్వేరు పీడీ ఖాతాల్లోనూ సొమ్ములు సిద్ధంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఆయా శాఖల చేత గురువారం అర్ధరాత్రే బ్యాంకులకు నిధులు విడుదల చేయించి... ఒక్క క్లిక్‌తో ఖాతాల్లోకి జమ చేసేలా వ్యూహం రచించారు. అయితే... ఇప్పటికే ఇచ్చిన బీఆర్వోలకు కాలం చెల్లడం, తాజా బీఆర్వోలు లేకుండానే నిధులు జమ చేయాలనడంపై అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. బీఆర్వోలు లేకుండా నిధులు విడుదల చేయడం నేరమని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇలాంటి ఘటనలను ఈసీ సీరియస్‌గా పరిగణిస్తుందని వారు ఆర్థికశాఖ అధికారులకు చెప్పారు. అయినా... ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు.

జన కేతనం





కౌంట్ డౌన్ 3 రోజులు

దార్శనికులు ఉజ్వల భవిష్యత్‌కు, అభివృద్ధికి బాటలు వేస్తారు. సంపద, ఉపాధి చేకూరుస్తారు. నాయకుడికి ఇలాంటి లక్షణాలే ఉండాలి. అలాంటి నాయకుడే చంద్రబాబు. అదే విధ్వంసకారులు నాయకులైతే... కట్టడాలను కూల్చడం, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, దోపిడీలతో అల్లకల్లోలం చేస్తారు. ఈ తరహా దమననీతి, ఫ్యూడల్ హింస లక్షణాలు పుష్కలంగా ఉన్న నాయకుడే జగన్మోహన్‌రెడ్డి. చంద్రబాబు, జగన్ లక్షణాలను పరిశీలిస్తే ఇద్దరి మధ్య స్పష్టమైన తేడా కనిపిస్తుంది. వారు చేసిన పనులే చంద్రబాబును నిర్మాతగా, జగన్‌ను విధ్వంసకారుడిగా నిలిపాయి. చంద్రబాబు, జగన్ పనితీరును పరిశీలిస్తే ఎవరి పేరు చెబితే ఏమేమి గుర్తుకొస్తాయో చూద్దాం...



1 సైబరాబాద్ నిర్మాణం



తొండలు గుడ్లు పెట్టే ప్రాంతంలో ఒక ఆధునిక నగర నిర్మాణం చేపట్టి ఐటీ అగ్రగామి చిరునామాల్లో ఒకటిగా సైబరాబాద్‌ను నిలిపిన ఘనత చంద్రబాబుదే. సైబరాబాద్ అంటేనే చంద్రబాబు పేరు గుర్తుకొస్తుంది. మైక్రోసాఫ్ట్‌లాంటి సంస్థలను రప్పించారు. హైదరాబాద్ ఐటీ నగరంగా మారడం వెనుక కర్త, కర్మ, క్రియ చంద్రబాబే. ఆయన చేసిన కృషి వల్ల నేడు తెలంగాణలో ఐటీ రంగంలోనే ప్రత్యక్షంగా 10 లక్షల మంది ఉద్యోగాలు చేస్తుండగా, అనుబంధ రంగాలు, ఆధార రంగాల్లో అంతకు అనేక రెట్లు ఉపాధి లభిస్తోంది.

1 సొంత వ్యాపార సామ్రాజ్యం

జగన్ కేసుల వల్లే క్విడ్ ప్రొకో (నాకిది-నీకిది) అనే పదం బాగా పాపులర్ అయింది. నాడు తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని, ప్రభుత్వ మేళ్లు పొందిన వారి నుంచి రూ.వేల కోట్లను పెట్టుబడుల రూపంలో తన కంపెనీల్లో పెట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై డజన్ల కొద్దీ అవినీతి కేసులు నమోదయ్యాయి. 16 నెలలు జైలులో గడిపారు. హైదరాబాద్ నగరంలో ఓ వైపు చంద్రబాబు తీసుకొచ్చిన బహుళ జాతి ఐటీ కంపెనీలు, చేపట్టిన నిర్మాణాలు కనిపిస్తే... మరోవైపు జగన్ సొంతానికి నిర్మించుకున్న వ్యాపార సంస్థలు, సొంత రోత మీడియా భవనాలు దర్శనమిస్తాయి. జగన్ అవినీతి సొమ్ముతోనే వీటిని నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి.




చంద్రబాబు పేరు వింటే.. విజన్, అభివృద్ధి, ఉపాధి, సుపరిపాలన వంటివి గుర్తుకొస్తాయి. ఆయన పాలనలో చిరకాలం గుర్తుండిపోయే అభివృద్ధి పనులు ఎన్నో చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు నవ్యాంధ్రను ఓ దార్శనికుడిలా ముందుకు నడిపించారు.

ఒకరిది అభివృద్ధి, నిర్మాణ పథం
మరొకరిది ఫ్యూడల్ మనస్తత్వం
కూల్చివేతలు, పగాప్రతీకారాలు

జగన్ పేరు వింటే... క్విడ్ ప్రొకో ఆరోపణలు, అవినీతి కేసులు, కూల్చివేతలు, ప్రతీకారాలు వంటివి గుర్తుకొస్తాయి. ఆయన పాలనలో జరిగిన దోపిడీ, అరాచకాలు, విధ్వంసం అంతా ఇంతా కాదు. వినాశకర నిర్ణయాలతో రాష్ట్రాన్ని తిరోగమన బాట పట్టించారు.

విజన్ X విధ్వంసం

చంద్రబాబు, జగన్‌కు తేడా ఇదే



1 తొలి ఆఫ్రో ఏషియన్ క్రీడలు (చంద్రబాబు)

క్రీడల్లో భారతదేశం వెనుకబాటును అధిగమించడానికి అసాధారణ స్థాయిలో మౌలిక సదుపాయాలను చంద్రబాబు కల్పించారు. 2002 జాతీయ క్రీడలు, 2003 ఆఫ్రో ఏషియన్ క్రీడలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షణలో జరిగాయి. ఆఫ్రికా, ఆసియా ఖండాలలోని అన్ని దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఆఫ్రో ఏషియన్ గేమ్స్ తొలిసారిగా హైదరాబాద్ నగరంలో జరగడం విశేషం. ఢిల్లీ లేదా కువైట్‌లో జరగాల్సిన ఈ క్రీడలకు చంద్రబాబు చొరవతోనే హైదరాబాద్ వేదికైంది. ఒక రాష్ట్ర ప్రభుత్వం అన్నీ తానై అంతర్జాతీయ క్రీడోత్సవాలను నిర్వహించడం అంతకు ముందెన్నడూ జరగలేదు.

1 జూదాలు, బెట్టింగ్‌లు (జగన్)



ముఖ్యమంత్రి జగన్‌కు పగ, ప్రతీకారాలు తప్ప క్రీడలు పట్టవు. క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ పురోగతికి తగిన చర్యలు తీసుకోలేదు. చంద్రబాబు నిర్మించిన స్టేడియాలలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతుంటే... వైసీపీ నేతలు బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లో ఆరితేరిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. వాటికి తోడు గుట్కా, మాట్కా, క్యాసినో, కోడిపందేల సంగతి సరేసరి. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని వైసీపీ వేడుకలా మార్చేశారు.

1 ప్రపంచంతో అనుసంధానం (చంద్రబాబు)

చంద్రబాబు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ నగరంలో మౌలిక సదుపాయాలను పెంచారు. ఐటీ, ఫార్మా, ఇతర రంగాల అభివృద్ధికి తగిన విధంగా బేగంపేట విమానాశ్రయం భవిష్యత్తు అవసరాలను తీర్చలేదని గుర్తించి అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి బాటలు వేశారు. శంషాబాద్ వద్ద అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించడానికి ప్రణాళిక రచించిందీ, భారీగా భూసేకరణ చేసిందీ చంద్రబాబు ప్రభుత్వమే. నగరంలో ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ, విమానాశ్రయానికి రహదారి నిర్మాణం వంటి కార్యక్రమాలు హైదరాబాద్ రూపురేఖలను మార్చేశాయి.

1 అంతర్జాతీయంగా అపఖ్యాతి (జగన్)

జగన్ అవినీతి చరిత్ర అంతర్జాతీయ సరిహద్దులు దాటిపోయింది. ఆఫ్‌షోర్ కంపెనీలతో అక్రమ లావాదేవీలకు పాల్పడిన వారి జాబితాలో జగన్ పేరు చేరింది. కొన్నేళ్ల కిందట పరిశోధనాత్మక జర్నలిస్టుల అంతర్జాతీయ కన్సార్టియం 'ప్యారడైజ్ పేపర్ల' పేరిట చీకటి లావాదేవీల వివరాలు వెల్లడించింది. ప్యారడైజ్ పేపర్లలో పేరు ఉన్న ఏకైక తెలుగు రాజకీయ నాయకుడు జగనే. ప్రపంచానికి ఇలా ఒక ఆర్థిక నేరస్తుడిలా పరిచయమయ్యారు. రాజకీయ పదవుల్లోకి రాకముందే అవినీతి బురదలో పీకల్లోతు కూరుకుపోయిన అరుదైన వ్యక్తి జగన్. 20 సీబీఐ-ఈడీ కేసులను ఎదుర్కొంటున్న ఏకైక ముఖ్యమంత్రి కూడా జగనే.

చంద్రబాబు ప్రత్యేకతలు	జగన్ అరాచకాలు
క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, అకాడమీల ఏర్పాటుకు సహకారం, అనేక మంది చాంపియన్ల తయారు	అకాడమీలపై కుల కక్ష, బూతుల చాంపియన్ల తయారు, వైసీపీ ఉత్సవంలా ఆడుదాం ఆంధ్రా
హైదరాబాద్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఏర్పాటు, 1999లో చంద్రబాబు పునాది వేయగా, 2001లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి ప్రారంభోత్సవం	జగన్ సీఎం కాకమునుపే తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని అక్రమ సంపాదన కోసం తోడువచ్చే ముఠాను తయారు చేసుకోవడం
అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సంస్థ హైటెక్స్-హెచ్ఐసీసీ చంద్రబాబు హయాంలో ఏర్పాటు	చంద్రబాబు హయాంలో నిర్మించిన ప్రజావేదికను జగన్ ముఖ్యమంత్రి కాగానే కూల్చివేత
పరిపాలనలో పరివర్తన, ప్రజలే కేంద్రంగా విధానాల రూపకల్పన లక్ష్యాలుగా 2001లో చంద్రబాబు ప్రభుత్వం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌ను ఏర్పాటు	మోడల్ ఫర్ బ్యాడ్ గవర్నెన్స్, పారదర్శకంగా పాలిస్తానని ప్రమాణం చేసిన జగన్ కొద్ది రోజుల్లోనే ప్రభుత్వ ఉత్తర్వులన్నీ రహస్యంగా ఉంచాలని ఆదేశించారు.
ప్రజల వద్దకే పాలనతో పరిపాలనలో వికేంద్రీకరణ తెచ్చి పారదర్శకత పెంచారు. సీఎంగా నేరుగా ప్రజల సమక్షంలో రియల్‌టైంలో సమస్యలను పరిష్కరించేందుకు చంద్రబాబు సంస్కరణలు తెచ్చారు	జగన్ సీఎం అయ్యాక ప్రజల్లోకి రావడమే మానేశారు. సచివాలయంలో సీఎం కార్యాలయానికి అతిథిగా వస్తున్న అరుదైన సీఎం జగన్. ప్రధాన సలహాదారులకు తప్ప మంత్రులకు, అధికారులకు, ఎమ్మెల్యేలకు కూడా దర్శనం అరుదే.
దేశ చరిత్రలోనే తొలి దళిత లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగిని నియమించేందుకు కృషి చేసి సామాజిక సాధికారత సాధించారు.	పేరుకు పదవులిచ్చి తన పక్కన కూడా కూర్చోబెట్టుకోలేని ఫ్యూడల్ మనస్తత్వం జగన్‌ది. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీకి అండ
మహిళా సాధికారత, స్వావలంబన, డ్వాక్రా సంఘాల ఏర్పాటు, దళిత మహిళ ప్రతిభా భారతికి ఏపీ తొలి అసెంబ్లీ స్పీకర్‌గా, బీసీ మహిళ పంచుమర్తి అనూరాధను చిన్న వయసులోనే మేయర్‌గా చేసిన ఘనత చంద్రబాబుది	సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారని 60 ఏళ్ల రంగనాయకమ్మపై కేసులు పెట్టి వేధించిన ఘనత జగన్‌ది. బాబాయి హత్యపై సొంత చెల్లెలు నిలదీసినందుకు జుగుప్సాకరంగా మాటల దాడి
సీఎంగా చంద్రబాబు హుందాగా వ్యవహరించారు. పార్టీ వేరైనా సీనియర్లకు గౌరవమిచ్చారు. ప్రాజెక్టులు, పథకాలకు ప్రముఖుల పేర్లు మార్చకుండా ఉదారత ప్రదర్శించారు.	శంషాబాద్ విమానాశ్రయంలో డొమెస్టిక్ టెర్మినల్‌కు ఎన్టీఆర్ పేరును కొనసాగించడానికి వైఎస్ నిరాకరించారు. విజయవాడలో ఎన్టీఆర్ స్థాపించిన వైద్య విద్యాలయానికి జగన్ ఆయన పేరును తొలగించి తన తండ్రి పేరు పెట్టారు
టెక్నాలజీ వినియోగంలో, అవినీతి నిర్మూలనలో, పారదర్శకత పెంపుదలలో చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్	ఈ-సేవను మీ-సేవగా మార్చడం తప్ప జగన్ తలపెట్టిన గొప్ప మార్పు ఒక్కటీ లేదు
ప్రతి కిలోమీటరుకు ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి సొంత భవనాల నిర్మాణాలకు చంద్రబాబు శ్రీకారం	ఉన్న పాఠశాలలకు రంగులేసి సొంత ప్రచారం, నాడు-నేడులో అవినీతి, చేసిన ఖర్చుకు, మార్పుకు పొంతన లేదు
నాటి పనికి ఆహార పథకం, నేటి ఉపాధి హామీ పథకాలను సద్వినియోగం చేసుకున్న చరిత్ర చంద్రబాబుది. దేశంలో మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువగా కేంద్ర పథకాన్ని వాడుకుని మౌలిక వసతులు కల్పన	ఉపాధి నిధులు దారిమళ్లించడంతో పాటు పథకాల అమల్లో తప్పిదాల వల్ల దేశంలోని ఇతర రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రతిష్ఠ మసకబారేలా చేశారు.
ఒక మనిషికి ఒక చేప ఇచ్చి ఆ రోజుకు తిండి పెట్టేకంటే... అతనికి చేపలు పట్టడం నేర్పిస్తే జీవితాంతం తనను తాను పోషించుకుంటాడన్న చైనా సూక్తిని అమలు చేసింది చంద్రబాబు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధిని పెంచడం ద్వారా యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారు.	జగన్ సబ్సిడీ రుణాల పథకాలన్నింటినీ గాలికొదిలేశారు. ప్రభుత్వ సాయం తీసుకుని స్వయంశక్తితో స్వావలంబన సాధించాలనే ఆత్మగౌరవ మార్గాన్ని మూసేసి సంక్షేమానికి తప్పుడు భాష్యం చెప్పారు.
శాంతిభద్రతల పరిరక్షణకు చంద్రబాబు పెద్దపీట వేశారు. ఆయన హయాంలో ఫ్యాక్షనిస్టులకు, పేరుమోసిన రౌడీలకు డార్మెటరీ ట్రీట్‌మెంట్	జగన్ రాజకీయ పదవుల్లోకి రాకముందే పరిటాల రవి హత్యలో ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆయన పాలనలో రౌడీలకు కొమ్ములు వచ్చాయి.
కుల ప్రస్తావన లేని పాలన చంద్రబాబు చేశారు. సొంత కులం వాళ్లకు పదవులు ఇవ్వడానికి వెనుకాడే వారని టీడీపీ నేతలు చెబుతుంటారు.	పదవులన్నీ ఒకే కులానికి కట్టబెట్టి కూడా ప్రత్యర్థిపైన కులం పేరిట దాడి చేయగల బరితెగింపు జగన్ సొంతం.
చంద్రబాబును చూసి రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాలు ఇచ్చారు. 2015 అక్టోబరు 8న అమరావతికి శంకుస్థాపన చేయగా, 2016 జూన్ నెలలో సచివాలయం అందుబాటులోకి వచ్చింది.	కడుపులో కత్తులు పెట్టుకుని కళ్లలో కారుణ్యం చూపించడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య. రాజధానిగా అమరావతే ఉంటుందని, తన ఇల్లు తాడేపల్లిలో కట్టుకున్నానని, తాను వస్తే మరింత మేలు చేస్తానని నమ్మించి మోసం చేశారు.
దేశానికి స్వాతంత్ర్యం రాకముందే ప్రతిపాదించిన పోలవరం ప్రాజెక్టులో నిర్మాణాత్మకమైన పనులు జరిగింది చంద్రబాబు హయాంలోనే	జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరానికి గ్రహణం పట్టింది.
పట్టిసీమ అనే చిన్న ఆలోచనతో బహుళ ప్రయోజనాలు సాధించిన ఘనత చంద్రబాబుది	చంద్రబాబు నిర్మించారన్న అక్కసుతో అవసరమున్నా పట్టిసీమ యంత్రాలకు తాళాలు వేసిన ఘనుడు జగన్
విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలనే యోచనతో ఐటీ, ఫార్మా, ఫిన్‌టెక్ కంపెనీలు ఏర్పాటు	విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తానని చెప్పి రాజధాని అమరావతిని అటకెక్కించి, రాష్ట్రంతో మూడుముక్కలాట
బాబు పాలనలో అభివృద్ధిని స్పష్టంగా చూపించిన అంశాల్లో రోడ్లు ఒకటి. రాష్ట్ర రహదారులు, లింకు రోడ్లే కాదు... గ్రామాల్లో చిన్న వీధులు, సందుల్లోనూ సిమెంట్ రోడ్లు వేశారు. ప్రతి వీధిలోనూ ఎల్ఈడీ లైట్లు వెలుగులు నింపాయి.	చంద్రబాబు హయాంలో నిర్మించిన సిమెంట్ రోడ్లే ఇప్పటికి మిగిలున్నాయి. కాలక్రమంలో పునరుద్ధరించాల్సిన రాష్ట్ర రహదారులు, పంచాయతీరాజ్ రోడ్లను పట్టించుకోకపోవడంతో అవన్నీ గుంటలమయ్యాయి.
చంద్రబాబు హయాంలో టీచర్ పోస్టులు, పోలీసుశాఖలో ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ, ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరిగేందుకు కౌన్సెలింగ్ ప్రక్రియ	మెగా డీఎస్సీ ఇస్తానంటూ హామీ ఇచ్చి ఎన్నికల ముందు అరకొర పోస్టులతో నోటిఫికేషన్, పోలీసు ఉద్యోగాల భర్తీలోనూ మోసమే.



- అమరావతి, ఆంధ్రజ్యోతి

ట్రెండింగ్.. ట్రెండింగ్..!

జగన్‌కు ఓటు.. యావదాస్తి దానం!


भारतीय गैर न्यायिक
एक सौ रुपये Rs. 100 ONE HUNDRED RUPEES
रु. 100
भारत INDIA
INDIA NON JUDICIAL

దాన విక్రయ దస్తావేజు

THE ANDHRA PRADESH LAND TITLING ACT, 2022

2024వ సంవత్సరం మే నెల 13వ తేది

వ్రాసి ఇచ్చేవారు: ఆంధ్ర రాష్ట్ర ప్రజలు

వ్రాయించు కొన్నవారు: YS జగన్ మోహన్ రెడ్డి

ఉదయం 7 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఫ్యాన్ గుర్తు మీద నొక్కడం ద్వారా తమ పేరు మీద వున్న యావదాస్తిని దానంగా ఇస్తున్నామని, ఇక మీదట మాకు, మా కుటుంబ సభ్యులకు ఈ ఆస్తితో ఎటువంటి సంబంధములేదు. ఇందులో ఎవరి ప్రమేయం లేదు, నాకు అన్నీ తెలిసి మరియు విజ్ఞతతో తీసుకున్న నిర్ణయం.

మీ భూమి - నా హక్కు


మన గుర్తు ఫ్యాన్ గుర్తు

దాన విక్రయ దస్తావేజు టైటిల్‌తో మీ భూమి - నా హక్కు అనే ఎండ్ లైన్‌తో ఉన్న ఈ దస్తావేజు చిత్రం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2024వ సంవత్సరం మే నెల 13వ తేదీ. వ్రాసి ఇచ్చేవారు ఆంధ్రా ప్రజలు. రాయించుకున్నవారు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మీ ఓటును ఫ్యాను గుర్తు మీద నొక్కడం ద్వారా తమ పేరు మీద ఉన్న యావదాస్తిని దానంగా ఇస్తున్నామని, ఇక మీదట మాకు, మా కుటుంబ సభ్యులకు ఈ ఆస్తితో ఎలాంటి సంబంధం లేదు. ఇందులో ఎవరి ప్రమేయం లేదు. నాకు అన్నీ తెలిసి మరియు విజ్ఞతతో తీసుకున్న నిర్ణయం. అని పేర్కొన్న దస్తావేజు చిత్రం ఇది. జగన్ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై ప్రజల్లో నెలకొన్న భయాందోళనలపై విస్తృత ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే పై దస్తావేజు చిత్రం కూడా ప్రజల వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది.

ఆనాటి ముచ్చట

మహారాజుకు నీలిరంగు పెట్టె

■ 1937లో ఎన్నికల కరపత్రం ఉండేదిలా


నీలిరంగును

నీలిరంగును

విజయనగరం

9-2-1937

కట్టోజు పెద్ద గంగరాజు,

జి.వీర్రాజు నాయుడు, విజయనగరం

1937 నాటి ఎన్నికల కరపత్రం

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకమునుపు ఎన్నికల ప్రచార పత్రాలు ఎలా ఉండేవి అనే దానికి ఫొటో సాక్ష్యం. ఆంధ్రప్రదేశ్ ఏర్పడక మునుపు మదరాసు శాసన నిర్మాణ సభకు వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు పోటీ చేసేవారు. విజయనగరం సంస్థానం నుంచి మీర్జా రాజా పూసపాటి అలక నారాయణ గజపతి మహారాజు ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ సందర్భంగా ఆయన పేరుతో సంస్థానం ఈనాందారులు కొట్టోజు పెద్దగంగరాజు, జి.వీర్రాజు నాయుడు ఒక కరపత్రాన్ని విడుదల చేశారు. అప్పట్లో ఒక్కో అభ్యర్థికి ఒక్కో రంగు పెట్టె ఉండేదని దీన్ని బట్టి తెలుస్తోంది. గజపతి మహారాజుకు అప్పటి బ్రిటీషు ప్రభుత్వం నీలిరంగు పెట్టెను కేటాయించింది. మహారాజు రెండు స్థానాల్లో పోటీ చేశారు. ప్రభుభక్తితో నీలి రంగుపెట్టెలో రెండు ఓట్లు వేయాలని కోరుతూ 1937 ఫిబ్రవరి 9న ఈ కరపత్రాన్ని విడుదల చేశారు. ఇప్పుడు ఈ ప్రచార పత్రం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

- మచిలీపట్నం టౌన్

అబ్బ ఛా!



కేఏ పాల్,
ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు

ఐదు లక్షల మెజార్టీతో గెలుస్తా..!

ఏడు నియోజకవర్గాల్లో ప్రజాశాంతి పార్టీకి స్పందన అద్భుతంగా ఉంది. విశాఖ నుంచి ఎంపీగా కేఏ పాల్‌ను గెలిపిద్దామని ప్రజలు భావిస్తున్నారు. నేను గెలిస్తే ఓటు హక్కు వినియోగించుకోని వారిపై చర్యలు తీసుకునేలా చట్టం తెస్తా. తాజా సర్వే ప్రకారం ఐదు లక్షల మెజార్టీతో గెలుస్తానని తేలింది. గెలిచాక 100 రోజుల్లో విశాఖను అభివృద్ధి చేస్తా.



అప్పట్లో..

రేషన్ షాపుల్లో... రూపాయికి కిలో బియ్యం, 50 శాతం రాయితీపై రెండు కిలోల కందిపప్పు, ఇంకా అర కిలో చొప్పున పంచదార, గోధుమలు, రాగులు, జొన్నలు, శనగలు, ఉప్పు, వంటనూనె. మహిళలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేసేవారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులకు వారి పండగల్లో ఇచ్చే ఆరు రకాల కానుకలు దీనికి అదనం. అరకిలో పంచదార రూ.10కి, కిలో కందిపప్పు రూ. 40కు రాయితీపై ఇచ్చేవారు. ఇన్ని సరుకులు, ఎంతో రాయితీతో పేదలకు అందించినా చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ప్రజా పంపిణీ వ్యవస్థపై రుణ భారం రూ. 16 వేల కోట్లు.



ఇప్పుడు..

జగన్ 'ఇంటింటా రేషన్ పంపిణీ' వాహనంలో.. టీడీపీ ఇచ్చిన తొమ్మిది రకాల సరుకుల జాబితా నుంచి ఉప్పు, గోధుమపిండి, రాగులు, జొన్నలు, మహిళలకిచ్చే శానిటరీ ప్యాడ్స్ ఎత్తేశారు. పంచదార రూ. 17, కందిపప్పు రూ.67కు అంటగడుతున్నారు. ఏడాదిగా ఆ ఇచ్చే కందిపప్పును కూడా ఆపేశారు. సరుకులకు కోతలేసి, కానుకలు కూడా ఇవ్వకుండా పేదలను ఎంతగానో మోసం చేసినా., జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజా పంపిణీ వ్యవస్థపై పడిన అప్పుల భారం రూ.30 వేల కోట్లు. పంపిణీకి ఆర్భాటంగా కొనుగోలుచేసిన బండ్లు ప్రజా పంపిణీ వ్యవస్థకు గుదిబండలుగా మారడమే ఈ భారానికి కారణం!

బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సామాన్యుల ఇంటి బడ్జెట్ జగన్ ఐదేళ్ల పాలనలో డబుల్ అయింది. రోజుకూలీలు, ఇతరత్రా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదల ఇళ్లల్లో రెండు పూటల పొయ్యి వెలగని పరిస్థితి! ఇలాంటి పరిస్థితుల్లో ఆ పేద కుటుంబాల వారికి నెలకు కిలో కందిపప్పు కూడా రాయితీపై అందటం లేదు. నిరుపేదలు జగన్ ఏలుబడిలో పండగలప్పుడు కూడా పప్పన్నం తినే భాగ్యానికి నోచుకోలేకపోతున్నారు.

కక్ష కట్టి.. పొట్ట గొట్టి

'కానుకలు' ఎగ్గొట్టి ఏం సాధించావ్ జగన్?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



"నా ఎస్సీలు... నా ఎస్టీలు.. నా బీసీలు... నా మైనారిటీలు" అంటూ తానొక్కడినే పేదల పక్షపాతినని, ఊరూరా ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టే సీఎం జగన్, ఆచరణలో వారి పట్ల కాఠిన్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ వర్గాల్లోనే ఎక్కువగా ఉండే పేదల విషయంలో పగ బట్టినట్లు వ్యవహరిస్తున్నారు. బీద, బడుగు వర్గాలకు భరోసాగా నిలుస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థను ఐదేళ్లలో పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరే ఇందుకు ఉదాహరణ. రేషన్ సరుకుల్లో ఒక్కొక్కటిగా ఎగ్గొట్టి పేదల పొట్ట కొట్టారు. టీడీపీ హయాంలో రేషన్ కార్డుదారులందరికీ రూపాయికి కిలో బియ్యంతోపాటు 50 శాతం రాయితీపై 2 కిలోల చొప్పున కందిపప్పు, ఇంకా పంచదార, గోధుమలు, రాగులు, జొన్నలు, శనగలు, ఉప్పు, వంటనూనె తదితర 9 రకాల నిత్యావసర సరుకులు, మహిళలకు శానిటరీ ప్యాడ్స్‌ను కూడా రేషన్ షాపుల్లో ఇచ్చేవారు. సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలకు 'చంద్రన్న కానుక' పేరుతో సుమారు రూ.500 విలువ చేసే ఆరేడు రకాల సరుకులతో ప్రత్యేక కిట్లను కార్డుదారులందరికీ ఉచితంగానే అందించారు. ఆయా పండుగలకు కార్డుదారులు ఊరెళ్లినా లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడే చంద్రన్న కానుకలు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. దాంతో అత్యంత నిరుపేదలు కూడా చంద్రన్న కానుకల ద్వారా ఉచితంగా వచ్చే రేషన్ సరుకులతో పిండివంటలు చేసుకుని పండుగలను ఆనందంగా జరుపుకొనేవారు. ఈ చంద్రన్న కానుకల పంపిణీతో ప్రభుత్వంపై ఏటా దాదాపు రూ.2,000 కోట్ల భారం పడేది. అయినప్పటికీ.. టీడీపీ ప్రభుత్వం అందించిన ఉచిత కానుకలతో రాష్ట్రంలో రూ.1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరేది. పండగల వేళ పేదలు పస్తులుండే పరిస్థితులుండేవి కాదు. కానీ జగన్ అధికారంలోకి వచ్చీరాగానే సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలను ఆపేశారు.

సరుకుల్లో కోతలు.. ధరలతో వాతలు

వైసీపీ అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డుదారులకు ప్రతినెలా రెగ్యులర్‌గా ఇచ్చే రేషన్ సరుకుల్లో కోతలు.. ధరలు పెంపుతో వాతలు తప్ప పేదలకు అదనంగా చేకూరిన మేలు ఏమీ లేదు. 2019 వరకు టీడీపీ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసిన 9 రకాల సరుకుల జాబితా నుంచి ఉప్పు, గోధుమపిండి, రాగులు, జొన్నలు, మహిళలకిచ్చే శానిటరీ నేప్‌కిన్స్‌ను తొలగించింది. దీని వల్ల కార్డుదారులు ప్రతిఏటా రూ.3 వేల కోట్లకు పైగా నష్టపోయారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గత ఏడాది నుంచి రాగి, గోధుమపిండి, ఇటీవల సీమలో జొన్నల పంపిణీని తిరిగి ప్రారంభించింది. కందిపప్పు కోటాను 2 కిలోల నుంచి ఒక కిలోకు కుదించడంతోపాటు.. 50 శాతం సబ్సిడీని 25 శాతానికి తగ్గించేసింది. ఫలితంగా రేషన్ కందిపప్పు ధర రూ.40 నుంచి ఇప్పుడు రూ.67కు పెరిగింది. టీడీపీ ప్రభుత్వం అర కిలో పంచదారను కార్డుదారులకు రూ.10కే అందించగా.. ఈ ప్రభుత్వం వచ్చాక అరకిలో పంచదార రేటును రూ.17 లకు పెంచేసింది. తద్వారా రేషన్‌కార్డుదారులపై రూ.625 కోట్ల ఆర్థిక భారాన్ని మోపింది. గత ఏడాది నుంచి కందిపప్పు సరఫరాను పూర్తిగా నిలిపివేసింది. వినాయక చవితి, దసరా, రంజాన్, క్రిస్మస్, సంక్రాంతి.. ఇలా పండుగలకు కూడా కనీసం కందిపప్పును సరఫరా చేయలేదు. పంచదార మాత్రం అరకొరగా ఇస్తున్నారు.

కార్పొరేషన్ దివాలా

ఏడాదికి దాదాపు రూ 3 వేల కోట్ల భారాన్ని పేదలపై జగన్ ప్రభుత్వం వేసింది. మిగిలిన నామమాత్రపు సబ్సిడీల భారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించకుండా పౌరసరఫరాల సంస్థ పైకి నెట్టేసింది. దీంతో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అన్ని రాయితీలు, కానుకలు ఇచ్చినా ఐదేళ్లలో కార్పొరేషన్ అప్పులు రూ. 16 వేల కోట్లు. జగన్ ప్రభుత్వం ఇన్ని కోతలు, కొర్రీలు పెట్టినా, దాదాపు రూ.30 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలే ఉన్నాయని కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి.

వృథా ప్రయాస...

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందిస్తామంటూ రేషన్ డీలర్ల వ్యవస్థకు సమాంతరంగా ఎండీయూ వ్యవస్థను తీసుకువచ్చారు. కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తామంటూ గొప్పలు చెప్పిన జగన్ తర్వాత మాట మార్చేశారు. రేషన్ సరుకుల డోర్ డెలివరీ కోసం ఏకంగా రూ.539 కోట్లతో 9,260 వాహనాలను కొనుగోలు చేశారు. ఇంతా చేస్తే ఇంటింటికీ వెళ్లాల్సిన రేషన్ వాహనాలను పట్టణాల్లో ఏదో ఒక వీధి చివరన, గ్రామాల్లో అయితే ఊరి పొలిమేర్లలోనూ నిలిపి బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక వేళ వరుసగా మూడు నెలలు సరుకులు తీసుకోకపోతే రేషన్‌కార్డులు రద్దు చేసేస్తున్నారు. జగన్ ప్రభుత్వం రూ.560 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి రేషన్ వాహనాలను కొనుగోలు చేయడం, ఆ వాహనాల్లో బియ్యం పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్లకు ప్రతి నెలా రూ. 21 వేలు చొప్పున జీతాలు చెల్లిస్తుండటం.. 'పావలా కోడికి.. ముప్పావలా మసాలా' అన్న చందంగా ఉందంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అవే చౌక బియ్యాన్ని గతంలో డీలర్ల ద్వారా సరఫరా చేసేటప్పుడు అయ్యే ఖర్చు నామమాత్రమే.

పోరు

రాజంపేట రసవత్తరం!

హ్యాట్రిక్ కోసం మిథున్‌రెడ్డి

తొలిసారి లోక్‌సభ బరిలో నల్లారి

రాజంపేట పార్లమెంటు నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. వరుసగా రెండు సార్లు విజయం దక్కించుకున్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కూటమి తరఫున తలపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ముస్లిం నాయకుడు షేక్ బషీద్ పోటీలో ఉన్నారు.

హ్యాట్రిక్ కోసం మిథున్

గత రెండు ఎన్నికల్లో రాజంపేట నుంచి విజయం దక్కించుకున్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఈసారి హ్యాట్రిక్ కోసం తపిస్తున్నారు. అయితే సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్న మాజీ సీఎం నల్లారి కూటమి తరపున బరిలో ఉండడంతో మిథున్ గెలుపుపై సందేహాలు ముసురుకున్నాయి. ఎంతైనా ఖర్చు పెట్టగల డబ్బు.. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పోల్‌మేనేజ్‌మెంట్ చేయడంలో మాత్రం మిథున్‌రెడ్డి ముందంజలో ఉన్నారు. కానీ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం సాగించిన పెత్తనంపై జిల్లావ్యాప్తంగా అసంతృప్తి పెల్లుబుకుతోంది. మిథున్‌రెడ్డి 2014, 2019 ఎన్నికల్లో విజయం సాధించారు. 2014లో దగ్గుపాటి పురందేశ్వరిపై లక్షా 70వేలు, 2019లో టీడీపీ అభ్యర్థి సత్యప్రభపై రెండు లక్షల 66వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

కిరణ్‌కు తొలి ప్రయత్నం

1989లో రాజకీయ అరంగేట్రం చేసిన నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి 2009 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. మధ్యలో 1994లో ఓటమి మినహా ఆయన ప్రతి ఎన్నికలోనూ విజయం దక్కించుకున్నారు. ఉమ్మడి ఏపీ స్పీకర్‌గా, ముఖ్యమంత్రిగా పనిచేశారు. తర్వాత సొంత పార్టీ పెట్టుకున్నా విజయం సాధించలేకపోయారు. అనంతరం కొన్నాళ్లు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు తొలిసారి బీజేపీ తరపున పార్లమెంటుకు పోటీ చేస్తున్నారు. కూటమి పార్టీలైన జనసేన, టీడీపీ నేతల మద్దతు కూడగట్టారు. పుంగనూరులో వ్యక్తిగతంగా కిరణ్‌కుమార్‌రెడ్డికి పరిచయాలు ఉన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలో కిరణ్‌కుమార్‌రెడ్డి గ్రాఫ్ పెరిగింది. ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసి పనిచేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గం, చల్లపల్లి నరసింహారెడ్డి.. కిరణ్ గెలుపు కోసం ప్రచారంలో పాల్గొంటున్నారు. రాజంపేటలో కిరణ్‌కుమార్ రెడ్డికి క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. పీలేరు సొంత నియోజకవర్గం కావడంతో.. నల్లారికి వ్యక్తిగతంగా బలం ఉంది. రాయచోటిలో కూటమి బలంగా ఉంది.

మిథున్‌రెడ్డి బలాలు



- జిల్లా వ్యాప్తంగా మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం పెత్తనం.
- ప్రతి నియోజకవర్గంలోనూ సొంత అనుచర వర్గం.
- అపరిమిత ఆర్థిక వనరులు.
- ఎన్నికల వ్యూహాలు, పోల్ మేనేజ్‌మెంట్.
- కనుసన్నల్లో పనిచేసే అధికార యంత్రాంగం.
- ప్రతిపక్షాల కట్టడి.

బలహీనతలు

- పెద్దిరెడ్డి కుటుంబ అక్రమాలు.
- ఇసుక, వనరుల దోపిడీపై ప్రజల్లో వ్యతిరేకత.
- స్థానికంగా ఉండరన్న చెడ్డపేరు.
- అన్నమయ్య జిల్లా కేంద్రం విషయంలో జనాల్లో వ్యతిరేకత.

నల్లారి బలాలు



- సీఎం హోదాలో చేసిన అభివృద్ధి.
- హుందాగా రాజకీయాలు చేయడం.
- పార్టీలకు అతీతంగా విద్యావంతుల మద్దతు.
- టీడీపీ నేతల సంపూర్ణ సహకారం.

బలహీనతలు

- జిల్లాలో బీజేపీ ప్రభావం అంతంత మాత్రం.
- పెద్దగా క్యాడర్ లేకపోవడం.
- పదేళ్లు రాజకీయాలకు దూరంగా ఉండడం

ఎంపీ బరి



మొత్తం ఓటర్లు 14,21,196 పురుషులు: 6,97,638., మహిళలు: 7,23,434, ట్రాన్స్‌జెండర్లు: 124

అసెంబ్లీ నియోజకవర్గాలు :తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటి, రాజంపేట, కోడూరు



కాంగ్రెస్ ఆశ ఇదే!

రాజంపేట పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అభ్యర్థి షేక్ బషీద్‌ను పోటీలో నిలిపింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని పేర్కొంటున్నారు. అయితే పార్లమెంటు పరిధిలో సుమారు 2 లక్షల ముస్లిం మైనార్టీల ఓట్లు ఉన్నాయి. ఇప్పటికే అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకత కారణంగా.. కూటమి అభ్యర్థికి వేయకపోయినా తమకే వేయవచ్చనే ఆశలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నాయి.

- రాయచోటి,ఆంధ్రజ్యోతి

సంఘం చెప్పిన మాట



ఎస్‌కే రఫీ, రాష్ట్ర అధ్యక్షుడు
ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్

వైసీపీతో ముస్లింలకు తీరని నష్టం

జగన్మోహన్‌రెడ్డి ముస్లింల ద్రోహి. ఆయన సీఎం అయ్యాక ముస్లింలకు ఏ సంక్షేమ కార్యక్రమం అమలు చేయకపోగా ట్రిపుల్ తలాక్‌కు, బీజేపీ చేస్తున్న నల్ల చట్టాలకు మద్దతు పలికారు. వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలకు చాలా నష్టం జరిగింది. ఒక్క చాన్స్ అని చెప్పి ముస్లింలను నట్టేట ముంచారు. దుల్హన్ పథకాన్ని, ముస్లింల విదేశీ విద్య పథకాలను తీసేశారు. ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్‌ను కాపాడిన వ్యక్తి చంద్రబాబు. జగన్మోహన్‌రెడ్డి ఆ రిజర్వేషన్‌ను తీసివేయాలని చూశారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు.. నవరంధ్రాలుగా మారాయి. రాష్ట్రంలో ఇసుక మాఫియా, మందు మాఫియాకు తోడు చేపలు కూడా అమ్ముకుంటున్నారు. ప్రజల ఆస్తులు కూడా జగన్ చేతుల్లో ఉంచేందుకు జీవో తెస్తున్నారు. జగన్ వల్ల రాష్ట్రం సర్వనాశనం అయ్యింది. ఆయన, ఆయన బృందం చేస్తున్న ఆగడాలకు ఇకనైనా ముగింపు పలకాలి.

- అచ్చంపేట



ఆనం X మేకపాటి

ఆత్మకూరులో ప్రతిష్ఠాత్మక పోటీ

బెజవాడ గోపాల్‌రెడ్డి, ప్రముఖ కమ్యూనిస్టు నేత జీసీ కొండయ్య వంటి ఉద్దండులు ప్రాతినిధ్యం వహించిన నెల్లూరు జిల్లా ఆత్మకూరు గడ్డపై ఈసారి రసవత్తర పోరు నడుస్తోంది. కూటమి అభ్యర్థిగా టీడీపీ సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి నువ్వా నేనా అనే రీతిలో తలపడుతున్నారు. ఆత్మకూరుకు, ఆనం కుటుంబానికి అవినాభావ సంబంధం ఉంది. రామనారాయణరెడ్డి పెదతండ్రి ఆనం సంజీవరెడ్డి 1962లో ఇక్కడి నుంచి గెలువగా.. తండ్రి వెంకటరెడ్డి 1983లో టీడీపీ తరఫున ఈ స్థానం నుంచే అసెంబ్లీకి ఎన్నికయ్యారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2009లో రామనారాయణరెడ్డి కాంగ్రెస్ తరఫున పోటీచేసి గెలిచారు. అయితే రాష్ట్ర విభజన అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో ఆయనకు డిపాజిట్ కూడా రాలేదు. అనంతరం టీడీపీలో, తర్వాత వైసీపీలో చేరారు. 2019లో వెంకటగిరి నుంచి వైసీపీ తరఫున గెలిచి.. సీఎం జగన్మోహన్‌రెడ్డి తీరుపై అసంతృప్తితో తిరిగి టీడీపీకి వచ్చి తాజాగా ఆత్మకూరు బరిలో నిలిచారు.

పదేళ్ల తర్వాత వచ్చినా..

సాధారణంగా ఏ నాయకుడైనా పదేళ్ల విరామం తర్వాత నియోజకవర్గానికి వస్తే ప్రజలు పెద్దగా పట్టించుకోరు. అయితే ఆనం రామనారాయణరెడ్డి పరిస్థితి అందుకు భిన్నం. ఎందుకంటే ఆత్మకూరు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు ఆయన చేసిన అభివృద్ధి ప్రజలకు గుర్తుంది. వారానికి ఒక్కపూటే నీరందే ఆత్మకూరు పట్టణానికి ఆయన శాశ్వత పరిష్కారం చూపారు. సోమశిల నుంచి ప్రత్యేక పైపులైను ద్వారా నీటిని తెప్పించి పట్టణ ప్రజల దప్పిక తీర్చారు. వంద పడకల ఆస్పత్రి కట్టించారు. ఈరోజు ఆత్మకూరు మున్సిపాలిటీగా ఉందన్నా, రెవెన్యూ డివిజన్‌గా ఉందన్నా కారణం ఆయనే. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు రాపూరు స్థానం నుంచి 1985లో టీడీపీ తరఫున, 1999, 2004ల్లో కాంగ్రెస్ తరఫున రామనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. 2009లో రాపూరు సీటు రద్దయి.. అందులో కొంత భాగం ఆత్మకూరులో, ఇంకొంత నెల్లూరు అసెంబ్లీ స్థానాల్లో కలిశాయి. కాగా.. 2014, 19ల్లో వైసీపీ సీనియర్ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి పెద్దకొడుకు గౌతమ్‌రెడ్డి ఇక్కడి నుంచి గెలిచారు. గౌతమ్‌రెడ్డి ఆకస్మిక మరణంతో 2022లో జరిగిన ఉప ఎన్నికలో ఆయన సోదరుడు విక్రమ్‌రెడ్డి విజయం సాధించారు. అయితే ఈ పదేళ్లలో మేకపాటి కుటుంబం ఆత్మకూరుకు చేసిందంటూ ఏమీ లేదు. రాజమోహన్‌రెడ్డి మూడుసార్లు నెల్లూరు ఎంపీగా చేసినా నియోజకవర్గానికి ఏమీ చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. రెండు రాజకీయ కుటుంబాలు ముఖాముఖి పోటీకి దిగడం ఆసక్తికరంగా మారింది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

ఆనం బలాలు..



నియోజకవర్గ ప్రజలతో తరతరాల అనుబంధం.. మంత్రిగా ఉన్నా, లేకున్నా.. పార్టీలకు అతీతంగా చేసిన అభివృద్ధి.. టీడీపీలోని అన్ని వర్గాలు కలిసి పనిచేస్తుండడం.. జనసేన, బీజేపీ ఓటు బ్యాంకు కలిసి రావడం.. నియోజకవర్గవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేసిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి లోక్‌సభ అభ్యర్థిగా ఉండడం.

బలహీనతలు..

పదేళ్లుగా ఆత్మకూరుకు దూరంగా ఉండడం.. వెంకటగిరిపైనే దృష్టిపెట్టడం.. తరచూ పార్టీలు మారడం..

విక్రమ్‌రెడ్డి బలాలు..



వైసీపీకి పటిష్ఠ ఓటుబ్యాంకు.. రాజకీయ కుటుంబ నేపథ్యం..

బలహీనతలు..

తండ్రి రాజమోహన్‌రెడ్డి 3సార్లు ఎంపీగా పనిచేసినా ఈ నియోజకవర్గానికి ఏమీ చేయకపోవడం.. ఆత్మకూరుకు మంజూరైన సెంచరీ ప్లైవుడ్ భారీ పరిశ్రమను జగన్ బద్వేలుకు తరలించినా నోరు మెదపకపోవడం.. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత.



నియోజకవర్గ స్వరూపం..

మండలాలు: చేజర్ల, ఆత్మకూరు, అనుమసముద్రంపేట, మర్రిపాడు, సంగం, అనంతసాగరం

మొత్తం ఓటర్లు: 2,15,519, పురుషులు: 1,05,873.. మహిళలు: 1,09,579.. ట్రాన్స్‌జెండర్లు: 67

సామాజిక వర్గాల వారీగా..

ఎస్సీలు-50 వేలు, రెడ్లు-35 వేలు, ముస్లింలు: 30 వేలు, కమ్మ-25 వేలు, యాదవులు-20 వేలు, బలిజలు-10 వేలు.



పూలతోటలో ఆసక్తికర పోరు



రాజమండ్రి రూరల్‌లో గోరంట్ల X చెల్లుబోయిన

- 2009 నుంచి వరుసగా గెలుస్తున్న టీడీపీ
- ఇంతవరకు బోణీ కొట్టని వైసీపీ

రాజమండ్రి రూరల్.. ఈ అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. గోదావరి ఒడ్డున, ప్రపంచ ప్రసిద్ధి చెందిన కడియం నర్సరీలతో నిండి ఉంది. తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ దీని పరిధిలోని బొమ్మూరులోనే ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో 2009లో ఏర్పాటైన ఈ స్థానంలో ఇప్పటి వరకు 3 సార్లు ఎన్నికలు జరుగగా.. టీడీపీయే గెలిచింది. 2009లో ప్రముఖ వస్త్ర వ్యాపారి చందన రమేశ్ టీడీపీ తరఫున పోటీ చేసి బోణీ కొట్టారు. 2014, 19 ఎన్నికల్లో సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి విజయం సాధించారు. ఈసారి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా మళ్లీ బుచ్చయ్యచౌదరి పోటీ చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇక్కడ జనసేనకు మంచి పట్టు ఉంది. వైసీపీ అభ్యర్థి చెల్లుబోయిన స్థానికుడు కాదు. బీసీ కార్డుతో ప్రచారం చేస్తున్నారు. గతంలో జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన ఈయన 2014లో కాకినాడ రూరల్‌లో వైసీపీ తరఫున పోటీచేసి ఓడిపోయారు. 2019లో రామచంద్రపురంలో నెగ్గారు. అక్కడ ఆయనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండడంతో సీఎం జగన్ ఆయనకు పెద్దగా పరిచయం లేని రాజమండ్రి రూరల్‌కు బదిలీచేశారు.

కీలకం

నర్సరీల కోట.. రూరల్ నియోజకవర్గంలో నర్సరీలు ఎక్కువ. కనీసం 1,800 రిజిస్టర్డ్ నర్సరీలు ఉన్నాయి. చిన్నాచితకా రైతులు నడిపేవి ఇంకా చాలా ఉన్నాయి. గతంలో మల్లెలు, చామంతి, కనకాంబరాలు వంటి పూలు ఎక్కువ సాగు చేసేవారు. ఇవాళ మొక్కల పెంపకం అధికంగా సాగుతోంది. కడియం మండలమే కాకుండా, అటు మండపేట, రాజానగరం మండలం వైపు కూడా విస్తరిస్తున్నాయి. కానీ వైసీపీ పాలనలో వీటికి మార్కెట్ లేదు. ప్రభుత్వం నుంచి ఒక్క మొక్క కూడా కొనుగోలు చేయని పరిస్థితి. ఎన్నడూ లేనివిధంగా రైతులు అప్పులపాలయ్యారు. ఈ నర్సరీలకు మార్కెట్ అవసరం. డ్రైనేజీలు లేకపోవడం వల్ల వానాకాలంలో నర్సరీలు మునిగిపోయి, మొక్కలు చనిపోతున్నాయి. వాన నీరు వెళ్లే మార్గం లేదు. డ్రైనేజీ సౌకర్యం కల్పించి, టూరిజం హబ్‌గా చేయగలిగితే ఈ నర్సరీల ద్వారా ఎక్కువ మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇళ్ల స్థలాల సమస్య కూడా ఎక్కువగా ఉంది. బుచ్చయ్యచౌదరి తన ప్రచారంలో ఈ సమస్యలనే ప్రస్తావిస్తూ.. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తామని.. వీలైనంత ఎక్కువ మంది పేదలకు ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇస్తున్నారు.

- రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి.

బుచ్చయ్యచౌదరి బలాలు..



అత్యంత సీనియర్ నేతగా కులాలు, పార్టీలకతీతంగా మంచి పేరు. టీడీపీ శ్రేణులపై పట్టు.. గతంలో నాలుగు సార్లు సిటీ ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు అక్కడి పేదలకు రూరల్ పరిధిలోని శాటిలైట్ సిటీ, డి-బ్లాక్, ఎ-బ్లాక్, బుచ్చియ్యనగర్ వంటి ప్రాంతాల్లో ఇళ్లు ఇప్పించారు. అందరూ పెద్దాయన అని ముద్దుగా పిలుస్తుంటారు. మండుటెండల్లోనూ విస్తృత ప్రచారం. కూటమి మేనిఫెస్టోపై ప్రజల్లో ఆసక్తి.

బలహీనతలు..

పార్టీలో కొందరు నేతలనే గుడ్డిగా నమ్మడం.. వ్యతిరేకంగా ఉన్నారనుకున్న వారిని పక్కన పెట్టడం.

చెల్లుబోయిన బలాలు..



మంత్రిగా అర్థబలం, అంగబలం దండిగా ఉన్నాయి. జగన్‌పై అభిమానమే తనను గెలిపిస్తుందని భావిస్తున్నారు.

బలహీనతలు..

స్థానికుడు కాకపోవడం.. ప్రజలతో పెద్దగా సంబంధాలు లేకపోవడం.. పోటీచేసిన చోట మళ్లీ పోటీచేయరన్న అపఖ్యాతి.. ఇసుక, ప్రకృతి వనరుల దోపిడీ ఆరోపణలు. ఆయన అభ్యర్థిత్వంపై సొంత శ్రేణుల్లోనే అసంతృప్తి.. మాజీ ఎమ్మెల్యే చందన రమేశ్‌కు సీటిస్తామని జగన్ మొండిచేయి చూపారు. దీంతో ఆయన వర్గం తీవ్ర అసంతృప్తితో ఉంది. వీటికితోడు జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత.

నియోజకవర్గ స్వరూపం..

(కడియం, రాజమండ్రి రూరల్ మండలాలు, రాజమండ్రి కార్పొరేషన్‌లోని 8 డివిజన్లు)

మొత్తం ఓటర్లు: 2,72,826, పురుషులు: 1,33,241, మహిళలు: 1,39,561.. ట్రాన్స్‌జెండర్లు: 24

సామాజిక వర్గాల వారీగా ..

కాపులు-60 వేలు, ఎస్సీలు-50 వేలు, గౌడ-శెట్టిబలిజలు-25 వేలు, యాదవులు-15 వేలు, పద్మశాలీలు/దేవాంగులు-12 వేలు, ముస్లింలు-12 వేలు, వెలమలు-10 వేలు

టీడీపీకి మద్దతు పలికిన 'జమైత్ ఉలేమా-ఏ-హింద్'

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద ముస్లిం సంస్థల్లో ఒకటైన 'జమైత్ ఉలేమా-ఏ-హింద్' తెలుగుదేశం పార్టీకి మద్దతు పలికింది. ఆ సంస్థ జాతీయ నాయకుడు మౌలానా సుహైబ్ ఖాసిం, టీడీపీ అధినేత చంద్రబాబుతో ఉండవల్లిలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మౌలానా సుహైబ్ ఖాసిం మాట్లాడుతూ... 'ఈ ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలవాలని 'జమైత్ ఉలేమా-ఏ-హింద్' సర్వసభ సమావేశంలో తీర్మానించింది. లౌకికవాదం, ప్రజాస్వామ్య విధానాలు పాటించే చంద్రబాబుకు మద్దతు తెలియజేయడం సంతోషకరం. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన టీడీపీకి ముస్లిం సమాజం వెన్నుదన్నుగా ఉంటుంది. రాష్ట్ర భవిష్యత్తును ముందుకు నడిపే శక్తి సామర్థ్యాలు ఆ అల్లా చంద్రబాబుకు ప్రసాదించాలని మనఃస్ఫూర్తిగా ప్రార్థన చేస్తున్నాం' అని అన్నారు.

కాపు కుల వ్యతిరేకి జగన్: చేగొండి

పాలకొల్లు, మే, 9: కాపు కుల వ్యతిరేకి జగన్మోహన్ రెడ్డి అని మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామ జోగయ్య విమర్శించారు. కాపు రిజర్వేషన్లు, విద్యా ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించడంలో జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం అని గురువారం విమర్శించారు. ముద్రగడ పద్మనాభం వైసీపీకి ఓటు వేయమంటున్నాడని, అలా చేస్తే తమ భవిష్యత్‌ను కాపులు చేతులారా పాడు చేసుకున్నట్లేనని జోగయ్య హెచ్చరించారు. కాపు రిజర్వేషన్లు పట్టని ముద్రగడ.. వైసీపీకి తొత్తుగా మారి సొంత కులానికే అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు కాపులకు 5శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. రానున్నది డబుల్ ఇంజన్ సర్కార్ అని జోగయ్య పేర్కొన్నారు.

టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపుతోనే ప్రయోజనం

- ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు పింఛనర్ల విజ్ఞప్తి


'చంద్రబాబు గెలుపు - పింఛనర్ల పిలుపు' పేరిట కరపత్రాలు విడుదల చేస్తున్న పింఛనర్ల సంఘం ప్రతినిధులు

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మే 9: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం నెలకొందని, అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, అఖిల భారత పింఛనర్ల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి జి.పూర్ణచంద్రరావు అన్నారు. ఈ ఇబ్బందులు తొలగిపోవాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలించాలని కోరారు. 'చంద్రబాబు గెలుపు-పింఛనర్ల పిలుపు' పేరుతో ఏపీ పింఛనర్ల అసోసియేషన్ ముద్రించిన కరపత్రాలను గురువారం పింఛనర్ల సంఘం రాష్ట ప్రతినిధులు కడపలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ... రాష్ట్ర పాలన మళ్లీ గాడిన పడాలంటే 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ సంఘాల కోఆర్డినేటర్, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి గారపాటి విజ్డమ్ చౌదరి, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు గురవయ్య, అఖిలభారత రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యదర్శి పి.నాగరాజు పాల్గొన్నారు.

కూటమికే రేషన్ డీలర్ల మద్దతు

అమరావతి(ఆంధ్రజ్యోతి)/విజయవాడ, మే 9: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి రాష్ట్రంలోని రేషన్ డీలర్లు మద్దతు ప్రకటించారు. ప్రజాపంపిణీని సమీక్షించి మరింత పటిష్ఠం చేస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చినందున ఈ ఎన్నికల్లో కూటమికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గురువారం విజయవాడలో రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు మీడియాతో మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా సాఫీగా సాగిపోతున్న రేషన్ డీలర్ల వ్యవస్థకు సమాంతరంగా.. ఇంటింటికీ రేషన్ పంపిణీ పేరుతో ఎండీయూ వ్యవస్థను తీసుకువచ్చిన వైసీపీ ప్రభుత్వం 29,500 మంది రేషన్ డీలర్ల కుటుంబాలతోపాటు మరో 30వేల మంది సహాయకుల కుటుంబాలను కూడా రోడ్డుపాలు చేసిందని విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన డీలర్లను పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దుర్భాషలాడుతూ అవమానించారని ఆరోపించారు.

బాదుడు లేని పాలన అందిస్తా

- జగన్‌లా విచ్చలవిడిగా అప్పులు తెచ్చి బటన్ నొక్కను
- సంపద సృష్టిస్తా.. సంక్షేమం, అభివృద్ధి చేపడతా
- ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో తీవ్ర నష్టం
- గద్దెనెక్కగానే రెండో సంతకం దీని రద్దుపైనే
- టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టీకరణ
- కురుపాం, చీపురుపల్లి, విశాఖల్లో భారీ సభలు



చీపురుపల్లి ప్రజాగళం సభకు హాజరైన జనం, సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, పక్కన కళా వెంకట్రావు

పార్వతీపురం/విజయనగరం/విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పన్నుల బాదుడు లేని పారదర్శక పాలన అందిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. జనం భవిష్యత్‌కు కూటమిదే బాధ్యతని భరోసా ఇచ్చారు. జగన్ భారీగా అప్పులు తెచ్చి బటన్ నొక్కుడు చేసి మిగిలిన మొత్తాన్ని జేబులోకి బుక్కుకుంటున్నారని ఆరోపించారు. అలాంటి పని తాను చేయనని.. సంపదను సృష్టించి ఆ సొమ్ముతో ఇప్పుడున్న సంక్షేమ పథకాలతో పాటు మిగిలినవీ అమలు చేస్తానన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇచ్చి అన్ని విధాలా మంచి పాలన అందిస్తానని తెలిపారు. గురువారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, విజయనగరం జిల్లా చీపురుపల్లి, విశాఖ నగరంలో నిర్వహించిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ బటన్ నొక్కినా ఖాతాల్లోకి డబ్బులు రావడం లేదన్నారు. మరోవైపు ధరలు, పన్నులు పెంచేశారని... వచ్చిన డబ్బులు వచ్చినట్లే పోయి తిరిగి అప్పులు మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి జీవితాల్లోనూ వెలుగులు లేవని.. జీవన ప్రమాణాలు పెరగలేదని చెప్పారు. గిరిజనులకు, దళితులకు, బీసీలకు ఒక అన్నగా, తమ్ముడుగా, కుటుంబ పెద్దగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మహిళలను మహాశక్తిమంతులుగా తీర్చిదిద్దుతానని, ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన జీవో నంబర్ 3ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి స్థానికంగా గిరిజనులకు ఉద్యోగాలు లేకుండా చేసిందన్నారు. గిరిజన ప్రాంతాల ప్రజలు జగన్‌కు ఓటు వేసి గెలిపిస్తే ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయకుండా కాటు వేశారని.. గిరిజనుల కోసం 16 పథకాలను తాను అమలు చేస్తే జగన్ రద్దు చేసి అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. వారి పిల్లల కోసం బెస్ట్ ఎవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించానని.. ఆయన ఇదీ రద్దు చేశానని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 3ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీల కోసం 27 సంక్షేమ పథకాలను, బీసీల కోసం, ఇతర సామాజికవర్గాల కోసం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కూడా జగన్ రద్దు చేశారని, దగాకోరు జగన్‌ను ఇంటికి పంపించి వైసీపీని భూస్థాపితం చేయాలని పిలుపిచ్చారు. నవరత్నాలు నవమోసాలని విమర్శించారు. ఇంకా ఏమన్నారంటే..

● సంక్షేమ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్ టీడీపీయే. రూ.10 ఇచ్చి రూ.100 లాగేసే జగన్‌ను నమ్మవద్దు. విద్యుత్ చార్జీలను 9సార్లు పెంచారు. మేం నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాం. గతంలో రూ.200 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.వెయ్యికి చేరింది. ఈ జగన్ చివరకు చెత్తమీద కూడా పన్ను వేశారు.

● పోలింగ్‌కు మరో నాలుగు రోజులే గడువుంది. ఎండగా ఉందని ఇంట్లో ఉంటే బయట కొంపలు కూలిపోతాయి. అందుచేత అందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి. దాని జీవితాలు మారతాయి. మంచి వ్యక్తికి వేస్తే ప్రజల జీవితాలతోపాటు రాష్ట్ర ముఖచిత్రం మారుతుంది. - చంద్రబాబు

ఆ చట్టంతో మన భూములు గల్లంతే!

మనం భూములు, ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఒరిజినల్ పత్రాలు జగన్ వద్ద, జిరాక్స్ పత్రాలు భూ యజమానుల వద్ద ఉంచడం వెనుక కుట్ర ఉంది. ఈ చట్టం ద్వారా మన భూములపై హక్కులు కోల్పోతాం. అమ్మాలన్నా, కొనాలన్నా ఆ భూమి మనదేనని రుజువు చేసుకోవాలి. అలా రుజువు చేసుకోవాలంటే మళ్లీ అధికారుల చుట్టూనే తిరగాలి. వారు కాదన్నా, వేరే వారికి అనుమతి ఇచ్చినా మన భూమి మనకు దక్కదు. ఇది దురుద్దేశపూరిత చట్టం. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సంతకం మెగా డీఎస్సీపై చేస్తే.. రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపైనే చేస్తానని చంద్రబాబు అన్నారు. మీ ఆస్తి మీ పేరున ఉండాలి గానీ.. మీ ఆస్తిపత్రాలపై జగన్ ఫొటో ఏమిటి? వాటిపై ఆయన బొమ్మ వేసుకుంటే మీకు కోపం రావడం లేదా? ప్రజల భూములు అమ్ముకోవడానికి జలగ జగన్ పర్మిషన్ అవసరమట! మీ భూములకు అమెరికాలో ఎవడో జలగను యజమానిగా పెడతాడు. అలాగే సజ్జల మాదిరిగా ఊరికొక గుమస్తాను పెట్టి ఆ గ్రామంలో ఎవరైనా భూములు అమ్ముకోవాలంటే వారి ద్వారా జలగ పర్మిషన్ తీసుకునేలా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో అందరికీ ఉరేయాలని జగన్ చూశాడు. మీరందరూ కలిసి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌కు ఉరేయడం ద్వారా జగన్‌కు ఉరేయాలి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ ఇచ్చిన ఆస్తిపత్రాలను చించేసి చెత్తబుట్టలో వేద్దాం. అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం మెగా డీఎస్సీపై చేస్తా. రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపైనే చేస్తా. ప్రభుత్వ రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు రైతుల ఫొటోతో అందిస్తా. భూ హక్కుపై భరోసా, బీమా కల్పించి రైతే రాజుగా చేస్తా.

విశాఖ నా గుండెల్లో..

ఈ ఐదేళ్లలో సైకో జగన్, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి అండ్ కో విశాఖలో రూ.40 వేల కోట్ల విలువైన భూములను/ఆస్తులను కబ్జా చేసింది. కూటమి అధికారంలోకి రాగానే మక్కెలు విరగ్గొట్టి ఆ భూములను స్వాధీనం చేసుకుని పేదవారికి ఖర్చుపెడతాం. విశాఖ ఎప్పుడూ నా గుండెల్లో ఉంటుంది. నన్ను అభిమానించిన ప్రాంతం.. మంచి ప్రజలు నివాసం ఉండే ప్రాంతం. మా హయాంలో విశాఖను ఐటీ రాజధానిగా అభివృద్ధి చేసేందుకు మిలీనియం టవర్ కట్టాం. డేటా సెంటర్ తెస్తే దాన్ని వైసీపీ అడ్డుకోవడంతో లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు పోయాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వైసీపీకి దడ పుట్టించారు. ఎప్పుడూ లేనివిధంగా వారంతా ఎండలో నిలబడి మరీ పట్టుదలతో ఓటు వేయడం మార్పునకు అద్దంపడుతోంది. 90 శాతం మంది కూటమికే వేశారు. మేం వచ్చాక ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పోలీసులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ చెల్లిస్తాం. పోలీసులకు వారానికో రోజు సెలవు ఇస్తాం. హోం గార్డులకు భారీగా జీతాలు పెంచి వారి జీవితాల్లో ఆనందం నింపుతాం.

బొత్సా.. ఊడిగం చేస్తున్నావా?

ఈ ఐదేళ్లలో విశాఖను పూర్తిగా దోచేశారు. రూ.40 వేల కోట్ల విలువైన ఆస్తులు కబ్జా చేశారు. మరి మంత్రి బొత్స సత్యనారాయణ ఏం చేస్తున్నట్లు.. ఊడిగం చేస్తున్నారా? చీపురుపల్లి బరిలో ఉన్న ఆయన పనైపోయింది. కుటుంబ పాలన చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఆయన, బెల్లాన, నెల్లిమర్లలో బడ్డుకొండ, గజపతినగరంలో బొత్స అప్పలనరసయ్య, చిన్న శ్రీను మాత్రమే సమర్థులా.. మిగిలిన నాయకులంతా అసమర్థులేనా? పేద ప్రజల జీవితాలతో జగన్ ఆడుకుంటున్నారు. మద్యం షాపులను ప్రభుత్వ పరం చేసి తన కంపెనీల మద్యాన్ని అమ్మకం చేస్తున్నారు. ఆడబిడ్డల తాళ్లు తెంచుతున్నారు.

ఇంతకంటే నాకు ఏం కావాలి?

వైసీపీ నేతలకు విశాఖ ప్రజలపై ప్రేమ లేదు. ఇక్కడి సంపదపైన, ప్రజల ఆస్తులపైనే ప్రేమ. ఇక్కడ ఎన్నో కబ్జాలు జరిగాయి. ఎంతోమంది మెడపై కత్తిపెట్టి ఆస్తులను రాసిస్తావా చస్తావా అని బెదిరించి రాయించుకున్నారు. అలాంటి వారితో నేను మాట్లాడితే 'ఆస్తిపోయినా ప్రాణం ఉంది. అదిచాలు. బతికుంటే బలుసు ఆకు తినైనా బతకొచ్చు' అని అన్నారు. ఇది న్యాయమేనా? చేయని తప్పునకు నన్ను జైలులో పెట్టారు. జైల్లో ఉన్నప్పుడు లేపేయడానికి ప్రయత్నించారు. కానీ భయపడలేదు. ఒకవేళ పోవాలని దేవుడు రాసిపెట్టి ఉంటే ఏదైనా జరుగుతుంది. నేను తప్పుచేయలేదు కాబట్టి భయపడక్కర్లేదు. నా కోసం 59 రోజులుపాటు ప్రజలంతా ప్రార్థనలు చేశారు. ఒక నాయకుడిగా అంతకంటే నాకు ఇంకేం కావాలి? 2014 ఎన్నికల్లో జగన్ తల్లి విశాఖ ఎంపీగా పోటీ చేస్తే ఓడించి పంపించడం.. విశాఖ ప్రజల ముందుచూపును తెలియజేసింది. సొంత చెల్లి ఏ చీర కట్టుకుందో మాట్లాడే అన్న ఉన్నాడంటే అది మనకర్మ కాకపోతే ఇంకేమనుకోవాలి?

జగన్ మోసాలకు ఓటుతో బుద్ధి చెబుదాం

- 'వైసీపీ అంతం-దళితుల పంతం' నినాదంతో ప్రచారం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో దళిత, మైనార్టీ సంఘాల నేతలు


ఐక్యత చాటుతున్న దళిత, మైనార్టీ సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), మే 9: 'ఓటు వేసిన వారిపైనే వేటు వేసే మనస్తత్వం జగన్‌మోహన్‌రెడ్డిది. దళితుల సంక్షేమం కోసం రూపొందించిన 27 పథకాలను రద్దు చేసి ఈ విషయాన్ని రుజువు చేశాడు. జగన్ చేసిన మోసాలకు ఓటుతో తగిన బుద్ధి చెబుదాం' అని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు ఆక్రోశించారు. మాలమహానాడు, అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం గురువారం గుంటూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నా ఎస్సీ, నా ఎస్టీ అంటూనే దళితులను రోడ్ల మీద జగన్ కూర్చోబెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణను అడ్డుపెట్టుకుని మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మరో వైపు కూటమి అధికారంలోకి వస్తే ముస్లిం, మైనార్టీలకు రక్షణ లేకుండా పోతుందని చీకటి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని, జగన్ కుట్రలను సమర్థంగా తిప్పికొట్టి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మాలలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా వర్గీకరణ చేస్తామని చంద్రబాబు, మోదీ ఇచ్చిన హామీని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వైసీపీ అంతం-దళితుల పంతం అనే నినాదాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుతోనే భూములకు రక్షణ: రోహిత్


గుడిబండలో నారా రోహిత్‌కు చీనీపండ్ల గజమాల

మడకశిర టౌన్, మే 9: 'మీ భూములకు రక్షణ ఉండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి. ల్యాండ్ టైటిలింగ్ చట్టం ద్వారా మీ భూములకు జగన్ రక్షణ లేకుండా చేస్తున్నారు' అని సినీహీరో నారా రోహిత్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎస్ రాజుకు మద్దతుగా గురువారం ఆయన ప్రచారం చేశారు. టీడీపీ నాయకుడు గుండుమల తిప్పేస్వామి, హాస్యనటుడు రఘుతో కలసి గుడిబండ, రొళ్ల మండలాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ ఒక్కరికీ రక్షణ లేకుండా పోయిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు విజనరీ లీడర్

- ఆయన తరఫున ప్రచారం చేయడం గర్వంగా ఉంది
- పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్


సమావేశంలో మాట్లాడుతున్న అన్బుమణి రాందాస్

కుప్పం, మే 9: చంద్రబాబు విజనరీ ఉన్న నాయకుడని పీఎంకే (పట్టాలి మక్కల్ కచ్చి) పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మాజీమంత్రి అన్బుమణి రాందాస్ అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన వన్నెకుల క్షత్రియ కులస్తుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశానికే ఆదర్శంగా నిలువదగిన నాయకుడు చంద్రబాబేనని చెప్పారు. అటువంటి నాయకుడి కోసం ప్రచారం చేయడం గర్వంగా ఉందన్నారు. తమిళనాడులోని రాందాస్‌పురంలాగా ఒకప్పుడు కుప్పం కూడా పనిష్మెంట్ ఏరియాగా ఉండేదని, అటువంటి ప్రాంతాన్ని సకల రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. కుప్పం నియోజకవర్గంలో వన్నెకుల క్షత్రియులు 60శాతం ఉన్నారని, వారిలో ఎక్కువమంది వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. అన్నదాతకు ఏటా రూ.20వేలు ఆర్థిక సాయం ప్రకటించిన చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవాలని రాందాస్ పిలుపునిచ్చారు.

జగన్ గొంతు వణుకుతోంది

- ప్రతిపక్షాలు ఉన్నది ఓడించడానికే
- విజయవాడ బహిరంగ సభలో పవన్ కల్యాణ్


విజయవాడ బహిరంగ సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

విజయవాడ, మే 9(ఆంధ్రజ్యోతి): 'పోలింగ్‌కు ఘడియలు దగ్గర పడుతున్న కొద్దీ జగన్ గొంతులో వణుకు కనిపిస్తోంది. ప్రతిపక్షాలన్నీ కలిసి తనను ఒంటరిని చేసి ఓడించడానికి చూస్తున్నాయని చెబుతున్నారు. ప్రతిపక్షాలు ఉన్నది ఓడించడానికి కాకపోతే జగన్‌ను గెలిపించడానికా?" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. కూటమి అభ్యర్థుల తరఫున గురువారం విజయవాడ తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాల్లో రోడ్ షో నిర్వహించారు. అనంతరం పశ్చిమ నియోజకవర్గంలోని పంజా సెంటర్‌లో నిర్వహించిన బహిరంగసభలో పవన్ మాట్లాడారు. 'జగన్ చేసిన పనుల వల్లే అధికారులను బదిలీ చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏం చేశావో ఒక్కసారి గుర్తుచేసుకో జగన్. ఏ ఒక్కరినీ నామినేషన్ వేయనీయలేదు. నామినేషన్ వేసిన వారిని కొట్టారు. ఇదంతా నీవు నేర్పిన విద్యే నీరజాక్ష' అని పవన్ వ్యాఖ్యానించారు. 'ఈ ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యం. ఓటమి తర్వాత వైసీపీ గూండాలు, రౌడీలు ఇష్టానుసారంగా మాట్లాడితే ఎలా బాధ్యతను తెలియజేయాలో మాకు తెలుసు. ఎవరైనా ఇష్టానుసారంగా మాట్లాడితే తాట తీస్తా' అని పవన్ హెచ్చరించారు. 'ఓటును చాలా బాధ్యతతో ఉపయోగించుకోవాలి. ప్రజలకు ప్రజాస్వామ్యం విలువ తెలిసినంతగా మనకు తెలియడం లేదు. జగన్ ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం పెట్టి... ఆయన చెప్పిన విధానాలు మాత్రం అమలు చేయలేదు. ఎస్సీలకు సంబంధించిన 11, బీసీలకు సంబంధించిన 27పథకాలు రద్దు చేశారు. సీపీఎస్ రద్దు, మద్యపాన నిషేధం హామీలు ఇచ్చి అమలు చేయని జగన్... ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు ఇస్తారా? కులాల ఐక్యత జనసేన పార్టీ లక్ష్యం. యువత బాధ్యతతో ప్రజలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆలోచించి ఓటు వేయాలి. ఉదయం 11గంటలకే 70% ఓటింగ్ నమోదు కావాలి' అని పవన్ పిలుపునిచ్చారు.

నా ప్రేమ, మద్దతు మీకే..!: అల్లు అర్జున్

ఈ ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు మద్దతు పలుకుతున్న హీరోల జాబితాలో మరో స్టార్, పుష్ప ఫేం అల్లు అర్జున్ కూడా చేరిపోయారు. ఈ మేరకు గురువారం ట్విటర్ వేదికగా జనసేనానికి శుభాకాంక్షలు తెలిపారు. "పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రయాణం విజయవంతంగా సాగాలని కోరుకుంటూ ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీరు ఎంచుకున్న మార్గం, సేవ చేయాలి అన్న నిబద్ధత పట్ల నేను ఎంతో గర్విస్తున్నాను. ఒక కుటుంబ సభ్యుడిగా నా ప్రేమ, మద్దతు ఎప్పటికీ మీకే ఉంటాయి. మీ ఆంకాక్షలు, లక్ష్యాలు నెరవేరాలని కోరుకుంటున్నాను' అని ట్వీట్ చేశారు.

పవన్‌పై ఇదేం కక్ష..!

కాకినాడ, మే 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటనకు పోలీసులు అనుమతులు నిరాకరిస్తున్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజుల్లో భాగంగా శనివారం కాకినాడ సిటీలో పర్యటించాలని పవన్ మూడు వారాల క్రితమే నిర్ణయించారు. కిలోమీటరు రోడ్డు షో, తర్వాత సభ ఏర్పాటు చేయాలని భావించారు. దీనికోసం రెండు రోజుల క్రితమే టీడీపీ, జనసేన నేతలు అనుమతుల కోసం డీఎస్పీ, నియోజకవర్గ ఆర్వోకు దరఖాస్తు చేశారు. కాకినాడ సిటీలో పవన్ పర్యటిస్తే తాను ఓడిపోతామనే భయంతో ద్వారంపూడి అధికారులు, పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. పవన్ పర్యటనకు కాకినాడ నగరంలో ఎక్కడ అనుమతులకు దరఖాస్తు చేసినా తిరస్కరించేలా తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. అదే సమయంలో, అదే ప్రాంతంలో ద్వారంపూడి బైక్ ర్యాలీ ఉందంటూ పోలీసులు అనుమతి నిరాకరిస్తున్నారు.

న్యాయం వైపా, నేరం వైపా?

- కడప ప్రజలు ఆలోచించాలి
- చెల్లెళ్ల కన్నా భార్య తరఫు బంధువులే ఎక్కువయ్యారా?: షర్మిల
- ఓట్లతో షర్మిల కొంగు నింపండి: సౌభాగ్యమ్మ


పులివెందుల రోడ్‌షోలో మాట్లాడుతున్న వివేకానందరెడ్డి సతీమణి వైఎస్ సౌభాగ్యమ్మ, పక్కనే షర్మిల, సునీత

పులివెందుల, మే 9: 'ప్రపంచమంతా కడప వైపు చూస్తోంది. కడప ప్రజలు న్యాయం వైపో, నేరం వైపో నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది' అని ఏపీసీసీ చీఫ్, కడప ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిల అన్నారు. పులివెందుల నియోజకవర్గంలో గురువారం ఆమె బస్సు యాత్ర నిర్వహించారు. వేంపల్లె, వేముల, లింగాల, పులివెందుల మండలాల్లో యాత్ర సాగింది. షర్మిల మాట్లాడుతూ ఓటర్లు న్యాయం వైపు నిలబడాలని, హంతకులకు శిక్ష పడేలా చూడాలని పిలుపునిచ్చారు. 'వివేకానందరెడ్డిని అంత క్రూరంగా ఏడుసార్లు గొడ్డలితో నరికి చంపితే.. సాక్షి చానెల్‌లో మాత్రం హార్ట్‌అటాక్ అని చెప్పారు. సాక్షి చానెల్ నడుపుతున్నది వైఎస్ భారతి. అలా ఎందుకు చెప్పారో ఈ రోజు వరకూ సమాధానం చెప్పలేదు. అవినాశ్‌రెడ్డిని కాపాడాల్సిన అవసరం ఏముంది? చెల్లెళ్లు ఒకవైపు.. భార్య బంధువులు మరోవైపు ఉన్నారు. చెల్లెళ్ల కంటే వారే ఎక్కువయ్యారా?' అని ప్రశ్నించారు. 'చిన్నాన్న హత్యకుగురైతే నిందితుల పక్షాన మూర్ఖంగా ఎందుకు నిలబడ్డారో జగన్ సమాధానం చెప్పలేదు. ఐదేళ్లుగా నిందితుడిని కాపాడుకుంటూ రావడమే కాకుండా మళ్లీ అదే నిందితుడు అవినాశ్‌రెడ్డికి టికెట్ ఇచ్చాడు. 'అవినాశ్‌రెడ్డి నిర్దోషి అని జగన్ నమ్ముతున్నారట. కాబట్టి ఆయనకు సపోర్టు చేస్తున్నారట. గుడ్డిగా నమ్మాల్సిన అవసరం ఏముంది. జగన్ కన్విన్స్ అయితే ప్రపంచం మొత్తం కన్విన్స్ కావాలా? ఆయన ఏమన్నా లా నా? కాన్‌స్టిట్యూషనా?. కన్విన్స్ కావాల్సింది ప్రజలు కాదా, సీబీఐ కాదా, జడ్జిలు కాదా? అని ప్రశ్నించారు. మీ అందరి ఓట్లతో షర్మిల కొంగు నింపాలని వివేకా సతీమణి సౌభాగ్యమ్మ ప్రజలను కోరారు. రాజశేఖర్‌రెడ్డి పరిపాలన చూడాలంటే షర్మిలతోనే సాధ్యమన్నారు.

సంక్షేమం సాకుతో ఆర్థిక అరాచకం: షర్మిల

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి సీఎం జగన్ వినోదం చూస్తున్నారని షర్మిల మండిపడ్డారు. పీసీసీ వేసే న్యాయ నవ సందేహాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 1) జనంపై పన్నుల వాత, అప్పుల మోతతో రాష్ట్రాన్ని అపకీర్తిపాల్జేయ లేదా? 2) 2019-20 లో జీఎస్‌డీపీలో 31.32% ఉన్న ప్రజా రుణాలు 2022-23 నాటికి 33.32శాతానికి పెరగడం తమరి చలువ కాదా? 3) కాగ్, క్రిసిల్ హెచ్చరించినా పరిస్థితిని చక్కదిద్దలేకపోయారేం? 4) పెట్రో ఉత్పత్తులపై అదనపు భారం మోపిన తమరిని మళ్లీ ఎందుకు ఎన్నుకోవాలి? 5) అప్పుతెస్తే తప్ప జీతాలివ్వలేని స్థితిలో రాష్ట్రాన్ని గట్టెక్కించే మార్గం ఏదీ? 6) అప్పులపై ఆధారపడటం, కేంద్ర నిధుల్ని దారిమళ్లించడం గొప్ప పాలనా? 7) పంచాయతీ, మునిసిపల్ నిధుల మళ్లింపు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంకాదా? 8) పరిమితి మించి అప్పులు తెచ్చిన తమరిని ప్రజలెందుకు క్షమించాలి? 9) ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించిన తమరిని ప్రజలు ఎలా నమ్ముతారు?

నే..రుగా సాగదీత!

- పేలవంగా జగన్ ప్రసంగాలు.. స్పష్టంగా కనిపించిన బెరుకు
- కర్నూలు, కల్యాణదుర్గం, రాజంపేటల్లో ప్రచార సభలు


కర్నూలులో మాట్లాడుతున్న సీఎం జగన్

రాయచోటి, మే 9 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు, కల్యాణదుర్గం : మునుపటి ఉత్సాహం కనుమరుగైంది. మాటల్లో బెరుకుతనం, పేలవమైన ప్రసంగం.. నే....రుగా మీ ఖాతాల్లోకి కోట్ల రూపాయలు జమచేశానంటూ పాతరాగం... ఏదో ఊహించుకుని వచ్చిన కార్యకర్తలు సీఎం జగన్ ప్రసంగాన్ని విని డీలాపడ్డారు. గురువారం కర్నూలు, కల్యాణదుర్గం, రాజంపేటలో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన పాల్గొన్నారు. కర్నూలు సభలో ముస్లిం ఓటుకు గేలం వేసేందుకు ప్రయత్నించారు. 4శాతం రిజర్వేషన్, ఎన్ఆర్సీ, సీఏఏ వంటి అంశాలను ప్రస్తావిస్తూ ముస్లింలను ఆకర్షించేందుకు విఫలయత్నం చేశారు. "ఆరు నూరైనా.. నూరు ఆరైనా ముస్లిం మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్లు ఉండాల్సిందే. ఇది జగన్ మాట. ఇలా నా మాదిరిగా మోదీ ముందు చంద్రబాబు మాట్లాడగలరా?" అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. కల్యాణదుర్గం సభలో... 'మీ బిడ్డ మంచి చేసిఉంటే చేతులెత్తండి' అని పదే పదే విజ్ఞప్తి చేసినా స్పందన పెద్దగా లేదు. ఖాతాల్లో నే....రుగా రూ.2.70 లక్షల కోట్ల నగదు జమ చేశానంటూ చెప్పడంతో జనం నవ్వుకున్నారు. ఇదేమి సాగదీతరా బాబూ అంటూ హాస్యమాడారు. షెడ్యూలు ప్రకారం గురువారం సాయంత్రం 3గంటలకు అన్నమయ్య జిల్లా రాజంపేట సభలో జగన్ పాల్గొనాల్సి ఉంది. కానీ, ఉదయం 6గంటల నుంచే పోలీసులు ఆంక్షలు పెట్టారు. సభ జరిగిన రోడ్డువైపు ఆసుపత్రులకు సైతం వెళ్లలేక జనాలు మండుటెండలో అగచాట్లు పడ్డారు. ప్రసంగించడానికి సీఎం బస్సుపైకి చేరగానే.. ప్రజలంతా పోలోమంటూ వెనుదిరిగి వెళ్లిపోవడం కనిపించింది. కాగా, కల్యాణదుర్గంలో జగన్ రోడ్ షోను చిత్రీకరిస్తున్న 'ఈనాడు' విలేకరి రమేశ్‌పై వైసీపీ వర్గీయులు దాడి చేశారు. సెల్‌ఫోన్ లాక్కుని పిడిగుద్దులు కురిపించారు. మిగిలిన విలేకరులు బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విలేకరిపై దాడిని టీడీపీ కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఖండించారు. ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

సీఎం కోసం తీసిన విద్యుత్ లైన్లు వేస్తూ దుర్మరణం

రాజంపేట, మే 9: అన్నమయ్య జిల్లా రాజంపేటలో గురువారం సీఎం నిర్వహించిన సిద్ధం సభ ఏర్పాట్లలో అపశృతి చోటు చేసుకుంది. జగన్ రోడ్‌షో కోసం తప్పించిన విద్యుత్‌లైన్లను తిరిగి వేస్తూ విద్యుదాఘాతంతో ఓ కార్మికుడు మృతి చెందాడు. గురువారం సాయంత్రం రాజంపేటలో 'సిద్ధం' సభకు సీఎం జగన్ వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలో జగన్ రోడ్‌షో జరిగే మార్గాల్లో విద్యుత్ తీగలను తొలగించారు. సభ ముగిసిన తరువాత రాత్రి ఆ తీగలను తిరిగి తగిలించే పనిలో విద్యుత్ శాఖ నిమగ్నమైంది. సభా వేదికకు సమీపంలోని ఎంజీఆర్ షాపింగ్ మాల్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పైకిఎక్కిన హెల్పర్ హరీశ్‌బాబు(30) రాత్రి 9.30కు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సుమారు అర్ధగంటపాటు మృతదేహం విద్యుత్ స్తంభానికే ఉంది. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

సజ్జల భార్గవ్‌పై సీఐడీ కేసు

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): నియంత పాలన సాగించిన వైసీపీకి ఊహించని షాక్ తగిలింది. సకల శాఖల మంత్రిగా అధికారాలు చెలాయిస్తోన్న సజ్జల రామకృష్ణా రెడ్డి కుమారుడు సజ్జల భార్గవ్‌పై రాష్ట్ర సీఐడీ కేసు నమోదు చేసింది. నమ్మడానికి ఆశ్చర్యకరంగా ఉన్నా ఇది నిజం. జగన్‌రెడ్డిని ప్రశ్నించే ఎవ్వరికైనా ట్రీట్మెంట్ ఇచ్చేది సీఐడీ, ఏపీ పోలీసులైతే... ఆయన్ను విమర్శిస్తే సొంత చెల్లెళ్లనైనా టార్గెట్ చేసేది వైసీపీ సోషల్ మీడియా విభాగం. అయితే ఏప్రిల్ 1న రాష్ట్రంలోని పేద వృద్ధులకు సామాజిక పెన్షన్ల పంపిణీ ఆగడానికి చంద్రబాబు కారణమని సోషల్ మీడియాలో నిందలేశారు. రాష్ట వ్యాప్తంగా ఓటర్లకు ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్లు చేస్తూ వైసీపీకి మేలు చేయడంతోపాటు టీడీపీకి నష్టం కలిగించేలా తప్పుడు ప్రచారం చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ నాయకుడు వర్ల రామయ్య ఫిర్యాదును ఎన్నికల కమిషన్ పరిశీలించి సీఐడీకి పంపడంతో కేసు నమోదు చేయక తప్పని పరిస్థితి జగన్ భజన చేస్తున్న పోలీసులకు ఎదురైంది. ఈ వ్యవహారంలో సజ్జల భార్గవ్ రెడ్డితోపాటు వైసీపీ సోషల్ మీడియా విభాగానికి చెందిన పలవురిని నిందితులుగా చేర్చినట్లు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas,
RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 10 మే 2024
diksuchi@andhrajyothy.com

ప్రతి రంగంలోనూ అత్యంత అనుకూల ఆధునిక ఆవిష్కరణ 'ప్లాస్టిక్.' అదే సమయంలో అన్ని రకాల కాలుష్యాలకు 'ప్లాస్టిక్' ప్రధాన కారణం అవుతోంది. వైద్య, పారిశ్రామిక, నిత్యావసర, సరుకు రవాణా... ఇలా అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు కారణమైన ప్లాస్టిక్ నేడు మానవాళి మనుగడకే సవాలు విసురుతోంది.

తొలి 'ప్లాస్టిక్ కాలుష్య నివారణ చట్టం'

ప్రపంచ దేశాల కసరత్తు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



రోజు రోజుకూ పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను భూమి పైపొర శోషించుకోలేకపోతోంది. దాంతో భూగర్భ జలమట్టాలు అడుగంటిపోతున్నాయి. నదులు, తీరప్రాంతాల నుంచి సముద్రాల్లోకి ప్లాస్టిక్ చేరుతోంది. అలల తాకిడికి, సూర్యరశ్మి ప్రభావంతో మైక్రో ప్లాస్టిక్‌గా విచ్ఛిన్నమై సముద్ర ఆవరణ వ్యవస్థ కలుషితం అవుతోంది. ఫలితంగా సముద్ర జీవుల మనుగడకు ప్రమాదం ముంచుకొస్తోంది. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు గాలి, నీరు, మట్టి, ఆహార పదార్థాలను కలుషితం చేస్తూ మానవ, జంతు, వన్యప్రాణి ఆహార గొలుసుల్లోకి చొచ్చుకుపోతున్నాయి.

- మైక్రో ప్లాస్టిక్స్ వల్ల మానవులు క్యాన్సర్లు వంటి ప్రమాదకర రోగాల బారిన పడుతున్నారు. భూతాపం కూడా పెరుగుతోంది. ప్లాస్టిక్ తయారీ సమయంలో విడుదలయ్యే కర్బన ఉద్గారాలు, ప్రపంచ కర్బన ఉద్గారాల్లో ప్రస్తుతం 5 శాతంగా ఉన్నాయి. ఇదేవిధంగా నియంత్రణ రహితంగా ఉన్నట్లయితే 2050 నాటికి ఇవి 20 శాతానికి చేరుకోవచ్చని అంచనా. ప్లాస్టిక్ ఉత్పత్తి 2060 నాటికి ప్రస్తుతమున్న స్థాయి కంటే మూడురెట్లు పెరుగుతుందని అంచనా. మొత్తం ప్లాస్టిక్ కాలుష్యంలో 40 శాతంగా ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అత్యధికంగా కాలుష్యానికి కారణమవుతోంది. ఓఈసీడీ(ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ అండ్ కోఆపరేషన్) అంచనాల ప్రకారం వార్షిక ప్లాస్టిక్ ఉత్పత్తి ప్రపంచవ్యాప్తంగా 460 మిలియన్ టన్నులు. దీనిలో కేవలం 9 శాతం మాత్రమే ప్లాస్టిక్ రీసైక్లింగ్ జరుగుతోంది.
- ఒక ప్లాస్టిక్ వ్యర్థం భూమిలో పూర్తిగా కలిసిపోవడానికి సుమారు 20 నుంచి 500 సంవత్సరాలు పడుతుంది. ఆ ప్లాస్టిక్ మెటీరియల్, సూర్యరశ్మి తదితర వాతావరణ అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఇన్ని రకాల దుష్ప్రభావాలను చూపే ప్లాస్టిక్ ఉత్పత్తి, వినియోగంపై ప్రపంచవ్యాప్తంగా పటిష్ఠవంతమైన నియంత్రణలు తీసుకురావాల్సిన తక్షణ అవసరం ఎంతైనా ఉంది. ఆ కోవలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొట్టమొదటి ప్రపంచ స్థాయి ఒప్పందాన్ని ఈ ఏడాది చివరినాటికి తీసుకువచ్చేందుకు ఏప్రిల్ మూడోవారంలో ప్రపంచ నాయకులు కెనడా రాజధాని ఒట్టావాలో సమావేశం అయ్యారు. గత ఏడాది నవంబరులో నైరోబీలో నిర్వహించిన సమావేశంలో తలెత్తిన భిన్నాభిప్రాయాలను పరిష్కరించడం, దక్షిణకొరియాలో జరగనున్న చివరి రౌండ్ చర్చల్లో ఏకాభిప్రాయం సాధించడమే ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఉద్దేశించారు.

అందులో భాగంగా 175 దేశాలకు చెందిన ప్రతినిధులు, పర్యావరణవేత్తలు, పారిశ్రామికరంగ ప్రతినిధులు ఒట్టావా సమావేశానికి హాజరయ్యారు.

- వాస్తవానికి 2022లో నిర్వహించిన ఐక్యరాజ్య సమితి ఎన్విరాన్‌మెంటల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న దేశాలు... ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించేందుకు 2024 చివరినాటి కల్లా ఒక సమగ్ర ఒప్పందాన్ని రూపొందించాలనే అంగీకారానికి వచ్చాయి. ఇందులో భాగంగా ఉరుగ్వే, ఫ్రాన్స్, నైరోబీ, కెనడా, దక్షిణకొరియాలో సమావేశమై 2024 చివరినాటికల్లా ఒక సమగ్ర ఒప్పందాన్ని తీసుకురావడానికి ప్రణాళిక రచించారు. అయితే పెట్రో కెమికల్ ఉత్పత్తిదేశాలు, వ్యాపార వర్గాలు, కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ ఒప్పందంలోని ఉత్పత్తి నియంత్రణ అంశాలపై కొన్ని అభ్యంతరాలను లేవనెత్తాయి. మరికొన్ని దేశాలు మాత్రం విభిన్న ప్రణాళికలతో ముందుకు వస్తున్నాయి. సౌది అరేబియా, ఇరాన్, ఇండియా, చైనా వంటి ప్లాస్టిక్, పెట్రో కెమికల్ ఉత్పత్తిదేశాలు(ప్లాస్టిక్ పెట్రో కెమికల్స్ నుంచి ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నాయి) 'లైక్ మైండెడ్ కంట్రీస్'గా జతకూడాయి. ఈ దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తిపై విధించే ఆంక్షలపై అభ్యంతరం తెలుపుతున్నాయి. ఈ దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తి కంటే పునర్వినియోగం, రీసైక్లింగ్‌పై దృష్టిసారించాలని డిమాండ్ చేస్తున్నాయి.
- జపాన్, యురోపియన్ యూనియన్ దేశాలు; మరికొన్ని ద్వీప దేశాలను కలిగి ఉన్న 60 దేశాల 'హై యాంబిషన్ గ్రూప్' మాత్రం 2040 నాటికి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని అభిలషిస్తోంది. అమెరికా వంటి దేశాలు 2040 నాటికి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతంచేయాలని చెబుతూనే... హై యాంబిషన్ గ్రూప్‌లా కాకుండా దేశాలవారీగా తమ సొంత ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని, ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన ప్రమాణాలతో తమ ప్రణాళికలను అనుసంధానపర్చుకోవాలని అభిప్రాయపడుతున్నాయి.
- ఈ భిన్నాభిప్రాయాల నేపథ్యంలో ఒక ఉమ్మడి అంగీకారానికి రావడం కత్తిమీద సాము వంటి వ్యవహారమే. అయితే, అత్యధిక జనాభా ఉన్న భారతదేశంలో ఏటా 35 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో కేవలం 8 శాతం మాత్రమే రీసైక్లింగ్‌కు వెళుతున్నాయి. పైగా ఇప్పటికే ప్రపంచంలో అన్ని రంగాలు ప్యాకేజింగ్, వస్తుపరమైన సౌలభ్యతల వల్ల ప్లాస్టిక్‌పై భారీగా ఆధారపడ్డాయి. ఒక్కసారిగా ప్లాస్టిక్ ఉత్పత్తిపై నియంత్రణలు విధిస్తే అవి అనేక రంగాలపై ఆర్థిక, మనుగడపరమైన సమస్యలు రేకెత్తించే అవకాశం ఉంది. కాబట్టి పలుచటి, హానికర, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విషయంలో ఉత్పత్తిపరమైన ఆంక్షలు విధించినా, మిగతా ప్లాస్టిక్ ఉత్పత్తులపై రీసైక్లింగ్, పునర్ వినియోగం వంటి వ్యూహాలను పటిష్ఠంగా రూపొందించాల్సిన అవసరం ఉందని, ప్రత్యామ్నాయ వస్తువులను, అలాగే వస్తు పరిశోధనలను ప్రోత్సహించాలని పర్యావరణ వేత్తలు భావిస్తున్నారు. ఈ అంశాలపరంగా ప్రాథమిక చర్యలు తీసుకున్న తరవాత, క్రమంగా కొత్త ప్లాస్టిక్ ఉత్పత్తులపై ఆంక్షలు విధించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించే దిశగా ప్రయత్నాలు సఫలం అవుతాయన్నది నిపుణుల సూచన.
- ఏది ఏమైనా, అంటార్కిటికా ఖండంలో మానవ సంచారం లేని ప్రాంతాలకు కూడా ప్లాస్టిక్ చేరుతోంది. చివరికి తల్లిపాలల్లో సైతం మైక్రో ప్లాస్టిక్ రూపంలో చేరిపోతోందన్న పరిశోధనలు కాలుష్య ఉధృతికి అద్దంపడుతున్నాయి. ఒకవైపు జలమట్టాలు అడుగంటి బెంగళూరు వంటి మహానగరాలు అల్లాడటానికి, వర్షపు నీరు భూమిలో ఇంకక ఇవే నగరాలు వరదల్లో మునిగిపోవడానికి గల కారణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమేయం భారీగానే ఉంది. క్యాన్సర్ క్యాపిటల్‌గా భారత్ మారబోతోందన్న వార్తల్లో అతిశయోక్తి లేదు. ఈ పరిస్థితులన్నీ ప్రపంచవ్యాప్తంగా ఒక పటిష్ఠవంతమైన ప్లాస్టిక్ కాలుష్య నివారణ చట్టాన్ని తీసుకురావాల్సిన తక్షణ అవసరాన్ని చాటిచెబుతున్నాయి.

ఒట్టావా సమావేశం

కెనడా రాజధాని ఒట్టావాలో ఏప్రిల్ 23 నుంచి 29 వరకు 'ఇంటర్ గవర్నమెంటల్ నెగోషియేటింగ్ కమిటీ' 4వ సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్య నివారణ, ప్లాస్టిక్ ఉత్పత్తిపై నిషేధం విధించడానికి ప్రపంచదేశాలకు ఒక నిర్ణీత కాలపరిమితితో కూడిన లీగల్లీ బైండింగ్(చట్టబద్ధ) గడువుపై ఏకాభిప్రాయం సాధించడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యం.

- అయితే 'హై-యాంబిషన్ గ్రూప్' దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేయడం ద్వారా మాత్రమే కాలుష్యాన్ని నివారించగలమని, కాబట్టి ప్లాస్టిక్ ఉత్పత్తిని నిలిపివేసేందుకు దేశాలకు లీగల్లీ బైండింగ్ గడువు నిర్ణయించాలని వాదించాయి. కాగా, 'లైక్ మైండెడ్ దేశాలు'గా వ్యవహరిస్తున్న పెట్రో కెమికల్స్ ఉత్పత్తి దేశాలు మాత్రం పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ ఉత్పత్తి నిషేధాన్ని వ్యతిరేకించాయి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు పూర్తిస్థాయిలో ఇంకా అభివృద్ధి కానందున వాటి ఉత్పత్తిపై పూర్తి నిషేధం నిర్హేతుకమని వాదిస్తున్నాయి.
- రెండు గ్రూపుల దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరనందున ఈ సమావేశం ప్రధానలక్ష్యం పరంగా ముందడుగు పడలేదు. అయితే ప్లాస్టిక్ సంబంధిత ఉద్గారాలు, ఉత్పత్తి, వ్యర్థాల నిర్వహణ, సమస్యాత్మక, నివారించదగ్గ ప్లాస్టిక్ రకాలు వంటి వాటిపై(సవివర అంచనాలతో(డీటైల్డ్ అసెస్‌మెంట్స్) ముందుకు రావడానికి అన్ని దేశాలు అంగీకరించడం కొసమెరుపు.
- ఈ ఏడాది నవంబరులో దక్షిణకొరియాలోని బుసాన్‌లో ప్లాస్టిక్ కాలుష్య నివారణ కోసం 5వ, చివరి సంప్రదింపుల సమావేశం జరగనుంది. ఇప్పటివరకు నిర్వహించిన నాలుగు సమావేశాల్లో కుదరని ఏకాభిప్రాయం ఈ చివరి సమావేశంలోనైనా సాధిస్తేనే ప్లాస్టిక్ కాలుష్య నివారణ ఒప్పందం సాకారమవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

టీఎస్ సెట్ - 2024

జాబ్ కార్నర్

తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీఎస్ సెట్)-2024 నోటిఫికేషన్‌ను ఉస్మానియా యూనివర్శిటీ విడుదల చేసింది. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ నియామకాలకు అర్హత సాధించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు.

సబ్జెక్టులు: జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్-1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ(ఎంఏ, ఎమ్మెస్సీ), ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్ఈ, ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: గరిష్ఠ వయోపరిమితి లేదు

పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత టెస్ట్(సీబీటీ) పద్ధతిలో జరిగే పరీక్షకు రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

పరీక్ష ఫీజు: ఓసీలకు రూ.2000. బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ, వీహెచ్, హెచ్ఐ, ఓహెచ్, ట్రాన్స్‌జెండర్‌లకు రూ.1000.

పరీక్ష కేంద్రాలు: ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూలు, కరీంనగర్, ఖమ్మం, తిరుపతి, మహబూబ్‌నగర్, వైజాగ్, నల్లగొండ

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: మే 14 **చివరి తేదీ:** జూలై 2

పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 28 నుంచి 31 వరకు

వెబ్‌సైట్: http://telanganaset.org/index.html



నలంద యూనివర్సిటీలో మాస్టర్స్

న్యూఢిల్లీలోని నలంద యూనివర్సిటీ - మాస్టర్స్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంబీఏలో ఏడాది కోర్సు పూర్తిచేసిన తరవాత డిప్లొమాతో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. అభ్యర్థులకు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం తప్పనిసరి.

ప్రోగ్రామ్‌లు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** హిందూ స్టడీస్(సనాతన), వరల్డ్ లిటరేచర్, హిస్టారికల్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారిటివ్ రెలీజియన్స్
- **ఎంబీఏ స్పెషలైజేషన్:** సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్:** ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్

అర్హత వివరాలు: హ్యూమానిటీస్/సైన్సెస్/ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/లా విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ/తత్సమాన కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఎంబీఏ కోర్సుకు క్యాట్/ఎక్స్ఏటీ/మ్యాట్‌లో కనీసం 70 శాతం స్కోర్ సాధించి ఉండాలి. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు అయిదేళ్ల అనుభవం ఉంటే చాలు. ఏ కోర్సులో ప్రవేశానికైనా అభ్యర్థులు కనీసం 250 పదాలతో సెల్ఫ్ ఇంట్రడక్షన్/బయో-నోట్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ కింద ఈ యూనివర్సిటీలో చేరడానికి గల కారణాన్ని 100 పదాల్లో; ప్రోగ్రామ్‌ని ఎంచుకోవడానికిగల కారణాన్ని 300-500 పదాల్లో రాసి పంపాలి. విదేశీ (నాన్ ఇంగ్లీష్ కంట్రీస్) అభ్యర్థులు ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ ప్రూఫ్ కింద టోఫెల్/ఐఈఎల్‌టీఎస్ స్కోర్ కార్డ్ సబ్మిట్ చేయాలి.

ఎంపిక: స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, సెల్ఫ్ ఇంట్రడక్టరీ నోట్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విదేశీ అభ్యర్థులకు ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూ కూడా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** nalandauniv.edu.in



ఏపీ ఆర్‌జీయూకేటీ అడ్మిషన్స్

ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)- ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్‌కే వ్యాలీ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నారు. ఇందులో మొదట రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు(పీయూసీ) తరవాత నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తానికి 80 క్రెడిట్స్ నిర్దేశించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పీయూసీ సబ్జెక్టులు: మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, తెలుగు/హిందీ/సంస్కృతం/ఫారిన్ లాంగ్వేజ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయాలజీ

బీటెక్ విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్.

సీట్ల వివరాలు: ఒక్కో క్యాంపస్‌లో 1000 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం ప్రతి క్యాంపస్‌లో అదనంగా 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు.

అర్హత వివరాలు: ఈ ఏడాది ఏపీ/టీఎస్ ప్రభుత్వం నిర్వహించిన పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 4 శాతం వెయిటేజీ ఉంటుంది. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే.

ముఖ్య సమాచారం

- **ట్యూషన్ ఫీజు:** పీయూసీ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.45,000; బీటెక్ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.50,000 చెల్లించాలి. తెలుగు రాష్ట్రాలు మినహా ఇతర రాష్ట్రాల అభ్యర్థులు ట్యూషన్ ఫీజు కింద ఏడాదికి రూ.1,50,000లు చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 25
- **స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూలై 1 నుంచి 6 వరకు
- **అభ్యర్థుల సెలెక్షన్ లిస్ట్ విడుదల:** జూలై 11
- **జనరల్ అభ్యర్థుల డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** నూజివీడు, ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లకు ఎంపికైన వారికి జూలై 22, 23; ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనవారికి జూలై 24, 25; శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైన వారికి జూలై 26, 27
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ వేదికలు:** నూజివీడు, ఆర్‌కే వ్యాలీ, శ్రీకాకుళం క్యాంపస్‌లు
- **వెబ్‌సైట్:** www.rgukt.in



కొడుకులకు పరీక్ష పెట్టిన నాన్న!

సోమయ్య అనే వ్యక్తి ఉండేవాడు. కష్టపడి పని చేసేవాడు. పండిన పంటను అమ్మి తన కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు నలుగురు కొడుకులు. వారంతా సోమరులు. ఏ పని చేసేవాళ్లు కాదు. నాన్న కాయాకష్టం మీద బతికేవాళ్లు. అది అతనికి నచ్చేది కాదు. ఎలాగైనా పిల్లలను ప్రయోజకుల్ని చేయాలని కలగనేవాడు. అయితే వారు మాత్రం సోమరులుగానే ఉండేవాళ్లు.

ఆ రైతుకు జబ్బు చేసింది. వయసుపైబడింది. దీంతో మంచానికే పరిమితమయ్యాడు. ఒక రోజు తన నలుగురు కొడుకులను పిలిచాడు. 'ఇక నా పని అయిపోతోంది. చేసినన్ని రోజులు కష్టపడ్డాను. ఇక ఓపిక లేదు. మీరు ఎలా బతుకుతారో ఏమో' అన్నాడు. నలుగురు కొడుకులు కిందకి తల దించుకుని ఉన్నారు. 'ఓరి బడవల్లారా.. మీకో విషయం చెబుతా. బాగుపడండి. మన చేనులో ఓ కుండ ఉంది. అందులో బంగారు నాణేలు ఉన్నాయి' అన్నాడు. అందరి ముఖాలు వెలిగిపోయాయి. 'నేను ఆ బంగారు నాణేలను కుండలో ఎక్కడ పూడ్చిపెట్టానో మర్చిపోయా. చేనును తవ్వి తీసుకోండి' అన్నాడు. ఆ మాటలు వినగానే కష్టజీవుల్లా అందరూ చేనుకు పయనమయ్యారు. మట్టిలో వెతకటం ప్రారంభించారు. రెండు రోజుల పాటు వెతికి ఆయాసంతో తండ్రి దగ్గరకు వచ్చారు.

రైతు విషయం తెలుసుకున్నాడు. అవునా! అయితే ఓ పని చేయండి. ఎలాగూ మట్టిని తవ్వారు కాబట్టి మీరు విత్తనాలు చల్లండి అన్నాడు. ఆ కొడుకులు వెంటనే సంతకు పోయి మంచి విత్తనాలు తీసుకొచ్చారు. అదృష్టవశాత్తూ వానపడింది. పదును అయిన నేలలో విత్తనాలను చల్లేసరికి పంట మొలకెత్తింది. ఇంకో వాన పడటంతో పంట బాగా పండింది. కొంత ధాన్యం ఇంట్లోకి తీసుకుని మిగతాది సంతలో అమ్ముకొచ్చారు. మంచి లాభం వచ్చింది. ఈ విషయం తండ్రి దగ్గరకు వచ్చి చెప్పారు. 'మీరు కష్టపడండి. చేనులో కుండలేదు. అసలు బంగారం లేనే లేదు. మీరు కష్టపడి పని చేస్తే ఇలా చేను పండుతుంది. బంగారం లాంటి ధాన్యం మీ చేతులోకి వస్తుంది. మీ కాళ్లమీద మీరు నిలదొక్కుకుంటారు' అంటూ రైతు చెప్పాడు. పిల్లలకు విషయం అర్థమైంది. సిగ్గుపడ్డారు. ఆ రోజు నుంచి తండ్రిమాట జవదాటకుండా కష్టపడ్డారు.

సరైన నీడ ఏది?




10 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 303

	8				4	9		
	7		9			8		
5		3						
	1			3		4		8
3				2				6
8		4		7			3	
						3		9
		8			7		2	
		6	8				5	

సుడోకు - 302 సమాధానం

8	2	5	3	9	4	1	7	6
9	6	7	2	1	8	5	3	4
4	1	3	5	7	6	2	9	8
7	3	1	8	2	9	6	4	5
2	9	4	7	6	5	8	1	3
5	8	6	1	4	3	9	2	7
6	4	8	9	3	2	7	5	1
1	5	2	4	8	7	3	6	9
3	7	9	6	5	1	4	8	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.